సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4+16 వెల: ₹ 5.00

సంపుటి: 10
సంచిక: 159

బుధవారం 30-8-2017

SIMULTANEOUSLY PRINTED AT KADAPA | VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



‘తెలుగువారి గుండెచప్పుడు వినగలిగే
ఆత్మీయుడిగా ఉంటే చాలు...
నా జన్మ ధన్యమైనట్టే’



హచిసన్‌కు 32వేల కోట్ల వడ్డన

రూ. 7,900 కోట్ల పన్ను,
అంతే మొత్తం జరిమానా - బిజినెస్‌లో



సూపర్ షరపోవా

‘గ్రాండ్’గా పునరాగమనం.. యూఎస్ ఓపెన్‌లో హాలెప్‌పై విజయం - స్పోర్ట్స్‌లో

ముంబైలో 29.8 సెం.మీ. వర్షపాతం నమోదు

సముద్రం పోటుమీద ఉండటంతో రహదారులపైనే నిలిచిన వరద నీరు

ఆగిన రైళ్లు.. ఆరు విమానాలు రద్దు..

పట్టాలు తప్పిన నాగ్‌పూర్-ముంబై దురంతో

2 లో

మరో నాలుగు రోజులు కోస్తాలో వర్షాలు



మంగళవారం ముంబైలో కుంభవృష్టి ధాటికి జలమయమైన రోడ్లపై జనం పాట్లు

ముంబై మునక

హూస్టన్ వణుకు

అమెరికాలో ‘హార్వీ’ ధాటికి పది మంది మృతి

లక్ష మంది భారతీయ-అమెరికన్లపైనా ప్రభావం

చైనాలో వరదలు.. 20 మంది మృత్యువాత

7 లో



హూస్టన్‌లో వరదలో చిక్కుకున్న వారిని పడవల్లో తరలిస్తున్న సహాయక సిబ్బంది

2 వేలు.. 2 వేలు.. 3 వేలు

రేటెత్తిన కాకినాడ ఓటు

కార్పొరేషన్ ఎన్నికల్లో పరాకాష్టకు చేరిన ప్రలోభాల పర్వం

విడతల వారీగా డబ్బు పంచిన టీడీపీ.. ఆభరణాలు, వెండి గిన్నెలు అదనం

ఒకవైపు పోలింగ్ జరుగుతుండగా మరోవైపు యథేచ్ఛగా డబ్బులు ఎర

బూత్‌ల వద్ద మాటువేసి మరీ పంపిణీ చేసిన అధికార పార్టీ నేతలు

ఓట్ల సంఖ్యను బట్టి కుటుంబానికి రూ.70 వేల వరకు అందజేత

టీడీపీ రెబల్స్ ఒక్కొక్కరికి రూ.35 లక్షల నుంచి రూ.40 లక్షలు!

పోలీసుల ప్రేక్షక పాత్ర.. ప్రజాస్వామ్యం అపహాస్యం పాలు

కాకినాడ జగన్నాథపురం 14వ వార్డుకు చెందిన సత్తిబాబు (పేరు మార్చాం) ఓటు విలువ రోజురోజుకీ భారీగా పెరిగిపోయింది. ఓ రోజు ఇచ్చి ఓ రోజు ఇవ్వకపోతే ఎక్కడ మనసు మార్చుకుంటాడోనని అధికార టీడీపీ నేతలు విడతల వారీగా సత్తిబాబుకు డబ్బు ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాక ముందు రూ.2 వేలు ఇవ్వగా, ఆయన వెళ్లాక మరో రూ.2వేలు ఇచ్చారు. ఇక ఎన్నికల ముందురోజు రాత్రి మరో రూ.3 వేలు పంపిణీ చేశారు. ఇలా ఆయన ఒక్క ఓటుకు రూ.7 వేలు ముట్టజెప్పారు. సత్తిబాబు దృష్టి ప్రత్యర్థి పార్టీ అభ్యర్థిపై పడకుండా ఇలా విడతల వారీగా డబ్బును ఎర వేస్తూ వచ్చారు. ఒక్క సత్తిబాబుకే కాదు.. ఇదే తరహాలో కాకినాడలో చాలాచోట్ల అధికార పార్టీ నేతలు అడ్డూ అదుపూ లేకుండా డబ్బు పంపిణీ చేశారు.

- వివరాలు 5లో

కాకినాడ ఓట్లకు ఖాకీలే పెద్దలు!

అధికార టీడీపీకి యథాశక్తి సహకరించిన పోలీసులు

- 64.78 శాతం పోలింగ్ నమోదు
- పోలింగ్ కేంద్రాల వద్దే టీడీపీ అభ్యర్థుల ప్రచారం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసు యంత్రాంగం
- టీడీపీ ఫిర్యాదు ఆధారంగా ఓ పోలీసు అధికారిని తప్పించిన వైనం

5 లో

డేరాబాబా గురువు చంద్రబాబా



- డేరా బాబాకు పట్టిన గతే బాబుకు పట్టడం ఖాయం: కొడాలి నాని
- సీబీఐ విచారణ జరిపిస్తే బాబు బతుకు జైల్లోనే
- సొంత నియోజకవర్గంలో నెగ్గలేని దద్దమ్మ బాబు
- ఫిరాయింపుదార్లను గెలిపించుకునే దమ్ముందా?

- వివరాలు 14లో

జపాన్ మీదుగా క్షిపణి

ఉ.కొరియా చర్యను తీవ్రంగా పరిగణిస్తున్నామన్న జపాన్ ప్రధాని

చర్యలకు అన్ని అంశాలు పరిశీలిస్తున్నామని డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక

అమెరికా హెచ్చరికలను ఏమాత్రం పట్టించుకోని ఉత్తర కొరియా మరోసారి దుందుడుకు చర్యకు పాల్పడింది. వరుసగా క్షిపణి ప్రయోగాలు చేపడుతూ ఆందోళనలు రేకెత్తిస్తున్న ఉత్తర కొరియా మంగళవారం జపాన్ మీదుగా బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించింది. - 7లో



మార్కెట్‌కు షాక్

- ఉ.కొరియా క్షిపణి ప్రయోగంతో వారం రోజుల కనిష్టానికి సూచీలు

-బిజినెస్‌లో

వారసత్వ సంపద పరిరక్షణకు 7 అకాడమీలు

- జీవోను ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు
- తెలుగుభాషాభివృద్ధి ప్రాధికార సంస్థకు చట్టం

- ఫుల్‌అవుట్ IVలో

‘డేరా’ బాధ్యత జస్మీత్‌కు

- సంప్రదాయాలకు భిన్నంగా వారసుడికే పగ్గాలు
- గుర్మీత్ ప్రధాన కార్యాలయం ఖాళీ!

- 7లో

‘ప్రైవేట్’ భోజనం!

- మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేట్‌కు అప్పగించేందుకు ప్రభుత్వ నిర్ణయం
- 13 జిల్లాల్లో కేంద్రీకృత వంటశాలల ఏర్పాటు
- ఆహార పదార్థాల పంపిణీకి ఈఓఐలు
- ప్రకటన విడుదల చేసిన పాఠశాల విద్యాశాఖ
- 25 వేల మందికిపైగా సిబ్బంది ఉపాధిపై ప్రభావం

6 లో

నా ప్రాణమున్నంత వరకు జగన్ వెంటే

- కొన్ని చానెళ్లలో నాపై తప్పుడు వార్తలను ప్రసారం చేస్తున్నారు
- పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ సునీల్ కుమార్ ఆగ్రహం



పలమనేరు: తన ప్రాణమున్నంత వరకు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మనిషిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే నడుస్తానని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. తాను పార్టీ మారుతానంటూ కొన్ని టీవీ చానెళ్లలో వస్తున్న తప్పుడు కథనాలను మంగళవారం రాత్రి ఆయన పలమనేరులోని తన నివాసంలో తీవ్రంగా ఖండించారు. వారేదో ప్రత్యక్ష్యంగా చూసినట్టు తాను నియోజకవర్గ నాయకులతో సంప్రదిస్తున్నానని నిరాధారమైన విషయాలను టీవీలో చూపెట్టడం సమంజసం కాదన్నారు. త్వరలో నవరత్నాలతో తమ అధినేత ప్రజల్లోకి వస్తున్నారని, దీన్ని చూసి భయపడే అధికారపార్టీ ఇలాంటి నీచమైన మైండ్‌గేమ్‌లకు పాల్పడుతోందని విమర్శించారు. దానికి తోడు పచ్చటీవీలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను భయపెట్టి, అధికారాన్ని ఉపయోగించి, కోట్లాదిరూపాయల డబ్బులు కుమ్మరించి నంద్యాలలో గెలిచినంత మాత్రాన అధికారపార్టీ వాపును చూసి బలుపుగా అనుకుంటుందని ధ్వజమెత్తారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌పాలన కావాలని జనం వేచిచూస్తున్నారని, ఇది జరిగి తీరుతుందని చెప్పారు.

గ్రూప్-2 అవకతవకలపై విచారణ జరిపించాలి

- ఏపీపీఎస్సీ పరీక్షలన్నీ ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలి
- మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు డిమాండ్



గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): ఇటీవల నిర్వహించిన గ్రూప్-2 పరీక్షల్లో జరిగిన అవకతవకలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. ఆన్‌లైన్ విధానంలో నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలను రద్దు చేయాలని, ఏపీపీఎస్సీ పరీక్షలన్నీ ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహించాలని కోరారు. మంగళవారమిక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. విశాఖ, చీరాల, నెల్లూరు పరీక్షా కేంద్రాల్లో మాల్‌ప్రాక్టీస్ జరిగిందని ఆరోపించారు. అలాగే ప్రశ్నలు సిలబస్‌కు అనుగుణంగా లేవని, ప్రశ్నపత్రంలో సమతుల్యం లోపించిందన్నారు. పరీక్షల నిర్వహణలో ఏపీపీఎస్సీ విఫలమైందన్నారు. ఏపీపీఎస్సీ కార్యదర్శి అభ్యర్థులను బెదిరించే రీతిలో షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నారని మండిపడ్డారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి సూర్యారావు మాట్లాడుతూ.. ఏపీపీఎస్సీ తీరును నిరసిస్తూ ఈనెల 31న విజయవాడలోని ధర్నా చౌక్‌లో ఆందోళనకు దిగనున్నట్లు తెలిపారు. సమావేశంలో నిరుద్యోగ ఐక్యవేదిక నాయకులు పరిమి కిరణ్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న ఎంబీబీఎస్ కౌన్సెలింగ్

సాక్షి, అమరావతి/ విజయవాడ (హెల్త్ యూనివర్సిటీ): రాష్ట్రంలో ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి సంబంధించిన తుది విడత కౌన్సెలింగ్ బుధవారంతో ముగియనుంది. ప్రస్తుతం యాజమాన్య కోటాలో కడపలోని ఫాతిమా మెడికల్ కాలేజీలో 10 సీట్లు మాత్రమే ఉన్నాయి. ప్రవాస భారతీయ కోటాలో 119 సీట్లున్నాయి. ప్రభుత్వ కళాశాలల్లో సీట్లు వచ్చి చేరని వారి సీట్లకు కూడా బుధవారం మధ్యాహ్నం 2 గంటల లోపు వెబ్ ఆప్షన్ల ద్వారా భర్తీ చేస్తామని, ఆగస్ట్ 31 తర్వాత ఎలాంటి కౌన్సిలింగ్ ఉండబోదని ఎన్టీఆర్ హెల్త్ వర్శిటీ రిజిస్ట్రార్ ఎస్.అప్పలనాయుడు తెలిపారు. ఎంసీఐ నిబంధనల ప్రకారం ఎలాంటి కేటగిరీ సీట్లయినా బుధవారం సాయంత్రంలోపే భర్తీ చేస్తామని, ఆ తర్వాత ఎలాంటి అవకాశం ఉండబోదన్నారు. బీడీఎస్ సీట్లకు మరో విడత వెబ్ కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు http://ntruhs.ap.nic.in, http://apmedadm.apsche.ac.in వెబ్‌సైట్ సందర్శించవచ్చు.

సీటు పొంది జాయిన్ కాకపోతే రూ. 3 లక్షలు ఫైన్

ఎంబీబీఎస్ కోర్సులో అడ్మిషన్లు పొంది, కళాశాలలో జాయిన్ కాని అభ్యర్థులకు రూ. 3 లక్షల ఫైన్ విధించడంతో పాటు, వారిని రెండు సంవత్సరాలు డిబార్ చేయనున్నట్లు ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. బుధవారం జరిగే తుది విడత కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన అభ్యర్థులతో పాటు ఇంతకు ముందు జరిగిన కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన అభ్యర్థులకు కూడా ఈ నిబంధన వర్తిస్తుందని స్పష్టం చేసింది.

తూర్పు నావికాదళాన్ని సందర్శించిన బంగ్లాదేశ్ అడ్మిరల్

ఇరు దేశాల మధ్య నావికా సంబంధాలపై చర్చ



బంగ్లాదేశ్ అడ్మిరల్ నిజాముద్దీన్ అహ్మాద్‌కు జ్ఞాపికను అందిస్తున్న బిస్త్

పాతపోస్టాఫీసు (విశాఖ దక్షిణం): బంగ్లాదేశ్ నావికాదళ ప్రధానాధికారి, అడ్మిరల్ నిజాముద్దీన్‌అహ్మాద్ మంగళవారం తూర్పు నావికాదళాన్ని సందర్శించారు. ఆయన వెంట సతీమణి నజ్మున్‌నిజాం, ఆరుగురు ఉన్నతాధికారులున్నారు. వారికి ఇక్కడి అధికారులు సాదర స్వాగతం పలికారు. అనంతరం తూర్పు నావికాదళ ఫ్లాగ్ ఆఫీసర్, వైస్ అడ్మిరల్ హెచ్‌సీఎస్ బిస్త్‌తో పాటు ఇతర నావికాదళ అధికారులతో సమావేశమైన నిజాముద్దీన్‌అహ్మాద్ భారత్, బంగ్లాదేశ్‌ల మధ్య కొనసాగుతున్న నావికా సంబంధాలతో పాటు తమకు అందుతున్న సహకారంపై చర్చించారు. అనంతరం నావికాదళంలోని వివిధ విభాగాలను సందర్శించారు. అహ్మాద్ సందర్శనకు గుర్తుగా ఆయనకు బిస్త్ జ్ఞాపికను బహూకరించారు.

ఈపీడీసీఎల్ సీఎండీగా హెచ్‌వై దొర?

సాక్షి, అమరావతి: తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) మేనేజింగ్ డైరెక్టర్‌గా హెచ్‌వై దొర నియామకం దాదాపు ఖరారైంది. బుధ, గురువారాల్లో ఇందుకు సంబంధించి అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. దొర ప్రస్తుతం దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్)కు సీఎండీగా ఉన్నారు. ఆయన పదవీ కాలం ఈ నెలాఖరుతో ముగుస్తుంది. తిరిగి ఆయననే కొనసాగించే విషయంలో కొద్దికాలంగా తర్జనభర్జనలు నడుస్తున్నాయి. 8 జిల్లాలతో కూడిన పంపిణీ సంస్థ కావడంతో అనుభవం ఉన్నవారికే ప్రాధాన్యత ఇవ్వాలని ఉన్నతాధికారులు ప్రభుత్వానికి సూచించారు. ఈ నేపథ్యంలో దొరనే తిరిగి ఎస్పీడీసీఎల్‌కు సీఎండీగా నియమించాలని ప్రభుత్వం తొలుత భావించింది. అయితే, 5 జిల్లాలతో కూడిన ఈపీడీసీఎల్‌లో విద్యుత్ విస్తరణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో దొరను ఈపీడీసీఎల్‌కు పంపాలని, ఈ స్థానంలో ఈపీడీసీఎల్ సీఎండీగా ఉన్న నాయక్‌ను ఎస్పీడీసీఎల్‌కు సీఎండీగా బదిలీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

ముంబై మునక



వర్షాల ధాటికి నీరు నిలిచిపోయి నదిని తలపిస్తున్న ముంబై రోడ్డు

29.8 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదు

- ఇళ్లలోకి చేరిన నీరు... రోడ్లపై నిలిచిన వేలాది వాహనాలు
- సీఎంతో మాట్లాడిన మోదీ... సాయమందిస్తామని హామీ

ముంబై: దేశంలోనే అతిపెద్ద నగరం ముంబైని మంగళవారం కుండపోత వర్షాలు ముంచెత్తాయి. వరుణుడి దెబ్బతో రోడ్డు, రైలు రవాణా, విమాన సేవలకు తీవ్ర ఆటంకం కలిగింది. అనేక ప్రాంతాల్లో నీళ్లు నడుము లోతు వరకు ప్రవహించగా, ఇళ్లు జలమయమయ్యాయి. జనజీవనం అస్తవ్యస్తమైంది. పదుల సంఖ్యలో చెట్లు కూలిపోయాయి. దాదార్, కుర్లా, అంధేరి, ఘట్కోపర్, దిగువ పరేల్, ఖర్ వెస్ట్ తదితర ప్రాంతాల్లో వేల సంఖ్యలో వాహనాలు నీటిలో చిక్కుకుని రోడ్లపై నిలిచిపోయాయి. అటు అలల ఉధృతి కూడా పెరగడంతో వర్షపు నీరు సముద్రంలో కలవడానికి అడ్డంకులు ఏర్పడ్డాయి. ముంబై వ్యాప్తంగా మంగళవారం ఉదయం 8.30 నుంచి 11.30 మధ్య కేవలం మూడు గంటల్లోనే దాదాపు 65 మిల్లీ మీటర్ల వర్షం కురిసిందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) చెప్పింది. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాకూడదని అధికారులు హెచ్చరించారు. నగరపాలక సంస్థ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం కనీసం 20 చెట్లు, ఒక గోడ కూలిపోయింది. ఇప్పటివరకు ఎక్కడా ప్రాణ నష్టం సంభవించలేదు.

కేంద్రం నుంచి సాయం: మోదీ

మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌తో ప్రధాని మోదీ మాట్లాడి నగరంలో పరిస్థితి గురించి తెలుసుకున్నారు. కేంద్రం నుంచి అవసరమైన సాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. ముంబై, సమీప ప్రాంతాల్లోని ప్రజలు అవసరమైన జాగ్రత్తలు తీసుకుని సురక్షితంగా ఉండాలని మోదీ ట్విటర్‌లో సూచించారు. మరోవైపు ఫడ్నవిస్ వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర విపత్తు నిర్వహణ విభాగాన్ని తనిఖీ చేశారు. పోలీసు కమిషనర్, నగర పాలక సంస్థ అధికారులతో మాట్లాడి పరిస్థితిని గురించి తెలుసుకున్నారు. సచివాలయంలోని ఉద్యోగులను ఫడ్నవిస్ ముందుగానే ఇళ్లకు పంపించేశారు. పాఠశాలలు, కార్యాలయాలు కూడా విద్యార్థులు, ఉద్యోగులను పంపించేయాలని ఆయన ఆదేశించారు. అటు నౌకాదళం కూడా సహాయక చర్యల కోసం సిబ్బంది, సామగ్రిని సిద్ధంగా ఉంచింది. అవసరమైన వెంటనే రంగంలోకి దిగేందుకు వీలుగా ముంబైలోని వివిధ ప్రాంతాల్లో వరద సహాయక బృందాలు, హెలికాప్టర్లు, ఈతగాళ్లు, వైద్య బృందాలు సిద్ధంగా ఉన్నాయని నేవీ అధికార ప్రతినిధి ట్విటర్ ద్వారా వెల్లడించారు. ముంబై, దక్షిణ గుజరాత్, కొంకణ్, గోవా, పశ్చిమ విదర్భ తదితర ప్రాంతాల్లో రానున్న ఒకట్రెండు రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయనీ, పరిస్థితి మరింత దిగజారొచ్చని పుణెలోని ఐఎండీ అధికారులు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీచేశారు.

నిలిచిపోయిన సబర్బన్ రైళ్లు

రైలు పట్టాలపైకి నీరు చేరడంతో ముంబై జీవన రేఖగా పేర్కొనే సబర్బన్ రైళ్ల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగింది. మూడు సబర్బన్ మార్గాల్లోనూ కొన్ని రైళ్లను రద్దు చేయగా, మరికొన్ని గంటల తరబడి పట్టాలపైనే నిలిచిపోయాయి. అనేక మంది ప్రయాణికులు రైల్వే స్టేషన్లలో చిక్కుకుపోయారు. భారీ వర్షం వల్ల ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయంలోనూ ఉదయం నుంచి విమానాల రాకపోకల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకుంది. సాయంత్రం నాలుగు గంటల తర్వాత రన్‌వేపై దిగేందుకు విమానాలను అనుమతించలేదు. ఆరు విమానాలను పూర్తిగా రద్దు చేయగా, పదింటిని ఇతర విమానాశ్రయాలకు మళ్లించారు. ఇక ప్రధాన రోడ్లపై ట్రాఫిక్ నత్తలతో పోటీపడుతూ ముందుకు సాగింది. కాగా, ముంబైలో మంగళవారం మొత్తంగా 29.8 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు శాంటాక్రూజ్‌లోని వాతావరణ కేంద్రం తెలిపింది. 1997 తర్వాత నుంచి చూస్తే ఆగస్టు నెలలో ఒక్క రోజులో నమోదైన అత్యధిక వర్షపాతం ఇదే.





భారీ వర్షాలతో ఛత్రపతి శివాజీ టెర్మినల్ వద్ద భారీగా నిలిచిపోయిన వాహనాలు, ముంబైలోని మరో ప్రాంతంలో వరద నీటిలో వెళ్తున్న బస్సు

పట్టాలు తప్పిన దురంతో ఎక్స్‌ప్రెస్



రైలు పట్టాల కింద మట్టి కొట్టుకుపోవడంతో నాగ్‌పూర్-ముంబై దురంతో ఎక్స్‌ప్రెస్ మంగళవారం ఉదయం పట్టాలు తప్పింది. మహారాష్ట్రలోని వసింద్, అసన్‌గావ్ స్టేషన్ల మధ్య రైలు ఇంజిన్, 9 బోగీలు పట్టాలు తప్పాయనీ, ఎవరూ చనిపోలేదని రైల్వే పేర్కొంది. ఈ రైలుకు ఉన్నవన్నీ అత్యాధునిక లింక్ హాఫ్‌మన్ బుష్ బోగీలే కావడం గమనార్హం. పట్టాల కింద మట్టి కొట్టుకుపోయి ఉండడాన్ని గమనించిన డ్రైవర్ వెంటనే బ్రేకులు వేశాడనీ, అందుకే ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు.

కోస్తాంధ్రలో మరో 4 రోజులు వర్షాలు

- క్రియాశీలకంగా రుతుపవనాలు
- శ్రీకాకుళం జిల్లా వంశధార నదిలో పెరిగిన వరద ప్రవాహం
- విశాఖలో నీట మునిగిన వరినాట్లు



విశాఖ జిల్లా కుమ్మరపల్లిలో నీట మునిగిన వరి పంటను చూపిస్తున్న రైతులు



గొట్టా బ్యారేజీ వద్ద నీటిని వంశధారలోకి విడిచిపెడుతున్న దృశ్యం

సాక్షి, అమరావతి/విశాఖపట్నం/హిరమండలం: నైరుతి మధ్యప్రదేశ్‌పై కొనసాగుతున్న అల్పపీడనం గుజరాత్ వైపు మళ్లింది. ఇది బుధవారం నాటికి అక్కడ వాయుగుండంగా బలపడనుంది. దీంతో దాని ప్రభావం రాష్ట్రంపై పూర్తిగా తగ్గిపోనుంది. ఫలితంగా రాష్ట్రంలో వర్షాల ఉధృతి తగ్గుముఖం పట్టనుంది. మరోవైపు నైరుతి రుతుపవనాలు కోస్తాంధ్రపై బలంగా ఉన్నాయి. రానున్న మూడు రోజుల్లో కోస్తాంధ్ర జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు, వచ్చేనెల రెండు నుంచి మూడో తేదీ వరకూ కోస్తా జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) మంగళవారాం రాత్రి వెబ్‌సైట్‌లో పేర్కొంది. గత 24 గంటల్లో శ్రీకాకుళం జిల్లాలో భారీ వర్షాలు పడ్డాయి. సగానికి పైగా మండలాల్లో 50 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైందని అధికారవర్గాలు తెలిపాయి. గత వారం రోజులుగా కురిసిన వర్షాలతో రాష్ట్రంలో ప్రకాశం, గుంటూరు, శ్రీకాకుళం జిల్లాలు ఈ సీజన్ ఇప్పటి (జూన్ 1 నుంచి ఆగస్టు 29) వరకూ అధిక వర్షపాతం నమోదైన జాబితాలో చేరాయి.

ఉప్పొంగిన వంశధార

ఒడిశాలో సోమ, మంగళవారాల్లో కురిసిన భారీ వర్షాలకు శ్రీకాకుళం జిల్లాలోని వంశధార నదిలో వరద ప్రవాహం పెరగడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. గొట్టా బ్యారేజీ వద్ద నీటి ప్రవాహం పెరగడంతో అధికారులు నీటిని వంశధారలోకి విడిచిపెడుతున్నారు. ప్రస్తుతం గొట్టా బ్యారేజీ వద్ద 37.70 మీటర్ల నీటి నిల్వ ఉండగా, 36,317 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. దీంతో మంగళవారం 22 గేట్లను 50 సెంటీమీటర్ల మేరకు పైకిలేపి 36 వేల క్యూసెక్కులు దిగువకు విడిచిపెడుతున్నారు. సోమవారం ఉధృతంగా ప్రవహించిన నాగావళి మంగళవారానికి కొంత తగ్గుముఖం పట్టింది.

విశాఖలో పొంగిప్రవహిస్తున్న వాగులు

విశాఖ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఆంధ్రా, ఒడిశా సరిహద్దులోని జోలాపుట్టు రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 2,750 అడుగులు కాగా మంగళవారం సాయంత్రానికి 2732.50కి చేరింది. ఆంధ్రా, ఒడిశా సరిహద్దు జలవిద్యుత్ కేంద్రాలకు నీటిని విడుదల చేయడంలో కీలకమైన బలిమెల రిజర్వాయర్‌లోకి వరదనీరు భారీగా వచ్చింది. సీలేరు జలవిద్యుత్ కేంద్రం దిగువన ఉన్న డొంకరాయి జలాశయంలోకీ వరదనీరు చేరడంతో జెన్‌కో అధికారులు విద్యుదుత్పత్తి నిలిపేశారు. వందలాది ఎకరాల్లో వరినాట్లు నీటమునిగాయి. కాగా, శ్రీకాకుళం జిల్లాలో వరద పరిస్థితిపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్, వివిధ శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడి తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

కర్ణాటక గుప్పిట్లో కృష్ణమ్మ!

- వచ్చిన వరద జలాలను మళ్లించేస్తున్న కర్ణాటక ప్రభుత్వం
- స్థానిక వర్షాలతో శ్రీశైలం జలాశయానికి అరకొర ప్రవాహం

సాక్షి, అమరావతి: కృష్ణా నదిలో వచ్చిన వరద జలాలను వచ్చినట్టుగా ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాల నుంచి కర్ణాటక సర్కార్ మళ్లిస్తోంది. నెలన్నర క్రితమే ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాలు నిండినా వ్యూహాత్మకంగా రిజర్వాయర్‌లకు జలాలను మళ్లించి వాటిని ఖాళీ చేసిన కర్ణాటక గత వారం నుంచి వస్తున్న వరద నీటిని కూడా కిందకి వదలడంలేదు. స్థానికంగా కురిసిన వర్షాలతో జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల జలాశయాల్లోకి అరకొరగా నీళ్లు చేరుతున్నాయి. దాంతో ఎగువ నుంచి దిగువకు చుక్క నీరు చేరడం లేదు. స్థానికంగా కురిసిన వర్షాలకు మంగళవారం జూరాలలోకి 3,579, శ్రీశైలంలోకి 6,574, నాగార్జునసాగర్‌లోకి 820, పులిచింతలలోకి 1,226 క్యూసెక్కులు చేరాయి. తుంగభద్ర జలాశయాలోకి మంగళవారం 17,442 క్యూసెక్కులు చేరడంతో నీటి నిల్వ 61.74 టీఎంసీలకు చేరుకుంది.

రూ.200 నోటు కోసం మరో వారం ఆగాల్సిందే!



సాక్షి, అమరావతి: కొత్తగా విడుదల చేసిన రూ.200 నోటు రాష్ట్రానికి రావడానికి మరో వారం పడుతుందని బ్యాంకర్లు మంగళవారం తెలిపారు. రూ.200 నోట్లకు అనుగుణంగా ఏటీఎంలు సిద్ధం చేయడానికి మంగళవారమే అనుమతి వచ్చిందని వివరించారు. వచ్చే సోమవారం కల్లా ఏటీఎంలను సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ఈనేపథ్యంలో రూ.200 నోటు కోసం రాష్ట్ర ప్రజలు సోమవారం వరకు ఆగాల్సిందే.

టెండర్లు పిలవకుండా ప్రసార హక్కులెలా కట్టబెడతారు?

- వివరణ ఇవ్వాలని అసెంబ్లీ కార్యదర్శికి హైకోర్టు ఆదేశం
- విచారణ సెప్టెంబర్ 12కి వాయిదా
- శాసనసభ సమావేశాల ప్రత్యక్ష ప్రసార హక్కుల అప్పగింత ఏకపక్షం
- దురుద్దేశాలతోనే టెండర్లు పిలవలేదు.. జోక్యం చేసుకోండి
- హైకోర్టులో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పిల్

సాక్షి, హైదరాబాద్: ఎటువంటి టెండర్లను ఆహ్వానించకుండానే ఆంధ్రప్రదేశ్ శాసనసభ, శాసనమండలి సమావేశాల ప్రత్యక్ష ప్రసారాల హక్కులను ఆంధ్రజ్యోతి యాజమాన్యానికి చెందిన అడ్వాన్స్‌డ్ కమ్యూనికేషన్స్‌కు కట్టబెట్టడాన్ని సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై ఉమ్మడి హైకోర్టు స్పందించింది. టెండర్లు ఆహ్వానించకుండా కేవలం నామినేషన్ పద్ధతిపైనే ప్రత్యక్ష ప్రసారాల హక్కులను అడ్వాన్స్‌డ్ కమ్యూనికేషన్స్‌కు అప్పగించడంపై వివరణ ఇవ్వాలని అసెంబ్లీ కార్యదర్శిని ఆదేశించింది. ఇందులో భాగంగా న్యాయ, అసెంబ్లీ వ్యవహారాల ముఖ్య కార్యదర్శి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, అసెంబ్లీ కార్యదర్శి, అడ్వాన్స్‌డ్ కమ్యూనికేషన్స్‌కు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 12కి వాయిదా వేసింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ జె.ఉమాదేవిలతో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అసెంబ్లీ ప్రత్యక్ష ప్రసారాల హక్కులను నామినేషన్ పద్ధతిపై అడ్వాన్స్‌డ్ కమ్యూనికేషన్స్‌కు అప్పగించడాన్ని సవాలు చేస్తూ మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై మంగళవారం ఏసీజే నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ, ఎటువంటి అర్హత ప్రమాణాలను నిర్దేశించకుండానే తన ఇష్టానుసారం స్పీకర్ ప్రసార హక్కును ఆంధ్రజ్యోతి యాజమాన్యానికి చెందిన అడ్వాన్స్‌డ్ కమ్యూనికేషన్స్‌కు కట్టబెట్టారని పేర్కొన్నారు. ఆరు గంటలకు రూ.75వేలు చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారని తెలిపారు. ఈ ఒప్పందం రెండేళ్ల పాటు అమల్లో ఉంటుందన్నారు. ప్రత్యక్ష ప్రసారాల హక్కుల అప్పగింత ఏకపక్షంగా, దురుద్దేశపూర్వకంగా జరిగిందని వివరించారు. రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో న్యూస్ ఛానెళ్లు ఉండగా, ఆంధ్రజ్యోతి యజమాన్యానికి చెందిన సంస్థకు ప్రసార హక్కులను ఇవ్వడంలో దురుద్దేశం ఉందన్నారు. ఆంధ్రజ్యోతి యజమాన్యానికి, అధికార పార్టీకి ఉన్న సత్సంబంధాల గురించి ప్రపంచానికి తెలుసునని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం, ఈ వ్యాజ్యాన్ని విచారణకు స్వీకరిస్తూ ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. టెండర్లు పిలవకుండా ఎందుకు ప్రసార హక్కులను కట్టబెట్టారో వివరణ ఇవ్వాలని ప్రతివాదులను ఆదేశించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలంటూ విచారణను సెప్టెంబర్ 12కి వాయిదా వేసింది.

అడ్డగోలుగా కేసుల ఎత్తివేత

- ఆంధ్రజ్యోతికి అడ్డదారిలో ప్రసార కాంట్రాక్టు
- కోర్టు విచారణకు తీసుకోవడాన్ని స్వాగతించిన ఆర్కే
- ప్రభుత్వానికి నోటీసులు జారీచేయడంపై హర్షం
- స్పీకర్ స్థాయి మరిచి పచ్చకండువాలు కప్పుతున్నారని విమర్శ



సాక్షి, హైదరాబాద్: చంద్రబాబు ప్రభుత్వం అక్రమ నిర్ణయాలను న్యాయస్థానం అడ్డుకోవడాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి స్వాగతించారు. అధికార పార్టీ నేతలపై నమోదైన తీవ్ర నేరాలకు సంబంధించిన కేసులను విచారణ దశలోనే ఎత్తివేస్తూ సర్కార్ ఇచ్చిన జీవోలు, అసెంబ్లీ ప్రసారాలను తన అనుకూల ఛానల్‌కు అడ్డగోలుగా కట్టబెట్టిన వైనంపై వేసిన పిటిషన్లను కోర్టు విచారణకు స్వీకరించి, ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయడం ఆహ్వానించదగ్గ పరిణామమని వ్యాఖ్యానించారు. తాను సీఎంను కాబట్టి ఏం చేసినా చెల్లుతుందని భావించే చంద్రబాబుకు ఇది చెంపపెట్టని వ్యాఖ్యానించారు. హైదరాబాద్ లోటస్‌పాండ్‌లోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో రామకృష్ణారెడ్డి మంగళవారం మీడియాతో మాట్లాడారు. బాధిత కుటుంబాలు ఏమైనా ఫర్వాలేదని, తనవాళ్ళపై మాత్రం కేసులు ఎత్తివేయాలన్న చంద్రబాబు చట్టవ్యతిరేకంగా 132 జీవోలిచ్చారని చెప్పారు. టీడీపీ నేతలపై నమోదైన ఈ కేసులన్నీ ఉపసంహారణకు ఎంతమాత్రం అనుకూలం కాదన్నారు. వీటిపై పోలీసులు విచారణ జరిపి, చార్జిషీట్లు పెట్టారని, ప్రస్తుతం వీటిని కోర్టు విచారిస్తోందని చెప్పారు. ఈ దశలో కేసులను ఉపసంహరించుకునే అధికారం ప్రభుత్వానికి ఎక్కడిదని ప్రశ్నించారు. ఇలాంటి కేసులను విత్‌డ్రా చేసుకోవద్దని గతంలో ప్రముఖ న్యాయమూర్తి కృష్ణయ్యర్ తీర్పు చెప్పారని, అయినా ప్రభుత్వం ఇవేవీ బేఖాతర్ చేయలేదని చెప్పారు.

అడ్డగోలుగా ఆంధ్రజ్యోతికి లబ్ధి: అసెంబ్లీ సమావేశాల ప్రసారాలను చట్ట నిబంధనలకు వ్యతిరేకంగా ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ కుమారుడు ఆదిత్యకు కట్టబెట్టారని ఆర్కే ధ్వజమెత్తారు. అసెంబ్లీ ప్రసారాలను ఏ విధంగా ఇచ్చారు? ఎవరికి ఇచ్చారు? దీనికి పాటించిన నిబంధనలు ఏమిటని సమాచార చట్టం కింద ప్రశ్నిస్తే తీవ్ర జాప్యం తర్వాత ప్రభుత్వం విచిత్రమైన సమాధానం ఇచ్చిందని తెలిపారు. సమయాభావం వల్ల నామినేషన్ పద్ధతిలో టెండర్లు పిలవకుండానే అడ్వాన్స్‌డ్ టెలీ కమ్యూనికేషన్‌కు స్పీకర్ ఆదేశాల మేరకు 2018 వరకూ అనుమతి ఇచ్చినట్టు పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారి లిఖితపూర్వకంగా సమాధానమిచ్చినట్టు చెప్పారు. ఆ సంస్థ ఆదిత్య పేరుపై ఉందని, ఇది రియల్ క్విడ్ ప్రోకో అని విమర్శించారు. వాస్తవానికి ఈ కాంట్రాక్టు ఇచ్చే అధికారం స్పీకర్ పరిధిలోకి రాదని, అయినా చంద్రబాబు, స్పీకర్ పనిగట్టుకుని ఆ సంస్థకు కాంట్రాక్టు అప్పగించారని తెలిపారు. తమిళనాడులో ఇదే తరహా కేసును విచారించిన కోర్టు స్పీకర్‌కు ఆ అధికారం లేదని తీర్పు చెప్పిన విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్ళామన్నారు.



స్వైన్.. వణుకు!

దేశంలో హెచ్1ఎన్1 విజృంభణ

- ఈ ఎనిమిది నెలల్లోనే 18,000 కేసులు నమోదు
- వైరస్ కారణంగా మరణించిన వారి సంఖ్య 871.. గత ఏడాదితో పోలిస్తే పది రెట్లు పెరిగిన కేసుల సంఖ్య
- మహారాష్ట్ర, గుజరాత్‌లో ఎక్కువ కేసులు, మరణాలు

దేశంలో స్వైన్‌ఫ్లూ(హెచ్1ఎన్1) వైరస్ భయం కొనసాగుతోంది. ఈ ఏడాది ఇప్పటి వరకూ సుమారు 18,000 మంది స్వైన్‌ఫ్లూ బారిన పడగా.. 871 మంది దీని వల్ల ప్రాణాలు కోల్పోయారు. గత ఏడాదితో పోలిస్తే స్వైన్‌ఫ్లూ కేసుల సంఖ్య ఈ ఏడాది పది రెట్లు పెరగడం గమనార్హం. 2016లో దేశవ్యాప్తంగా 1,786 స్వైన్‌ఫ్లూ కేసులు నమోదుకాగా.. 265 మంది మృత్యువాతపడ్డారు. 2015లో స్వైన్‌ఫ్లూ దేశం యావత్తునూ వణికించింది. ఆ ఏడాది సుమారు 42,500 మంది స్వైన్‌ఫ్లూ బారిన పడగా.. దాదాపు 3,000 మంది ప్రాణాలు కోల్పోయారు. అయితే స్వైన్‌ఫ్లూపై ప్రభుత్వ యంత్రాంగం స్పందన అంతంత మాత్రంగానే ఉండటంతో ఈ ఏడాది మళ్లీ అది విజృంభించింది.

స్వైన్‌ఫ్లూ లేదా ఇన్‌ఫ్లుయెంజా ఏ అనేది హెచ్1ఎన్1 వైరస్ ద్వారా వ్యాపిస్తుంది. ఇది తొలుత శ్వాసకోశ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. సీజనల్ వ్యాధుల మాదిరిగానే దీని లక్షణాలు కూడా ఉంటాయి. ఒక్కసారిగా జ్వరం రావడం, శరీరం చల్లబడిపోవడం, గొంతుమంట, తలనొప్పి, దగ్గు, ఒళ్లు నొప్పులు మొదలైన లక్షణాలు కనిపిస్తాయి. స్వైన్‌ఫ్లూ బారిన పడిన వారు తుమ్మినా, దగ్గినా వారి నుంచి ఇది ఇతరులకు వ్యాపిస్తుంది. ఈ ఏడాది మహారాష్ట్రలో ఎక్కువ మంది స్వైన్‌ఫ్లూ బారిన పడ్డారు. ఇక్కడ 414 మంది మరణించారు. దేశవ్యాప్తంగా సంభవించిన మరణాల్లో 50 శాతం మహారాష్ట్రలోనే నమోదు కావడం గమనార్హం. ఇక గుజరాత్‌లో స్వైన్‌ఫ్లూ కారణంగా 210 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నెల 13–15 మధ్య మూడు రోజుల వ్యవధిలోనే ఇక్కడ 30 మంది స్వైన్‌ఫ్లూకు బలయ్యారు.


మహారాష్ట్రలో 50 శాతం మరణాలు

ఎందుకీ పెరుగుదల..

స్వైన్‌ఫ్లూ కేసుల సంఖ్య పెరగడానికి జాతీయ స్థాయిలో నిఘా వ్యవస్థ ఉండటం, మెరుగైన ప్రయోగశాల వ్యవస్థ కలిగి ఉండటమే కారణమని పుణెలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ డైరెక్టర్ దేవేంద్ర మౌర్య వెల్లడించారు. 2015లో స్వైన్‌ఫ్లూ విజృంభించడంతో గత ఏడాది ఎక్కువ మంది ఫ్లూ వ్యాక్సిన్ తీసుకున్నారని, కానీ ఈ ఏడాది చాలా తక్కువ మందే వ్యాక్సినేషన్ తీసుకోవడం వల్ల కూడా కేసుల సంఖ్య పెరిగిందని వైద్య నిపుణులు చెపుతున్నారు.

సన్నద్ధత అంతంత మాత్రమే..

సీజనల్ ఫ్లూ వ్యాక్సినేషన్ అనేది దేశ జాతీయ వ్యాక్సినేషన్ పాలసీలో ఒక భాగం కాదు. దీనికితోడు హెచ్1ఎన్1 వైరస్ ప్రభావం ఎంత.. ఏటా ఇది ఏ విధంగా మారుతోంది.. వైరస్ వల్ల ఎదురయ్యే ఇబ్బందులు ఏమిటి తదితర అంశాలకు సంబంధించి ప్రభుత్వం దగ్గర సరైన గణాంకాలు లేవు. చిన్నారులు, వృద్ధులు, దీర్ఘకాల వ్యాధులతో బాధపడేవారు త్వరగా స్వైన్‌ఫ్లూ వైరస్ బారిన పడుతున్నారని వైద్యులు చెపుతున్నారు. వీరితో పాటు గర్భిణులు, ఆరోగ్య కార్యకర్తలు కూడా స్వైన్‌ఫ్లూ వ్యాక్సిన్ తీసుకోవాలని సూచిస్తున్నారు.



దేశంలో స్వైన్‌ఫ్లూ కేసులు, మరణాలు

రాష్ట్రానికి మరో 1.20 లక్షల 'పీఎంఏవై' ఇళ్ల మంజూరు

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద ఆంధ్రప్రదేశ్‌కు 1,20,894 ఇళ్లను కేంద్రం మంజూరు చేసింది. సోమవారం కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ ఏపీ సహా ఆరు రాష్ట్రాలకు మొత్తం 2,17,900 ఇళ్లను మంజూరు చేసింది. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 26 లక్షలకు పైగా ఇళ్లు మంజూరు చేయగా ఇందులో ఏపీ వాటా 20.71 శాతమని ఆ శాఖ తెలిపింది. అలాగే రాష్ట్రానికి మొత్తం 5,41,300 ఇళ్లు మంజూరయ్యాయని, వీటికి రూ.31,056 కోట్ల మేర పెట్టుబడి ప్రతిపాదనలను ఆమోదించామని పేర్కొంది. దీనికి సంబంధించి రూ.8,138 కోట్ల మేర కేంద్రం సాయంగా అందించనున్నట్టు కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ వెల్లడించింది.

గూడ్స్ బోగీల మధ్యలో ఊడిన కప్లింగ్

గార్ల (ఇల్లందు): గూడ్స్ రైలు బోగీల మధ్యలో కప్లింగ్ ఊడిపోయిన ఘటన మంగళవారం తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లా గార్ల రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. కాజీపేట నుంచి విజయవాడ వైపు వెళ్తున్న గూడ్స్ రైలు గార్ల సమీపంలోని పాకాల ఏటి బ్రిడ్జిపైకి రాగానే బోగీల మధ్యలో కప్లింగ్ తెగిపోయింది. దీంతో సగం బోగీలు గార్ల రైల్వేగేట్ వరకు రాగా, మిగతా సగం బోగీలు పాకాల ఏటి బ్రిడ్జిపై నిలిచిపోయాయి. గార్డ్ అప్రమత్తమై లోకో పైలెట్‌కు సమాచారం అందించాడు. దీంతో రైలును వెనక్కి తీసుకెళ్లి బోగీలను మళ్లీ కలిపారు.

స్వగ్రామాలకు గల్ఫ్ బాధితులు

- శ్రమ దోపిడీ చేసి ఒట్టి చేతులతో పంపారు
- దేశం మొత్తం మీద 900 మంది బాధితులు
- మోసపోయిన వారిలో 170 ఆంధ్రావారు
- విశాఖ చేరుకున్న శ్రీకాకుళం జిల్లా వాసులు

గోపాలపట్నం (విశాఖ పశ్చిమ): వారంతా కటిక పేదలు.. ఉన్న ఊళ్లో పనులు దొరక్క.. భార్యా పిల్లలతో పస్తులుండలేక బతుకుదెరువు కోసం గల్ఫ్‌లోని ఒమన్‌కు వెళ్లారు. అక్కడ సోహార్ నగరంలో పెట్రోన్ గల్ఫ్ అనే కంపెనీలో మెషీన్ రిగ్గర్, ఎలక్ట్రీషియన్, మెకానిక్ పనులకు వెళ్లారు. పదేళ్లుగా కొందరు.. ఏడున్నరేళ్లుగా ఇంకొందరు.. ఇలా దేశం మొత్తంమ్మీద 900 మంది భారతీయులు అక్కడ శ్రమిస్తున్నారు. వీరిలో 30 మంది తెలంగాణ, 170 మంది ఆంధ్ర వారూ కాయకష్టం చేస్తున్నారు. ఉన్నట్టుండి కంపెనీ యాజమాన్యం వీరికి నాలుగు నెలలుగా జీతాలు ఆపేసింది. చేతిలో డబ్బులన్నీ అయిపోవడంతో ఆకలిబాధలతో అలమటించారు. కార్మికులంతా గగ్గోలు పెట్టారు. తెలంగాణ గల్ఫ్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నంగి దేవేందర్‌రెడ్డి ఈ సమస్యను భారత రాయబార కార్యాలయం దృష్టికి తీసుకెళ్లడంతో కదలిక వచ్చింది. భారత రాయబారి ఇంద్రామణి పాండే స్పందించారు. అక్కడి నుంచి దశల వారీగా కార్మికులను స్వదేశానికి తరలిస్తున్నారు. వీరిలో శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురానికి చెందిన 20 మంది మంగళవారం విశాఖకు చేరారు. ఈ సందర్భంగా మీడియాతో పంచుకున్న అక్కడి అనుభవాలు వారి మాటల్లోనే...



విశాఖ విమానాశ్రయంలో బాధితులు

ప్రభుత్వాలు స్పందించాలి

ఊర్లో ఉపాధి లేక పొరుగు దేశానికి వెళ్లి భంగపడ్డ గల్ఫ్ కార్మికుల సమస్యపై తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలి. వీరికి పునరావాసం కల్పించాలి. సంక్షేమ కార్యక్రమాల్లో వీరికి ప్రాధాన్యం ఇవ్వాలి.

– నంగి దేవేందర్‌రెడ్డి, తెలంగాణ గల్ఫ్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

పదేళ్లుగా మా శ్రమను దోచేశారు

ఉన్న ఊళ్లో పస్తులుండలేక పదేళ్ల క్రితం ఒమన్‌లో ఉద్యోగానికి వెళ్లాం. చివరకు దారుణంగా భంగపడ్డాం. పదేళ్లుగా మా శ్రమను కంపెనీ యాజమాన్యం దోచేసింది. నాలుగు నెలల జీతం, రూ.లక్షల మొత్తంలో రావాల్సిన గ్రాట్యుటీ ఇవ్వలేదు. ఏం చేయాలో పాలుపోవడంలేదు.

– వేణురెడ్డి, బాధితుడు

ఏమీ మిగల్లేదు

మా అవస్థలను తెలుసుకుని మస్కట్‌కు చిరు మెగా యూత్ ఫోర్స్ ప్రతినిధులు చందక రామదాస్, పోల్నాని లింగయ్య వచ్చారు. 79మంది తెలుగు కార్మికులకు చేతి ఖర్చుల కింద రూ.వెయ్యి చొప్పున ఇచ్చారు. భారత రాయబారి జోక్యంతో స్వదేశానికి తిరిగి పంపించారు.

– చిరుగాడి గురుమూర్తి

వివాదాలతో రోడ్డునపడ్డాం

మస్కట్‌లో ఏడున్నరేళ్లుగా పనిచేస్తున్నా. నెలకు రూ.18 వేల ఆదాయం వస్తుందని అక్కడకు వెళ్లా. నాలుగు నెలలుగా యాజమాన్యం దారుణంగా మారింది. నలుగురు భాగస్వాములు గొడవలుపడి మమ్మల్ని రోడ్డున పడేశారు. ఇంత ఘోరంగా మోసపోతామని ఊహించలేదు.

– శీరపు వాసుదేవ్

న్యాయం ఎలా ?

జీతాలు లేక, రావాల్సిన గ్రాట్యుటీ పొందలేకపోయిన మా పరిస్థితిని భారత రాయబారికి మొరపెట్టుకున్నాం. దీంతో అక్కడి కోర్టులో పిటిషన్ వేయించారు. మాకు కోర్టులో న్యాయం ఎలా జరుగుతుందో అర్థంకావడంలేదు.

– గేదెల పురుషోత్తం

పీజీ ఈసెట్ సీట్ల కేటాయింపు

సాక్షి, అమరావతి: ఏపీ పీజీఈసెట్ కింద అర్హులైన అభ్యర్థులకు సీట్లు కేటాయిస్తూ పీజీఈసెట్ కన్వీనర్ మంగళవారం ప్రకటన విడుదల చేశారు. దీనికి గేట్, జీప్యాట్ క్వాలిఫై అయిన 1,433 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 987 మంది ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైనట్లు పేర్కొన్నారు. ఈ నెల 27, 28న వెబ్ ఆప్షన్లకు అవకాశమివ్వగా 979 మంది ఆప్షన్లు నమోదు చేసినట్లు వివరించారు. మొత్తం 18,515 సీట్లు అందుబాటులో ఉండగా 956 మందికి సీట్లు కేటాయించినట్లు తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసి ఆ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకొని కాలేజీల్లో ధ్రువపత్రాలతో పాటు బుధవారం సాయంత్రం 5 గంటల్లోగా సమర్పించాలని సూచించారు.

పాముకాటుతో విద్యార్థి మృతి

స్కూల్ బ్యాగులో దూరి కాటేసిన పాము

బ్రహ్మంగారిమఠం: స్కూల్ బ్యాగులో దూరిన పాము.. కాటేయడంతో విద్యార్థి మరణించాడు. ఈ ఘటన బ్రహ్మంగారిమఠం మండలంలోని నర్సిరెడ్డిపల్లెలో జరిగింది. గ్రామానికి చెందిన యత్తపు గురివిరెడ్డి కుమారుడు గురు కృష్ణారెడ్డి(11) లింగాలదిన్నెపల్లె లో ఉన్న లిఖిత ఇంగ్లీషు మీడియం హైస్కూల్లో మూడో తరగతి చదువుతున్నాడు. సోమవారం పాఠశాలకు వెళ్లేందుకు తోటి విద్యార్థులతో స్కూల్ బస్సు కోసం రోడ్డుపై వేచి ఉన్నాడు. బస్సు ఆలస్యం కావడంతో స్కూల్‌బ్యాగ్ రోడ్డుకు సమీపంలోని పచ్చని గడ్డిలో ఉంచాడు. దీంతో చిన్నపాము బ్యాగ్‌లోకి చేరుకుంది. గమనించని విద్యార్థి బస్సు రాగానే తోటి విద్యార్థులతో కలిసి బస్సు ఎక్కాడు. బస్సులో కూర్చోగానే బ్యాగులో ఉన్న పాము కృష్ణారెడ్డిని కాటు వేసింది. దీంతో బాలుడు బస్సులోనే కింద పడడంతో విద్యార్థులు కేకలు వేశారు. దీంతో డ్రైవర్ బస్సు ఆపి పామును చంపేశాడు. పాముకాటుకు గురైన విద్యార్థిని మైదుకూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మంగళవారం విద్యార్థి మృతి చెందాడు. దీంతో బాలుని తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.

రూ.263 కోట్లతో ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లు



సీఎస్ దినేశ్‌కుమార్ వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రూ.263 కోట్లతో 19 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకు అనుమతిచ్చినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్‌కుమార్ వెల్లడించారు. ఈ యూనిట్లు ఏర్పాటుతో 1,968 ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. మంగళవారం సచివాలయంలో తన కార్యాలయంలో రాష్ట్రస్థాయి ఎంపవర్‌మెంట్ కమిటీతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లకు ఏపీ అనువైన ప్రాంతమని అన్నారు. పరిశ్రమలకు ఇస్తోన్న సబ్సిడీలు దుర్వినియోగం కాకుండా పర్యవేక్షించాలని అధికారులకు సీఎస్ సూచించారు. ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుతో రైతులకు ప్రయోజనం, యువతకు ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. రాయితీతో ప్రభుత్వ భూములు తీసుకుని ఉత్పత్తి ప్రారంభించని సంస్థలపై కఠినంగా వ్యవహరించాలని సీఎస్ ఆదేశించారు. సమావేశంలో రాష్ట్ర పశుసంవర్ధకశాఖ ప్రత్యేక కార్యదర్శి జేఎస్వీ ప్రసాద్, ఉద్యానవన కమిషనర్ చిరంజీవి చౌదరి, ఎంపవర్ కమిటీ కార్యదర్శి ప్రసాద్, ఆర్థికశాఖాధికారులు పాల్గొన్నారు.

లైసెన్సు రెన్యువల్‌కు పునశ్చరణ తరగతులు

సాక్షి, అమరావతి: రవాణా వాహనాలు నడిపే డ్రైవర్లు తమ లైసెన్సు రెన్యువల్ చేసుకోవాలంటే ఇకపై తప్పనిసరిగా డ్రైవింగ్ స్కూల్స్‌లో పునశ్చరణ తరగతులకు హాజరై ధ్రువపత్రం సమర్పించాల్సి ఉంటుంది. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సుమితా దావ్రా ఉత్తర్వులు జారీ చేశారు. రవాణా వాహనాల డ్రైవర్లు తమ లైసెన్సును మూడేళ్లకొకసారి రెన్యువల్ చేసుకుంటారు. ఇకపై లైసెన్సు పునరుద్ధరించుకోవాలంటే రెండు రోజుల పాటు పునశ్చరణ తరగతులకు హాజరుకావాల్సి ఉంటుంది.

ఆడపిల్ల పుట్టిందని 'తలాక్'!

- మగబిడ్డ కోసం బాబా చెప్పినట్టు నడుచుకోవాలన్న అత్తింటివారు
- హైదరాబాద్ పాతబస్తీలో ఘటన

హైదరాబాద్: మగబిడ్డ కోసం గృహిణిని వేధించిన అత్తింటివారు... చివరకు ఆడపిల్ల పుట్టడంతో ఆమెను వదిలించుకోవడానికి సిద్ధమయ్యారు. బాబా చెప్పినట్టు నడుచుకోనందుకు... ఆయన ఇచ్చిన మందులు వాడనందుకే మగ పిల్లాడు పుట్టలేదంటూ కోడలిని హింసించారు. అర్థం చేసుకొంటాడని భర్తకు మొరపెట్టుకుంటే.. అతడు నిర్దాక్షిణ్యంగా విడాకుల నోటీసులు పంపి నిలువునా వంచించాడు. ఈ ఘోరంపై బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. అత్త, మామతో పాటు నకిలీ బాబానూ హైదరాబాద్ చార్మినార్ పోలీసులు అరెస్టు చేశారు. పురానాహవేలీలోని తన కార్యాలయంలో దక్షిణ మండలం డీసీపీ వి.సత్యనారాయణ మంగళవారం ఈ వివరాలు వెల్లడించారు. నాంపల్లికి చెందిన ముజఫర్ హుస్సేన్ కుమార్తె హబీబా ఫాతిమా(19)ను మొఘల్‌పురావాసి మహ్మద్ సాదిక్ కుమారుడు మహ్మద్ మన్సూర్ అలియాస్ సైఫ్‌కు ఇచ్చి 2016 ఆగస్టులో వివాహం జరిపించారు. పెళ్లయిన కొద్ది రోజులకే మన్సూర్ అబుదాబీ వెళ్లాడు. ఫాతిమా గర్భవతి అయింది. అత్త సమీనాసుల్తానా(50), మామ మహ్మద్ సాదిక్ (55) తమకు మగ పిల్లవాడు కావాలని.. అది జరగాలంటే తమకు తెలిసిన బాబా వద్దకు వెళ్లి మందులు తీసుకోవాలన్నారు. వద్దంటున్నా ఫాతిమాను బలవంతంగా మొఘల్‌పురాలో ఉండే షేక్ అబ్దుల్ రహీం అలియాస్ బాయి మియా(68) వద్దకు తీసుకెళ్లారు. బాబా ఆమెకు కొన్ని మందులిచ్చి, గర్భంపై నూనె రాయాలని సూచించాడు. అందుకు రూ.20 వేలు తీసుకున్నాడు. బాబా అనుచిత ప్రవర్తన గమనించిన ఫాతిమా అత్త, మామలకు విషయం చెప్పింది. దీన్ని పట్టించుకోని అత్త.. తాను కూడా అలా బాబా వద్ద మందులు తీసుకోవడంవల్లే నీ భర్త పుట్టాడంటూ చెప్పింది.

మొరపెట్టుకున్నా పట్టించుకోని భర్త...

ఈ క్రమంలో గత ఏడాది అక్టోబర్‌లో ఫాతిమా అబుదాబీలో ఉన్న భర్త వద్దకు వెళ్లింది. విషయాన్ని అతనికి చెప్పింది. బాబా చెప్పినట్టు నడుచుకోవాల్సిందేనని మన్సూర్ కూడా తెగేసి చెప్పి, ఈ ఏడాది జనవరిలో ఫాతిమాను తిరిగి నగరానికి పంపించాడు. ఈ ఏడాది మేలో ఫాతిమా ఆడ పిల్లకు జన్మనిచ్చింది. ఆడబిడ్డ జన్మించడంతో ఆగ్రహించిన అత్త, మామలు... ఫాతిమాను హింసించారు. ఆడపిల్ల పుట్టినందుకు శిక్షగా పుట్టింటి నుంచి రూ.10 లక్షలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. తాను ఇచ్చుకోలేనని తండ్రి ముజఫర్ చెప్పడంతో ఫాతిమాకు 'డైవర్స్–తలాక్–ఇ–బయాన్'పేరుతో విడాకుల నోటీసులు పంపించారు.

కేంద్రం నిధులిచ్చినా.. రాష్ట్రం కనికరించదే!

- గర్భిణులకు, చిన్నారులకూ మందులివ్వకుండా మొండిచేయి
- సర్కారు తీరుపై ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ తీవ్ర అభ్యంతరం

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి జాతీయ ఆరోగ్యమిషన్ పథకం నుంచి వేలాది కోట్ల రూపాయలు ఇచ్చినా గర్భిణులకు మందులు కూడా అందించలేక పోయారని తాజాగా ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (ఆడిట్) రాష్ట్రానికి అక్షింతలు వేశారు. 2011 నుంచి 2016 వరకూ జాతీయ ఆరోగ్యమిషన్ నిధుల వ్యయానికీ, రోగులకు అందిన వసతులకు పొంతన లేదని అభిప్రాయపడ్డారు. ప్రధానంగా ఐపీహెచ్ఎస్ (ఇండియా పబ్లిక్ హెల్త్ సర్వీసెస్) ప్రకారం 1571 రకాల మందులు అందాల్సి ఉండగా.. 300 రకాల మందులు కూడా అందించలేకపోయారని రాష్ట్రానికి రాసిన లేఖలో పేర్కొన్నారు. తాము మచ్చుకు కొన్ని ఆస్పత్రులను పరిశీలించినట్టు ఆడిట్ విభాగానికి చెందిన ఓ అధికారి చెప్పారు. ఏలూరు జిల్లా ఆస్పత్రి, భీమవరం, నరసాపురం సామాజిక ఆరోగ్యకేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. దీంతో పాటు ఆచంట, వేమవరం, వల్లూర్, గొల్లవానిపేట, కొణితివాడ, ఎల్బీచెర్ల తదితర ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లోనూ ఆడిట్ అధికారులు తనిఖీలు నిర్వహించగా పలు లోపాలు బయటపడ్డాయి. అందాల్సిన వాటికంటే 62 శాతం మందులు అందలేదని నిర్ధారించారు. రాష్ట్ర నిబంధనల ప్రకారం కూడా 636 రకాల మందులు విధిగా ఆస్పత్రుల్లో ఉండాలని, కానీ 419 రకాల మందులు మాత్రమే అందుబాటులో ఉంచారని ఆడిట్ అధికారులు వెల్లడించారు.



చిన్నారులకు మందులు ఎందుకివ్వనట్టు!

పుట్టిన బిడ్డకు మూడేళ్ల వరకూ విటమిన్–ఎ సొల్యూషన్ మందులు ఇవ్వాలి. కానీ 34 శాతం మంది చిన్నారులకు విటమిన్–ఎ మందులు ఎందుకు ఇవ్వలేదో అర్థం కాలేదని రాష్ట్రానికి రాసిన లేఖలో పేర్కొన్నారు. గర్భిణులకు సైతం మొదటి డోసు కింద కేవలం 66 శాతం మందికే ఇచ్చారని, రెండో డోసు ఇవ్వలేదని తేల్చారు. 2011 నుంచి 2016 మధ్యలో తీవ్ర రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణుల సంఖ్య 1.42 లక్షల మందికి పైగా నమోదైందని, దీన్ని బట్టి చూస్తే పరిస్థితులను అర్థం చేసుకోవచ్చని ఆడిట్ అధికారులు చెప్పుకొచ్చారు. ఇప్పటికీ నాలుగు శాతం మంది ఇళ్లదగ్గరే కాన్పులు చేసుకుంటుండటం కలచివేస్తున్న అంశమని కూడా వెల్లడించారు.

'లెక్క'లేదు

ఇదిలా ఉండగా.. గత మూడేళ్లుగా జాతీయ ఆరోగ్యమిషన్ ఇస్తున్న నిధులపై వినియోగ ధ్రువపత్రాలు (యుటిలైజేషన్ సర్టిఫికెట్స్) ఇవ్వలేదని కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలిసింది. జిల్లాల్లో వ్యయం చేసిన నిధులకు ఎక్కడా జమాఖర్చులు లేవని అధికార వర్గాలు తెలిపాయి.

చంద్రబాబుతో బ్రహ్మానందరెడ్డి భేటీ

- సీఎంను కలిసిన మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలు
- ఉప ఎన్నికలో బాగా కష్టపడ్డారని చంద్రబాబు కితాబు

సాక్షి, అమరావతి: నంద్యాలలో ఉప ఎన్నికలో గెలిచిన టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డితోపాటు ఆయన సోదరి, మంత్రి అఖిల ప్రియతోపాటు అక్కడ పనిచేసిన మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు మంగళవారం ఉండవల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. ఈ ఎన్నికలో అందరూ బాగా కష్టపడ్డారని చంద్రబాబు వారిని అభినందించారు. గెలుపొందిన బ్రహ్మానందరెడ్డిని ప్రత్యేకంగా ప్రశంసించారు. అఖిల ప్రియ కేక్‌ను తీసుకొచ్చి, కట్ చేసి అందరికీ తినిపించారు. ఈ సమావేశంలో మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, కాల్వ శ్రీనివాసులు, నంద్యాల ఎంపీ ఎస్పీవై రెడ్డి, ఎమ్మెల్సీ ఎన్ఎండీ ఫరూఖ్, ఏవీ సుబ్బారెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. సమావేశం తర్వాత బయటకు వచ్చిన బ్రహ్మానందరెడ్డి మీడియాతో మాట్లాడారు. నంద్యాల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పారు. మంత్రి అఖిలప్రియ మాట్లాడుతూ... ఈ ఎన్నికలో గెలవడం ద్వారా తన తండ్రి భూమా నాగిరెడ్డిని బ్రతికించుకున్నానని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచన మేరకు సెప్టెంబర్ ఒకటో తేదీన తామంతా నంద్యాలకు వెళ్లి ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతామని పేర్కొన్నారు.

'నారాయణ' విద్యార్థి ఆత్మహత్య

యాజమాన్యమే బాధ్యత వహించాలని విద్యార్థి సంఘాల డిమాండ్

హైదరాబాద్: రాజధానిలోని ప్రగతినగర్ నారాయణ జూనియర్ కళాశాలలో ఓ విద్యార్థి అనుమానాస్పద స్థితిలో ఉరి వేసుకుని ఆత్మహత్య పాల్పడ్డాడు. బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. తెలంగాణలోని నిజామాబాద్ జిల్లా బోధన్ పంటకుదురుకు చెందిన వంశీధర్ కుమారుడు నాగసాయి.. ప్రగతినగర్ నారాయణ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం ఉదయం హాస్టల్‌లో నాగసాయి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి, తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. అయితే నాగసాయి మృతి విషయం తెలుసుకున్న అతని బంధువులు, విద్యార్థి సంఘాల నాయకులు కళాశాల వద్దకు చేరకుని, ఈ ఘటనకు యాజమాన్యమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

పీఎస్ఎల్వీ సీ-39కి నేడు కౌంట్‌డౌన్ ప్రారంభం

- గురువారం రాత్రి 7 గంటలకు ఐఆర్ఎన్ఎస్ఎస్–1 హెచ్ ప్రయోగం
- మిషన్ సంసిద్ధతా సమావేశంలో నిర్ణయం
- అందుబాటులోకి రానున్న సొంత నావిగేషన్ సిస్టం

శ్రీహరికోట (సూళ్లూరుపేట): పీఎస్ఎల్వీ సీ–39 రాకెట్ ద్వారా ఐఆర్ఎన్ఎస్ఎస్–1 హెచ్(రీప్లేస్‌మెంట్) ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి ప్రయోగించేందుకు రంగం సిద్ధమైంది. సతీష్ ధవన్ స్పేస్ సెంటర్(షార్) నుంచి గురువారం రాత్రి 7 గంటలకు ఈ ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నారు. ఇందుకోసం బుధవారం మధ్యాహ్నం కౌంట్‌డౌన్ ప్రారంభం కానుంది. ఈ విషయాన్ని మంగళవారం నిర్వహించిన మిషన్ సంసిద్ధతా సమావేశం(ఎంఆర్ఆర్)లో అధికారికంగా ప్రకటించారు. షార్ కేంద్రంలోని బ్రహ్మ ప్రకాష్ హాలులో ఎంఆర్ఆర్ కమిటీ చైర్మన్ బీఎన్ సురేశ్ ఆధ్వర్యంలో మిషన్ సంసిద్ధతా సమావేశం జరిగింది. గురువారం సాయంత్రం 6.59కు ప్రయోగం జరుగుతుందని తొలుత ప్రకటించారు. కానీ అనంతరం లాంచ్ ఆథరైజేషన్ బోర్డు చైర్మన్ పి.కున్హికృష్ణన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ప్రయోగ సమయాన్ని మరో నిమిషం పొడిగించాలని నిర్ణయం తీసుకున్నారు. కాగా, మంగళవారం మధ్యాహ్నానికి రాకెట్‌కు అన్నిరకాల పరీక్షలు నిర్వహించి ప్రయోగానికి సిద్ధం చేశారు. ప్రయోగానికి 29 గంటల ముందు అంటే.. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభమవుతుంది. పీఎస్ఎల్వీ సీ–39 ద్వారా 1,425 కిలోల బరువు కలిగిన ఐఆర్ఎన్ఎస్ఎస్–1 హెచ్(రీప్లేస్‌మెంట్) ఉపగ్రహాన్ని రోదసీలోకి పంపించనున్నారు.



1,425 కిలోల బరువు కలిగిన ఇండియన్ రీజినల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం

ప్రయోగం జరిగేదిలా..

పీఎస్ఎల్వీ సీ–39 రాకెట్‌ను 19.25 నిమిషాల్లో రోదసిలోకి పంపించేలా ప్రణాళిక రూపొందించారు. 44.4 మీటర్లు ఎత్తున్న ఈ రాకెట్‌ను నాలుగు దశల్లో ప్రయోగించనున్నారు. ప్రయోగ సమయంలో 321 టన్నుల బరువును తీసుకుని రాకెట్ భూమి నుంచి నింగికి పయనమవుతుంది. మొదటి దశలో ఆరు స్ట్రాపాన్ బూస్టర్లలోని 73.2 టన్నుల ఘన ఇంధనంతో పాటు కోర్ అలోన్ దశలో మరో 138.2 టన్నుల ఘన ఇంధనాన్ని వినియోగించుకుని రాకెట్ భూమి నుంచి నింగికి తన ప్రయాణాన్ని ప్రారంభిస్తుంది. రెండో దశలో 42 టన్నుల ద్రవ ఇంధనం, మూడో దశలో 7.6 టన్నుల ఘన ఇంధనం, నాలుగో దశలో 2.5 టన్నుల ద్రవ ఇంధనం ఉపయోగించుకుంటుంది. 110 సెకన్లకు మొదటి దశను, ఆ తర్వాత 263 సెకన్లకు రెండోదశ, అనంతరం 606 సెకన్లకు మూడోదశ, 1,146 సెకన్లకు నాలుగో దశను పూర్తి చేయనున్నారు. ఆ తర్వాత 1,165 సెకన్లకు నాలుగో దశ నుంచి ఐఆర్ఎన్ఎస్ఎస్–1 హెచ్ ఉపగ్రహాన్ని పెరిజీ (భూమికి దగ్గరగా) 284 కిలోమీటర్లు, అపోజి (భూమికి దూరంగా) 20,650 కిలోమీటర్ల ఎత్తులో భూస్థిర బదిలీ కక్ష్య (జియో ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్)లో 17.82 డిగ్రీల వాలులో దీర్ఘవృత్తాకార కక్ష్యలో ప్రవేశపెడతారు. ఆ తర్వాత కర్ణాటకలోని హాసన్‌లో ఉన్న మాస్టర్ కంట్రోల్ సెంటర్ ఈ ఉపగ్రహాన్ని కంట్రోల్‌లోకి తీసుకుని.. వారం తర్వాత ఉపగ్రహంలో ఉన్న 827 కిలోల ద్రవ ఇంధనాన్ని దశల వారీగా మండించి జియో ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ నుంచి భూమికి 36 వేల కిలోమీటర్ల ఎత్తులోని జియో సింక్రోనస్ ఆర్బిట్(భూస్థిర కక్ష్య)లోకి ప్రవేశ పెడుతుంది. ఈ ప్రయోగం పీఎస్ఎల్వీ సిరీస్‌లో 41 ఎక్సెల్ స్ట్రాపాన్ బూస్టర్ల వెర్షన్‌లో 18వది కావడం విశేషం. అలాగే ఐఆర్ఎన్ఎస్ఎస్ సిరీస్ ఉపగ్రహాల్లో 8వది. ఈ ఉపగ్రహ ప్రయోగంతో భారతదేశానికి సొంత నావిగేషన్ సిస్టం అందుబాటులోకి వస్తుంది.

సాక్షి
బుధవారం, ఆగస్టు, 30

నంద్యాల చెప్పే నిజం

ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, గోవాల్లో ఈ నెల 23న జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యాయి. షరా మామూలుగా అన్నిచోట్లా పాలక పక్షాలే విజయం సాధించాయి. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్‌కు చెందిన ఫిరాయింపు ఎమ్మెల్యే భూమా నాగిరెడ్డి గుండెపోటుతో మరణించడం వల్ల నంద్యాల స్థానానికి ఎన్నిక అవసరమైంది. కేంద్ర రక్షణ మంత్రి పదవి నుంచి తప్పుకుని గోవా సీఎంగా బాధ్యతలు స్వీకరించిన మనోహర్ పరీకర్ కోసం బీజేపీ శాసనసభ్యుడు రాజీనామా చేయడంతో పణజీ స్థానానికి ఉప ఎన్నిక జరిగింది. ఆ రాష్ట్రంలోనే వాల్పోయ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి గెలిచి బీజేపీకి ఫిరాయించిన విశ్వజిత్ రాణే శాసనసభ్యత్వాన్ని వదులుకోవడం వల్ల ఆ స్థానానికీ ఎన్నిక తప్పలేదు. ఆయన తిరిగి ఎన్నికయ్యారు. ఢిల్లీలోనూ ఫిరాయింపు కారణంగానే ఉప ఎన్నిక జరిగింది. ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ఎమ్మెల్యే వేద్‌ప్రకాశ్ మొన్న మార్చిలో ఆ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరి, శాసనసభ్యత్వాన్ని వదులుకున్నారు. కానీ ఉప ఎన్నికలో ఆయన పరాజయం పాలయ్యారు. అధికారపక్షమైన ఆప్ అక్కడ గెలిచింది. గోవా, ఢిల్లీల్లో ఫిరాయించినవారు అనుసరించిన ప్రమాణాలనే ఆంధ్రప్రదేశ్‌లోని మిగిలిన 20 మంది ఫిరాయింపుదారులు కూడా పాటించి ఉంటే నంద్యాల ఒక్కచోట మాత్రమే కాదు... ఆ ఇరవై స్థానాల్లో కూడా ఉప ఎన్నికలు తప్పకపోయేవి. వారిని చేర్చుకున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నైతిక విలువలకు తాను సహస్రయోజనాల దూరమని దశాబ్దాలక్రితమే ఎటూ నిరూపించుకున్నారు. కనీసం ఆ పంచన చేరినవారిలో ఒక్కరైనా తాము నైతికంగా ఉన్నతులమని చెప్పుకునే ప్రయత్నం చేయలేదు. వారిలో కొందరు మంత్రి పదవులు కూడా దక్కించుకుని తరించారు. పైపెచ్చు నంద్యాల ఫలితాన్నే ఆ స్థానాలకు కూడా అన్వయించుకోవాలని మర్కట తర్కానికి దిగుతున్నారు.

గోవా, ఢిల్లీల్లో బీజేపీలోకి ఫిరాయించినవారు పాత పార్టీల ద్వారా వచ్చిన ఎమ్మెల్యే పదవుల్ని వదులుకున్నారు గనుక బీజేపీ ఉన్నత ప్రమాణాలు పాటించిందనుకోనవసరం లేదు. వారిని రాజీనామా చేయమని కోరిందా లేక వారే స్వచ్ఛందంగా తప్పుకున్నారా అనే విచికిత్స కూడా అనవసరం. ఆ విషయంలో తనకు పెద్ద పట్టింపు లేదని బీజేపీ అరుణాచల్‌ప్రదేశ్‌లో నిరుడు నిరూపించుకుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఫిరాయింపుల్ని ప్రోత్సహిస్తున్న తెలుగుదేశంతో చెలిమిని కొనసాగిస్తోంది. తమ నుంచి ఫిరాయించిన ఇద్దరు ఎంపీలపై అనర్హత వేటు వేయాలన్న వైఎస్సార్ కాంగ్రెస్ ఫిర్యాదు లోక్‌సభ స్పీకర్ వద్ద మూడేళ్లుగా పెండింగ్‌లోనే ఉండిపోయింది. ఇది చాలదన్నట్టు నంద్యాల ఉప ఎన్నిక గెలిచినందుకు బాబును స్వయానా ప్రధాని నరేంద్రమోదీ అభినందిస్తూ ట్వీట్ చేశారు. ఆ ఎన్నిక ఎందుకు అవసరమైందో మోదీకి తెలియదనుకోలేం. పైగా అక్కడ ఎడాపెడా జరిగిన అధికార దుర్వినియోగం, సృష్టించిన భయానక వాతావరణం సంగతి ఆయనకు చేరి ఉండాలి. కనీసం తమను అక్కడ బాబు ప్రచారానికే రానీయకుండా అవమానించారన్న విషయం తెలిసి ఉండాలి. గోవా, ఢిల్లీల్లో తమ పార్టీలో చేరిన ఇద్దరు ఎమ్మెల్యేలు రాజీనామా చేసి మళ్లీ జనం తీర్పు కోరినందుకైనా నంద్యాల విషయంలో ఆయన మౌనంగా ఉండిపోతే వేరుగా ఉండేది.

నంద్యాల అగ్నిపరీక్ష ఎదుర్కొనడం తప్పదని గ్రహించినప్పటినుంచీ అధికార తెలుగుదేశం అక్కడ సాగించిన అరాచకాలకూ, అధికార దుర్వినియోగానికీ అంతు లేదు. అంతకుక్రితం నంద్యాలసహా విపక్షం గెలిచిన 67 స్థానాల్లోనూ కనీసం ఒక్కచోటైనా బాబు సర్కారు అభివృద్ధి ఊసెత్తలేదు. ఫిరాయింపులు జరిగాక ఆ 21 చోట్ల కూడా పెద్దగా ఒరిగిందేమీ లేదు. కానీ ఉప ఎన్నిక అనేసరికి గుండెల్లో రైళ్లు పరుగెత్తి ఆగమేఘాలపైన నంద్యాలలో స్వల్ప వ్యవధిలో రూ. 1,400 కోట్ల విలువైన పనులకు శ్రీకారం చుట్టింది. చేతికి ఎముక లేకుండా జీవోలు జారీ చేసింది. 'అవిగో ఇళ్లు... ఇవిగో పింఛన్లు, రోడ్లు' అంటూ హడావుడి చేసింది. వైఎస్సార్ కాంగ్రెస్ కార్యకర్తల్లో, సానుభూతిపరుల్లో భయోత్పాతం సృష్టించే ప్రయత్నం చేసింది. స్వయానా ఆ పార్టీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి ఇంటివద్దే పోలీసుల్ని మోహరించడంతోపాటు ఇతర నాయకుల ఇళ్లపై అర్ధరాత్రుళ్లు పోలీసు దాడులు చేయించింది. ఇవన్నీ ఒకపక్క కొనసాగిస్తూనే రూ. 200 కోట్ల మేర టీడీపీ నల్లడబ్బు ఖర్చు చేసిందన్న ఆరోపణలున్నాయి. స్వయానా చంద్రబాబే కులాలవారీ సమావేశాలు పెట్టి ప్రలోభపెట్టాలని చూశారు. 'నా పింఛన్ తీసుకుంటున్నారు... నేనేసిన రోడ్లపై నడుస్తున్నారు, నాకు ఓటెందుకు వేయర'ంటూ ప్రజల్ని బ్లాక్‌మెయిల్ చేసే ప్రయత్నాలకు దిగారు. తన సొంత ఆస్తుల్ని జనానికి దోచిపెడుతున్నట్టు మాట్లాడారు. దాదాపు కేబినెట్‌నంతటినీ, 70మంది ఎమ్మెల్యేలనూ అక్కడ దించారు. ప్రచార పర్వం ముగిశాక ఎక్కడివారక్కడికి పోవాల్సి ఉండగా వారిలో చాలామంది నంద్యాలలోనే తిష్టవేసి బెదిరింపుల పర్వాన్ని కొనసాగించారు. చేసిందంతా చేసి నంద్యాల ఫలితం తన పాలనపై రిఫరెండమని బాబు చెప్పుకుంటున్నారు. విషాదమేమంటే ఎన్నికల సంఘం అధికారులకు ఎప్పటికప్పుడు ఫిర్యాదులు అందినా వారు సరైన చర్యలు తీసుకోలేకపోయారు. ఒక ఉదంతంలో చర్య తీసుకోక తప్పనందుకు ఆ సంస్థపై బాబు ఆరోపణలు చేయడం చూస్తే ఎవరికైనా డేరా బాబా గుర్తుకు రాకమానడు. ఎన్నో అత్యాచారాలు, అఘాయిత్యాలకూ పాల్పడిన డేరా బాబా మూడు కేసుల్లో శిక్ష పడేసరికి తనకేదో అన్యాయం జరిగిందని లబలబలాడి మూడు రాష్ట్రాల్లో ఎలా విధ్వంసం సృష్టించాడో అందరికీ తెలుసు. బాబు తొలిసారి పాలనలోనే డేరా బాబాకు సాటిరాగల నయీముద్దీన్ పుట్టుకొచ్చాడు. లెక్కలేనన్ని హత్యలు, అత్యాచారాలు, ఇతర అఘాయిత్యాలు బాబు సర్కారు ఆశీస్సులతో కొనసాగించాడు. ఏదేమైనా నంద్యాల ఉప ఎన్నిక తంతు చూస్తే ఎన్నికల సంఘానికంటూ కింది స్థాయి వరకూ శాశ్వత ప్రాతిపదికన సొంత వ్యవస్థ ఉండాలనీ, అది మరింత సమర్థవంతంగా పనిచేసేలా నిబంధనలుండాలని, ఆ సంఘం ఎప్పటికప్పుడు తక్షణ చర్యలు తీసుకునే ఏర్పాటుండాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు.



"అవినీతిపరులైన నాయకుల తక్షణ లక్ష్యం ఏదంటే.. సమాజంలోని మిగిలిన 10 శాతం సన్మార్గులను కూడా పాడు చేయడమే."
– ఆంగ్ శాన్ సూకీ
మయన్మార్ రాజకీయనేత

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపదమాసం, తిథి శు.నవమి తె.4.30 వరకు (తెల్లవారితే గురువారం) తదుపరి దశమి, నక్షత్రం జ్యేష్ఠ రా.2.14 వరకు, తదుపరి మూల వర్జ్యం ఉ.5.54 నుంచి 7.40 వరకు, దుర్ముహూర్తం ఉ.11.36 నుంచి 12.25 వరకు, అమృతఘడియలు సా.4.30 నుంచి 6.15 వరకు.

సూర్యోదయం	: 5.48	1.30 వరకు	
సూర్యాస్తమయం	: 6.16	యమగండం :	
రాహుకాలం :		ఉ.7.30 నుంచి	
ప 12.00 నుంచి		9.00 వరకు	

నమాజ్ వేళలు


ఫజర్	4.48	మగ్రీబ్	6.31
జొహార్	12.17	ఇషా	7.45
అసర్	4.43		

'నంద్యాల' విజేత నల్లధనమే!


దేవులపల్లి అమర్

ఒక్కసారి శోభా నాగిరెడ్డి మరణం సందర్భాన్ని గుర్తు చేసుకుందాం. ఆమె వైఎస్ఆర్ కాంగ్రెస్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉండగా ప్రమాదంలో మరణిస్తే కనీసం ఆ పిల్లలను పలకరించని, ఆమె భౌతిక కాయానికి నివాళులు అర్పించని చంద్రబాబు, ఆ తరువాత అధికారంలోకి వచ్చిన తరువాత కూడా అసెంబ్లీలో ప్రతిపక్షం పట్టుపడితే తప్ప మొక్కుబడిగా సంతాప తీర్మానం కూడా పెట్టని బాబు, ఆయన పార్టీ పాపం తల్లితండ్రులు లేని పసి పిల్లలు అని ఇప్పుడు సానుభూతి చూపడం ఓట్లు దండుకోవడానికే కదా!

ఏ ఆట అయినా గెలవడానికే ఆడతారు ఎవరయినా! ఏ ఎన్నికలో అయినా గెలవాలనే పోటీ చేస్తుంది ఏ రాజకీయ పార్టీ అయినా! ఫలితాలు వెలువడిన తరువాత సమీక్షించుకోవడం సహజం. ఈ సమీక్ష మామూలుగా ఓడిన పక్షం వైపే ఎక్కువగా జరుగుతుంది. ఏయే కారణాల వల్ల ఓడిపోయాం? ఎక్కడ పొరపాటు జరిగింది? భవిష్యత్తులో గెలవడానికి పనితీరును ఎట్లా మెరుగు పరుచుకోవాలి...? ఇలా, ఈ రీతిలో సమీక్షించుకుంటారు. సోమవారం దేశ వ్యాప్తంగా జరిగిన నాలుగు శాసనసభా స్థానాల ఉప ఎన్నికల్లో అధికార పక్షాలే గెలుపొందాయి. గోవాలో రెండు స్థానాలనూ అక్కడి అధికార పక్షం భారతీయ జనతా పార్టీ, ఢిల్లీలో ఒక స్థానం అధికార ఆమ్ ఆద్మీ పార్టీ, ఆంధ్రప్రదేశ్‌లో నంద్యాల స్థానాన్ని అధికార పక్షం తెలుగుదేశం పార్టీ గెల్చుకున్నాయి. మందీ మార్బలం, హంగూ ఆర్భాటం, అధికార యంత్రాంగం తమ పక్షాన పనిచేస్తాయి కాబట్టి సాధారణంగా ఎక్కడ ఉప ఎన్నికలు జరిగినా అధికార పక్షాన్నే గెలుపు వరించడం సహజం. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే ఉప ఎన్నికల్లో అధికార పక్షం ఓడిపోవడం చూస్తాం.



ఉప ఎన్నికలలో ఇది మామూలే

ఇటీవలి చరిత్ర పరిశీలిస్తే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అటువంటి ఫలితాలను మనం చూశాం. తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు 2006లో కేంద్ర మంత్రి పదవికీ, కరీంనగర్ లోక్‌సభ స్థానానికీ రాజీనామా చేసి ఉప ఎన్నికలో పోటీ చేసినప్పుడు అధికార కాంగ్రెస్ అభ్యర్థి మీద రెండు లక్షల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఆ తరువాత డాక్టర్ రాజశేఖరరెడ్డి మరణానంతరం ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకీ, పార్లమెంట్ సభ్యత్వానికీ రాజీనామా చేసి కడప పార్లమెంట్ స్థానానికి మళ్లీ పోటీ చేసినప్పుడు అద్భుతమయిన ఆధిక్యం సాధించారు. ఆయనతో బాటు డాక్టర్ రాజశేఖరరెడ్డి సతీమణి వైఎస్ విజయలక్ష్మి కూడా పులివెందుల శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేసి మళ్లీ మంచి మెజారిటీతో గెలుపొందారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పెట్టిన తరువాత జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా శాసనసభ్యత్వాలకూ, పార్లమెంట్ సభ్యత్వాలకూ రాజీనామాలు చేసి తిరిగి ఉప ఎన్నికల్లో పోటీ చేసిన వారిలో అత్యధికులు గెలిచిన విషయం తెలిసిందే. ఆ తరువాత తెలంగాణలో కూడా పలువురు వివిధ పార్టీల శాసనసభ్యులు రాజీనామా చేసి ఉప ఎన్నికల్లో గెలుపొందారు. ఈ అన్ని సందర్భాల్లోనూ కొన్ని స్పష్టమయిన అంశాలు ఎన్నికలను ప్రభావితం చేశాయి. కేసీఆర్ పోటీ చేసినప్పుడు, ఆ తరువాత తెలంగాణలో పలువురు శాసనసభ్యులు పోటీ చేసినప్పుడు ఉప ఎన్నికల మీద తెలంగాణ ఉద్యమ ప్రభావం తీవ్రంగా ఉండటం చూశాం. జగన్‌మోహన్‌రెడ్డి పోటీ చేసిన ఉప ఎన్నిక తండ్రి మరణానంతరం ఆయన పట్ల కాంగ్రెస్ పార్టీ అనుసరించిన వైఖరి బలంగా ప్రభావం చూపింది. ఆ తరువాత కాలంలో వైఎస్ఆర్ సీపీలో చేరిన ఇతర పార్టీల ఎంఎల్ఏల ఉప ఎన్నికల సందర్భంలో కూడా ఇదే అంశం అధికార పక్షం ఓడిపోడానికి కారణం అయింది.

2004 నుంచి 2014 దాకా చంద్రబాబునాయుడు ప్రతిపక్ష నేతగా ఉన్న కాలంలో 40కి పైగా శాసనసభా స్థానాలకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉప ఎన్నికలు జరిగితే ఎక్కడా తెలుగుదేశం పార్టీ గెలవకపోగా 20 స్థానాలకు పైగా డిపాజిట్లు కూడా కోల్పోవడం గమనార్హం. ఈ మాట ఇక్కడ ఎందుకు చెప్పాల్సివచ్చిందంటే నంద్యాల ఉప ఎన్నిక ఫలితం వెలువడగానే కొందరు తెలుగుదేశం మంత్రులు, నాయకులు విజయోత్సాహం తట్టుకోలేక ప్రతిపక్షం పని అయిపోయింది, ఇక జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాల నుంచి తప్పుకుంటే బాగుంటుంది అని నోటికి వచ్చినట్టు మాట్లాడారు. మరి అంత దీనస్థితిలోకి తెలుగుదేశం పార్టీ ఆనాడు దిగజారితే ఆ పార్టీకి నాయకుడిగా చంద్రబాబు నాయుడు ఎందుకు సన్యాసం తీసుకోలేదు? నంద్యాలలో శిల్పా మోహన్‌రెడ్డి ఓటమికి ఆనాడు టీడీపీ వారి ఓటమికి ఎక్కడయినా పోలిక ఉందా?

తప్పించుకోలేరు కాబట్టే...

ఇక నంద్యాల ఉప ఎన్నిక విషయానికి వద్దాం. ఈ అసెంబ్లీ స్థానం వైఎస్ఆర్ కాంగ్రెస్‌కు చెందినది. ఈ స్థానం నుంచి గెలిచి, పార్టీ ఫిరాయించి అధికార పక్షానికి వలసపోయిన నాగిరెడ్డి మరణం కారణంగా అక్కడ ఉప ఎన్నిక జరిగింది. నంద్యాలతో బాటు తమ పార్టీ నుంచి అధికార పక్షానికి వలసపోయిన మరో 20 శాసనసభా స్థానాలకు కూడా ఆ ఎంఎల్ఏలతో రాజీనామా చేయించి ఉప ఎన్నికలు జరపాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ డిమాండ్ చేస్తూనే ఉంది. అందుకు ఏ మాత్రం సాహసం చెయ్యని చంద్రబాబునాయుడుకు నాగిరెడ్డి ఆకస్మిక మృతితో అక్కడ ఉప ఎన్నికకు వెళ్లక తప్పలేదు. ఇప్పుడు నంద్యాలలో గెలిచాక ఇకపైన ఎక్కడ ఎన్నిక జరిగినా తమ పార్టీయే గెలుస్తుందని ప్రకటించుకున్నారు. అదేక్షణం మరి మిగిలిన 20 స్థానాలకు ఉప ఎన్నికలకు సిద్ధమేనా అంటే సమాధానం దాటవేసి వెళ్లిపోయారు.

ఆ ఇరవై స్థానాలలో కూడా జరిగితే...!

నిజంగానే నంద్యాల ప్రజలు ఈ మూడేళ్ల రెండుమాసాల కాలంలో ఆయన ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేసిన తీరుకు ముచ్చట పడి ఓట్లేసి గెలిపించి ఉంటే మిగిలిన 20 స్థానాల్లో కూడా ఎన్నికలను ఎదుర్కోడానికి వెనకాడటం ఎందుకు? ఆ సాహసం ఆయన చేయరన్న విషయం అందరికీ తెలుసు. అదే చేయవలసి వస్తే ఓ నాలుగువేల కోట్ల రూపాయలు ఖర్చు చెయ్యాలి. ఒక్క ఎన్నిక కాబట్టి నంద్యాలలో 200 కోట్లతో సరిపెట్టారు. అట్లాగే ఒక్కచోటే ఎన్నిక కాబట్టి మొత్తం మంత్రివర్గాన్నీ, ఎంఎల్ఏలనూ, ఎంపీలనూ నెల రోజులపాటు నంద్యాలలోనేవిడిది చేయించారు. అధికార యంత్రాంగాన్ని, ముఖ్యంగా పోలీసు వ్యవస్థ మొత్తాన్ని మోహరింప చెయ్యగలిగారు. ఫలితం వెలువడగానే మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రే స్వయంగా చెప్పారు, నంద్యాల ఉప ఎన్నిక కారణంగా రాష్ట్రమంతటా అభివృద్ధి ఆగిపోయిందని. ఒక్క ఉప ఎన్నిక కోసం మొత్తం అధికార యంత్రాంగాన్ని నంద్యాలకు తరలించమని ఎవరు చెప్పారు ఆయనకు? ఆ అవసరం ఎందుకొచ్చిందట! ఇంత చేస్తే ఈ మాత్రం గెలుపు సాధించగలిగారు. నంద్యాల ఫలితం వెలువడ్డ తరువాత పలువురు తెలుగుదేశం సీనియర్ నాయకులు సంతోషానికి బదులు దిగులు పడ్డారట. ఎందుకంటే ఒక్క నంద్యాల ఎన్నికకే 50 స్థానాల్లో పోటీ చేసినంత కష్టపడ్డాం, ఇక 2019 ఎన్నికలను ఎట్లా ఎదుర్కోవాలో అని ఆందోళన చెందారట. అట్లాంటిది ఇప్పుడు 20 స్థానాలకు ఒక్కసారే ఎన్నికలు నిర్వహించాల్సి వస్తే ఇదంతా ఎట్లా సాధ్యం అవుతుంది? అందుకే చంద్రబాబు ఆ పనికి సిద్ధంగా లేకపోగా మీ ఎంపీలతో రాజీనామా చెయ్యించండని వైఎస్ఆర్ కాంగ్రెస్‌కు సవాలు విసురుతున్నారు. ఇప్పుడు జరగాల్సింది ఏమిటి? సక్రమంగా గెలిచిన పార్లమెంట్ సభ్యులు రాజీనామా చెయ్యడమా, అక్రమంగా పార్టీ ఫిరాయించిన ఎంఎల్ఏలు రాజీనామా చెయ్యడమా? దబాయించేస్తే సరిపోతుంది అనుకుంటే ఎలా?

గెలుపు ఎవరిది?

ఇంతకీ నంద్యాలలో ఎవరు గెలిచారు? మొత్తం ఎన్నికల కాలంలో ఒక్క క్షణం కూడా నోరు విప్పని భూమా బ్రహ్మానందరెడ్డి గెలిచారా, ఆయనకు టికెట్ ఇచ్చిన తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు గెలిచారా? సాంకేతికంగా గెలిచింది తెలుగుదేశం అభ్యర్థి బ్రహ్మానందరెడ్డి అయినా, అసలు గెలిచింది మాత్రం మితిమీరిన అధికార దుర్వినియోగం, వందల కోట్ల రూపాయల నల్లధనం, అభివృద్ధి పేరిట జరిగిన విధ్వంసం, గెలిపించకపోతే అభివృద్ధిని ఆపేస్తామన్న బెదిరింపులు. నిజానికి నంద్యాల ఉపఎన్నికల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీనవ్వుల పాలయ్యారు. పెద్ద నోట్ల రద్దు (డిమోనిటైజేషన్)తో నల్లధనం మొత్తం బయట పడిపోయిందని మోదీ చెబుతుంటే ఆయన మిత్రపక్షం తెలుగుదేశం మాత్రం నంద్యాల వీధుల్లో నల్లధనం పారించింది. భూమా నాగిరెడ్డి మరణం, అంతకు ముందే ఆయన భార్య శోభా నాగిరెడ్డి మరణం ఈరెండింటినీ సానుభూతిగా మలచి తనకు అనుకూలంగా మార్చుకోడానికి కూడా చంద్రబాబునాయుడు ఏ అవకాశమూ వదిలిపెట్టలేదు. తల్లీతండ్రీ లేని పిల్లలను చూసి తెలుగుదేశంకు ఓటు వెయ్యండని నంద్యాల వీధుల్లో ఆ ఇద్దరి మరణానికి సంబంధించిన వీడియోలు, లేజర్ షోలు చూపించారు. ఒక్కసారి శోభా నాగిరెడ్డి మరణం సందర్భాన్ని గుర్తు చేసుకుందాం. ఆమె వైఎస్ఆర్ కాంగ్రెస్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉండగా ప్రమాదంలో మరణిస్తే కనీసం ఆ పిల్లలను పలకరించని, ఆమె భౌతిక కాయానికి నివాళులు అర్పించని చంద్రబాబునాయుడు, ఆ తరువాత అధికారంలోకి వచ్చిన తరువాత కూడా అసెంబ్లీలో ప్రతిపక్షం పట్టుపడితే తప్ప మొక్కుబడిగా సంతాప తీర్మానం కూడా పెట్టని చంద్రబాబునాయుడు, ఆయన పార్టీ పాపం తల్లితండ్రులు లేని పసిపిల్లలు అని ఇప్పుడు సానుభూతి చూపడం ఓట్లు దండుకోవడానికే కదా!

నంద్యాలలో ఓడినా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ దాని అధినేత, ప్రతిపక్ష నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ ఫిరాయింపుల విషయంలో జాతీయ స్థాయిలో చర్చకు తెర తీయడంలో విజయం సాధించారు. ఆరేళ్ల శాసన మండలి సభ్యత్వానికి శిల్పా చక్రపాణిరెడ్డి చేసిన రాజీనామా చిన్న త్యాగం కాదు. ఇప్పుడు నంద్యాల ఉప ఎన్నికల ఫలితాలను సమీక్షించుకోవాల్సింది ఎవరు? సాధారణంగా ఏ ఎన్నిక ఫలితాన్నయినా సమీక్షించుకునేది ఓడిపోయిన పక్షమే. కానీ ఇక్కడ అష్టకష్టాలు పడి, అన్ని అడ్డదారులూ తొక్కి గెలిచి ఓడిన అధికార పక్షమే సమీక్ష చేసుకోవాల్సిన పరిస్థితి.

datelinehyderabad@gmail.com

డ్రగ్స్‌పై రాజీ అతి పెద్ద నేరం..!

కొమ్మినేని శ్రీనివాసరావుతో టాలీవుడ్ దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ

దేశమంతా కోట్లమంది డ్రగ్స్‌కు అలవాటు పడినప్పుడు సినీ పరిశ్రమను మాత్రమే కౌంటర్ చేయడం తప్పని టాలీవుడ్ దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ అంటున్నారు. డ్రగ్స్ తీసుకోవడం అతి పెద్ద నేరం కాగా దానికి క్షమాపణలు చెప్పడం, కాస్త సరళంగా వ్యవహరించమనడం ఇంకా పెద్ద నేరమని అన్నారు. పైగా సోర్సును బట్టే సిట్ విచారణ జరిగి ఉంటే, దర్శకుడు పూరీ జగన్నాథ్ క్యాంప్‌కు చెందిన వారినే ఎందుకు విచారించారని ప్రశ్నించారు. ఆడవారు ఇళ్లల్లోనే ఉండటం అనేది ఇప్పుడు పోవడంతో సమాన హక్కులూ వచ్చాయనీ.. దురలవాట్లకు సంబంధించి ఆడా మగా తేడా లేదంటున్న తమ్మారెడ్డి భరద్వాజ అభిప్రాయాలు ఆయన మాటల్లోనే...



సినిమారంగం అప్పుడెలా ఉండేది, ఇప్పుడెలా ఉంటోంది?

అప్పట్లో కలెక్టివ్‌గా టీమ్ వర్క్ ఉండేది. ఇప్పుడు అది పోయింది. అప్పుడు కూడా హీరో, హీరోయిన్‌ని కేంద్ర స్థానంలో ఉంచి సినిమాలు తీసేవారు. ఇప్పుడయితే హీరో కోసమే సినిమాలు తీస్తున్నారు. మా రోజుల్లో చిన్న సినిమాలను మా ఇష్టమొచ్చిన హీరో, హీరోయిన్లను కొత్తవారిని తీసుకుని తీసేవారం. ఇప్పుడు అలా కాదు. ఫలానా హీరో సినిమా సూపర్ హిట్ అయితే దాన్ని కొత్తవాళ్లను పెట్టి కాపీ చేస్తున్నారు. ఒకరకంగా డూప్లికేట్ సినిమాలన్నమాట. ట్రెండ్ నడుస్తోంది.. అలాగే వెళ్లాలి అనేది ఇప్పుడు ఫ్యాషన్.

నష్టాలపై చిత్ర పరిశ్రమలో ఒక ఏర్పాటు, విధివిధానాలు పెడితే మంచిదేమో కదా?

అలాంటి కన్వెన్షన్లు ఏవీ పెట్టకూడదు. ఇవ్వకూడదు. వ్యాపారం వ్యాపారమే. ఏ సినిమాకయినా ఒక అంచనా ఉంటుంది. బాహుబలి–2 చాలాబాగా ఆడింది. వేల కోట్లు బిజినెస్ చేసింది. రేపు ఇంకొకరెవరైనా అంత ఖర్చు పెట్టి సినిమా తీస్తానంటే అంత బిజినెస్ ఏ సినిమా కూడా చేయదు. టాలీవుడ్‌లో సినిమా బిజినెస్ వందకోట్లు, ఇప్పుడయితే మరో 20 కోట్లు ఎక్కువగా బిజినెస్ చేయవచ్చేమో.. కానీ బాహుబలి రూ.2 వేల కోట్లు బిజినెస్ చేసింది కాబట్టి నాకు కూడా 2 వేల కోట్లు ఇవ్వు అని నేను అమ్మితే కొనుక్కున్నవాడు ఏమైపోతాడు? రేపు మరో పెద్ద హీరో సినిమాను 500 కోట్లకు కొంటాను అని ఎవడైనా సిద్ధపడితే అది వాడి తప్పు అంతే.

డ్రగ్స్ కేసు ఇండస్ట్రీ మీద వేసిన ప్రభావం ఎంత, మీ స్పందన ఏంటి?

చిత్రపరిశ్రమపై డ్రగ్స్ ప్రభావం ఉండదు. దేశంలో డ్రగ్స్ తీసుకునేవారు కోట్లమంది ఉంటున్నారు. సినీ పరిశ్రమలో కొన్ని వేలమంది డ్రగ్స్ తీసుకుంటూ ఉండవచ్చు. ఇలాంటి వారివల్ల సినీ పరిశ్రమపై ప్రభావం ఉండదు.

సినీ పరిశ్రమ క్షమాపణలు చెప్పడం, వర్మ కౌంటర్ ఇవ్వడంపై మీ అభిప్రాయం?

క్షమాపణలు చెప్పలేదు కానీ ఈ కేసులో కాస్త సరళంగా వెళ్లమని కోరినట్లున్నారు. అది కూడా తప్పే. అలా ఎందుకడగాలి? తమ్మారెడ్డి డ్రగ్స్ తీసుకుంటున్నాడు అని తెలిస్తే ఫిలిం చాంబర్ వెంటనే ఈ భరద్వాజను లోపల వేయండి అని చెప్పాలి. అతడు మా చాంబర్‌కు ప్రెసిడెంటుగా చేశాడు. కొంచెం చూసీ చూడనట్లుగా ఉండండి అని చెప్పకూడదు. డ్రగ్స్ కేసులో ఇదే జరిగి ఉంటే తప్పు. మావాళ్లను చూసీ చూడనట్లుగా ఉండండి, వదిలేయండి అని ఆ ఉత్తరంలో ఉంటే మాత్రం అది క్రైమ్ అండి. చాలా పెద్ద క్రైమ్.

సిట్ విచారణ ప్రాతిపదిక సరైందేనా?

నాకు తెలిసినంతవరకు ఫిలిం చాంబర్ పెద్దలు క్షమాపణ చెప్పలేదు. ఒక వేళ చెప్పి ఉంటే తప్పు. కాస్త ఉదారంగా చూడమని చెప్పి ఉన్నా తప్పే. అదే సమయంలో డ్రగ్స్ కేసు విచారణ తీరు కూడా తప్పే. ఎందుకంటే సిట్ విచారించిన వారిలో రవితేజ, చార్మి తోసహా తొమ్మిదిమంది పూరీ జగన్నాథ్ క్యాంపులో ఆఫీసులో కూర్చునేవారే. అంటే ఇంత పెద్ద చిత్రపరిశ్రమలో పూరీ జగన్నాథ్ తాలూకూ మనుషులే, ఆ క్యాంప్‌కు సంబంధించినవారే డ్రగ్స్ తీసుకుంటున్నారా అనేది నా ప్రశ్న. సోర్సును బట్టే చేసి ఉంటే మిగతావారిని ఎందుకు వదిలేశారు?

నటులే కాదు నటీమణులకు డ్రగ్స్ ఎలా అలవాటు అవుతోంది?

మీరు హైటెక్ సిటీకి వెళ్లండి. సాయంత్రంపూట రోడ్డుమీదే అమ్మాయిలు సిగిరెట్లు తాగుతూ మందు బాటిళ్లు పట్టుకుని నడిచి వెళుతుంటారు. వాళ్లకు అలవాటు అయిందా అంటే మనం ఏం చెబుతాం? దురలవాట్లకు సంబంధించి ఆడా మగా అని లేదండి. సమాజంలో చాలా తేడా వచ్చేసింది. మన బాల్యంలోలాగా ఆడవారు ఇళ్లల్లోనే ఉండటం అనేది ఇప్పుడు పోయింది. సమాన హక్కులూ వచ్చాయి వాటితో పాటు ఇలాంటి మార్పులు కూడా వచ్చేశాయి. లిబరలైజ్ అయ్యారు. వాళ్ల హక్కు వాళ్లది.

వైఎస్ఆర్, బాబు పాలనలో మీరు గమనించిన పోలికలు, తేడాలు ఏమిటి?

ఇద్దరికీ మధ్య పోలికలు లేవండి. నక్కకు నాగలోకానికి మధ్య ఉన్నంత తేడాలే ఉన్నాయి. మొదట్లో చంద్రబాబుతో చాలా సన్నిహితంగా ఉండేవాడిని. తనకు విజన్ ఉంది. కానీ ఆయన మనుగడకోసమే ఉండే విజన్ అది. సమాజాన్ని బాగు చేయడానికి విజన్ ఉంటుంది. సమాజాన్ని ఆకర్షించడానికి విజన్ ఉంటుంది. చంద్రబాబుది మాత్రం ఆకర్షణా విజన్ అని చెప్పొచ్చు. తొలిసారి ఆయనతో భేటీలో నాతో అయిదు గంటలపాటు మాట్లాడారు. ఆయన మాటలని చూస్తే ప్రపంచంలోనే ఆంధ్రప్రదేశ్ అంత గొప్ప రాష్ట్రం లేదనిపించింది. బాబు మాటలు వింటున్నంత సేపు ఇలాంటి సీఎంకి మనం చాకిరీ చేయకపోతే జీవితమే వేస్ట్ అనిపించింది. అంతగా నమ్మేసి పొద్దున్న ఆరుగంటలకు ఆయన కార్యాలయానికి వెళితే రాత్రి 12 గంటలకు బయటపడేవాడిని. బాబు ఇంట్లోనే పడి ఉండేవాళ్లం. గంటలు గంటలు చెబుతుంటారు కాని దాని అమలు మాత్రం కనబడేది కాదు. ఈరోజుకి కూడా ఆయన మాట్లాడితే హైదరాబాద్‌ను డెవలప్ చేశానంటారు. అంత అభివృద్ధి జరిగివుంటే ఒక హైటెక్ సిటీ ప్రాంతంలో తప్పితే నగరం మొత్తం మీద ఏ అభివృద్ధి ప్రాంతంలో అయినా ప్రజలు నడిచిగానీ, కారులో కానీ వెళ్లే చాన్స్ ఉందా? ఎవరికి వాళ్లు ఇష్టానుసారం తోచిన చోట నిర్మాణాలు చేసుకుంటూ పోతుంటే ఇక హైదరాబాద్‌ను నేనే డెవలప్ చేశానంటే కుదురుతుందా?

ప్రజలకోసం కాదు, బాబు కోసం విజన్ అంటున్నారు, స్పష్టంగా చెబుతారా?

ఎన్టీఆర్‌ను గద్దె దింపాక చంద్రబాబుతో నాలుగేళ్లు కొనసాగాను. ఆ నాలుగేళ్లలో ఆయన చెప్పిన మాట ఒక్కటి కూడా పూర్తిగా అమలు కాలేదు. ప్రయత్నాలు కొన్ని జరిగాయి. స్లో అయి ఉంటే క్షమించవచ్చు. కానీ దేన్నయితే తాను మాటల్లో వ్యక్తం చేశారో, దాంట్లో 50 శాతం అయినా పని జరగాలి. జరగలేదు. అదే వైఎస్ఆర్ విషయానికి వస్తే సినీ పరిశ్రమకోసమో, ఫిలిం చాంబర్ కోసమో ఫలానా సహాయం చేయాలి అని చెప్పి మేం వెనక్కి వస్తుండగానే దారిలోనే ఫోన్ చేసి ఎలాంటి సహాయం కావాలి అని అడిగేవారు. అంటే ఇచ్చిన మాటకు ఫాలో అప్ చేసేవారు. ఏదైనా సహాయం కోరి ఆయన్ని కలిసి కాగితం ఇచ్చి తిరిగి వస్తే ఆ పని కచ్చితంగా పూర్తయ్యేది. అంత నమ్మకాన్ని ఆయన కలిగించారు. చంద్రబాబు పాలనలో అలాంటిది చూడనేలేదు. నేను బాబుతో ఎంతో సన్నిహితంగా ఉండేవాడిని. కాని ఆయన తన నీడను కూడా నమ్మరు. అంత భయం. అవతలివాళ్లు అడిగారంటే మంచికోసమే అడిగి ఉంటారు అని నమ్మి దాన్ని పూర్తి చేయడం వైఎస్సార్ శైలి అయితే. ఈ పని చేస్తే ఏమవుతుందో, ఎక్కడ ఇబ్బంది వస్తుందో అని ఒకటికి పదిసార్లు అనుమానించే తత్వం చంద్రబాబుది. మొత్తానికి ఆ పని అయ్యేది కాదు. ఫలానా పని కావాలని అడిగితే ఇది కుదుర్తుంది. ఇది కుదరదు అని వైఎస్సార్ స్పాట్‌లోనే చెప్పేసేవారు. కాని చంద్రబాబు అయితే ఎంత చిన్నా పెద్దా విషయంలో కూడా తేల్చి చెప్పరు. అలా పని జరిగే ప్రాసెస్ చాలా లేటు అయ్యేది. చాలాసార్లు జరిగేది కాదు కూడా.

> తెలంగాణకు అనుకూలంగా చంద్రబాబు రహస్యంగా ఉత్తరాలు ఇచ్చేసి తీరా విభజన జరిగిపోయాక అర్ధరాత్రి విభజించారు, ఆంధ్రుల పొట్టకొట్టారు అని ఆరోపిస్తే ఎలా? పైగా విభజన తర్వాత ఇంత అవినీతికర పాలనను చూడలేదు. చేతులు తడపందే ఏపీలో ఇప్పుడు ఏదీ జరగదని అధికారులే చెబుతున్నారు. హైటెక్ సిటీ ప్రాంతంలో తప్పితే హైదరాబాద్‌లో ఏ ప్రాంతంలో అయినా ప్రజలు నడిచిగానీ, కారులో కానీ వెళ్లే చాన్స్ ఉందా? బాబు చేసిన అభివృద్ధి ఇదేనా?

విభజన సమయంలో చంద్రబాబు వైఖరిపై మీ అభిప్రాయం?

చాలా అసహ్యంగా ఉంటుంది. రెండు మూడు సార్లు తెలంగాణకు అనుకూలంగా ఉత్తరాలు ఇచ్చేసి తర్వాత విభజన జరిగిపోయాక అర్ధరాత్రి విభజించారు, పొట్టకొట్టారు అని ఇతరులపై ఆరోపిస్తే ఎలా.. పైగా విభజన తర్వాత ఇంత అవినీతికర పాలన నేనెన్నడూ చూడలేదు. చిన్న పనికావాలన్నా చేతులు తడపందే ఏపీలో ఇప్పుడు జరగదని అధికారులే చెబుతున్నారు.

(తమ్మారెడ్డి భరద్వాజతో ఇంటర్వ్యూ పూర్తి పాఠం కింది లింకుల్లో చూడండి)
https://goo.gl/eCkgR4
https://goo.gl/wZLqoZ

మూడో కన్ను



మూడు కళ్ళు గల దేవుడు ముక్కంటి శంకరుడు. మూడో కన్ను వల్లనే త్ర్యంబకుడు అని పేరు వచ్చింది. అంబకం అంటే కన్ను. త్ర్యంబకుడు మృత్యువును నియంత్రించే వాడు కనుక మృత్యుంజయ మంత్రం త్ర్యంబకుడిని జపిస్తుంది.

భోళా శంకరుడు త్ర్యంబకేశ్వరుడు కావటం వెనక ఒక పురాణ కథ ఉంది. శంకరుడు హిమాలయాలలో కూర్చుని ఉన్నాడట. పార్వతీ దేవి వేడుకగా వెనక నుంచి వచ్చి, ఆయన రెండు కళ్లూ మూసేసిందట. దాంతో బ్రహ్మాండమంతా అంధకార బంధురమైపోయిందట. ఆదిదంపతులకు ఒక్క క్షణం, ప్రాణికోటికి సుదీర్ఘ కాలం. అన్ని పనులూ ఆగిపోయాయి. ప్రాణికోటికి ఆ చీకటిలో దిక్కు తోచక భయభ్రాంతులైపోయారు. మహాదేవుడు ఆ అంధకారాన్ని ఛేదించేందుకు మరో కన్ను తెరవవలసి వచ్చింది. ఆయన నుదుటి భాగం మధ్యలో సూర్యుడిలా కాంతులు చిమ్ముతూ మూడవకన్ను చీల్చుకు వచ్చింది. కానీ ఆ ఫాలనేత్రం వేడికి మంచుకొండ వేడెక్కి, దాని మీది పశుపక్ష్యాదులన్నీ మాడిపోయాయి. పార్వతి తప్పు తెలుసుకొని భర్త ముందు చేతులు జోడించింది. వెంటనే భోళాశంకరుడు, తన నిటలాక్షం వేడి తగ్గించి పూర్వ స్థితిని పునరుద్ధరించాడు. ఇక కాముడి దహనం కథ అందరికీ తెలిసిందే.

జ్యోతిర్మయం

శివుడిని లయ కారకుడు అంటాం. సృష్ట్యంతంలో ఆయన తన మూడవ కన్ను తెరిచి, ప్రళయంతో ఈ బ్రహ్మాండాలన్నీ ఉపసంహరించి తనలో లయం చేసుకొంటాడు అంటాం. ఇదీ ప్రతీకాత్మకమే. శివుడు జ్ఞాన స్వరూపుడు. జ్ఞానం లయకారకం. పారమార్థిక జ్ఞాన ప్రకాశం కలిగిన వాడికి, నశ్వరమైన, మిథ్యాత్మకమైన, అనాత్మ విషయాలు కనిపించవు. వాటి స్థానంలో వాటి అసలు రూపమైన సచ్చిదానందమయమైన అఖండ చైతన్యమే సర్వత్రా అనుభూతమౌతుంది. చీకటిలో పాముగా కనిపించింది వెలుతురులో తన అసలు రూపంలో తాడుగా కనిపించేసరికి, ముందు కనిపించిన పాము లయమైపోతుంది. లయమైపోవటానికి కారణం భ్రాంతులకూ కనికట్టులకూ లొంగని జ్ఞాన నేత్రం.

శంకరుడికే కాదు, శంకర కింకరులైన సామాన్యులకు కూడా జ్ఞాన నేత్రం మూడో కన్ను. దాన్ని సద్గురువు తెరిపించినప్పుడు, బాహ్య ప్రపంచం ఉనికి స్వాప్నిక లోకం లాగా తాత్కాలికమనీ, దాని అసలు రూపం బ్రహ్మమయమనీ తెలిసి వస్తుంది. జ్ఞానాగ్ని పూర్వ కర్మల ఫలాలను భస్మీకృతం చేస్తుంది. జితేంద్రియుడూ, శ్రద్ధాశాలీ, జ్ఞానార్జన తత్పరుడూ అయిన వాడు జ్ఞానం పొంది తద్వారా పరమ శాంతిని (మోక్షాన్ని) పొందుతాడు అంటుంది భగవద్గీత.

– ఎం. మారుతి శాస్త్రి

గమనిక : ఆగస్ట్ 29వ తేదీన నాల్గవ పేజీలో (ఫోకస్) ప్రచురించిన ఏబికే ప్రసాద్ వ్యాసం 'ఆధార్ కోరలు తీసిన సుప్రీం' చివరి పేరాలో వచ్చిన 'శాసన వ్యవస్థను ఆక్రమించి న్యాయ వ్యవస్థ పెత్తనం చేయాలని ప్రయత్నిస్తోంది' అన్న ప్రకటన కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీదిగా గమనించగలరు.


రేటెత్తిన కాకినాడ ఓటు

సినిమా రోడ్డులో నివాసముంటున్న జగన్నాథాన్ని (పేరు మార్చాం) కూడా టీడీపీ నేతలు డబ్బుతో ముంచెత్తారు. మూడు రోజుల వ్యవధిలో నగదుతో పాటు విలువైన వెండి ఆభరణాలు అందజేశారు. 27వ తేదీన రూ.2 వేలు నగదు ఇవ్వగా, 28న మరో రూ.2 వేలు ఇచ్చారు. అయినప్పటికీ ఎక్కడ మనసు మార్చుకుంటాడోనన్న అనుమానంతో పోలింగ్‌కు ముందురోజు రాత్రి రెండు వేల రూపాయల విలువైన వెండి గిన్నె ఇచ్చారు.

నగరంలో ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన ఓ వ్యక్తికి పోటీ నుంచి విరమించుకునేందుకు గాను రూ.30 లక్షల నగదుతో పాటు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇస్తామని హామీ ఇచ్చారు. అంతేకాదు అతని అనుయాయులైన పలువురికి విడతల వారీగా ఒక్కొక్కరికి రూ.6 వేల వరకు నగదు ఇచ్చారు.

(కాకినాడ నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి)

నంద్యాల ఉప ఎన్నికలో ఓటర్లకు విచ్చలవిడిగా డబ్బులు పంపిణీ చేసిన అధికార తెలుగుదేశం పార్టీ.. కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లోనూ ప్రలోభాల పర్వాన్ని యథేచ్ఛగా కొనసాగించింది. మూడురోజుల క్రితమే ప్రారంభమైన ఈ ఓట్ల కొనుగోళ్ల కార్యక్రమం పోలింగ్ రోజైన మంగళవారం పరాకాష్టకు చేరుకుంది. నోట్లు కట్టలు తెంచుకున్నాయి. అధికార పార్టీ నేతలు ఏకంగా పోలింగ్ బూత్‌ల వద్ద కూడా డబ్బుల పంపిణీ కొనసాగించారు. రూ.1,000.. రూ.2,000... రూ.3,000... ఇలా విడతల వారీగా ఓటర్లకు డబ్బులిచ్చారు. సరికొత్త నీచ చరిత్ర సృష్టించారు. ఇష్టానుసారంగా డబ్బు పంపిణీ చేయడంలో అధికార పక్షానికి ఎక్కడా ఎలాంటి అడ్డంకులూ ఎదురు కాకపోవడం గమనార్హం. పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించడంతో తీసుకున్నోడికి తీసుకున్నంత.. అన్నట్టుగా నోట్ల కట్టలను బాహాటంగా చేతులతో పట్టుకుని మరీ ఓటర్లకు ఎర వేశారు. పోలింగ్ రోజును 'ఓట్లకు నోట్లు' పండుగలా మార్చేశారు. ముఖ్యంగా పేదలు ఎక్కువగా నివసించే కాలనీల్లో బూత్‌లకు అత్యంత సమీపంలో మాటువేసి నోట్లు పంపిణీ చేశారు. పురుష ఓటర్లకు మద్యం సైతం బహిరంగంగానే పంపిణీ చేశారు. కాకినాడ చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతంలో మకాం వేసిన రాష్ట్ర మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



బాబు ఆదేశాలతో..

సీఎం చంద్రబాబు కాకినాడ ఎన్నికల ప్రచారానికి వచ్చి వెళ్లగానే నోట్ల పంపిణీ కార్యక్రమానికి అధికార పార్టీ శ్రీకారం చుట్టింది. ఈ మేరకు స్థానిక నేతలకు ఆదేశాలు, నిధులు వెళ్లాయి. కొన్ని వార్డుల్లో ఓటుకు వెయ్యి పంపిణీ చేయాలని స్థానిక నేతలు తొలుత నిర్ణయించారు. అయితే వైఎస్సార్ కాంగ్రెస్‌కు కార్పొరేషన్ ఎన్నికల పరిస్థితి అనుకూలంగా ఉందని అంచనాకు వచ్చిన కొందరు మంత్రులు ఆ విషయాన్ని ముఖ్యమంత్రికి నివేదించడంతో ఓటు ధరను రెట్టింపు చేయాలని ఆదేశించినట్టు తెలిసింది. దాంతో ఇదివరకు వెయ్యి, రూ.2 వేలు ఇచ్చిన ఓటర్లకు సోమవారం ఒక్కసారిగా మరో రూ.3,000 అదనంగా ఇచ్చినట్లు సమాచారం. నువ్వా నేనా అనే స్థాయిలో పోటీ ఉన్న వార్డుల్లో ఆ మొత్తాన్ని రూ.7,000 వరకు పెంచారు. పదేసి ఓట్లు ఉన్న కుటుంబాలకు గుత్తగా రూ.50,000 నుంచి రూ.70,000 వరకు పంపిణీ చేసినట్లు సమాచారం. ఇక ఓ మోస్తరు నాయకులకైతే లక్షల్లో డబ్బులు ముట్టినట్లు ప్రచారం జరిగింది.

ద్విచక్ర వాహనాలపై మద్యం పంపిణీ

మరోవైపు పురుష ఓటర్లకు టీడీపీ నేతలు మద్యం సీసాలు బహిరంగంగానే అందజేశారు. జగన్నాథపురంలోని కొన్ని వాడల్లో మద్యం సీసాలు ద్విచక్రవాహనాలపై చేతి సంచుల్లో ఉంచుకుని ఓటర్లకు పంపిణీ చేయడం కనిపించింది. పోలీసుల బందోబస్తుగా ఉన్నా ఎక్కడా అధికారపక్షం అరాచకాలకు అడ్డు చెప్పకపోవడం గమనార్హం.

విస్తుపోయిన ప్రజాస్వామ్యవాదులు

కాకినాడలో ధనస్వామ్యానిదే పై చేయి కావడం చూసి ప్రజాస్వామ్యవాదులు ముక్కున వేలేసుకున్నారు. రాజకీయాల్లో ఇక నిజాయితీపరులకు తావెక్కడ అంటూ చర్చించుకున్నారు. ఓటర్లకు యథేచ్ఛగా డబ్బు, మద్యం పంచడాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు.

పండిన రెబల్స్ పంట

మొత్తం 48 డివిజన్లలో మిత్రపక్షమైన బీజేపీకి టీడీపీ 9 డివిజన్లను కేటాయించింది. బీజేపీకి కేటాయించిన సీట్లలో దాదాపుగా అన్ని స్థానాల్లోనూ టీడీపీ నేతలు తిరుగుబాటు అభ్యర్థులుగా పోటీకి దిగారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. ఈ తిరుగుబాట్లను ముఖ్యమంత్రి, స్థానిక మంత్రులే ప్రోత్సహించారని గ్రహించిన బీజేపీ రాష్ట్ర నేతలు తమ పార్టీ అధిష్టానవర్గానికి ఫిర్యాదు చేశారు. తమకు సీట్లను కేటాయించినట్లు కేటాయించి ఓడిపోయేలా చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బీజేపీ అగ్ర నాయకత్వం ముఖ్యమంత్రికి సైతం అవగతమయ్యేలా హెచ్చరికలు జారీ చేసింది. దీంతో చంద్రబాబు హుటాహుటిన జిల్లా మంత్రులను, ఎన్నికల ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్న మంత్రులను సోమవారం రాత్రి రంగంలోకి దించారు. 'ఏమైనా చేయండి.. తిరుగుబాటు అభ్యర్థులను ఉపసంహరింపజేసి వారితోనే బీజేపీకి ప్రచారం చేయించండి' అంటూ ఆదేశించారు. దాంతో రాత్రికి రాత్రి హవాలా రూపంలో రూ.20 కోట్లు కాకినాడకు తెప్పించుకున్న మంత్రులు గ్రామీణ ప్రాంతంలో మకాం వేసి రెబల్ అభ్యర్థులను పిలిపించి బుజ్జగించారు. 9 డివిజన్లలో ఎనిమిదింట తిరుగుబాటు అభ్యర్థులుగా బరిలోకి దిగిన తెలుగుదేశం అభ్యర్థులు ఒక్కొక్కరికి రూ.35 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ముట్టజెప్పారని తెలిసింది. ఈ నేపథ్యంలోనే వారు సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు తమ డివిజన్లలో తిరిగి తాము పోటీలో ఉండటం లేదని, బీజేపీ అభ్యర్థులకు ఓట్లేయాలంటూ ప్రచారం చేశారు. తెల్లవారే సమయానికి ప్రచారం పూర్తి చేయలేక పోయిన వారు పోలింగ్ బూత్‌ల వద్ద నిలబడి బీజేపీ అభ్యర్థులకు మద్దతు ప్రకటిస్తున్నట్లు చెప్పి, దగ్గరుండి మరీ వారికి ఓట్లు వేయించారు.

టీడీపీ రూ.200 కోట్లకుపైగా ఖర్చు చేసింది

నంద్యాల ఉప ఎన్నికపై రఘువీరా



మడకశిర: నంద్యాల ఉప ఎన్నికలో గెలిచేందుకు తెలుగుదేశం పార్టీ రూ. 200 కోట్లకుపైగా ఖర్చు చేసిందని పీసీసీ చీఫ్ ఎన్.రఘువీరారెడ్డి ఆరోపించారు. నంద్యాల ఉప ఎన్నిక పూర్తిగా అక్రమమని పేర్కొన్నారు. మంగళవారం అనంతపురం జిల్లా మడకశిరలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ విషయంపై ఆధారాలతో సహా ఎన్నికల కమిషన్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. కాగా, సీఎం చంద్రబాబు బెల్టుషాపులను రద్దు చేశామని చెబుతున్నారని.. కాకినాడ స్థానిక సంస్థల ఎన్నికల్లో మద్యాన్ని డోర్‌టూ డోర్ డెలివరీ చేస్తున్నారని ధ్వజమెత్తారు. రోడ్లపైనే మద్యం పంచుతున్నా పోలీసులు మాత్రం పట్టించుకోలేదని ఆరోపించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కె.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సాయంత్రంలోగా నీ అంతుచూస్తా...

- కాకినాడలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి టీడీపీ ఎమ్మెల్యే హెచ్చరిక
- సోదరుడి కుమారుడిపై పోటీ చేయడమే కారణం
- సైకిల్‌కు ఓటు వేయాలంటూ పోలింగ్ కేంద్రాల వద్ద ప్రచారం

సాక్షి, కాకినాడ: కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికల్లో స్థానిక ఎమ్మెల్యే(టీడీపీ) వనమాడి వెంకటేశ్వరరావు(కొండబాబు), ఆయన అన్న సత్యనారాయణ హద్దుమీరి ప్రవర్తించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను బెదిరించారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేశారు. నిబంధనలను ఉల్లంఘించారు. ఎన్నికల కేంద్రాల వద్ద ప్రచారం చేశారు. 'సాయంత్రం నాలుగు గంటలకల్లా నీ అంతు చూస్తా' అంటూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అంకడి సత్తిబాబును ఎమ్మెల్యే కొండబాబు బెదిరించారు. ఎమ్మెల్యే కొండబాబు అన్న సత్యనారాయణ కుమారులు ఉమాశంకర్ 14వ డివిజన్, ప్రసాద్ 23వ డివిజన్ నుంచి పోటీ చేస్తున్నారు. 14వ డివిజన్ నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా అంకడి సత్తిబాబు బరిలోకి దిగారు. ఎక్కడ తన కుమారుడు ఓడిపోతాడోనన్న భయంతో వనమాడి సత్యనారాయణ మంగళవారం 14వ డివిజన్ పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లను ప్రలోభపెట్టారు. తన కుమారుడికి ఓటు వేయాలని అన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద తిష్టవేసిన టీడీపీ నేతలను ఎందుకు అడ్డుకోవడం లేదని సత్తిబాబు పోలీసులను ప్రశ్నించారు. దీంతో వనమాడి సత్యనారాయణ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సత్తిబాబుపై బూతుపురాణం అందుకున్నారు. ఇంతలో అక్కడికి చేరుకున్న ఎమ్మెల్యే కొండబాబు.. సత్తిబాబు వైపు వేలు చూపిస్తూ 'సాయంత్రం నాలుగు గంటల్లోపు నీ అంతు చూస్తా' అని బెదిరించారు. పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే కొండబాబు కాకినాడలో అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద తిరుగుతూ సైకిల్‌కు ఓట్లు వేయాలని ప్రచారం చేశారు. అంతేకాకుండా తన అనుచరులతో పలు డివిజన్లలో భారీగా దొంగ ఓట్లు వేయించారు.





వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సత్తిబాబును బెదిరిస్తున్న టీడీపీ ఎమ్మెల్యే కొండబాబు, ఆయన అన్న సత్యనారాయణ (ఇన్‌సెట్‌లో) కొండబాబు

కాకినాడ తొలి మేయర్ సరోజ ఓటు గల్లంతు



కాకినాడ: తూర్పు గోదావరి జిల్లా కాకినాడ కార్పొరేషన్ తొలి మేయర్ పొలసపల్లి సరోజ ఓటు గల్లంతైంది. నగరపాలక సంస్థ అప్‌గ్రేడ్ అయ్యాక తొలి మేయర్‌గా పనిచేసిన ఆమె మంగళవారం కార్పొరేషన్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ బూత్‌కు వెళ్లారు. 39వ డివిజన్‌లోని రామారావుపేట స్కూల్‌కు వెళ్లగా ఆమె ఓటులేదని పోలింగ్ సిబ్బంది చెప్పారు. డోర్ నెంబర్ 10–3–2లో ఆమె భర్త, అత్త, ఆడపడుచుల ఓట్లన్నీ ఉన్నా సరోజ పేరు ఓటర్ల జాబితాలో లేకపోవడంతో ఆమె విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. జేసీ, ఆర్డీవో, కమిషనర్, సిటీప్లానర్ సహా అందరితో మాట్లాడినా ఫలితం లేకపోయింది. ఓటర్ల జాబితాలో పేరులేనిదే ఏమి చేయలేమంటూ చేతులెత్తేశారు. 2014లో సమైక్యాంధ్ర పార్టీ నుంచి పోటీచేసిన సందర్భంలో ఇదే డోర్ నెంబర్‌పై తనకు ఓటు ఉందని, ఇప్పుడు తన కుటుంబ సభ్యుల ఓట్లుండి తన పేరు లేకపోవడం ఆశ్చర్యంగా ఉందని సరోజ ఆవేదన వ్యక్తంచేశారు. ఉద్దేశ్యపూర్వకంగా తన ఓటును తొలగించారేమోనన్న అనుమానాన్ని ఆమె వ్యక్తంచేశారు.

పోలింగ్ కోడ్ ఉల్లంఘించిన మంత్రులు

- పట్టణాభివృద్ధి శాఖ కమాండ్ కంట్రోల్ రూం నుంచి కాకినాడ పోలింగ్ పర్యవేక్షణ
- సెంటర్ సిబ్బందినీ పోలింగ్ కోసమే వినియోగం

సాక్షి, అమరావతి: ఎన్నికల ప్రచారంతో పాటు ఎన్నికలకు సంబంధించి కార్యక్రమాలకు కనీసం పాఠశాల భవనం కూడా ఉపయోగించకూడదని నిబంధనలున్నప్పటికీ కాకినాడ నగర పాలక ఎన్నికల కోసం మంత్రులు ఏకంగా సచివాలయం కేంద్రంగానే కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డారు. ఇద్దరు మంత్రులు, పలువురు అధికారపార్టీ ఎమ్మెల్యేలు సచివాలయంలోని రెండో బ్లాక్‌లో ఉన్న పట్టణాభివృద్ధి శాఖ కమాండ్ కంట్రోల్ రూంలో తిష్టవేసి, అక్కడి నుంచి సీసీ కెమెరాలు, ఫోన్ల ద్వారా నిరంతరం పోలింగ్ జరిగే తీరును పర్యవేక్షించారు. మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర, గద్దె రామ్మోహన్‌రావు, ఎమ్మెల్సీ బాబు రాజేంద్రప్రసాద్‌లు పోలింగ్ ముగిసేవరకు సచివాలయంలోనే మకాం వేసి కాకినాడలోని అధికార పార్టీ నేతలకు సూచనలిచ్చారు. కమాండ్ కంట్రోల్‌లో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులను కూడా మంత్రులు.. పోలింగ్ పర్యవేక్షణకే ఉపయోగించుకున్నారు. రాష్ట్రంలోని 110 పట్టణాలు, నగరాల్లో ముఖ్యమైన కూడలి ప్రాంతాల్లో పారిశుద్ధ్యం గురించి సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణకు పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక కమాండ్ కంట్రోలు సెంటర్ ఏర్పాటు చేసింది. ఇందులో బాధ్యతలు నిర్వహించడానికి దాదాపు 150 మందిని నియమించింది. కాకినాడ నగర పాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం కమాండ్ కంట్రోల్ రోజు వారీ కార్యక్రమాలకు కూడా స్వస్తి పలికి మంత్రులు ఆ ప్రాంతాన్ని పూర్తిగా ఎన్నికల పోలింగ్ పర్యవేక్షణకే ఉపయోగించుకున్నారు. అక్కడి సీసీ కెమెరాలను కూడా పూర్తిగా పోలింగ్ పర్యవేక్షణకు ఉపయోగించారు. సచివాలయంలో ఉన్న మరో మంత్రి కాల్వ శ్రీనివాసులుతో సహా ఎంపీలు సీఎం రమేష్, జేసీ దివాకర్‌రెడ్డి వంటి వారు తరచూ కమాండ్ కంట్రోలు సెంటర్‌కు వచ్చి తమ వంతు సహాయ సహకారాలు అందజేశారు. ఈ తీరును చిత్రీకరించేందుకు వెళ్లిన సాక్షి టీవీ, పత్రికా ఫోటోగ్రాఫర్‌లను మంత్రుల వ్యక్తిగత భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు.

యథేచ్ఛగా దొంగ ఓట్లు

- కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో టీడీపీ కుయుక్తులు
- ఓట్లు లేని వారితో ఓట్లు వేయించిన అధికార పార్టీ
- నకిలీ ఓటరు గుర్తింపు కార్డులు, ఓటరు స్లిప్పులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు, పోలీసులు

సాక్షి, కాకినాడ: కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికల పోలింగ్‌లో అధికార తెలుగుదేశం పార్టీ సామదానభేద దండోపాయాలన్నీ ప్రయోగించింది. గెలిచేందుకు అన్ని అడ్డదారులూ తొక్కింది. ఈ విషయాన్ని వైఎస్సార్‌సీపీ ఏజెంట్ ఎన్నికల అధికారులు, పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా వారు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. జగన్నాథపురం 17వ డివిజన్‌లో టీడీపీ అభ్యర్థి ప్రసాద్ ఓట్లు లేని వారిని తీసుకొచ్చి దొంగ ఓట్లు వేయించారు. ఉదయం నుంచి పోలింగ్ బూత్ లోపలికి, బయటకు తిరుగుతూ ఈ తంతు సాగించారు. ఎన్నికల గుర్తింపు కార్డుపై ఒరిజినల్ ఫోటో స్థానంలో దొంగ ఓటర్ల ఫొటోను పెట్టి ల్యామినేషన్ చేసి, నకిలీ కార్డు తయారు చేశారు. నకిలీ ఓటర్లతో యథేచ్ఛగా ఓట్లు వేయించారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు ఈ విషయాన్ని గుర్తించిన వైఎస్సార్‌సీపీ ఏజెంట్.. 'మహాలక్ష్మి సంగాడి, భర్త గంగరాజు సంగాడి' అనే పేరుతో తయారు చేసిన ఎన్నికల గుర్తింపు కార్డుతో వచ్చిన మహిళ ఓటు వేయడాన్ని అడ్డుకున్నారు. దీంతో సదరు మహిళ ఆ కార్డును అక్కడే వదిలేసి పారిపోయింది. మరో 30 నిమిషాల తర్వాత ఇంకో మహిళను టీడీపీ అభ్యర్థి దగ్గరుండి మరీ తీసుకొచ్చారు. ఆమెకు కూడా 'కె.నాగమణి భర్త కె.గంగరాజు' అనే పేరుపై నకిలీ ఓటరు గుర్తింపు కార్డు, ఓటరు స్లిప్పు స్థానంలో ఓ కాగితంపై పోలింగ్ బూత్ నంబర్, ఓటరు స్లిప్పు నంబర్, పేరు రాసి తీసుకొచ్చారు. బూత్‌లోకి అడుగుపెట్టిన వెంటనే వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, ఏజెంట్ అడ్డుకుని రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకెళ్లారు. రిటర్నింగ్ అధికారి అది నకిలీ కార్డుగా నిర్ధారించారు. ఆ మహిళను ప్రశ్నించగా ఆధార్‌కార్డు తీసుకువస్తానంటూ వెళ్లిపోయి తిరిగి రాలేదు. ఇతరుల ఓటరు స్లిప్పులు తీసుకుని ఇద్దరు దంపతులు ఓటు వేయడానికి వచ్చారు. గమనించిన వైఎస్సార్‌సీపీ ఏజెంట్ ఈ స్లిప్పులు ఎవరు ఇచ్చారని ప్రశ్నించగా టీడీపీ అభ్యర్థి ప్రసాద్ ఇచ్చారని చెప్పారు. వారిని ఓటు వేయనీయకుండా అధికారులు వెనక్కి పంపించివేశారు.



నకిలీ ఓటర్ గుర్తింపు కార్డును పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి. చిత్రంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ అభ్యర్థులు



పోలీసులు తోసివేయడంతో వీల్ చైర్ నుంచి కింద పడిపోయిన వైఎస్సార్‌సీపీ ఏజెంట్

నేను అధికార పార్టీ వాడినే: సీఐ

టీడీపీ వాళ్లు దొంగ ఓట్లు వేయిస్తున్నా ఎందుకు అడ్డుకోవడం లేదని వైఎస్సార్‌సీపీ ఏజెంట్ పోలీసులను ప్రశ్నించారు. తమపై నింద మోపుతావా అంటూ టీడీపీ అభ్యర్థి ప్రసాద్ వైఎస్సార్‌సీపీ ఏజెంట్‌పై తిట్ల దండకం అందుకున్నాడు. టీడీపీ కార్యకర్తలు కూడా తోడుకావడంతో ఇరు వర్గాలు తోపులాటకు దిగాయి. వైఎస్సార్‌సీపీ ఏజెంట్ (అభ్యర్థి తండ్రి)పై పోలీసులు చేయి చేసుకున్నారు. బలంగా నెట్టివేయడంతో ఆయన కిందపడ్డారు. మరో వైఎస్సార్‌సీపీ ఏజెంట్(దివ్యాంగుడు)ను బలంగా తోసివేయడంతో ఆయన కాలికి గాయమైంది. తమపై దౌర్జన్యం చేయడంపై వైఎస్సార్‌సీపీ ఏజెంట్ పోలీసులను ప్రశ్నించగా.. ''అవును, నేను అధికారపార్టీ వాడినే, ఏం చేస్తావ్'' అంటూ సీఐ ఏఎస్ రాజు దబాయించారు. దొంగ ఓట్లు వేయడం, తమపై పోలీసులు చేయి చేసుకోవడంపై వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.


కాకినాడ ఓట్లకు ఖాకీలే పెద్దలు!

అధికార టీడీపీకి యథాశక్తి సహకరించిన పోలీసులు

కాకినాడ నుంచి 'సాక్షి' ప్రత్యేక ప్రతినిధి

చెదురుమదురు సంఘటనలు, స్వల్ప ఉద్రిక్తతల నడుమ తూర్పు గోదావరి జిల్లా కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలు మంగళవారం ముగిశాయి. 64.78 శాతం పోలింగ్ నమోదైంది. 241 మంది అభ్యర్థుల భవిష్యత్తును నిర్ణయించే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను(ఈవీఎంలు) అధికారులు స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచారు. సెప్టెంబర్ 1న ఫలితాలు వెలువడనున్నాయి. కోర్టు ఆదేశాల మేరకు రెండు డివిజన్లు మినహా మిగిలిన 48 డివిజన్లలో పోలింగ్ నిర్వహించారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5 గంటలకు ముగిసింది. మొత్తం 2,29,373 మంది ఓటర్లలో 1,48,598 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా, ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు కొందరు పోలీసు అధికారులు ఈ ఎన్నికల్లో అధికార పార్టీకి వత్తాసు పలికారు. ఇదే అదనుగా టీడీపీ అభ్యర్థులు స్వైరవిహారం చేశారు. 144 సెక్షన్‌ను అపహాస్యం చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా పోలింగ్ కేంద్రాల వద్దే ఎన్నికల ప్రచారం చేశారు. ఇదేమిటని ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడికి ప్రయత్నించారు. అంతు చూస్తామంటూ బెదిరించారు.

ఇదెక్కడి న్యాయం ఎస్పీ?



అధికార పార్టీకి మద్దతు ఇవ్వలేదన్న సాకుతో 38వ డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న రాజమహేంద్రవరం ఎస్‌ఐ రాంబాబును జిల్లా ఎస్పీ విశాల్ గున్ని అక్కడి నుంచి తొలగించడం ఓటర్లను విస్మయపరిచింది. ఆ ఎస్‌ఐ వైఎస్సార్‌సీపీకి సహకరిస్తున్నారంటూ టీడీపీ నేతలు ఫిర్యాదు చేయడంతో ఆయనను తొలగించారు. అయితే, అక్కడే ఉన్న ఓ కానిస్టేబుల్ టీడీపీకి ఓట్లేయాలని చెబుతున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్పీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం గమనార్హం. కొన్ని డివిజన్లలో పోలింగ్ బూత్‌ల వద్దే టీడీపీ నాయకులు పోలీసుల సాయంతో యథేచ్ఛగా ఓటర్లకు స్లిప్పులతో పాటు డబ్బు పంపిణీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో అధికార పార్టీ నేతలు హల్‌చల్ సృష్టించినా, ఓటర్లను గుంపులు గుంపులుగా తీసుకువచ్చి పోలింగ్ బూత్‌ల్లోకి చొరబడుతున్నా పోలీసులు అదేమని ప్రశ్నించకపోగా యథాశక్తి సహకరించారు.

ఓట్లు గల్లంతు.. జనం గగ్గోలు

చాలా డివిజన్లలో తమ ఓట్లు గల్లంతయ్యాయని పలువురు ఓటర్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఓటరు స్లిప్పులు ఇచ్చినా జాబితాలో పేర్లు లేవంటూ చాలామందిని అధికారులు వెనక్కి పంపించడం వివాదానికి దారి తీసింది. పలు చోట్ల వాగ్వాదాలు జరిగాయి. మరి కొన్నిచోట్ల ఘర్షణ వాతావరణం నెలకొంది.

'నోటా' ఆప్షన్ ఏది?

కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలకు వినియోగించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో నోటా (పై అభ్యర్థులు ఎవరికీ కాదు అన్న మీట) అవకాశం కనిపించకపోవడం వివాదాస్పదంగా మారింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ అవకాశం ఉండదని పోలింగ్ అధికారులు వివరణ ఇచ్చారు.

పలు చోట్ల ఘర్షణలు

ఎన్నికల సందర్భంగా ఏటిమొగ, జగన్నాథపురం, రామారావుపేట, వెంకటనగరం తదితర ప్రాంతాల్లో టీడీపీ నేతల ఆగడాలను వైఎస్సార్‌సీపీ శ్రేణులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకోవడంతో పోలీసులు జోక్యం చేసుకుని చెదరగొట్టారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ తదితరులు ఆయా ప్రాంతాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు.



ఓటు వేసేందుకు 10వ డివిజన్‌లోని పోలింగ్ కేంద్రంలో బారులుతీరిన ప్రజలు

ఆ నిబంధన టీడీపీ నేతలకు వర్తించదా?

ఎన్నికల సమయంలో స్థానికులు తప్ప ఇతర ప్రాంతాల నాయకులు ఎవరూ ఉండకూడదన్న నిబంధనను టీడీపీ నేతలు తుంగలో తొక్కారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు చెందిన నాయకులు కాకినాడలోని వివిధ లాడ్జిలలో మకాం వేసి ఎన్నికలను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. రాష్ట్ర హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప ఆదేశాల మేరకు పలు ప్రాంతాల ఇంటెలిజెన్స్ అధికారులు టీడీపీ ఏజెంట్లుగా వ్యవహరించారు. పిఠాపురం టీడీపీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, అనపర్తి టీడీపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులు వివిధ డివిజన్లలో కలియతిరిగారు.



ఓటు వేయడానికి దివ్యాంగురాలిని తీసుకొస్తున్న దృశ్యం

ఓటింగ్‌కు ఉద్యోగులు దూరం

పోలింగ్ జరుగుతున్న కాకినాడలో మంగళవారం సెలవు ప్రకటించినప్పటికీ వేలాది మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకోలేక పోయారు. ఐదారు వేల మంది ఉద్యోగులు నిత్యం కాకినాడ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లి విధులు నిర్వహించుకుని సాయంత్రానికి తిరిగివస్తుంటారు. కాకినాడలో తప్ప శివారు ప్రాంతాలకు సెలవు లేకపోవడంతో వీరు ఓటింగ్‌కు దూరంగా ఉండాల్సి వచ్చింది.

పరాజయాలు.. పరాభవాలే..

ప్రతిపక్షంలో ఉండగా టీడీపీ ఓటములు 56

ఉప ఎన్నికల్లో 25సార్లు డిపాజిట్లు గల్లంతు..

రెండు తెలుగు రాష్ట్రాలలోనూ అనేక పరాజయాలు..

సాక్షి, అమరావతి

అధికారంలో ఉండగా విచ్చలవిడిగా డబ్బు వెదజల్లి ఓటర్లను ప్రలోభపెట్టి, భయభ్రాంతులకు గురిచేసి విజయాలు సాధించిన తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉన్నపుడు మాత్రం ఓటమి చెందడంలో అంతకు మించిన రికార్డు సృష్టించింది. 2004 నుంచి 2014 వరకు ప్రతిపక్షంలో ఉండగా తెలుగుదేశం పార్టీ మొత్తం 56 ఉప ఎన్నికలలో పరాజయాన్ని మూటకట్టుకుంది. అందులో 25 చోట్ల డిపాజిట్లు కోల్పోయింది.

డబ్బు పంపిణీకి ఆద్యుడు బాబే..

ఎన్నికల్లో గెలిచేందుకు విచ్చలవిడిగా డబ్బు ఖర్చు పెట్టే సంస్కృతికి ఆద్యుడు చంద్రబాబేనని ప్రతిపక్షాలు విమర్శిస్తుంటాయి. సాధారణ ఎన్నికల్లోనే కాదు ఉప ఎన్నికల్లోనూ వందల కోట్లు ఖర్చుచేసే విష సంస్కృతికి చంద్రబాబే శ్రీకారం చుట్టారని అంటుంటారు. 1995లో జరిగిన ఓ ఉప ఎన్నిక సందర్భంగా ఓటుకు రూ.500 పంపిణీ చేయించారని గుర్తు చేస్తుంటారు. నంద్యాల ఉప ఎన్నిక జరిగిన తీరు తాజా నిదర్శనం. ఈ ఎన్నికల్లో చంద్రబాబునాయుడు దాదాపు రూ.200 కోట్లు ఖర్చు పెట్టడమే కాకుండా పూర్తిగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్న విమర్శలున్నాయి. డబ్బు మంచినీళ్ల ప్రాయంలా ఖర్చు చేయడమే కాకుండా నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాల్సిన యంత్రాంగంపై తీవ్ర ఒత్తిడి తెచ్చి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. ఉప ఎన్నికలు ఎప్పుడు జరిగినా అధికారంలో ఉండే పార్టీకి అనుకూలత ఎక్కువగా ఉంటుంది. స్థానిక యంత్రాంగాన్ని చెప్పుచేతల్లో ఉంచుకోవడంతో సహా అధికారపార్టీకి అన్ని అవకాశాలు ఉంటాయి. పార్టీ ఎమ్మెల్యేలతో పాటు రాష్ట్ర మంత్రివర్గాన్ని కూడా పూర్తిగా నంద్యాలలోనే మకాం వేయించిన చంద్రబాబు ఎన్నికలకు ముందు దాదాపు రూ.1,400 కోట్లతో వివిధ పథకాలను మంజూరు చేసి ప్రజలను ప్రలోభాలకు గురిచేశారు. ఓటుకు రూ. 2వేల నుంచి రూ. 10వేల వరకూ పంపిణీ చేశారు. తమకు ఓటు వేయకపోతే అభివృద్ధి ఆగిపోతుందని, పథకాలు ఆగిపోతాయని, పెన్షన్లు – రేషన్ నిలిచిపోతాయని బెదిరించారు. డ్వాక్రా మహిళలను కూడా కార్యకర్తల్లా ఉపయోగించుకున్నారు. అందుకే ఈ ఎన్నికల్లో తాము ఓడినా నైతిక విజయం తమదేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు పేర్కొంటున్నారు.

ఉప ఎన్నికల్లో 56 సార్లు ఓడిన టీడీపీ

రాష్ట్రంలో 2004 అసెంబ్లీ సాధారణ ఎన్నికల తరువాత వివిధ కారణాలతో పలు అసెంబ్లీ స్థానాలకు 62 ఉప ఎన్నికలు జరిగాయి. ఇందులో టీడీపీ 56 స్థానాలలో ఓటమి పాలవ్వడమే కాకుండా 25 స్థానాలలో డిపాజిట్లు కూడా దక్కించుకోలేకపోయింది.

- 2005లో టీడీపీ అభ్యర్థి మరణంతో జరిగిన బొబ్బిలి పార్లమెంటు స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో అప్పటి అధికార కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా బొత్స ఝాన్సీ లక్ష్మి టీడీపీపై విజయం సాధించారు.
- 2005లో జరిగిన కరీంనగర్ ఉప ఎన్నికల్లో రాజీనామా చేసిన టీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖరరావు కాంగ్రెస్‌పై గెలిచారు. టీడీపీ మూడో స్థానంలో నిలిచింది.
- తెలంగాణ సాధన వ్యూహంలో భాగంగా 17 మంది టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రాజీనామాలు సమర్పించడంతో 2008 మే 29న ఉప ఎన్నికలు జరిగాయి. దీంతోపాటు విజయనగరం జిల్లా తెర్లాంలో టీడీపీ ఎమ్మెల్యే తెంటు జయప్రకాశ్, కాంగ్రెస్‌నేత పి.జనార్దన్‌రెడ్డి హఠాన్మరణంతో ఖైరతాబాద్‌లో ఉపఎన్నికలు ఇదేరోజున జరిగాయి. వీటితో పాటు తెలంగాణలోని, జడ్చర్ల, వికారాబాద్, ముషీరాబాద్, సికింద్రాబాద్, సిద్దిపేట, దొమ్మాట, రామాయంపేట, ఎల్లారెడ్డి, డిచ్‌పల్లి, ఖానాపూర్, మేడారం, హుజూరాబాద్, కమలాపూర్, చేర్యాల్, ఘణ్‌పూర్, ఆలేరు నియోజకవర్గాల్లో ఈ ఉప ఎన్నికలు జరిగాయి. తెర్లాంలో టీడీపీ అభ్యర్థి తెంటు లక్ష్మునాయుడు (జయప్రకాశ్ కుమారుడు) గెలిచారు. ఇక తెలంగాణలో జరిగిన మిగతా ఉప ఎన్నికల్లో ఆరు స్థానాలను అప్పటి అధికార పార్టీ కాంగ్రెస్ గెల్చుకోగా, టీఆర్ఎస్ ఏడు స్థానాలను, టీడీపీ నాలుగు స్థానాలను, సాధించాయి. సిద్దిపేట సహా కొన్ని నియోజకవర్గాలలో ప్రతిపక్ష టీడీపీ, అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు డిపాజిట్లు కూడా కోల్పోయారు.
- తెలంగాణలో ప్రత్యేక రాష్ట్ర సాధన లక్ష్యంగా టీఆర్ఎస్ ఎమ్మెల్యేలతోపాటు, ఆపార్టీలో చేరిన టీడీపీ ఎమ్మెల్యేల రాజీనామాలతో 2010 జులై 27న 12 స్థానాలకు (చెన్నూరు, ఎల్లారెడ్డి, సిర్పూరు, సిద్ధిపేట, హుజూరాబాద్, కోరుట్ల, ధర్మపురి, వేములవాడ, సిరిసిల్ల, మంచిర్యాల, వరంగల్ వెస్ట్, నిజామాబాద్ అర్బన్ స్థానాలకు ఉప ఎన్నికలు జరిగాయి. ఈ ఉప ఎన్నికల్లో నిజామాబాద్ అర్బన్ మినహా తక్కిన అన్ని స్థానాలను టీఆర్ఎస్ కైవసం చేసుకుంది. ఈ ఎన్నికల్లోనూ తెలుగుదేశం పార్టీ అన్ని స్థానాల్లోనూ డిపాజిట్లు కోల్పోయింది.
- 2011 అక్టోబర్ 13న నిజామాబాద్ జిల్లా బాన్సువాడ ఉప ఎన్నికలు జరగ్గా టీఆర్ఎస్ అభ్యర్థి సమీప కాంగ్రెస్ అభ్యర్థిపై విజయం సాధించారు. అప్పట్లో ఈ ఉప ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బాబ్లీ ప్రాజెక్టు వ్యతిరేకంగా పోరాటమంటూ చంద్రబాబు నాయుడు ఆ ప్రాజెక్టు వద్దకు వెళ్లి పెద్ద హైడ్రామా నడిపినా ఈ ఎన్నికల్లో టీడీపీ డిపాజిట్లు కూడా దక్కించుకోలేకపోయింది.
- కాంగ్రెస్ పార్టీకి, ఎంపీ పదవికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజీనామా చేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని నెలకొల్పిన అనంతరం జరిగిన కడప లోక్‌సభ స్థానానికి 2011లో జరిగిన ఉపఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 5,45,672 ఓట్ల మెజార్టీతో గెలిచారు. ఈ ఉప ఎన్నికల్లో టీడీపీ డిపాజిట్లు కోల్పోయింది. ఇదే సమయంలో జరిగిన పులివెందుల అసెంబ్లీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గౌరవాధ్యక్షురాలు వైఎస్ విజయమ్మ 81,373 ఓట్ల మెజార్టీతో గెలుపొందగా టీడీపీ డిపాజిట్లు కూడా దక్కించుకోలేకపోయింది.
- 2012 మార్చి 18న కోవూరు, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, ఘణ్‌పూర్, కొల్లాపూర్, ఆదిలాబాద్, కామారెడ్డి నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో ఏపీలోని కోవూరు స్థానంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ విజయం సాధించగా, తెలంగాణాలోని ఆరింటిలో టీఆర్ఎస్ నాలుగు స్థానాలను, బీజేపీ, ఇండిపెండెంట్లు ఒక్కొక్క స్థానాన్ని చేజిక్కించుకున్నారు. ఆ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షమైన టీడీపీ రెండూ ఓటమి పాలయ్యాయి. ఇక టీడీపీ అయితే ఈ ఉప ఎన్నికల్లో కోవూరుతో సహ నాలుగు చోట్ల డిపాజిట్లు కూడా కోల్పోయింది.
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం తరువాత ఇతర పార్టీల నుంచి వచ్చే వారితో పదవులకు రాజీనామాలు చేయించడంతో ఒక ఎంపీ స్థానంతో పాటు 18 అసెంబ్లీ స్థానాలకూ ఉప ఎన్నికలు జరిగాయి. 2012 జూన్ 12న జరిగిన ఈ ఉప ఎన్నికల్లో మూడు (పరకాల, నరసాపురం, రామచంద్రాపురం) అసెంబ్లీ స్థానాలు మినహా తక్కిన 15 అసెంబీల స్థానాలనూ. నెల్లూరు ఎంపీ స్థానాన్నీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకొంది. తిరుపతి, ఆళ్లగడ్డ, రాజంపేట, రాయచోటి, ఒంగోలు, నరసన్నపేట, పాయకరావుపేట, అనంతపురం అర్బన్, ఎమ్మిగనూరు, రాయదుర్గం, రైల్వేకోడూరు, ఉదయగిరి, ప్రత్తిపాడు, మాచర్ల, పోలవరం స్థానాలు వైఎస్సార్ కాంగ్రెస్ గెల్చుకుంది. ఇక పరకాలలో టీఆర్ఎస్, నరసాపురం, రామచంద్రాపురంలలో కాంగ్రెస్ విజయం సాధించాయి. ఈ ఉప ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ఉన్న టీడీపీ ఒక్క స్థానాన్నీ గెల్చుకోలేక చతికిలపడింది. పైగా 5స్థానాల్లో డిపాజిట్లు కోల్పోయింది. ఏడు స్థానాల్లో అధికార కాంగ్రెస్ కూడా డిపాజిట్లు దక్కించుకోలేకపోయింది.

మిలీనియం మార్చ్‌కి ఫ్యాప్టో, పీఆర్టీయూ మద్దతు

సాక్షి, అమరావతి: ఉద్యోగభద్రత లేని కంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం (సీపీఎస్) రద్దు కోరుతూ విజయవాడలో సెప్టెంబర్ 1న నిర్వహించనున్న మిలీనియం మార్చ్‌కి రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) మద్దతు ప్రకటిస్తోందని సమాఖ్య చైర్మన్ పి.బాబురెడ్డి, సెక్రటరీ జనరల్ జి.హృదయరాజు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే దాదాపు 50 వేల మంది పాల్గొననున్న ఈ మిలీనియం మార్చ్‌కు మద్దతు ప్రకటిస్తున్నట్లు పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కమలాకర్‌రావు, శ్రీనివాసరాజులు తెలిపారు. ఈ ర్యాలీని తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి బిషప్ అసరయ్య బాలికల ఉన్నత పాఠశాల వరకు నిర్వహిస్తామని వెల్లడించారు.

తెలుగు మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి

రాష్ట్రంలో తెలుగును పరిపాలనా భాషగా చేయడంతో పాటు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. మున్సిపల్ స్కూళ్లలో తెలుగు మీడియం రద్దు చేస్తూ ఇచ్చిన జీఓ 14ను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. కర్ణాటకలో ప్రైవేట్ పాఠశాలల్లో కూడా కన్నడను తప్పనిసరి చేసినట్లుగా రాష్ట్రంలోనూ ప్రైవేట్ పాఠశాలల్లో తెలుగును తప్పనిసరి చేయాలని విజ్ఞప్తి చేశారు.

డీఈఓ పదోన్నతులను పారదర్శకంగా నిర్వహించాలి

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న డీఈఓ, సర్వశిక్ష అభియాన్ పీఓ పోస్టులకు నిర్వహించే పదోన్నతులు, బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీలు వి.బాలసుబ్రహ్మణ్యం, బొడ్డు నాగేశ్వరరావు, వై.శ్రీనివాసులురెడ్డి, రాము సూర్యారావులు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ పదోన్నతుల, బదిలీల విషయంలో అక్రమాలు జరుగుతున్నట్లు కథనాలు రావడం బాధాకరమన్నారు. ఈ వ్యవహారాల్లో కార్పొరేట్ విద్యాసంస్థలు జోక్యం చేసుకుంటున్నాయని ఆరోపించారు.

ప్రభుత్వ స్థలాలను పార్కులు చేస్తే తప్పేంటి?: హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: రాజధానిలోని ఖాళీ ప్రభుత్వ స్థలాలను పార్కులుగా మార్చడం సరైనదేనని హైకోర్టు అభిప్రాయపడింది. ఎన్ని వీలుంటే అన్ని పార్కులు ఏర్పాటు చేయడం వల్ల లాభాలే ఎక్కువని పేర్కొంది. ప్రభుత్వ స్థలాలు ఖాళీగా ఉంటే ఆక్రమణలకు గురవుతాయని, వాటిని పార్కులుగా మార్చితే తప్పేంటని పిటిషనర్‌ను ప్రశ్నించింది. సనత్‌నగర్ భరత్‌నగర్‌కాలనీలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పార్కుగా మార్చడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని మంగళవారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ జె.ఉమాదేవితో కూడిన ధర్మాసనం విచారించింది. ఆ స్థలాన్ని క్రీడా మైదానంగా చేసుకుని పిల్లలు ఆడుకుంటున్నారని, ఇప్పుడు ఆ స్థలాన్ని పార్కుగా మార్చేందుకు అధికారులు చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని పిటిషనర్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఖాళీ స్థలాల్ని పార్కులు చేయడంలో తప్పేముందని ధర్మాసనం ప్రశ్నించింది. పార్కుగా మార్చడంపై ప్రభుత్వం నిర్ణయిస్తుందని, ఇలాంటి అంశాలపై న్యాయస్థానాలు జోక్యం చేసుకోబోవని స్పష్టం చేసింది. ఓ ప్రైవేటు విద్యాసంస్థలోని పిల్లలు ఆ స్థలాన్ని వినియోంచుకుంటున్నారని ప్రభుత్వ తరఫు న్యాయవాది హైకోర్టు దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ స్థలాన్ని ఫీజులు వసూలు చేసే ప్రైవేటు విద్యాసంస్థ ఎలా వాడుకుంటుందని హైకోర్టు ప్రశ్నించింది. ఓ ప్రైవేట్ విద్యా సంస్థ హైదరాబాద్‌లో ఉంటే క్రీడా స్థలం ఘట్‌కేసర్‌లో ఉన్నట్లు తెలిసిందని, అసలు ప్రైవేటు విద్యా సంస్థలు క్రీడా మైదానాలను ఎందుకు ఏర్పాటు చేయట్లేవని ప్రశ్నించింది.

అమెరికాతో పాక్ చర్చలు రద్దు

ఇస్లామాబాద్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఘాటు విమర్శల నేపథ్యంలో ఆ దేశంతో చర్చల ప్రక్రియను పాకిస్తాన్ రద్దు చేసుకుంది. దిగజారుతున్న ఇరు దేశాల సంబంధాలపై ద్వైపాక్షిక చర్చలకు ఓ కమిటీని అమెరికాకు పంపాలని పాక్ నిర్ణయించింది. అయితే.. పాకిస్థాన్ ఉగ్రవాదులకు సురక్షిత స్థావరాలను కల్పిస్తోందని ట్రంప్ తాజాగా తీవ్ర విమర్శలు చేసిన విషయం తెలిసిందే. అలాగే ఆఫ్గాన్‌లో సుస్థిరత కోసం భారత్ కీలక పాత్ర పోషిస్తోందని, ఈ విషయంలో తమకు మరింతగా సహకరించాలని కూడా పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలకు నిరసనగా యూఎస్ పర్యటన, చర్చల ప్రక్రియను రద్దు చేస్తున్నట్లు పాక్ విదేశాంగ మంత్రి ఖవాజ ఆసిఫ్ సోమవారం సెనేట్‌లో పేర్కొన్నారు. తమ దేశంలో అస్థిరతను ఏర్పర్చడం కోసం భారత్.. ఆఫ్గాన్ భూ భాగాన్ని వాడుకుంటే ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించమన్నారు. మంగళవారం మంత్రి కమిటీ ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఇరు దేశాల సంబంధాలు బలోపేతం కావడం కోసం విధానపరంగా తీసుకోవాల్సిన మార్గదర్శకాలపై మళ్లీ సమావేశం కావాలని కమిటీ నిర్ణయించింది.

బినామీ ఆస్తుల కేసులో ఐటీ విచారణకు రబ్రీ, తేజస్వి

పట్నా: బినామీ ఆస్తులకు సంబంధించిన కేసులో ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ సతీమణి రబ్రీదేవీ, ఆయన కుమారుడు తేజస్వి యాదవ్‌ను మంగళవారం ఆదాయ పన్ను విభాగం అధికారులు ప్రశ్నించారు. ఈ కేసు దర్యాప్తులో సహాయం కోసం ఢిల్లీ నుంచి పట్నాకు వచ్చిన ప్రత్యేక ఐటీ బృందంతో కలసి దర్యాప్తు అధికారి వారిని విచారించారు. గతంలో లాలూ కుమార్తె మీసా భారతి, అల్లుడు శైలేశ్ కుమార్‌లను కూడా ఐటీ విభాగం ప్రశ్నించిన సంగతి తెలిసిందే. జూన్‌లో లాలూ ప్రసాద్ యాదవ్, రబ్రీదేవీ, తేజస్వి, కుమార్తెలు, చందా, రాగిణి, భారతి, అల్లుడు శైలేశ్ కుమార్‌లకు సంబంధించిన ఆస్తులను అటాచ్ చేస్తూ ఐటీ విభాగం నోటీసులు జారీచేసింది. పలామ్ విహార్ ప్రాంతంలోని ఫామ్‌హౌజ్, భూమి, దక్షిణ ఢిల్లీలోని నివాస గృహం, పట్నాలోని 9 ప్లాట్లు, మరికొన్ని ఆస్తులను అటాచ్ చేసింది. ఈ బినామీ ఆస్తుల విలువ ప్రభుత్వ రేటు ప్రకారం రూ. 9.32 కోట్లు కాగా, మార్కెట్ రేటు ప్రకారం రూ. 170–180 కోట్లు ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఇక ప్రైవేటోళ్ల 'మధ్యాహ్న భోజనం'!

పథకాన్ని ప్రైవేటుకు అప్పగించేందుకు ప్రభుత్వ నిర్ణయం

సాక్షి, అమరావతి

రాష్ట్రంలోని సర్కారు బడుల్లో చదువుకుంటున్న విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనం ఇక పూర్తిగా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లనుంది. ప్రస్తుతం డ్వాక్రా మహిళలు, స్థానికంగా ఉన్న ఇతరులతో నడిపిస్తున్న ఈ పథకాన్ని గంపగుత్తగా ప్రైవేటు పరం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి ఆసక్తి వ్యక్తీకరణలను(ఈఓఐ) ఆహ్వానిస్తూ పాఠశాల విద్యాశాఖ సోమవారం ప్రకటన విడుదల చేసింది. 13 జిల్లాల్ని 71 క్లస్టర్లుగా విభజించి ఈఓఐలను పిలిచింది. రాష్ట్రంలోని 19,794 పాఠశాలలకు సంబంధించిన 15,41,172 పిల్లలకు ఆహార పదార్థాలు అందించేందుకు 13 జిల్లాల్లోని ఈ 71 క్లస్టర్లలో కేంద్రీకృత క్లస్టర్ కిచెన్ సెంటర్ల ఏర్పాటుకోసం సంస్థలు ఆసక్తి వ్యక్తీకరణలు దాఖలు చేయవచ్చని ఈ ప్రకటనలో పేర్కొంది. ఇప్పటికే విజయనగరం, విశాఖపట్నం, గుంటూరు, చిత్తూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలు, విజయవాడ వంటి చోట్ల మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ బాధ్యతను స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేటు సంస్థలకు అప్పగించగా.. సీఎం చంద్రబాబు నియోజకవర్గమైన కుప్పంలోని స్కూళ్లన్నిటిలో ఈ పథకం నిర్వహణను ఈషా ఫౌండేషన్‌కు అప్పగించడం జరిగింది. ఇప్పుడీ పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా పూర్తిగా ప్రైవేటు పరం చేయనున్నారు.

వేలాదిమంది ఉపాధికి గండి..

మధ్యాహ్న భోజనం పథకం కింద రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో వంట చేయడంతోపాటు ఇతర కార్యక్రమాల్ని నిర్వహిస్తున్న వేలాదిమంది కార్మికులపై ప్రభుత్వ తాజా నిర్ణయం తీవ్ర ప్రభావం చూపనుంది. దాదాపు 25 వేల మందికిపైగా సిబ్బందికి ఈ పథకం ద్వారా లభిస్తున్న కొద్దిపాటి ఆసరా కూడా ఇక లేకుండా పోనుంది. మధ్యాహ్న భోజనం తయారీ పనిచేస్తున్న ఒక్కో కార్మికురాలికి రూ.1,000 చొప్పున భృతి చెల్లిస్తున్నారు. అయితే అది సైతం నాలుగైదు నెలలకోసారి కూడా ఇవ్వని పరిస్థితి. అయినప్పటికీ ఆయా కార్మికులు నానా పాట్లు పడుతూ విద్యార్థులకు ఏదో ఒక విధంగా వంటచేసి పెడుతున్నారు. కొన్ని సందర్భాల్లో వివిధ సరుకులకు ఇవ్వాల్సిన నిధులు అందకున్నా కిరాణా షాపులనుంచి తెచ్చి వండి పెడుతున్నారు. అంతేగాక స్కూళ్లలోనే ఈ వంట పదార్థాలను తయారు చేయడంవల్ల వేడివేడిగా అప్పటికప్పుడే పిల్లలకు వడ్డించడానికి వీలవుతోంది. ఇప్పుడు ప్రైవేటు సంస్థలకు ఈ పథకం నిర్వహణ బాధ్యతను అప్పగించనుండడంతో సిబ్బంది ఉపాధికి గండి పడనుంది.



చల్లారిన భోజనమే ఇక గతి!

ఇదిలా ఉంటే.. కొత్త విధానంలో ఎక్కడో సుదూర ప్రాంతంలో కేంద్రీకృత వంటశాలను ఏర్పాటుచేసి అక్కడ్నుంచీ ఆయా స్కూళ్లకు ఆహార పదార్థాలు తయారుచేసి పంపించడం జరుగుతుంది. వేలాది స్కూళ్లకు ఒక్కటే కిచెన్ సెంటర్ నుంచి భోజనం సిద్ధం చేయాలంటే తెల్లవారు జామునుంచే వంటలు ప్రారంభించాలి. తర్వాత దూరప్రాంతాల్లోని స్కూళ్లకు వాహనాల్లో వీటిని తరలించాలి. అంటే ఉదయం వండిన పదార్థాలు మధ్యాహ్నానికి ఆయా స్కూళ్లకు చేరే అవకాశముంది. అప్పటికి ఆహార పదార్థాలు పూర్తిగా చల్లబడిపోవడంతోపాటు పాడైపోయేందుకు ఆస్కారముంటుంది. ఈ విషయాన్ని ఏమాత్రం పరిగణనలోకి తీసుకోని ప్రభుత్వం ఈ కేంద్రీకృత వంటశాలల ద్వారా మధ్యాహ్న భోజనం పంపిణీ కాంట్రాక్టును ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు నిర్ణయించింది. దీనివల్ల పిల్లలకు నాసిరకం, పాడైన ఆహారం సరఫరా అయ్యే ప్రమాదముందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలాది కార్మికులను, పిల్లల్ని పట్టించుకోకుండా ప్రైవేటు సంస్థలకు లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం ఇలా వ్యవహరించడం దారుణమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

● మూడో సారి తండ్రి అయిన కిమ్ జాంగ్ ఉన్



సియోల్: ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ మూడోసారి తండ్రి అయ్యారన్న విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. కిమ్ భార్య రి–సోల్–జు ఈ ఏడాది ఫిబ్రవరిలో బిడ్డకు జన్మనిచ్చిందని దక్షిణ కొరియాకు చెందిన యోన్‌హప్ న్యూస్ ఏజెన్సీ మంగళవారం వెల్లడించింది. జపాన్ మీదుగా మంగళవారం ఉత్తర కొరియా బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించిన నేపథ్యంలో ఈ వార్త వెలువడడం గమనార్హం. గతేడాదిగా రి–సోల్ బయట ప్రపంచానికి కనిపించకపోవటంతో ఆమె గర్భవతి అన్న వార్తలు వచ్చాయి. కిమ్ దంపతులు 2009లో వివాహం చేసుకున్నారు. వీరికి 2009లో మొదటి బిడ్డ, 2013లో పాప పుట్టింది. కిమ్ దేశాధ్యక్షుడైనప్పటికీ అతని పుట్టిన రోజు, పెళ్లి రోజు గురించి కచ్చితమైన సమాచారం ప్రపంచానికి తెలియదు. రెండో బిడ్డ విషయం కిమ్ అభిమాన బాస్కెట్ బాల్ ఆటగాడు డెన్నిస్ రాడ్‌మెన్ బయటకు చెప్పినప్పుడు మాత్రమే ప్రపంచానికి తెలిసింది. రి–సోల్–జు సామాన్య కుటుంబం నుంచి వచ్చింది. ఆమె తండ్రి విద్యావంతుడు కాగా, తల్లి డాక్టర్.

● ఆ అమ్మాయిలతో వివాహం సులభమే!



వాషింగ్టన్: విద్య, ఉద్యోగం, ఆర్థిక స్థితుల్లో తమ కంటే పై స్థాయి అమ్మాయిని పెళ్లి చేసుకోవడం పురుషులకు ప్రస్తుతం చాలా సులభమని తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఇందుకు కారణం ఇటీవల కాలంలో ఉన్నత చదువులు చదివిన అమ్మాయిల సంఖ్య అబ్బాయిలను మించిపోవడమేనని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. తద్వారా తక్కువ విద్యార్హత కలిగిన అబ్బాయిలను కూడా అమ్మాయిలు వివాహమాడుతున్నారని పేర్కొన్నారు. పెళ్లిళ్లు, తదనంతరం ఆర్థిక స్థితిగతులను తెలుసుకునేందుకు అధ్యయనం నిర్వహించినట్లు అమెరికాలోని కన్సాస్ విశ్వవిద్యాలయ అసోసియేట్ ప్రొఫెసర్ చాంగ్వాన్ కిమ్ తెలిపారు. ఇందులో భాగంగా 1990, 2000లో నిర్వహించిన అమెరికా జనాభా లెక్కలతోపాటు 2009–2011 అమెరికన్ కమ్యూనిటీ సర్వేకు సంబంధించిన డేటాను పరిశీలించినట్లు చెప్పారు. వివాహం అనంతరం భర్త కంటే భార్య సంపాదనే అధికంగా ఉందని అధ్యయనంలో తేలినట్లు కిమ్ పేర్కొన్నారు. కుటుంబంలో అందరి కంటే ఎక్కువ ఆదాయం భార్య నుంచే వస్తోందని తెలిపారు. దీనికి కారణం భార్య ఉన్నత విద్యార్హత కలిగి ఉండటమేనని పేర్కొన్నారు. తద్వారా పురుషులకు పనిచేయడం ద్వారానే కాకుండా పెళ్లి అనంతరం భార్య రూపంలో సంపాదన పెరుగుతోందని శాస్త్రవేత్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు.

జితేంద్రశర్మను ముఖ్యమంత్రే నియమించారు

- ఆయన్ను సీఎంకు నేను పరిచయం చేశా.. సలహాదారుగా సీఎం నియమించారు
- నేను ఎవరిపైనా బెదిరింపులకు పాల్పడలేదు
- మెడ్‌టెక్ అక్రమాలపై వైద్యారోగ్యశాఖ మంత్రి కామినేని
- 29 ఏళ్ల బ్యూరోక్రాట్‌గా ఉన్న నన్ను కూడా నమ్మలేరా
- మీడియాతో పూనం మాలకొండయ్య ఆవేదన
- తప్పుల తడకల సమాచారంతో మెడ్‌టెక్‌పై మరిన్ని అనుమానాలు..



విలేకర్లతో మాట్లాడుతున్న జితేంద్రశర్మ. చిత్రంలో మంత్రి కామినేని, పూనం మాలకొండయ్య,

సాక్షి, అమరావతి: మెడ్‌టెక్ జోన్ వ్యవహారంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న సంస్థ సీఈవో జితేంద్రశర్మను స్వయానా సీఎం చంద్రబాబునాయుడే నియమించారని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ వెల్లడించారు. జితేంద్రశర్మకు ఢిల్లీలో బాగా పేరుండటంతో తాను సీఎంకు పరిచయం చేశానని, తర్వాత ఆరోగ్యశాఖ సలహాదారుగా, మెడ్‌టెక్ జోన్ సీఈవోగా నియమించింది చంద్రబాబేనని ఆయన స్పష్టం చేశారు. మెడ్‌టెక్ జోన్ అవినీతి, అక్రమాలపై తాజాగా తీవ్ర ఆరోపణలొస్తున్న నేపథ్యంలో మంగళవారం మంత్రి కామినేని శ్రీనివాస్.. వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య, మెడ్‌టెక్ జోన్ సీఈవో జితేంద్రశర్మతో కలసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జితేంద్రశర్మను తాను సీఎంకు పరిచయం చేశానని, తర్వాత సీఎం స్వయానా శర్మతో మాట్లాడారన్నారు. జితేంద్రకు సీఎం ఐదు ప్రశ్నలేయగా.. వాటన్నిటికీ జవాబు చెప్పగానే ఆయన సంతృప్తి చెంది ఆరోగ్యశాఖ సలహాదారుగా నియమించాలని సూచించారని వివరించారు. ఆ తర్వాత ఆయన్ను మెడ్‌టెక్ జోన్ సీఈవోగా నియమించారన్నారు.

నేను ఎవరిపైనా బెదిరింపులకు పాల్పడలేదు

మెడ్‌టెక్ జోన్‌లో చోటుచేసుకున్న అక్రమాల వ్యవహారంలో తానెవరి మీదా బెదిరింపులకు పాల్పడలేదని, కొంతమంది గిట్టనివాళ్లు, కాంట్రాక్టు రానివాళ్లు తనపై వ్యాఖ్యలు చేసి ఉంటారని మంత్రి కామినేని అన్నారు. పవన్ అనే వ్యక్తిపై తాను బెదిరింపులకు పాల్పడలేదని, ఆయనే ఓ మధ్యవర్తి ద్వారా వచ్చి క్షమాపణ లేఖ ఇచ్చారని మంత్రి చెప్పారు. మెడ్‌టెక్‌జోన్ అక్రమాలు బయటకు తెచ్చినవారి కాల్‌డేటాను కూడా తీశారు కదా! అని విలేకరులు ప్రశ్నించగా.. మీరు ఎవరెవరికి ఫోన్లు చేశారో చెప్పాలని మాత్రమే సదరు వ్యక్తిని అడిగానని, ఎవరి కాల్‌డేటా బయటకు తీయలేదని మంత్రి బదులిచ్చారు. మెడ్‌టెక్‌జోన్‌లో అక్రమాలకు సంబంధించి కొన్ని విషయాలు చెప్పడానికి తనకు సాంకేతికంగా తెలియనందున.. సలహాదారు జితేంద్రశర్మనే మీడియా ముందుకు తీసుకొచ్చానని ఆయన చెప్పారు. సంస్థకు సంబంధించి సమాచారాన్ని వివిధ సంస్థలకు ఈ–మెయిళ్ల ద్వారా పంపించినందుకు మాజీ వైస్ ప్రెసిడెంట్ జుడిష్‌రాజ్‌ను అరెస్టు చేశారని పేర్కొన్నారు. అయితే వాస్తవానికి ఈ–మెయిళ్లు పంపిన వ్యక్తి నిఖిల్‌జైన్ అని వైద్య, ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి.

నన్ను కూడా నమ్మలేకపోయారా?: పూనం

29 ఏళ్ల బ్యూరోక్రాట్‌గా ఉన్న నన్ను కూడా మీరు నమ్మలేకపోయారా? అంటూ మీడియాతో వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మెడ్‌టెక్ జోన్‌కు తానే చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌నని, తన ప్రమేయం లేకుండా ఇక్కడ ఏ పనీ జరగదని తెలిపారు. మీడియాలో మెడ్‌టెక్‌జోన్‌పై రకరకాలుగా వార్తలొచ్చాయని, కనీసం తన వాదన కూడా ఎవరూ రాయలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

మంత్రిపై వచ్చిన ఆరోపణలివే..

మెడ్‌టెక్ జోన్‌లో అక్రమాలు జరిగినట్టు మెడ్‌టెక్ జోన్ మాజీ ఉపాధ్యక్షులు జుడిష్‌రాజు, రామరాజు ఆగస్టు 2న మీడియా సమావేశంలో చెప్పారు. అనంతరం జుడిష్‌రాజుపై మంత్రి కేసు నమోదు చేయించి జైల్లో వేయించారనే ఆరోపణలొచ్చాయి. అంతేగాక మీడియాకు సమాచారమిచ్చిన వారిలో.. కొంతమందికి ఫోన్లు చేసి బెదిరించడమేగాక, వారితో క్షమాపణ లేఖలు రాయించుకున్నట్టు వార్తలొచ్చాయి. ఆ లేఖలు మీడియాకూ అందాయి. వీటన్నిటికంటే మరో అడుగు ముందుకేసి అక్రమాలపై సమాచారమిచ్చినవారి కాల్‌డేటాను తీసి వారిని బెదిరించినట్టు కూడా కలకలం రేగింది. ఇప్పటికీ పోలీసుల సహకారంతో కొంతమంది ఫోన్లను పరిశీలనలో ఉంచినట్టు సైతం ఆరోపణలొచ్చాయి.

సర్కారు లెక్కలకు, వాస్తవానికి లేని పొంతన

ఇదిలా ఉండగా మంగళవారం మంత్రితోపాటు మెడ్‌టెక్ సీఈవో జితేంద్రశర్మ చెప్పిన లెక్కలకు, వాస్తవానికీ పొంతన లేకుండా పోయింది. మంత్రి కామినేని ఇటీవల ప్రాజెక్టు వ్యయం రూ.1100 కోట్లు అనడం, జితేంద్రశర్మ తాజాగా రూ.350 కోట్లయితే సరిపోతుందని చెప్పడం విడ్డూరం. మరోవైపు పర్యావరణ అనుమతులకు పంపినప్పుడు ప్రాజెక్టు వ్యయం రూ.670 కోట్లని ఇచ్చారు. ఇలా రకరకాల వ్యయం సంఖ్యలతో గందరగోళం సృష్టించారు. స్వయానా మీడియాకిచ్చిన పత్రాల్లోనే ప్రాజెక్టు వ్యయం రూ.1,500 కోట్లవుతుందని పేర్కొన్నారు. ఇలా పొంతనలేని లెక్కలు మరిన్ని అనుమానాలకు తావిస్తున్నాయి. డీ లిస్టెడ్ కంపెనీ అయిన ల్యాంకోకు టెండరు ఎందుకిచ్చారని ప్రశ్నించగా... అది డీ లిస్టెడ్ కాలేదని, ఓ ట్రిబ్యునల్ పరిశీలనలో మాత్రమే ఉందని ఇచ్చామని బదులిచ్చారు. ల్యాంకో సంస్థ ఇచ్చిన సాల్వెన్సీ సర్టిఫికెట్ ఇవ్వాలని విలేకరులు కోరగా దాటేశారు. మెడ్‌టెక్ అక్రమాలపై జుడిష్‌రాజు, రామరాజు చేసిన ఆరోపణలకు తాజా లెక్కలు బలం చేకూర్చినట్టయింది.

హూస్టన్ వణికింది



వరదనీరుతో చిన్న చెరువులా మారిన హూస్టన్‌లోని ఓ రహదారి

'హార్వీ' ధాటికి పది మంది మృతి

- నేడు మరోసారి తుపాను తీరాన్ని తాకే చాన్స్
- టెక్సాస్‌లో పర్యటించనున్న ట్రంప్, మెలానియా
- లక్ష మంది భారతీయ–అమెరికన్లపై ప్రభావం
- ఇళ్లలో చిక్కుకున్న 200 మంది భారతీయ విద్యార్థులు

హూస్టన్: అమెరికా చరిత్రలోనే అత్యంత విధ్వంసకర తుపానుల్లో ఒకటిగా నిలుస్తున్న హార్వీ టెక్సాస్ రాష్ట్రాన్ని అతలాకుతలం చేస్తోంది. హార్వీ తుపాను సంబంధిత కారణాలతో ఇప్పటికే 10 మంది మరణించారు. ఓ వ్యాన్ వరదలో మునిగిపోవడంతో అందులోని ఆరుగురు మరణించారు. వారిలో నలుగురు చిన్నారులున్నారు. అమెరికాలో నాలుగవ అతిపెద్దది, టెక్సాస్‌లో అత్యంత ఎక్కువ జనాభా నివసించే నగరమైన హూస్టన్‌కు తుపాను వల్ల బిలియన్ల డాలర్ల నష్టం వాటిల్లిందనీ, కోలుకోవడానికి కొన్ని సంవత్సరాలు పడుతుందని అధికారులు చెప్పారు. హూస్టన్‌లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. రహదారులు కొట్టుకుపోవడంతో అంబులెన్సులు వైద్యశాలలకు చేరుకోడానికి కూడా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. తుఫాను ప్రభావం టెక్సాస్ వ్యాప్తంగా దాదాపు 1.3 కోట్ల మందిపై ఉంది. వరదల్లో చిక్కుకున్న వారిని కాపాడేందుకు 12 వేల మంది సహాయక సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. 16 హెలికాప్టర్లు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. టెక్సాస్‌లోని తూర్పు కౌంటీల్లో రానున్న రోజుల్లో ప్రాంతాన్ని బట్టి 15 నుంచి 24 అంగుళాల (38 నుంచి 60 సెంటీమీటర్లు) వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అమెరికా వాతావరణ విభాగం తెలిపింది. వర్షం తెరపిస్తే మరో 30 వేల మందిని వారి ఇళ్ల నుంచి సురక్షిత ప్రదేశాలకు తరలిస్తామని అధికారులు చెప్పారు. టెక్సాస్‌లో విద్యుత్తు సరఫరా లైన్లను ఇప్పుడిప్పుడే పునరుద్ధరిస్తున్నారు. గత శుక్రవారమే హార్వీ తుపాను గంటకు దాదాపు 130 మైళ్ల వేగంతో తీరాన్ని తాకడం తెలిసిందే. అప్పటి నుంచి తుపాను మరింత విజృంభిస్తోంది. టెక్సాస్–లూజియానా సరిహద్దులో తుపాను బుధవారం ఉదయం మరోసారి తీరాన్ని తాకే అవకాశం ఉందని సీఎన్ఎన్ వాతావరణ కేంద్రం తెలిపింది. మరోవైపు ప్రజలు తమ దీనస్థితిని తెలుపుతూ ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసి సహాయం కోసం అర్థిస్తున్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించనున్న ట్రంప్

హార్వీ తుపాను నేపథ్యంలో టెక్సాస్‌లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాతావరణ అత్యవసర స్థితిని ప్రకటించారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ట్రంప్ తన భార్య మెలానియాతో కలసి టెక్సాస్‌లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో మంగళవారం (అమెరికా కాలమానం ప్రకారం) పర్యటిస్తారనీ, సహాయక చర్యలను పర్యవేక్షిస్తారని శ్వేతసౌధం వర్గాలు తెలిపాయి. ట్రంప్ మాట్లాడుతూ 'తుఫానులో చిక్కుకున్న వారికి అమెరికాలోని ప్రతి వ్యక్తీ తమ మద్దతును, ప్రేమను పంపుతున్నారు. తుఫానును ఎదుర్కొని మనం మరింత శక్తిమంతులుగా ఎదుగుతాం' అని అన్నారు. వరద ప్రభావం ఎక్కువగా ఉన్న హూస్టన్‌లో కాకుండా.. హార్వీ శుక్రవారం తీరాన్ని తాకిన కార్పస్ క్రిస్టీ ప్రాంతంలో ట్రంప్ దంపతులు పర్యటించనున్నారు.



వేలాదిమందితో కిక్కిరిసిన హూస్టన్‌లోని సహాయక శిబిరం

ఇద్దరు భారతీయ విద్యార్థులు క్షేమం...: బ్ర్యాన్ సరస్సులో మునిగి దాదాపు ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఇద్దరు భారతీయ విద్యార్థులను సహాయక సిబ్బంది కాపాడి ఆసుపత్రికి తరలించారు. వారిని టెక్సాస్‌లోని ఏ అండ్ ఎం విశ్వవిద్యాలయంలో చదువుతున్న నిఖిల్ భాటియా, షాలినిగా గుర్తించారు. వారు ఈత కొట్టేందుకు సరస్సు వద్దకు వెళ్లినట్లు భావిస్తున్నారు. మరోవైపు హూస్టన్ చుట్టుపక్కల నివసిస్తున్న దాదాపు లక్ష మంది భారతీయ అమెరికన్లపై కూడా తుపాను ప్రభావం భారీగా ఉంది. వరద నీరు ఇళ్లలోకి చేరడంతో వారందరినీ సురక్షిత ప్రాంతాలకు తరలించారు. 200 మందికిపైగా భారతీయ విద్యార్థులు ఇళ్లలో చిక్కుకుపోగా వారికి భారత కాన్సులేట్ సహాయం అందిస్తోంది. భారతీయుల సహాయార్థం ఓ హెల్ప్‌లైన్ నంబర్‌ను కూడా హూస్టన్‌లోని భారత కాన్సుల్ జనరల్ అనుపమ్ రే ట్వీటర్‌లో పోస్ట్ చేశారు.

సత్వర పరిష్కారానికి పనితీరు సూచీ

పెండింగ్ కేసులపై నీతి ఆయోగ్ సూచన



న్యూఢిల్లీ: న్యాయ వ్యవస్థ పనితీరు సూచీను ఏర్పాటు చేయడం ద్వారా కింది కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరం పరిష్కరించ వచ్చని నీతి ఆయోగ్ కేంద్రానికి సూచించింది. దీంతో పాటు ఆన్‌లైన్ వ్యవస్థ ద్వారానే న్యాయవ్యవస్థలో నియామకాలను చేయాలని కూడా సూచించింది. హైకోర్టులు, హైకోర్టు న్యాయమూర్తులు న్యాయవ్యవస్థ పనితీరు సూచీలతో పర్యవేక్షించి జిల్లా కోర్టుల్లోనూ, సబార్డినేట్ స్థాయిల్లోనూ జరిగే ఆలస్యాన్ని నివారించవచ్చని నీతి ఆయోగ్ ఇటీవల విడుదల చేసిన నివేదికలో అభిప్రాయపడింది. మూడేళ్ల కార్యాచరణ ప్రణాళిక ప్రకారం సమాచారం, ప్రస్తుతమున్న మౌలిక వసతులు, సూచనలతో పాటు కేసులు ఎంతకాలం నుంచి పెండింగ్ లో ఉంటున్నాయి, ఎంత శాతం కేసులు పెండింగ్‌లో ఉంటున్నాయి వంటి అంశాలను గత ఏడాది సమాచారంతో పోల్చి చూడవచ్చని నివేదికలో పేర్కొంది. కోర్టు పనితీరులో ప్రపంచశ్రేణి ప్రమాణాలను పాటించేందుకు ఆస్ట్రేలియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జ్యుడీషియల్ అడ్మినిస్ట్రేషన్, ది ఫెడరల్ జ్యుడీషియల్ సెంటర్ (యూఎస్), ది నేషనల్ ఆఫ్ కోర్ట్స్ (యూఎస్), సింగపూర్‌లోని సబార్డినేట్ కోర్టులను అధ్యయనం చేయాలని కూడా సూచించింది.



హిమాచల్‌ప్రదేశ్‌లో పర్వతాల నడుమ ప్రఖ్యాతిగాంచిన మణి మహేశ్ సరస్సులో వార్షిక పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు. భార్మర్ దగ్గర్లోని హడ్సర్ బేస్‌క్యాంప్ నుంచి అత్యంత క్లిష్టమైన 14 కి.మీ. పొడవైన కొండమార్గంలో నడిచి ఇక్కడికి చేరుకోవచ్చు.

సెప్టెంబర్ 20 తర్వాతే కేబినెట్ విస్తరణ

సాక్షి, న్యూఢిల్లీ: నేడో, రేపో అంటూ వార్తలొస్తున్నప్పటికీ.. కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ మరింత ఆలస్యమయ్యేలా కనిపిస్తోంది. ఆగస్టు 30, 31న మంత్రిత్వ శాఖలు, విభాగాల వారీగా సమీక్షలు, మంత్రుల అపాయింట్‌మెంట్‌లు ఇప్పటికే ఖరారైపోయాయి. మరోవైపు రాష్ట్రపతి భవన్ సమాచారం మేరకు సెప్టెంబర్ 1న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తిరుపతి పర్యటన ఖరారైంది. ఇక సెప్టెంబర్ 2 బక్రీద్ కావడంతో ప్రభుత్వ సెలవు దినం. అందువల్ల ఆ నాలుగు రోజుల్లో విస్తరణ దాదాపుగా ఉండనట్లే.. సెప్టెంబర్ 3న మోదీ చైనా పర్యటనకు వెళ్తున్నారు. చైనాలో జరిగే బ్రిక్స్ సదస్సు, మయన్మార్ పర్యటన ముగించుకుని సెప్టెంబర్ 7న ప్రధాని భారత్‌కు తిరిగి రానున్నారు. ఇదే సమయంలో సెప్టెంబర్ 5 నుంచి 20 వరకూ శ్రాద్ధ(అశుభ) దినాలు. ఆ రోజుల్లో కొత్త పనులు, మంచి పనులు చేపట్టరు. అందువల్ల సెప్టెంబర్ 20 తర్వాతే కేబినెట్ విస్తరణ ఉండొచ్చని తెలుస్తోంది.

చైనా పర్యటనకు ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: వచ్చే నెల 3 నుంచి 5 మధ్య చైనాలో జరిగే బ్రిక్స్ దేశాల సదస్సుకు ప్రధాని మోదీ హాజరవుతారని విదేశాంగ శాఖ మంగళవారం ప్రకటించింది. జియామెన్ నగరంలో ఈ సదస్సు జరగనుంది. డోక్లాం వివాదం సద్దుమణిగిన తరువాతి రోజే ఈ ప్రకటన వెలువడటం గమనార్హం. 'చైనా అధ్యక్షుడి ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ జియామెన్‌లో జరిగే 9వ బ్రిక్స్ సదస్సుకు ప్రధాని హాజరవుతారు' అని విదేశాంగ శాఖ పేర్కొంది.

'డీమ్డ్' నీట్ కౌన్సెలింగ్ సెప్టెంబర్ 7 వరకు



న్యూఢిల్లీ: డీమ్డ్ యూనివర్సిటీల్లో వైద్య విద్య ప్రవేశాలకు నీట్ చివరి రౌండ్ కౌన్సెలింగ్‌ను సుప్రీంకోర్టు మంగళవారం సెప్టెంబర్ 7 వరకు పొడిగించింది. ఈ గడువు ఆగస్టు 31నే ముగియాల్సి ఉంది. ఈ సౌకర్యం డీమ్డ్ వర్సిటీలకే పరిమితమని, తదుపరి గడువులుండవని స్పష్టం చేసింది. గత రెండు కౌన్సెలింగ్‌లలో ఏ కాలేజీలోనూ సీట్లు పొందని విద్యార్థులను 'మాప్ అప్ రౌండ్'గా పిలిచే ఈ దఫాలో అనుమతిస్తారు. డీమ్డ్ వర్సిటీల్లో ఖాళీగా ఉన్న 5,500 సీట్లను అర్హులైన 55 వేల విద్యార్థుల జాబితా నుంచి 1:10 నిష్పత్తిలో భర్తీ చేయనున్నారు.

ఎటూ తేల్చని చైనా!

బీజింగ్: వివాదాస్పద సరిహద్దు ప్రాంతం డోక్లాంలో రోడ్డు నిర్మాణ పనులు నిలిపేయడంపై చైనా ఇంకా స్పష్టత ఇవ్వడం లేదు. సరిహద్దుల రక్షణ కోసం చైనా చాలా కాలం క్రితమే అక్కడ రోడ్డు, ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణాలను చేపట్టిందని ఆ దేశ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి హువా చున్యింగ్ మంగళవారం తెలిపారు. రోడ్డు నిర్మాణాన్ని కొనసాగిస్తారా అని విలేకర్లు ప్రశ్నించినపుడు..'క్షేత్ర స్థాయి పరిస్థితులకు లోబడి తగిన నిర్మాణ ప్రణాళికను రూపొందిస్తాం' అని ఆమె అస్పష్టంగా బదులిచ్చారు.

వ్యవస్థను అవిటిని చేశారు

- యూపీఏ హయాంలో అంతా అస్తవ్యస్తం: ప్రధాని మోదీ
- మా ప్రభుత్వం దేశాభివృద్ధికి బాటలు వేస్తోంది
- సాహసోపేత నిర్ణయాలతో ముందుకు సాగుతున్నాం


ఉదయ్‌పూర్ (రాజస్తాన్): గత పాలకులకు భిన్నంగా దేశాభివృద్ధి కోసం ఎన్‌డీఏ ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటోందని...దృఢవిశ్వాసంతో వాటిని అమలు చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. యూపీఏ హయాంలో వ్యవస్థ అవిటిదైందని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేసరికి పరిస్థితులు అస్తవ్యస్తంగా ఉన్నాయని చెప్పారు. అయితే తాము భిన్న మూలాల నుంచి వచ్చామన్నారు. దేశాభివృద్ధికి బాటలు వేయడంలో భాగంగా సవాళ్లను స్వీకరించి, వాటికి పరిష్కారాలు కనుగొంటూ ముందుకు సాగుతున్నామని వెల్లడించారు. మోదీ మంగళవారం రాజస్తాన్‌లో రూ.15వేల కోట్లతో చేపట్టిన పలు రహదారుల ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. 873 కిలోమీటర్ల మేర పూర్తయిన 11 జాతీయ రహదారుల ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ఖేల్గోవన్‌లో నిర్వహించిన భారీ ర్యాలీలో ప్రధాని ప్రసంగించారు. రోడ్లు బాగుంటే... పూలు అమ్మేవాడి నుంచి చాయ్‌వాలా వరకూ అందరూ మంచి ఆదాయం పొందుతారన్నారు.

చెడును తొలగించడం పెద్ద సవాలు

'మేము చేపట్టిన పనులను పూర్తిచేసేందుకు పాటుపడతాం. ధైర్యంతో నిర్ణయాలు తీసుకొంటాం. అంతే దృఢచిత్తంతో వాటిని అమలు చేస్తాం. రాజస్తాన్‌లో చేపట్టిన మౌలిక వసతుల ప్రాజెక్టులు రాష్ట్ర స్వరూపాన్ని మారుస్తాయి. ఇది ఓ చారిత్రక ఘట్టం. ఎన్నికల సమయంలో భారీ స్థాయిలో హామీలివ్వడం ఆనవాయితీగా మారిపోయింది. దశాబ్దాలుగా ఈ సంప్రదాయం కొనసాగుతోంది. వ్యవస్థలో చెడును తొలగించడం పెద్ద సవాలు. దాన్ని రూపుమాపడానికి ఎంత శక్తిసామర్థ్యాలు కావాలో ఊహలకందదు'అని ప్రధాని చెప్పారు. తమ ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాల వేగం, స్థాయి, పరిధి పెంచిందన్నారు. ఈ 'యుద్ధవీరుల గడ్డ'లో ఎన్‌డీఏ ప్రభుత్వం అభివృద్ధి మాత్రమే చేసిందని... రాజకీయాలు కాదని చెప్పారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో వరద బాధితులకు అండగా ఉంటామన్నారు.



ఉదయ్‌పూర్‌లో ప్రసంగిస్తున్న మోదీ



హెలికాప్టర్‌లో వస్తున్న మోదీని చూసేందుకు పోటెత్తిన జనం

జీఎస్టీతో డ్రైవర్ల ఆదాయం పెరిగింది

వస్తు సేవల పన్ను (జీఎస్టీ) అపూర్వమైన సంస్కరణని, రాత్రికిరాత్రి దేశంలో పన్ను విధానాన్ని సమూలంగా మార్చేసిందని ప్రధాని మోదీ కొనియాడారు. దీని వల్ల రవాణా ఖర్చు తగ్గి ట్రాక్టర్ ట్రాలీలు, ట్రక్కుల డ్రైవర్ల ఆదాయం పెరిగిందన్నారు. దేశ రవాణా రంగంలో మార్పులు తెచ్చే దిశగా కృషి చేస్తున్నామన్నారు. చిన్న చిన్న వ్యాపారులకు జీఎస్టీపై అవగాహన కల్పించేందుకు 15 రోజుల కార్యక్రమం చేపట్టాలని అధికారులను కోరారు. కేంద్ర రహదారులు, రవాణా మంత్రి నితిన్‌గడ్కరీ మాట్లాడుతూ... దేశంలో గత 50 ఏళ్లలో జరగని అభివృద్ధి మోదీ ప్రభుత్వం మూడేళ్లలో చేసి చూపిందన్నారు.

జపాన్ మీదుగా ఉ.కొరియా క్షిపణి

- తమ దేశానికి తీవ్ర ముప్పుగా పరిగణిస్తున్నాం: జపాన్ ప్రధాని అబే
- ఉ.కొరియాపై చర్యలకు అన్ని అంశాలు పరిశీలిస్తున్నాం: ట్రంప్

సియోల్: అగ్రరాజ్యం అమెరికా హెచ్చరికలను ఏమాత్రం పట్టించుకోని ఉత్తర కొరియా మరోసారి దుందుడుకు చర్యకు పాల్పడింది. ఇప్పటికే వరుసగా క్షిపణి ప్రయోగాలు చేపడుతూ ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు రేకెత్తిస్తున్న ఉత్తర కొరియా తాజాగా మంగళవారం ఉదయం జపాన్ మీదుగా బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించింది. జపాన్ మీదుగా ప్రయాణించిన ఈ క్షిపణి ఉత్తర పసిఫిక్ మహాసముద్రంలో పడింది. దీనిపై జపాన్ ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. క్షిపణి ప్రయాణించే మార్గమైన ఉత్తర జపాన్ ప్రాంతంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. దీనిపై జపాన్ ప్రధాని షింజో అబే మాట్లాడుతూ.. ఇటువంటి క్షిపణి ప్రయోగాలు తమ దేశానికి తీవ్ర ముప్పుగా పరిగణిస్తున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా జపాన్, అమెరికాలు ఐక్యరాజ్యసమితిని కోరాయి. ఉత్తర కొరియాలోని సునన్ ప్రాంతం నుంచి ఆ దేశం తాజా ప్రయోగాన్ని చేపట్టినట్లు దక్షిణ కొరియా తెలిపింది. 2,700 కిలోమీటర్లు ప్రయాణించిన ఈ క్షిపణి గరిష్టంగా 550 కిలోమీటర్ల ఎత్తులోని లక్ష్యాలను ఛేదించగలదని ద.కొరియా వెల్లడించింది. ఉ.కొరియాపై ఒత్తిడిని తీవ్రతరం చేసేలా అమెరికా, జపాన్‌లు ఓ నిర్ణయానికి వచ్చాయి. ఉ.కొరియా చర్యలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా మండిపడ్డారు. ఉత్తర కొరియాపై చర్యలు తీసుకునేందుకు అన్ని అంశాలను పరిశీలిస్తున్నామని ఆ దేశాన్ని హెచ్చరించారు.



ఉ.కొరియా క్షిపణి జపాన్ మీదుగా వెళ్లిన మార్గం

జుకర్‌బర్గ్‌కు పాప.. పేరు ఆగస్ట్

శాన్‌ఫ్రాన్సిస్కో: ఫేస్‌బుక్ సహ వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్ మరోసారి తండ్రయ్యారు. తన భార్య ప్రిస్సిల్లా చాన్ ఆడపిల్లకు జన్మనిచ్చిందని తెలుపుతూ.. ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. పాపకు 'ఆగస్ట్'అనే పేరు పెట్టారు. 2015లో ప్రిసిల్లా మాక్సిమాకు జన్మనిచ్చిన విషయం తెలిసిందే. అప్పుడు మాక్స్‌కు లేఖ ద్వారా ఆహ్వానం పలికిన జుకర్ దంపతులు ఈ సారి ఆగస్ట్‌కు కూడా మరో లేఖ రాశారు. దానిలో 'బాల్యం ఒకసారి మాత్రమే వస్తుంది. దానిని పూర్తిగా ఆస్వాదించు. భవిష్యత్ గురించి ఆందోళన వద్దు. నీకు ఏ లోటు రాకుండా చూసుకోడానికి మావంతు కృషి చేస్తాం. నూతన ప్రపంచంలోకి స్వాగతం'అని రాశారు.



వైవాహిక అత్యాచారం నేరం కాదు

ఢిల్లీ హైకోర్టులో కేంద్రం అఫిడవిట్

న్యూఢిల్లీ: భార్య అంగీకారం లేకుండా భర్త ఆమెతో శృంగారంలో పాల్గొనడాన్ని నేరంగా పరిగణించలేమని, అలా చేస్తే వివాహ వ్యవస్థ అస్థిరమవుతుందని ఢిల్లీ హైకోర్టుకు కేంద్రం తెలిపింది. భర్తలను వేధింపులకు గురిచేయడానికి భార్యలకు అది ఒక సులభమైన ఆయుధంగా మారే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేసింది. వైవాహిక అత్యాచారాన్ని (మారిటల్ రేప్)ను నేరంగా చూడాలని కోరుతూ దాఖలైన పిటిషన్లకు స్పందనగా కేంద్రం మంగళవారం అఫిడవిట్ సమర్పించింది. ఐపీసీ సెక్షన్ 498 ఏ (గృహ హింస వ్యతిరేక చట్టం) దుర్వినియోగమవుతున్న సంగతి సుప్రీంకోర్టు, పలు హైకోర్టుల దృష్టికి వచ్చిందని గుర్తుచేసింది. ఈ విషయంలో ఎలాంటి సంక్లిష్టతలకు తావివ్వకుండా ఉండాలంటే రాష్ట్ర ప్రభుత్వాలను కూడా ప్రతివాదులుగా చేర్చి వాటి అభిప్రాయాలు తెలుసుకోవాలది. వైవాహిక రేప్‌ను చట్టంలో నిర్వచించలేదని, అందుకోసం సమాజంలో విస్తృత ఏకాభిప్రాయం అవసరమవుతుందని తెలిపింది.



నైతిక అవగాహన ముఖ్యం:

'భార్యకు వైవాహిక అత్యాచారంగా కనిపించినది ఇతరులకు అలా కనిపించకపోవచ్చు. వైవాహిక రేప్, వైవాహికేతర రేప్ మధ్య తేడాను స్పష్టంగా నిర్వచించాలి. రేప్ కేసుల విచారణ నుంచి భర్తలకు ఇస్తున్న మినహాయింపు తొలగించడం ద్వారా వైవాహిక రేప్‌లు సమసిపోవు. నైతిక, సామాజిక అవగాహన ఇక్కడ చాలా ముఖ్యం. భర్త తనపై చేసింది రేపా? కాదా? అని తేల్చే బాధ్యత భార్యపైనే ఉంటుంది. భార్య, భర్తల మధ్య జరిగిన శృంగారానికి సంబంధించి ఎలాంటి సాక్ష్యాలు లేనప్పుడు కోర్టులు ఏ ఆధారాలను నమ్ముతాయి' అని కేంద్రం ప్రశ్నించింది. అవివాహితురాలి మాదిరిగానే వివాహితురాలికీ తన శరీరంపై హక్కు ఉంటుందని పిటిషనర్ల న్యాయవాది వాదించారు.

నేను జయలలిత కూతురిని

శోభన్‌బాబు, జయ ప్రేమకు చిహ్నంగా జన్మించాను: అమృత



సాక్షి, బెంగళూరు: తమిళనాడు మాజీ సీఎం దివంగత జయలలిత తన కన్నతల్లి అని బెంగళూరుకు చెందిన అమృత అనే మహిళ సంచలన ప్రకటన చేసింది. కూతురినని నిరూపించుకునేందుకు డీఎన్ఏ పరీక్షలకు సైతం తాను సిద్ధమని ప్రకటించింది. మరోవైపు, జయలలితది సహజ మరణం కాదని, నిజాలను రాబట్టేందుకు సీబీఐతో దర్యాప్తు జరిపించాలని కోరుతూ ప్రధాని మోదీ, రాష్ట్రపతి కోవింద్ తదితరులకు ఆమె రాసిన లేఖలు మంగళవారం వెలుగుచూశాయి. సదరు లేఖలో ఉన్న సారాంశం క్లుప్తంగా... 'జయలలిత నా కన్నతల్లి. ఆమె తన అమ్మానాన్నలను కోల్పోయి మానసికంగా కుంగిపోయిన దశలో అలనాటి తెలుగు సినీ హీరో శోభన్‌బాబు సహచర్యంతో కోలుకుంది. ఆ సమయంలో వారిద్దరి ప్రేమకు గుర్తుగా నేను పుట్టాను. సామాజిక కట్టుబాట్ల కారణంగా వీరి వివాహం జరగలేదు. బెంగళూరులో ఉంటున్న జయ సోదరి శైలజ, భర్త సారథిలకు నన్ను అప్పగించారు. తన కుమార్తెననే విషయం చెప్పొద్దని వారితో జయ ఒట్టు వేయించుకున్నారు. 1996లో జయను కలవాల్సిందిగా శైలజ నాకు సూచించారు. కలిసినపుడు నన్ను చూడగానే జయ నా వివరాలు కనుక్కొని ఆప్యాయతతో ఆలింగనం చేసుకున్నారు. తర్వాతా అనేకసార్లు కలిశా. నేనే నీ తల్లినని ఆమె నాతో ఎన్నడూ అనలేదు. జయ మరణం తర్వాత దీప, దీపక్‌లు ఆమె ఆస్తులకు వారసులమని చెబుతున్నట్లు మీడియాలో వచ్చిన వార్తలను చూసి.. అమెరికాలో ఉన్న మా బంధువైన జయలక్ష్మి నాకు ఫోన్ చేసి జయ సంతానం నేనే అని చెప్పారు. బెంగళూరులో ఉంటున్న మరో బంధువు సైతం ఇదే మాట చెప్పారు. నా తల్లిని కొంతమంది కుట్రచేసి చంపారు. వారిలో అన్నాడీఎంకే నాయకురాలు శశికళ, నటరాజన్‌లు ముఖ్యులు' అని లేఖలో రాశారు.

జస్మీత్‌కు డేరా బాధ్యతలు

గత సంప్రదాయాలకు భిన్నంగా వారసుడికే పగ్గాలు

సిర్సా, కురుక్షేత్ర: గుర్మీత్ రామ్ రహీం జైలు కెళ్లడంతో తదుపరి డేరా చీఫ్ ఎవరన్న ఊహాగానాలకు తెరపడింది. గుర్మీత్ కుమారుడు జస్మీత్ ఇన్సాన్‌ను మంగళవారం డేరా తదుపరి వారసుడిగా నియమించారు. గత సంప్రదాయాలకు భిన్నంగా ప్రస్తుత చీఫ్ కుటుంబానికి చెందిన వ్యక్తికే డేరా సచ్చా సౌదా పగ్గాలు అప్పగించారు. దత్త పుత్రికగా పేర్కొంటున్న హనీప్రీత్, డేరా చైర్‌పర్సన్ విపాసన ఇన్సాన్ పేర్లు విన్పించినా చివరకు జస్మీత్‌కే అవకాశం దక్కింది. వ్యాపారస్తుడైన జస్మీత్ పంజాబ్ మాజీ ఎమ్మెల్సీ హర్మీందర్ సింగ్ కుమార్తెను పెళ్లిచేసుకున్నారు. నిజానికి 2007లో గుర్మీత్‌పై సీబీఐ చార్జ్‌షీట్ దాఖలు చేసినప్పుడే జస్మీత్‌ను వారసుడిగా ప్రకటించినట్లు సమాచారం.

15 ఏళ్లుగా నరకం..

గుర్మీత్‌పై న్యాయపోరాటంలో 15 ఏళ్లుగా లెక్కలేనన్ని బెదిరింపులు వచ్చాయని, తన సోదరుడిని హతమార్చారని, తన కుటుంబం ఎంతో మానసిక క్షోభ అనుభవించిందని బాధితురాళ్లలో ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. గుర్మీత్‌కు జైలు శిక్షతో ఊరట దక్కినా.. తన తమ్ముడి హత్య కేసులో తీర్పు కోసం ఎదురు చూస్తున్నామని ఆమె తెలిపారు. 'అమ్మాయిల్ని డేరా చీఫ్ తన గుహ ముందు కాపలా పెట్టేవాడు. కొందరు అమ్మాయిలు గుహ నుంచి బయటకు వస్తూ ఏడ్చేవారు. నన్ను కూడా శారీరకంగా వేధించాడు. ఎంతో మందిని శారీరకంగా వేధించినా.. అవమాన భయంతో చాలా మంది మౌనంగా ఉండిపోయారు' అని బాధితురాలు చెప్పారు. గుర్మీత్ అకృత్యాలపై అప్పటి ప్రధాని, పంజాబ్, హరియాణా హైకోర్టుల చీఫ్ జస్టిస్‌కు రాసిన లేఖల వెనుక బాధితురాలి తమ్ముడు ఉన్నాడని అనుమానిస్తూ 2002లో అతన్ని హత్య చేశారు.

డేరా దాదాపుగా ఖాళీ

డేరా సచ్చా సౌదా ప్రధాన కార్యాలయం నుంచి గుర్మీత్ అనుచరుల్ని ఖాళీ చేయించేందుకు ఆర్మీ ఆపరేషన్ మంగళవారం కూడా కొనసాగింది. మంగళవారం ఉదయం నుంచి దాదాపు 700 మంది అనుచరుల్ని ప్రత్యేక బస్సుల్లో వారి స్వగ్రామాలకు తరలించామని హరియాణా సమాచార శాఖ అధికారి తెలిపారు. ఇంకా దాదాపు 200 మంది ఉద్యోగులు ప్రధాన కార్యాలయంలోనే ఉన్నట్లు సిర్సా డీసీపీ ప్రభ్‌జోత్ సింగ్ చెప్పారు. 18 మంది మైనర్ బాలికలు డేరా నుంచి వచ్చేందుకు నిరాకరించారని, అయితే వారిని ఒప్పించి అనంతరం బాలికల సంరక్షణ కేంద్రాలకు తరలించినట్లు తెలిపారు. సోమవారం 34 మంది మైనర్ బాలురను డేరా నుంచి తీసుకొచ్చినట్లు డీసీపీ వెల్లడించారు. గత రెండు రోజుల్లో 6,500 మంది గుర్మీత్ అనుచరుల్ని పంజాబ్, హరియాణా, రాజస్థాన్‌లోని వారి స్వగ్రామాలకు పంపారు.



సిర్సాలోని డేరా సచ్చా సౌధా ఆశ్రమం నుంచి స్వస్థలాలకు వెళ్లిపోతున్న గుర్మీత్ అనుచరులు

ఇంటర్నెట్‌పై కొనసాగుతున్న నిషేధం

గుర్మీత్ రామ్ రహీం సింగ్ సోమవారం రాత్రి ఎలాంటి ఆహారం తీసుకోలేదని రోహ్‌తక్‌లోని సునరియా జైలు అధికారులు తెలిపారు. రాత్రి కేవలం మంచినీరు మాత్రమే తాగారని, మంగళవారం ఉదయం పాలు తీసుకున్నారని వారు చెప్పారు. కాగా బుధవారం మధ్యాహ్నం 12 గంటల వరకూ హరియాణాలోని సున్నిత ప్రాంతాల్లో మొబైల్ ఇంటర్నెట్ సేవల్ని నిలిపి వేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

డేరాలోనే సినిమా థియేటర్, సెట్టింగులు

డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీం సింగ్ విలాసాలు, వైభోగాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. సినిమా నటనను ఎంతో ఇష్టపడే గుర్మీత్ డేరా ప్రధాన కార్యాలయంలోనే సకల హంగులతో సినిమా థియేటర్ ఏర్పాటు చేసుకున్నాడు. అలాగే ఆయన నటించే సినిమాల్ని నిర్మించేందుకు వీలుగా డేరాలోనే ఖరీదైన ఇన్‌డోర్, అవుట్ డోర్ సెట్‌లు కూడా ఉన్నాయి. త్వరలో విడుదలకావాల్సిన 'ఆన్‌లైన్ గురుకుల్' కోసం ఇటీవలే ఆ సెట్స్‌లో కొన్ని రోజులు షూటింగ్ చేశారు. 'దాదాపు 70 శాతం బాబా సినిమాల షూటింగ్ ప్రధాన కార్యాలయంలో జరుగుతాయి. అవసరమైతే క్యాంపస్‌లోని స్కూళ్లు, కాలేజీల్ని వాడేవారు. బాబా సినిమా విడుదలకు ముందే సినిమా చూడమని అనుచరులందరికీ ఎస్ఎంఎస్‌లు వెళ్తాయి' అని గుర్మీత్ అనుచరుడు ఒకరు వెల్లడించారు. అలాగే గుర్మీత్‌కు కార్లంటే చాలా ఇష్టం. అతని కాన్వాయ్‌లో ఎప్పుడూ ఒకే రంగులో నాలుగైదు ఖరీదైన కార్లు ఉండేవి. ప్రాణహాని ఉండటంతో తాను ఏ కారులో ఉన్నాడో తెలియకుండా ఉండేలా ఈ ఏర్పాటు. ఆయన మహిళ గార్డుల్ని కూడా నియమించుకున్నారు.

సాక్షి
భవిత
బుధవారం 30-8-2017
స్పర్ధయా వర్ధతే విద్య

విద్య నేటి విద్యలో..
- జనరల్ స్టడీస్: ఇండియన్ పాలిటీ
- బ్యాంక్ పీవోస్, క్లర్క్స్: జనరల్ అవేర్‌నెస్

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన ఈ-మెయిల్
sakshieducation@gmail.com

పరీక్ష తేదీలు

- యూపీఎస్సీ-ఏఈ, జేడబ్ల్యూఎం, సీనియర్ సైంటిఫిక్ అసిస్టెంట్, ఆఫీసర్ అండ్ ఫోర్‌మ్యాన్ తదితర పోస్టులకు సీబీఆర్‌టీ పరీక్ష: సెప్టెంబర్ 3
- బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీలో ప్రాజెక్ట్ ఇంజనీర్స్ అండ్ ఎకనమిస్ట్స్ పోస్టులకు రాతపరీక్ష: సెప్టెంబర్ 3
- బీఎస్ఎఫ్‌లో అసిస్టెంట్ కమాండెంట్ (వర్క్స్ అండ్ ఎలక్ట్రికల్) పోస్టులకు రాతపరీక్ష: సెప్టెంబర్ 3

UPSC

భారత ప్రధానమంత్రులు

ప్రత్యేకతలు

పోటీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ పాలిటీ




- భారత రాజ్యాంగం దేశంలో పార్లమెంటరీ వ్యవస్థను ఏర్పాటు చేసింది. దాన్ని అనుసరించి దేశానికి రెండు రకాల అధిపతులు ఉంటారు. భారత రాష్ట్రపతి నామమాత్రపు అధికారాన్ని కలిగి ఉంటే.. ప్రధానమంత్రి వాస్తవ అధికారం కలిగి ఉంటాడు. భారతదేశంలో ప్రధానమంత్రి ప్రభుత్వాధినేతగా వ్యవహరిస్తాడు. రాజ్యాంగంలోని 5వ భాగంలో 74, 75, 78 ప్రకరణల్లో ప్రధానమంత్రి, కేంద్ర మంత్రిమండలికి సంబంధించిన వివరాలను పొందుపర్చారు.
- రాజ్యాంగంలోని ప్రకరణ 74(1) ప్రకారం రాష్ట్రపతికి విధి నిర్వహణలో సహాయపడేందుకు, సలహాలు ఇచ్చేందుకు ప్రధాని నేతృత్వంలో ఒక మంత్రిమండలి ఉంటుంది. రాజ్యాంగంలోని ప్రకరణ 75(1) ప్రకారం ప్రధానమంత్రిని నియమించే అధికారం రాష్ట్రపతికి ఉంటుంది. ప్రకరణ 75(2) ప్రకారం రాష్ట్రపతి విశ్వాసం ఉన్నంత వరకు మంత్రిమండలి అధికారంలో కొనసాగుతుంది. ప్రకరణ 75(3) ప్రకారం మంత్రిమండలి సమష్టిగా లోక్‌సభకు బాధ్యత వహిస్తుంది.

జవహర్‌లాల్ నెహ్రూ
పదవీకాలం: 1947-1964



- భారతదేశానికి మొదటి ప్రధాని. నవభారత నిర్మాత. దేశానికి అత్యధిక కాలం ప్రధానిగా పనిచేశారు. ఈయన స్వరాష్ట్రం ఉత్తరప్రదేశ్.
- భారతదేశంలో ప్రజాస్వామ్య సామ్యవాదాన్ని ప్రవేశపెట్టారు. నెహ్రూను భారత విదేశాంగ విధాన రూపశిల్పిగా పేర్కొంటారు.
- పంచశీల సిద్ధాంతకర్త, పంచశీల ఒప్పందంపై (చైనాతో) 1954లో సంతకం చేశారు.
- అలీన ఉద్యమ నిర్మాణంలో కీలకపాత్ర పోషించారు.
- భారతదేశ పారిశ్రామిక రాజ్యాంగంగా పేర్కొనే పారిశ్రామిక తీర్మానం-1956ను ప్రవేశపెట్టారు.
- 1955లో భారతరత్న అందుకున్నారు.
- ఎర్రకోటపై ఎక్కువసార్లు (17) జాతీయ జెండాను ఎగరవేశారు.
- పదవిలో ఉండగా మరణించిన తొలి ప్రధాని.
- 1959లో భారతదేశంలో పంచాయితీరాజ్ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు.
- 1962లో చైనాతో యుద్ధం కారణంగా మొదటిసారి జాతీయ అత్యవసర పరిస్థితిని విధించారు.
- డిస్కవరీ ఆఫ్ ఇండియా, గ్లింప్సెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ గ్రంథాలను రచించారు.

లాల్‌బహదూర్ శాస్త్రి
పదవీకాలం: 1964 - 1966




- ఈయన స్వరాష్ట్రం ఉత్తరప్రదేశ్. నెహ్రూ మంత్రివర్గంలో రైల్వేశాఖ మంత్రిగా పనిచేశారు. కర్ణాటకలో జరిగిన రైలు ప్రమాదానికి నైతిక బాధ్యత వహించి మంత్రి పదవికి రాజీనామా చేశారు. కేంద్ర మంత్రిగా పనిచేసి ప్రధానమంత్రి అయిన మొదటి వ్యక్తి. నెహ్రూ మరణంతో తాత్కాలిక ప్రధానిగా గుల్జారీలాల్ నందా కొద్ది కాలం పనిచేశారు. అనంతరం లాల్‌బహదూర్ శాస్త్రి ప్రధానమంత్రిగా ఎన్నికయ్యారు.
- జై జవాన్-జై కిసాన్ నినాదం ఇచ్చారు.
- పాకిస్థాన్‌తో తాష్కెంట్ ఒప్పందంపై సంతకం చేశారు.
- పోర్ట్ ఫోలియో లేకుండా కేంద్రమంత్రిగా కొనసాగిన మొదటి వ్యక్తి.
- ఇండియన్ లింకన్‌గా పేరొందారు.
- పదవిలో ఉండగా మరణించిన రెండో ప్రధాని. విదేశీ పర్యటనలో ఉండగా మరణించిన ఏకైక ప్రధాని.
- ఆయన కాలంలో 1965లో పాకిస్థాన్‌తో యుద్ధం జరిగింది.
- మరణానంతరం భారతరత్న పురస్కారం పొందారు.
- శాస్త్రి మరణం తర్వాత రెండోసారి తాత్కాలిక ప్రధానమంత్రిగా గుల్జారీలాల్ నందా కొద్ది రోజులుపాటు పనిచేశారు.

ఇందిరాగాంధీ
పదవీకాలం: 1966 - 1977, 1980 - 1984




- లాల్‌బహదూర్ శాస్త్రి మరణించడంతో ప్రధానమంత్రిగా ఇందిరాగాంధీ ఉండాలని భారత జాతీయ కాంగ్రెస్ భావించింది. రాజ్యసభ సభ్యురాలిగా ప్రధానమంత్రి పదవిని చేపట్టిన మొదటి వ్యక్తిగా గుర్తింపు పొందారు.
- కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖను నిర్వహించిన తొలి మహిళ. భారతరత్న పురస్కారం పొందిన తొలి మహిళా ప్రధాని.
- 1969లో మొదటిసారిగా 14 బ్యాంకులను జాతీయం చేశారు.
- 'గరీబీ హఠావో' నినాదం ఇచ్చారు.
- ప్రధానిగా పనిచేసి సాధారణ ఎన్నికల్లో పోటీచేసి, ఓడిన మొదటి వ్యక్తి.
- పదవిలో ఉండగా హత్యకు గురైన ఏకైక ప్రధాని.
- 20 సూత్రాల పథకాన్ని ప్రవేశపెట్టారు.
- 1970లో రాజభరణాలను రద్దు చేశారు.
- 1972లో పాకిస్థాన్‌తో సిమ్లా ఒప్పందంపై సంతకం చేశారు.
- 1974లో మొదటి అణు పరీక్షలను పోఖ్రాన్ వద్ద నిర్వహించారు.
- 1975లో జాతీయ అంతర్గత అత్యవసర పరిస్థితిని విధించారు.
- ఎక్కువ రాజ్యాంగ సవరణలు ఇందిరాగాంధీ కాలంలోనే జరిగాయి.
- అత్యధిక కాలం ప్రధానిగా ఉన్న రెండో వ్యక్తి.

మొరార్జీ దేశాయ్
పదవీకాలం: 1977 - 1979



- మొట్టమొదటి కాంగ్రెసేతర ప్రధానమంత్రి. 1967 నుంచి 1969 వరకు ఉప ప్రధానిగా పనిచేశారు. దీంతోపాటు బాంబే రాష్ట్ర ముఖ్యమంత్రిగా సేవలందించారు. ఈయన జన్మస్థలం ప్రస్తుత గుజరాత్ రాష్ట్రంలో ఉంది.
- భారతదేశంలో మొదటి సంకీర్ణ ప్రభుత్వానికి నేతృత్వం వహించారు.
- ముఖ్యమంత్రిగా పనిచేసి ప్రధానమంత్రి పదవిని చేపట్టిన మొదటి వ్యక్తి.
- భారతదేశంలో నిరంతర ప్రణాళికలను ఈయన కాలంలోనే ప్రవేశపెట్టారు.
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించాలనే ఉద్దేశంతో మండల్ కమిషన్‌ను నియమించారు. ➠ ఏకకాలంలో ఇద్దరు ఉపప్రధానుల (చరణ్‌సింగ్, జగ్జీవన్ రామ్)ను కలిగున్న ప్రధాని. పాకిస్థాన్ అందించే 'నిషాన్-ఇ-పాకిస్తాన్' పురస్కారం పొందిన తొలి భారతీయుడు.
- ప్రధాని పదవికి రాజీనామా చేసిన మొదటి వ్యక్తి.
- 1991లో భారతరత్న పురస్కారం లభించింది.

చరణ్‌సింగ్
పదవీకాలం: 1979-1980



- మొరార్జీ దేశాయ్ ప్రధాని పదవికి రాజీనామా చేయడంతో ఉపప్రధానమంత్రిగా ఉన్న చరణ్‌సింగ్‌ను అప్పటి రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి ప్రధానిగా నియమించారు. ఈయన ఉత్తరప్రదేశ్‌కు చెందినవారు.
- ప్రధానిగా పార్లమెంటులోకి అడుగు పెట్టకుండానే రాజీనామా చేసిన మొదటి వ్యక్తి.
- ముఖ్యమంత్రిగా పనిచేసి ప్రధాని అయిన రెండో వ్యక్తి. రైతు బాంధవుడిగా పేరొందారు.

రాజీవ్‌గాంధీ
పదవీకాలం: 1984 - 1989




- ఇందిరాగాంధీ మరణానంతరం భారత ప్రధాని పదవిని చేపట్టారు. అతి చిన్న వయసులో ప్రధానమంత్రి పదవిని చేపట్టారు.
- భారతదేశంలో సాంకేతిక విప్లవానికి పునాదులు వేశారు. కేంద్ర మంత్రిమండలిని అత్యధిక సార్లు (13) పునర్వ్యవస్థీకరించారు.
- జాతీయ నూతన విద్యా విధానాన్ని ప్రవేశపెట్టారు. శ్యామ్ పిట్రోడాతో కలిసి ఐటీ రంగ విప్లవానికి పునాదులు వేశారు.
- ఓటు హక్కు వయోపరిమితిని 18 సంవత్సరాలకు తగ్గించారు.
- పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టాన్ని తీసుకొచ్చారు. 1991లో భారతరత్న లభించింది (మరణానంతరం). శ్రీలంకకు శాంతి సైనిక దళాలను పంపారు.

వి.పి.సింగ్
పదవీకాలం: 1989, డిసెంబర్ 2 - 1990 నవంబర్ 10.




- ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందినవారు. జాతీయ స్థాయిలో ఫ్రంట్ ప్రభుత్వాలకు శ్రీకారం చుట్టారు. బీజేపీ మద్దతుతో కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అయోధ్య వివాదం నేపథ్యంలో బీజేపీ మద్దతు ఉపసంహరించడంతో అధికారం కోల్పోయారు.
- ముఖ్యమంత్రి పదవి నిర్వహించి ప్రధాని అయిన మూడో వ్యక్తి.
- మండల్ కమిషన్ సిఫార్సుల అమలుకు శ్రీకారం చుట్టారు.
- అవినీతికి వ్యతిరేకంగా జనమోర్చా అనే సంస్థను స్థాపించారు.
- 1990లో అంతరాష్ట్రమండలిని ఏర్పాటు చేశారు.
- జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఏర్పాటు చేశారు.

చంద్రశేఖర్
పదవీకాలం: 1990, నవంబర్ 10 - 1991, జూన్ 21




- ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందినవారు. కేంద్రంలో ఎలాంటి పదవులూ నిర్వహించకుండా ప్రధాని అయ్యారు. కాంగ్రెస్ మద్దతుతో ఫ్రంట్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. యంగ్ టర్క్‌గా గుర్తింపు పొందారు.
- దేశంలో రాజకీయ పాదయాత్రలకు శ్రీకారం చుట్టారు.
- 1991లో జరిగిన గల్ఫ్ యుద్ధంలో అమెరికా యుద్ధ విమానాలకు చమురు సరఫరా చేయడం వివాదాస్పదమైంది.
- ఎర్రకోట నుంచి ప్రసంగించకుండానే పదవిని కోల్పోయారు.

పి.వి.నరసింహారావు
పదవీకాలం: 1991 - 1996




- పార్లమెంటు ఉభయసభల్లో సభ్యుడు కాకుండా ప్రధాని పదవిని చేపట్టారు. తర్వాత నంద్యాల నుంచి పార్లమెంటుకు ఎన్నికయ్యారు. దక్షిణ భారతదేశం నుంచి ఎన్నికైన మొదటి ప్రధానమంత్రిగా గుర్తింపు పొందారు. ఈయన తెలంగాణ రాష్ట్రానికి చెందినవారు. ముఖ్యమంత్రిగా పనిచేసి ప్రధాని అయిన నాలుగో వ్యక్తి. మైనార్టీ ప్రభుత్వాన్ని పూర్తికాలం కొనసాగించారు.
- భారతదేశంలో ఆర్థిక సంస్కరణలకు నాంది పలికారు. ➠ ప్రణాళిక సంఘ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. ➠ అత్యధిక సార్లు అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొన్నారు.
- లుక్ ఈస్ట్ పాలసీని ప్రవేశపెట్టారు.
- 'దేశ్ బచావో దేశ్ బనావో' నినాదం ఇచ్చారు.
- అనేక భాషల్లో ప్రావీణ్యత సాధించారు.
- తన రాజకీయ జీవితంలోని అనుభవాలతో రాసిన పుస్తకం.. ద- ఇన్‌సైడర్.
- విశ్వనాథ సత్యనారాయణ రచించిన
- 'వేయిపడగలు' నవలను 'సహస్రఫణ్' పేరుతో హిందీలోకి అనువదించారు.
- స్థానిక సంస్థలకు చట్టబద్ధత కల్పిస్తూ 73, 74 రాజ్యాంగ సవరణలను తీసుకొచ్చారు.

హెచ్.డి.దేవెగౌడ
పదవీకాలం: 1996, జూన్ 1 - 1997, ఏప్రిల్ 21




- దక్షిణ భారతదేశం నుంచి ఎన్నికైన రెండో ప్రధాని. కర్ణాటక రాష్ట్రానికి చెందినవారు.
- ముఖ్యమంత్రి పదవిని నిర్వహించి ప్రధాని అయిన అయిదో వ్యక్తి.
- పార్లమెంటులో సభ్యుడు కాకుండా ప్రధానమంత్రి పదవిని చేపట్టిన రెండో వ్యక్తి. తర్వాత రాజ్యసభకు ఎన్నికయ్యారు.
- 13 పార్టీలతో కూడిన యునైటెడ్ ఫ్రంట్‌కు నేతృత్వం వహించారు.

ఎ.బి.వాజ్‌పేయి
పదవీకాలం: 1996 (మే 16-జూన్ 1) 1998- 2004



- బీజేపీ ఆధ్వర్యంలో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అత్యధిక పార్టీల కలయికతో ఏర్పడిన ఫ్రంట్ ప్రభుత్వానికి నాయకత్వం వహించారు. పి.వి.నరసింహారావు కాలంలో ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలను వేగవంతం చేశారు.
- జై విజ్ఞాన్ నినాదం ఇచ్చారు.
- పోఖ్రాన్‌లో రెండోసారి అణుపరీక్షలు నిర్వహించారు.
- కార్గిల్ యుద్ధాన్ని విజయవంతంగా ఎదుర్కొన్నారు.
- లాహోర్‌కు ఇండియా నుంచి బస్సు సర్వీసు ప్రారంభించారు.
- ఐక్యరాజ్యసమితిలో హిందీలో ప్రసంగించిన మొదటి ప్రధాని.
- 1994లో ఔట్‌స్టాండింగ్ పార్లమెంటేరియన్ అవార్డును, 2015లో భారతరత్న అవార్డును పొందారు.

ఐ.కె.గుజ్రాల్
పదవీకాలం: 1997, ఏప్రిల్ 21- 1998, మార్చి 19



- యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వానికి నేతృత్వం వహించారు.
- రాజ్యసభ సభ్యుడిగా ప్రధానమంత్రి పదవిని చేపట్టిన మూడో వ్యక్తి.
- గుజ్రాల్ 'డాక్ట్రిన్' పేరుతో విదేశాంగ విధానాన్ని రూపొందించారు.
- వరల్డ్ స్టేట్స్‌మన్ అవార్డు పొందిన తొలి భారతీయుడు.

డా. మన్మోహన్ సింగ్
పదవీకాలం: 2004, మే 22 - 2014, మే 26



- నెహ్రూ, ఇందిరాగాంధీల తర్వాత ఎక్కువ కాలం ప్రధానిగా పనిచేశారు. వరుసగా రెండుసార్లు యూపీఏ ప్రభుత్వానికి నేతృత్వం వహించారు. పి.వి.నరసింహారావు ప్రధానిగా ఉన్న సమయంలో ఆర్థికమంత్రిగా పనిచేసి ఆర్థిక సంస్కరణల అమల్లో కీలకంగా వ్యవహరించారు. రాజ్యసభ సభ్యునిగా ప్రధాని పదవిని చేపట్టిన నాలుగో వ్యక్తి. అసోం నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు.
- అమెరికాతో పౌర అణు ఒప్పందం కుదుర్చుకున్నారు.
- గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టారు.
- పెద్ద మంత్రివర్గాన్ని ఏర్పాటు చేశారు.
- ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షునిగా పనిచేశారు.

నరేంద్రమోదీ
పదవీకాలం: 2014, మే 26 నుంచి..



- గుజరాత్ ఈయన సొంత రాష్ట్రం. గుజరాత్‌కు నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ప్రధాని అభ్యర్థిగా అత్యధిక మెజార్టీతో అధికారంలోకి వచ్చారు. ఎన్‌డీఏ కూటమిని కొనసాగిస్తూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఉత్తర ప్రదేశ్‌లోని వారణాసి లోక్‌సభ నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.
- దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత జన్మించిన మొదటి ప్రధాని.
- ఐక్యరాజ్యసమితిలో హిందీలో ప్రసంగించిన రెండో ప్రధాని.
- 'స్వచ్ఛ భారత్' కార్యక్రమాన్ని ప్రారంభించారు.
- 'బేటీ బచావో-బేటీ పఢావో' నినాదం ఇచ్చారు.
- ప్రణాళిక సంఘం స్థానంలో నీతి ఆయోగ్‌ను ఏర్పాటు చేశారు.



వి.కొండల్
ప్రభుత్వ కళాశాల లెక్చరర్.

ఆదాయ వాస్తవ పంపిణీని సూచించేది?

కాంపిటీటివ్ గైడెన్స్
ఇండియన్ ఎకానమీ



- 1931-32లో డాక్టర్ వి.కె.ఆర్.వి.రావు భారతదేశ తలసరి ఆదాయాన్ని ఎంతగా అంచనావేశారు? **- రూ.65**
- స్వాతంత్ర్యానంతరం మొదటి మూడు దశాబ్దాల్లో జరిగిన వృద్ధిని హిందూ వృద్ధి రేటుగా అభివర్ణించినవారు? **- ప్రొఫెసర్ రాజ్‌కృష్ణ**
- జాతీయాదాయ లెక్కింపులో భాగంగా సేవారంగంలోని ఉప రంగాల భాగస్వామ్యాన్ని లెక్కించేందుకు వినియోగించే పద్ధతి? **- ఆదాయ మదింపు పద్ధతి**
- జాతీయాదాయ లెక్కింపులో డిఫ్లేటర్‌ను ఎందుకు ఉపయోగిస్తారు? **- ధరల ప్రభావాన్ని తొలగించేందుకు**
- మార్కెట్ ధరల వద్ద నికర జాతీయోత్పత్తిలో కలిసి ఉండేవి? **- పరోక్ష పన్నులు, సబ్సిడీలు**
- గ్రీన్ జీఎన్‌పీ అంటే? **- జాతీయాదాయ గణనలో పర్యావరణ నష్టాన్ని పరిగణనలోకి తీసుకోవడం**
- ఆదాయ చక్రీయ ప్రవాహంలో తగ్గుదలకు కారణమయ్యేది? **- పొదుపు**
- నిజ జాతీయాదాయంగా పరిగణించే భావన? **- ఉత్పత్తి కారకాల దృష్ట్యా నికర జాతీయోత్పత్తి**
- జాతీయాదాయాన్ని లెక్కించేటప్పుడు ఏర్పడే సమస్యలు? **- ఒక వస్తువు విలువను రెండుసార్లు లెక్కించడం, లావాదేవీలు ద్రవ్య రూపంలో జరగకపోవడం**
- భారతదేశంలో పొదుపు రేటు తక్కువగా ఉండటానికి కారణం? **- తలసరి ఆదాయం తక్కువ**
- ఆర్థిక పరిభాషలో శ్రామికుని ఉపాంత ఉత్పాదకత శక్తి సున్నా అయితే దాన్ని ఏ నిరుద్యోగంగా పిలుస్తారు? **- ప్రచ్ఛన్న నిరుద్యోగం**
- జాతీయ పనికి ఆహార పథకాన్ని 2004, నవంబర్ 14న అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఎక్కడ ప్రారంభించారు? **- రంగారెడ్డి జిల్లా ఆలూరు**
- నిరుద్యోగ నిర్మూలనకు ప్రణాళిక సంఘం 11 అంశాల కార్యక్రమాన్ని ఎప్పుడు రూపొందించింది? **- 1953**
- పేదరిక అంచనాలో భాగంగా పేదరిక అంతరం, స్క్వేర్డ్ పేదరిక అంతరం, తలల లెక్కింపు సూచీని ఉపయోగించినవారు? **- గౌరవ్ దత్తా**
- భారతదేశంలో పేదరికాన్ని లెక్కించడంలో విశేష కృషి చేసినవారు? **-దండేకర్, రథ్**
- భారతదేశంలో ఆదాయ అసమానతల పెరుగుదలకు కారణం? **- అభివృద్ధి ప్రక్రియలో భాగంగా వివిధ వర్గాల ప్రజల ఆదాయాల్లో తేడా, ప్రాంతీయ వృద్ధిలో తేడా, ఉపాధి కల్పన సరిపోయినంతగా లేకపోవడం, ఆస్తుల పంపిణీలో అధిక అసమానతలు**
- స్వల్ప వ్యవధిలో విస్తృత ప్రాంతంలో సామాజిక అభివృద్ధే లక్ష్యంగా 1953లో ప్రారంభించిన కార్యక్రమం? **- జాతీయ విస్తరణ సేవా కార్యక్రమం**
- ఆదాయ వాస్తవ పంపిణీని సూచించే రేఖ? **- లారెంజ్ వక్ర రేఖ**
- బ్రిటిష్ పాలనలో భారతదేశంలో జరిగిన ఆర్థిక దోపిడీని ఏ గ్రంథం ద్వారా తెలుసుకోవచ్చు? **- డ్రెయిన్ ఆఫ్ వెల్త్**
- పనిలో పాల్గొనే శ్రామిక శక్తి అంటే? **- శ్రామిక శక్తిలో భాగంగా ఉండి వాస్తవంగా ఉపాధి పొందే శ్రామిక శక్తి**
- గున్నార్ మిర్డాల్ రాసిన గ్రంథం? **- ది చాలెంజ్ ఆఫ్ వరల్డ్ పావర్టీ**
- వ్యవసాయం, వినియోగదారు వస్తు ఉత్పత్తి పరిశ్రమలకు ప్రాధాన్యమిచ్చిన ప్రణాళిక? **- ప్రజా ప్రణాళిక**
- వివిధ పెట్టుబడి మార్గాంతరాలకు ఆర్థిక వనరుల కేటాయింపునకు సంబంధించిన ప్రణాళిక? **- ఆర్థిక ప్రణాళిక**
- వికేంద్రీకృత ఆర్థిక వ్యవస్థకు ప్రాధాన్యమిచ్చిన ప్రణాళిక? **- గాంధేయ ప్రణాళిక**
- ఏ ప్రణాళికలో విదేశీ వ్యాపార చెల్లింపుల శేషంలో తీవ్ర లోటు ఏర్పడింది? **- ఏడో పంచవర్ష ప్రణాళిక**
- సాంఘిక న్యాయంతో కూడిన వృద్ధి - సమానత్వం ఏ ప్రణాళిక లక్ష్యం? **- తొమ్మిదో ప్రణాళిక**
- ఆహారం-పని-ఉత్పాదకతకు ప్రాధాన్యమిచ్చిన ప్రణాళిక? **- ఏడో ప్రణాళిక**
- జాతీయ పెట్టుబడి నిధిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఎప్పుడు నిర్ణయించింది? **- 2005, జనవరి 27**
- భారీ పరిశ్రమలకు తక్కువ ప్రాధాన్యమిస్తూ అవస్థాపనా సౌకర్యాలపై దృష్టి పెట్టడం ఏ ప్రణాళికలో ప్రారంభమైంది? **- ఎనిమిదో ప్రణాళిక**
- సింద్రీ ఎరువుల కర్మాగారం ఏ రాష్ట్రంలో ఉంది? **- జార్ఖండ్**
- రెండో ప్రణాళికను ధైర్యంతో కూడుకున్న ప్రణాళికగా వర్ణించడానికి కారణం? **- భారీ పెట్టుబడులకు ప్రాధాన్యమివ్వడం**
- జిల్లా పారిశ్రామిక కేంద్రాలను ఎప్పుడు ప్రారంభించారు? **- 1978**
- నిరంతర ప్రణాళికలతో ముడిపడి ఉన్న భారత ఆర్థికవేత్త? **- లక్డావాలా**
- పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పన, సాంకేతిక స్వావలంబనకు ప్రాధాన్యమిచ్చిన ప్రణాళిక? **- ఆరో ప్రణాళిక**
- ఏ కమిటీ సిఫార్సులను అనుసరించి 1982లో నాబార్డ్‌ను ఏర్పాటు చేశారు? **- శివరామన్ కమిటీ**
- నీతి ఆయోగ్ మొదటి సమావేశం ఎప్పుడు జరిగింది? **- 2015, ఫిబ్రవరి 8**
- టాస్క్‌ఫోర్స్ ఆన్ అగ్రికల్చర్ డెవలప్‌మెంట్‌ను నీతి ఆయోగ్ ఎప్పుడు ఏర్పాటు చేసింది? **- 2015, మార్చి 16**
- పన్నెండో పంచవర్ష ప్రణాళిక లక్ష్యం? **- వేగవంతమైన, సుస్థిర, అధిక సమ్మిళిత వృద్ధి**
- జాతీయ ఆహార భద్రతా మిషన్ కింద పన్నెండో ప్రణాళికలో వేటిని చేర్చారు? **- తృణధాన్యాలు, పశువుల దాణా**
- పన్నెండో పంచవర్ష ప్రణాళికకు సంబంధించి వనరుల కేటాయింపులో సాంఘిక సేవలు తర్వాత ఏ రంగానికి ప్రాధాన్యత దక్కింది? **- శక్తి**



డా॥ తమ్మా కోటిరెడ్డి
ప్రొఫెసర్, ఐబీఎస్, హైదరాబాద్

కాంపిటీటివ్ కౌన్సెలింగ్

సివిల్స్ మెయిన్స్ ప్రిపరేషన్‌లో అనుసరించాల్సిన విధానాలు ఏమిటి?
- జి.హర్ష, హైదరాబాద్.

- సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-మెయిన్స్ ప్రిపరేషన్‌లో రైటింగ్ ప్రాక్టీస్ అనేది చాలా ముఖ్యమైన విషయం. ఎందుకంటే ఓ అంశానికి సంబంధించి ఎంతటి లోతైన పరిజ్ఞానమున్నా, అవగాహన ఉన్నప్పటికీ రాతపూర్వకంగా సరిగా వ్యక్తీకరించకుంటే ఫలితం శూన్యం! అందువల్ల వీలైనన్ని మాక్ టెస్ట్‌లు రాయడం ద్వారా లోపాలను అధిగమించి, రాత తీరును మెరుగుపరచుకోవచ్చు.
- ఎస్సే ప్రిపరేషన్‌కు సంబంధించి సమకాలీన అంశాలపై ఎస్సేలు రాసి నిపుణులతో దిద్దించుకోవాలి. దీని వల్ల బలాలు, బలహీనతలు తెలుస్తాయి. మెరుగుపరచుకోవాల్సిన అంశాలపై స్పష్టత వస్తుంది. జనరల్ స్టడీస్ పేపర్లను చాలా మంది బాగానే రాస్తున్నారు.. ఈ నేపథ్యంలో విజయాన్ని నిర్దేశించడంలో ఎస్సే, ఆప్షనల్ పేపర్లు, ఇంటర్వ్యూ కీలకమవుతున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రిపరేషన్ సాగించాలి.
- రోజూ జనరల్ స్టడీస్, ఆప్షనల్ ప్రిపరేషన్‌కు సమయం కేటాయించాలి. ఉదయం జనరల్ స్టడీస్ చదివితే, సాయంత్రం ఆప్షనల్ సబ్జెక్టు చదవాలి.
- ప్రిపరేషన్‌కు ఒకట్రెండు పేపర్లతో పాటు ఒక ప్రామాణిక మ్యాగజైన్‌కు పరిమితమవ్వాలి. ముఖ్యమైన అంశాలను ప్రత్యేకంగా నోట్ చేసుకోవాలి.
- ఎంత ఎక్కువ చదివామనే దాని కంటే చదివిన విషయం ఎంత వరకు గుర్తుంది అనేది ప్రధానం. అందుకే పునశ్చరణకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- సామాజిక, ఆర్థిక సర్వే, బడ్జెట్, ముఖ్యమైన కమిటీల నివేదికలు వంటి వాటిని అధ్యయనం చేయడం ముఖ్యం. రాష్ట్రపతి, ప్రధానమంత్రి ప్రసంగాలపై దృష్టికేంద్రీకరించాలి. ఎందుకంటే వీటి ద్వారా వివిధ అంశాలకు సంబంధించిన ప్రభుత్వ ఆలోచనా ధోరణి తేటతెల్లమవుతుంది.
- సమాధానం రాసేటప్పుడు ఒక 'ఆఫీసర్'గా రాయాలి. ఆఫీసర్ అయినట్లు ఊహించుకుని సమాధానం రాస్తే ప్రాక్టికల్‌గా వీలయ్యే సూచనలు బయటపడతాయి.
- అన్నీ సమస్యలే.. అంతా అవినీతిమయం, ఏమీ చేయలేం.. వంటి నిరాశాజనక అభిప్రాయాలను కాకుండా "తప్పులున్నాయి.. వాటిని సరిదిద్దుకునేందుకు అవకాశముంది.." అనే సానుకూల ధోరణిని ప్రతిబింబించేలా సమాధానాలు రాయాలి.

జాబ్ పాయింట్

విజయనగరంలో ఆర్మీ నియామక ర్యాలీ

- **అక్టోబర్ 6 నుంచి 17 వరకు**
- **ఎనిమిది, పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ, డిప్లొమా విద్యార్థులకు అవకాశం**
- **సోల్జర్ ట్రేడ్‌మ్యాన్ (ఆల్ ఆర్మ్స్), సోల్జర్ నర్సింగ్ అసిస్టెంట్ , సోల్జర్ క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్, సోల్జర్ టెక్నికల్, సోల్జర్ టెక్నికల్ (ఏవియేషన్ అండ్ ఎమినేషన్ ఎగ్జామినర్), సోల్జర్ జనరల్ డ్యూటీ విభాగాల్లో పోస్టులు**


చెన్నైలోని ఆర్మీ జోనల్ రిక్రూట్‌మెంట్ ఆఫీస్ పరిధిలోని విశాఖపట్నం, గుంటూరులోని ఆర్మీ రిక్రూట్‌మెంట్ కార్యాలయాలు.. ఆర్మీలోని వివిధ విభాగాల్లో పోస్టుల భర్తీకి నియామక ర్యాలీ నిర్వహించనున్నాయి. ఈ మేరకు రెండు వేర్వేరు ప్రకటనలు వెలువరించాయి. ఈ ర్యాలీ 2017 అక్టోబర్ 6 నుంచి 17 వరకు విజయనగరంలోని రాజీవ్‌గాంధీ స్పోర్ట్స్ స్టేడియంలో జరగనుంది. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చు.

- **పోస్టులు:** గుంటూరు ఆర్మీ ఆఫీస్ పరిధి (అనంతపురం, కర్నూలు, వైఎస్సార్ కడప, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాలు)లోని అభ్యర్థులకు.. సోల్జర్ ట్రేడ్‌మ్యాన్ (ఆల్ ఆర్మ్స్), సోల్జర్ నర్సింగ్ అసిస్టెంట్, సోల్జర్ క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్; విశాఖపట్నం ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఆఫీస్ పరిధి (కృష్ణా, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం)లోని అభ్యర్థులకు.. సోల్జర్ టెక్నికల్, సోల్జర్ టెక్నికల్ (ఏవియేషన్ అండ్ ఎమినేషన్ ఎగ్జామినర్), సోల్జర్ నర్సింగ్ అసిస్టెంట్, సోల్జర్ జనరల్ డ్యూటీ, సోల్జర్ ట్రేడ్స్‌మ్యాన్ (ఆల్ ఆర్మ్స్), సోల్జర్ క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్.
- **అర్హతలు:** సోల్జర్ ట్రేడ్‌మ్యాన్ (ఆల్ ఆర్మ్స్)కు.. ఇందులోని హౌస్ కీపర్, మెస్ కీపర్, సైస్ పోస్టులకు ఎనిమిదో తరగతి; షెఫ్, వాషర్‌మ్యాన్, డ్రెస్సర్, స్టీవార్డ్, టైలర్, ఆర్టిషియన్ (ఉడ్‌వర్క్/మెటలర్జీ/కన్‌స్ట్రక్షన్), సపోర్ట్ స్టాఫ్ (ఈఆర్), ఇతర ట్రేడ్ విభాగాలకు పదో తరగతి/సంబంధిత ట్రేడ్ విభాగంలో ఐటీఐ.
- **సోల్జర్ నర్సింగ్ అసిస్టెంట్‌కు..** ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లిష్ సబ్జెక్టులుగా 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత. అలాగే ప్రతి సబ్జెక్టులోనూ 40 శాతానికి పైగా మార్కులు రావాలి. లేదా బోటనీ, జువాలజీ, బయో సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులతో బీఎస్సీ. ఇవే సబ్జెక్టులతో ఇంటర్మీడియెట్ కూడా చదివి ఉండాలి.
- **సోల్జర్ క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్‌కు...** ఇంగ్లిష్‌తో పాటు మ్యాథ్స్/అకౌంట్స్ /బుక్ కీపింగ్ సబ్జెక్టులుగా ప్రతి సబ్జెక్టులోనూ 50 శాతం మార్కులు, మొత్తం మీద 60 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్/పదో తరగతి.
- **సోల్జర్ టెక్నికల్‌కు..** ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులుగా 50 శాతం మార్కులతో ఇంటర్/హెచ్‌ఎస్‌సీ. అలాగే ప్రతి సబ్జెక్టులోనూ 40 శాతం మార్కులు వచ్చి ఉండాలి.
- **సోల్జర్ టెక్నికల్ (ఏవియేషన్ అండ్ ఎమ్యునేషన్ ఎగ్జామినర్)కు** ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులుగా 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్/హెచ్ఎస్‌సీ. అలాగే ప్రతి సబ్జెక్టులోనూ 40 శాతం మార్కులు వచ్చి ఉండాలి. లేదా మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లొమా (మెకానికల్/ఎలక్ట్రికల్/ఆటోమొబైల్స్/కంప్యూటర్ సైన్స్/ఎలక్ట్రానిక్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్)/ఐటీఐ. దీంతోపాటు పదోతరగతిలో 50 శాతం మార్కులు వచ్చి ఉండాలి.
- **సోల్జర్ జనరల్ డ్యూటీకి..** ప్రతి సబ్జెక్టులోనూ కనీసం 33 శాతం, మొత్తం మీద 45 శాతం మార్కులతో పదోతరగతి ఉత్తీర్ణత.
- **వయో పరిమితి:** 2017 అక్టోబర్ 1 నాటికి సోల్జర్ జనరల్ డ్యూటీ పోస్టుల అభ్యర్థులకు 17 ఏళ్ల 6 నెలల నుంచి 21 ఏళ్ల లోపు; మిగిలిన అన్ని పోస్టులకు 17 ఏళ్ల 6 నెలల నుంచి 23 ఏళ్ల లోపు ఉండాలి.
- **శారీరక ప్రమాణాలు:**

పోస్ట్	ఎత్తు (సెం.మీ)	బరువు (కేజీల్లో)	ఛాతీ (సెం.మీ) (సాధారణం-గాలి పీల్చాక)
సోల్జర్ ట్రేడ్‌మ్యాన్(ఆల్ ఆర్మ్స్)	166	48	76-81
సోల్జర్ నర్సింగ్ అసిస్టెంట్	165	50	77-82
సోల్జర్ క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్	162	50	77-82
సోల్జర్ టెక్నికల్	165	50	77-82
సోల్జర్ టెక్నికల్(ఏవియేషన్ అండ్ ఎమినేషన్ ఎగ్జామినర్)	165	50	77-82
సోల్జర్ జనరల్ డ్యూటీ	166	50	77-82

- **ఎంపిక విధానం:** శారీరక ప్రమాణాలు (ఫిజికల్ మెజర్‌మెంట్స్), శారీరక దృఢత్వ పరీక్ష (ఫిజికల్ ఫిట్నెస్ టెస్ట్), వైద్య పరీక్ష (మెడికల్ ఎగ్జామినేషన్), రాత పరీక్ష.
- **ఫిజికల్ ఫిట్నెస్ టెస్ట్ (శారీరక పరీక్షలు):** పరుగుపందెం.. 1.6 కి.మీ దూరాన్ని గ్రూప్-1లోని అభ్యర్థులు 5 నిమిషాల 30 సెకన్లు, గ్రూప్-2లోని అభ్యర్థులు 5 నిమిషాల 45 సెకన్లలోపు పూర్తిచేయగలగాలి; పుల్ అప్స్.. కనీసం 6 తీయగలగాలి; 9 అడుగుల కందకం (గొయ్యి)ని దూకగలగాలి; ఒక కడ్డీపై నిలబడి చేతులు చాచి బ్యాలెన్స్‌గా నడవాలి.
- **వైద్య పరీక్షలు:** శారీరక పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి నిర్దేశిత తేదీల్లో వైద్య పరీక్షలు నిర్వహిస్తారు.
- **రాత పరీక్ష:** వైద్య పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు విశాఖపట్నంలో రాతపరీక్ష నిర్వహిస్తారు.
- **గమనిక :** అభ్యర్థులు తమ విద్యార్హతల ధ్రువపత్రాలు, వాటి నకళ్లు, ఫొటోలు తదితర అవసరమైనవాటిని తీసుకుని ర్యాలీకి హాజరుకావాలి. వివాహితులు ర్యాలీకి అనర్హులు.
- **వేతనం :** ఎంపికైన అభ్యర్థులకు నెలకు సుమారు రూ.30 వేల వరకు వేతనం ఉంటుంది. దీంతోపాటు నిర్దేశిత ఇతర సదుపాయాలు (సెలవులు, వైద్యం..) లభిస్తాయి.
- **దరఖాస్తు విధానం:** వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** సెప్టెంబర్ 20, 2017

వెబ్‌సైట్: www.joinindianarmy.nic.in



ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

264 ఖాళీలు

లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్)లో 264 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన వెలువడింది.

- **పోస్టుల పేరు-ఖాళీలు:** అసిస్టెంట్-164; అసిస్టెంట్ మేనేజర్-100
- **రాష్ట్రాల వారీ అసిస్టెంట్ ఖాళీలు :** ఛత్తీస్‌గఢ్-4, మధ్యప్రదేశ్-10, బిహార్- 9, జార్ఖండ్-1, ఒడిశా -9, అసోం-2, సిక్కిం-1, త్రిపుర-1, పశ్చిమ బెంగాల్-10, ఉత్తరప్రదేశ్ (ఎన్‌సీఆర్ మినహా)-20, ఉత్తరాఖండ్-1, ఢిల్లీ (ఎన్‌సీఆర్‌తో కలిపి)-5, హరియాణా (ఎన్‌సీఆర్ మినహా)-1, పంజాబ్- 3, రాజస్థాన్-9, చండీగఢ్-3, కర్ణాటక-10, ఆంధ్రప్రదేశ్-11, తెలంగాణ -5, పుదుచ్చేరి-1, తమిళనాడు-22, గోవా-1, గుజరాత్-10, మహారాష్ట్ర -15
- **గమనిక:** ఏ రాష్ట్రంలోని అసిస్టెంట్ పోస్టుకైనా అభ్యర్థి దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే సంబంధిత రాష్ట్రానికి చెందిన అభ్యర్థికే భర్తీలో ప్రాధాన్యం ఇస్తారు. పరీక్ష కేంద్రం కూడా అదే రాష్ట్రంలో ఉంటుంది. ఎంపికైన అభ్యర్థి అదే రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా ఎక్కడైనా పనిచేయడానికి సిద్ధంగా ఉండాలి.
- **వేతనం:** అసిస్టెంట్‌కు రూ.21,236; అసిస్టెంట్ మేనేజర్‌కు రూ.49,805. దీంతోపాటు ఇతర అలవెన్సులు.
- **అర్హతలు:** అసిస్టెంట్ పోస్టులకు 60 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ; అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు 60 శాతం మార్కులతో ఎంబీఏ. అభ్యర్థులకు కంప్యూటర్ అంశాలపై పనిచేయగల నైపుణ్యం కచ్చితంగా ఉండాలి.
- **వయో పరిమితి:** 2017 జూలై 1 నాటికి 21-28 ఏళ్ల లోపు ఉండాలి.
- **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ.
- **పరీక్ష విధానం:** ఆబ్జెక్టివ్ విధానంలో ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. మల్టిపుల్ చాయిస్‌లో ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్నపత్రం ఇంగ్లిష్ లాంగ్వేజ్, లాజికల్ రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్, న్యూమరికల్ ఎబిలిటీ అనే నాలుగు సెక్షన్లుగా ఉంటుంది. ఒక్కో సెక్షన్ నుంచి 50 ప్రశ్నల చొప్పున మొత్తం 200 ప్రశ్నలు, ప్రశ్నకు ఒక మార్కు ఉంటాయి. పరీక్ష వ్యవధి రెండు గంటలు. ఇందులో జనరల్ అవేర్‌నెస్ సెక్షన్‌కు 15 నిమిషాలు, మిగిలిన సెక్షన్లలో ఒక్కోదానికి 35 నిమిషాలు. ఒక్కో తప్పు సమాధానానికి 0.25 మార్కు చొప్పున కోత విధిస్తారు. అసిస్టెంట్, అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు ఇవే సెక్షన్లతోనే ప్రశ్న పత్రం వేర్వేరుగా ఉంటుంది. నిర్దేశిత కటాఫ్ మార్కులు సాధించిన అభ్యర్థులకు ఇంటర్వ్యూ ఉంటుంది. ఆన్‌లైన్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూల్లో సాధించిన మార్కుల మెరిట్ ఆధారంగా అభ్యర్థులకు మెడికల్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు. ఇందులోనూ ఉత్తీర్ణులైతే నియామకం చేపడతారు.
- **ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాలు (తెలుగు రాష్ట్రాల్లో):** హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం.
- **దరఖాస్తు ఫీజు:** రూ.500 + జీఎస్‌టీ 18శాతం.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** సెప్టెంబర్ 7, 2017.
- **వెబ్‌సైట్:** www.lichousing.com

యూపీఎస్సీ..

41 ఖాళీలు

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ)... వివిధ ప్రభుత్వ విభాగాల్లోని 41 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన వెలువరించింది.

- **పోస్టుల పేరు-ఖాళీలు:** స్పెషలిస్ట్ గ్రేడ్ (3) (మైక్రో బయాలజీ)-27, ఎకనమిక్ ఆఫీసర్-11; సూపరింటెండింగ్ ఎపిగ్రాఫిస్ట్ (ద్రవిడియన్ ఇన్‌స్క్రిప్షన్)-1; జూనియర్ ఇంటర్‌ప్రెటర్(చైనీస్-1+ జపనీస్-1)-2.
- **వేతనం:** ఎకనమిక్ ఆఫీసర్ పోస్టులకు రూ.44,900-రూ.1,42,400; స్పెషలిస్ట్ గ్రేడ్ (3), జూనియర్ ఇంటర్‌ప్రెటర్ పోస్టులకు రూ.15,600- రూ.39,100. సూపరింటెండింగ్ ఎపిగ్రాఫిస్ట్ (ద్రవిడియన్ ఇన్‌స్క్రిప్షన్) పోస్టులకు ఏడో సీపీసీ లెవెల్ 11 ప్రకారం వేతనం ఉంటుంది.
- **అర్హతలు :** సంబంధిత పోస్టులను అనుసరించి డిగ్రీ/డిప్లొమా/ పీజీ/ ఎంబీబీఎస్/మాస్టర్స్ డిగ్రీ. దీంతోపాటు నిబంధనల మేర ఉద్యోగానుభవం.
- **వయోపరిమితి:** ఎకనమిక్ ఆఫీసర్ పోస్టులకు 30 ఏళ్లు; స్పెషలిస్ట్ గ్రేడ్ (3) (మైక్రో బయాలజీ) పోస్టులకు 40 ఏళ్లు; జూనియర్ ఇంటర్‌ప్రెటర్ పోస్టులకు 35 (చైనీస్ విభాగానికి 40) ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్ నిబంధనలు వర్తిస్తాయి.
- **ఎంపిక విధానం:** రిక్రూట్‌మెంట్ టెస్ట్, ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు ఫీజు:** రూ.25; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/మహిళ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** సెప్టెంబర్ 14, 2017
- **వెబ్‌సైట్:** www.upsconline.nic.in

ఫెడరల్ బ్యాంక్

ఆఫీసర్, క్లర్క్ పోస్టులు

ఫెడరల్ బ్యాంక్‌లో ఆఫీసర్ (స్కేల్-1), క్లర్క్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన వెలువడింది.

- **పోస్టుల పేరు :** ఆఫీసర్, క్లర్క్.
- **వేతనం:** ఆఫీసర్-రూ.23,700 -రూ.42,020; క్లర్క్-రూ.11,765-రూ.31,540.
- **అర్హతలు:** 60 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ. ఆఫీసర్ పోస్టులకు డిగ్రీతో పాటు పదో తరగతి/ తత్సమాన విద్య, ఇంటర్మీడియెట్/తత్సమాన విద్యలోనూ 60 శాతానికి పైగా మార్కులు వచ్చి ఉండాలి.
- **గమనిక :** క్లర్క్ పోస్టులకు అసోం, కర్ణాటక, మహారాష్ట్ర, న్యూఢిల్లీ/ ఎన్‌సీఆర్, తెలంగాణ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.
- **వయో పరిమితి:** 2017 జూలై 1 నాటికి ఆఫీసర్‌కు 26 ఏళ్లు, క్లర్క్‌కు 24 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ.
- **పరీక్ష కేంద్రాలు (తెలుగు రాష్ట్రాల్లో):** ఆఫీసర్ పోస్టులకు.. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం; క్లర్క్ పోస్టులకు.. హైదరాబాద్.
- **దరఖాస్తు ఫీజు :** ఆఫీసర్ పోస్టులకు.. ఎస్సీ/ఎస్టీ-రూ.350, జనరల్/ ఇతరులు-రూ.700; క్లర్క్ పోస్టులకు.. ఎస్సీ/ఎస్టీ-రూ.250; జనరల్/ ఇతరులు-రూ.500. దరఖాస్తు ఫీజుకు జీఎస్‌టీ అదనం.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** సెప్టెంబర్ 4, 2017
- **వెబ్‌సైట్:** www.federalbank.co.in

రైల్ కోచ్ ఫ్యాక్టరీ (కపుర్తలా)

101 ఖాళీలు



పంజాబ్‌లోని కపుర్తలాలో ఉన్న రైల్ కోచ్ ఫ్యాక్టరీ.. 101 యాక్ట్ అప్రెంటీస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు పేరు :** యాక్ట్ అప్రెంటీస్
- **మొత్తం పోస్టులు:** 101 (అన్‌రిజర్వుడ్-53+ఓబీసీ-27 ఎస్సీ-15+ఎస్టీ-6).
- **ట్రేడ్ విభాగాలవారీ ఖాళీలు :** ఫిట్టర్-25; వెల్డర్(జీ అండ్‌ఈ)-27; మెషినిస్ట్-8; పెయింటర్-7; కార్పెంటర్-7; మెకానిక్ (మోటార్ వెహికల్)-4; ఎలక్ట్రీషియన్-14; ఎలక్ట్రానిక్ మెకానిక్-2; ఏసీ అండ్ రిఫ్రిజిరేటర్ మెకానిక్-7
- **అర్హతలు:** కనీసం 50 శాతం మార్కులు/తత్సమాన సీజీపీఏతో పదోతరగతి లేదా తత్సమాన విద్యతో పాటు సంబంధిత ట్రేడ్ విభాగంలో ఐటీఐ.
- **వయో పరిమితి:** 2017 సెప్టెంబర్ 21 నాటికి 16-24 ఏళ్లలోపు ఉండాలి. రిజర్వేషన్ నిబంధనలు వర్తిస్తాయి.
- **ఎంపిక విధానం :** విద్యార్హతల మార్కులు (పదో తరగతి+ఐటీఐ) ఆధారంగా.
- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేదీ :** సెప్టెంబర్ 21, 2017
- **వెబ్‌సైట్:** www.rcf.indianrailways.gov.in

ఐఐటీ గోవా

21 ఖాళీలు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) గోవా.. వివిధ విభాగాల్లోని 21 బోధనేతర ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టుల పేరు-ఖాళీలు:** అసిస్టెంట్ రిజిస్ట్రార్-3; లైబ్రరీ ఆఫీసర్-1; మెడికల్ ఆఫీసర్-1; జూనియర్ సూపరింటెండెంట్-5; సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్-1; జూనియర్ ఇంజనీర్-2; జూనియర్ స్టాఫ్ నర్స్-1; జూనియర్ అసిస్టెంట్-5; జూనియర్ ల్యాబ్ అసిస్టెంట్-2.
- **వేతనం:** అసిస్టెంట్ రిజిస్ట్రార్, లైబ్రరీ ఆఫీసర్, మెడికల్ ఆఫీసర్‌కు రూ.15,600-రూ.39,100; జూనియర్ సూపరింటెండెంట్, సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్, జూనియర్ ఇంజనీర్, జూనియర్ స్టాఫ్ నర్స్‌కు-రూ.9,300-రూ.34,800; మిగిలిన పోస్టులకు రూ.5,200-రూ.20,200.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులను అనుసరించి మాస్టర్స్ డిగ్రీ /ఎంబీబీఎస్/ డిగ్రీ/బీఈ/బీటెక్/ఎంఎస్సీ/డిప్లొమా/ఇంటర్మీడియెట్/బీఎస్సీ(నర్సింగ్)/ఐటీఐ. దీంతోపాటు నిబంధనల మేర ఉద్యోగానుభవం, మార్కుల శాతం ఉండాలి.
- **వయోపరిమితి:** అసిస్టెంట్ రిజిస్ట్రార్, లైబ్రరీ ఆఫీసర్, మెడికల్ ఆఫీసర్ పోస్టులకు 40 ఏళ్లు; జూనియర్ సూపరింటెండెంట్, సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్, జూనియర్ ఇంజనీర్, జూనియర్ స్టాఫ్ నర్స్ పోస్టులకు 32 ఏళ్లు; మిగిలిన పోస్టులకు 27 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్ నిబంధనలు వర్తిస్తాయి.
- **ఎంపిక విధానం :** స్కిల్ టెస్ట్/రాతపరీక్ష/ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు ఫీజు:** రూ.50
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు కాపీలను పంపాల్సిన చిరునామా:** ది ఓఎస్‌డీ అండ్ రిజిస్ట్రార్ ఇన్‌చార్జ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ గోవా, గోవా ఇంజనీరింగ్ కాలేజ్ క్యాంపస్, ఫర్మగుడి, పాండ, గోవా-403401
- **దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ:** సెప్టెంబర్ 15, 2017
- **వెబ్‌సైట్:** www.iitgoa.ac.in

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ సదరన్ రీజియన్

66 ఖాళీలు

చెన్నైలోని స్టాఫ్ సెలక్షన్ కమిషన్ సదరన్ రీజియన్ (ఎస్ఎస్‌సీఎస్ఆర్).. వివిధ ప్రభుత్వ విభాగాల్లోని 66 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన వెలువరించింది.

- **పోస్టుల పేరు-ఖాళీలు:** టెక్నికల్ సూపరింటెండెంట్-3(అన్‌రిజర్వుడ్); వర్క్‌షాప్ సూపరింటెండెంట్-1 (అన్‌రిజర్వుడ్); సీనియర్ ఇన్‌స్ట్రక్టర్(వీవింగ్)-1(అన్‌రిజర్వుడ్); మెడికల్ అటెండెంట్-34(అన్‌రిజర్వుడ్-17, ఓబీసీ-11, ఎస్సీ-5, ఎస్టీ-1); లేడీ మెడికల్ అటెండెంట్-15(అన్‌రిజర్వుడ్-8, ఓబీసీ-4, ఎస్సీ-2, ఎస్టీ-1); కన్జర్వేషన్ అసిస్టెంట్-2(అన్‌రిజర్వుడ్-1, ఓబీసీ-1); జూనియర్ కన్జర్వేషన్ అసిస్టెంట్-9(అన్‌రిజర్వుడ్-5, ఓబీసీ-2, ఎస్సీ-2); ఎవాల్యుయేషన్ అసిస్టెంట్-1(అన్ రిజర్వుడ్).
- **వేతనం:** టెక్నికల్ సూపరింటెండెంట్ రూ.9,300-రూ.34,800; వర్క్‌షాప్ సూపరింటెండెంట్-రూ.44,900; సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ (వీవింగ్)- రూ.35,400; మెడికల్ అటెండెంట్, లేడీ మెడికల్ అటెండెంట్- రూ.5,200-రూ.20,200; కన్జర్వేషన్ అసిస్టెంట్-రూ.25,500- రూ.81,100; జూనియర్ కన్జర్వేషన్ అసిస్టెంట్-రూ.19,900-రూ.63,200; ఎవాల్యుయేషన్ అసిస్టెంట్‌కు రూ.29,900-రూ.92,300.
- **అర్హతలు:** పోస్టులను అనుసరించి పదోతరగతి/పదోతరగతి+(ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్/ఐటీఐ సర్టిఫికెట్)/డిప్లొమా(హ్యాండ్లూమ్ టెక్నాలజీ/టెక్స్‌టైల్ టెక్నాలజీ/సివిల్ ఇంజనీరింగ్)/డిగ్రీ(మెకానికల్ ఇంజనీరింగ్/టెక్స్‌టైల్ టెక్నాలజీ/టెక్స్‌టైల్ ఇంజనీరింగ్/స్టాటిస్టిక్స్/ మ్యాథమెటిక్స్/ఎకనామిక్స్/సోషియాలజీ/సోషల్ వర్క్)/. దీంతోపాటు నిబంధనల మేర ఉద్యోగానుభవం, కంప్యూటర్ అంశాల్లో పరిజ్ఞానం ఉండాలి.
- **వయోపరిమితి :** 2017 సెప్టెంబర్ 24 నాటికి టెక్నికల్ సూపరింటెండెంట్, వర్క్‌షాప్ సూపరింటెండెంట్, సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ (వీవింగ్) పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు; మెడికల్ అటెండెంట్, లేడీ మెడికల్ అటెండెంట్, కన్జర్వేషన్ అసిస్టెంట్, జూనియర్ కన్జర్వేటివ్ అసిస్టెంట్ పోస్టులకు 18-25 ఏళ్ల లోపు, ఎవాల్యుయేషన్ అసిస్టెంట్ పోస్టులకు 18-27 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్ నిబంధనలు వర్తిస్తాయి.
- **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ.
- **పరీక్ష విధానం:** ఆబ్జెక్టివ్/మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్నపత్రంలో నాలుగు విభాగాలు.. జనరల్ ఇంటెలిజెన్స్, ఇంగ్లిష్ లాంగ్వేజ్ (బేసిక్ నాలెడ్జ్), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ (బేసిక్ అరిథమేటిక్ స్కిల్), జనరల్ అవేర్‌నెస్ ఉంటాయి. ఒక్కో విభాగం నుంచి 50 మార్కులకు 25 ప్రశ్నల చొప్పున 200 మార్కులకు 100 ప్రశ్నలు ఉంటాయి. పోస్టుని బట్టి పదో తరగతి/ఇంటర్మీడియెట్/డిగ్రీ స్థాయిల్లో ప్రశ్నలు ఉంటాయి.
- **ఎగ్జామినేషన్ ఫీజు:** రూ.100; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/మహిళ/మాజీ సైనికోద్యోగ కేటగిరీల అభ్యర్థులకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దానిని ప్రింటవుట్ తీసుకుని సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి ఓ కవరులో ఉంచి 'ది రీజనల్ డైరెక్టర్ (ఎస్ఆర్), స్టాఫ్ సెలక్షన్ కమిషన్, సదరన్ రీజియన్, సెకండ్ ఫ్లోర్, ఈవీకే సంపత్ బిల్డింగ్, డీపీఐ క్యాంపస్, కాలేజ్ రోడ్, చెన్నై-600006' చిరునామాకు గడువులోగా చేరేలా పంపాలి. **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** సెప్టెంబర్ 24, 2017
- **దరఖాస్తు హార్డ్‌కాపీలు చేరడానికి చివరి తేదీ:** అక్టోబర్ 4, 2017
- **వెబ్‌సైట్:** www.ssconline.nic.in

నార్త్ వెస్ట్రన్ రైల్వే

21 ఖాళీలు

నార్త్ వెస్ట్రన్ రైల్వే.. స్పోర్ట్స్ కోటా కింద 21 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టుల పేరు-ఖాళీలు :** ఆర్చరీ (50 మీటర్లు) -3(పురుషులు-2 + మహిళలు-1); అథ్లెటిక్స్-2(పురుషులు-1(400మీ) + మహిళలు- 1 (1500 మీ)); బ్యాడ్మింటన్ (సింగిల్స్)-2(పురుషులు); బాక్సింగ్(91 కేజీలు)-1(పురుషులు); క్రాస్ కంట్రీ-2(పురుషులు-1(12 కి.మీ)+మహిళలు-1(8 కి.మీ)); సైక్లింగ్(1000 మీ టైమ్ ట్రైల్ (వ్యక్తిగత))-1 (పురుషులు); కబడ్డీ(పురుషుల)-4(ఆల్‌రౌండర్-3+ ఆర్‌టీ క్యాచర్-1); పవర్ లిఫ్టింగ్ (72 కేజీలు)-2(పురుషులు-1+ మహిళలు-1); షూటింగ్ (పురుషులు)-2 (10 మీ ఎయిర్ పిస్టల్-1+ 50 మీ ఎయిర్ పిస్టల్ 0.22 ప్రోన్-1); టేబుల్ టెన్నిస్ (సింగిల్స్)-2 (పురుషులు).
- **వేతనం:** పోస్టును బట్టి పే లెవెల్ 4/5 లేదా 2/3 ప్రకారం వేతనం ఉంటుంది. మొత్తం పోస్టుల్లో పే లెవెల్ 4/5 కింద 5, పే లెవెల్ 2/3 కింద 16 పోస్టులున్నాయి.
- **అర్హతలు:** పే లెవెల్ 4/5 పోస్టులకు డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హతతో పాటు సంబంధిత క్రీడా విభాగంలో దేశం తరపున ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం వహించి ఉండాలి. లేదా మిగిలిన అంతర్జాతీయ పోటీల్లో (సీనియర్/జూనియర్ విభాగాల్లో) కనీసం మూడోస్థానం పొంది ఉండాలి.పే లెవెల్ 2/3 పోస్టులకు ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన విద్యార్హతతో పాటు దేశం తరపున సంబంధిత క్రీడా విభాగంలో అంతర్జాతీయ పోటీల్లో (ఒలింపిక్ మినహా) ప్రాతినిధ్యం వహించి ఉండాలి. లేదా జాతీయ/ రాష్ట్ర/ ఇంటర్ యూనివర్సిటీ స్థాయి పోటీల్లో కనీసం మూడో స్థానం/ఫెడరేషన్ కప్ ఛాంపియన్‌షిప్స్ (సీనియర్ కేటగిరీ)లో ప్రథమ స్థానం పొంది ఉండాలి. నిబంధనల మేర దేశవాళీ ర్యాంకులను సైతం పరిగణిస్తారు.
- **వయోపరిమితి:** 2018 జనవరి 1 నాటికి 18-25 ఏళ్ల లోపు ఉండాలి.
- **ఎంపిక విధానం :** ధ్రువపత్రాల పరిశీలన, ఇంటర్వ్యూ.
- **ఎగ్జామినేషన్ ఫీజు:** రూ.500; ఎస్సీ/ఎస్టీ/ మహిళ/మైనార్టీస్/ఆర్థికంగా వెనకబడిన తరగతులవారికి రూ.250.
- **దరఖాస్తు విధానం:** నిర్దేశిత విధానంలో దరఖాస్తు పత్రంలో వివరాలు నింపి, సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు తదితర అవసరమైనవాటిని జత చేసి కవరులో ఉంచి 'అసిస్టెంట్ పర్సనల్ ఆఫీసర్ (రిక్రూట్‌మెంట్), రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్, నార్త్ వెస్ట్రన్ రైల్వే, పవర్ హౌస్ రోడ్, డీఆర్ఎం ఆఫీస్ ఎదురుగా, జైపూర్-302006' చిరునామాకు గడువులోగా చేరేలా ఆర్డినరీ పోస్టు ద్వారా పంపాలి.
- **దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ:** సెప్టెంబర్ 18, 2017
- **వెబ్‌సైట్:** www.nwr.indianrailways.gov.in , www.rrcjaipur.in

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
362 ▼	117 ▼
31,388	9,796

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండూ రాత్రి 11:30కి)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	6,295	▲ 12
డోజోన్స్	21,839	▲ 31
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,337	▽ 64
డాక్స్	11,946	▽ 178
షాంఘై	3,366	▲ 3
నికాయ్	19,363	▽ 87

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	63.11	64.78
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	81.25	84.21
€	యూరో	ఎస్‌బీఐ	75.26	77.90
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.75	59.79
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	49.70	51.66
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	46.40	47.99
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.41	18.34
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.80	18.51
¥	చైనా యువాన్	థామస్‌కుక్	6.84	11.10

మార్కెట్‌కు కొరియా షాక్



- సెన్సెక్స్ 362, నిఫ్టీ 117 పాయింట్లు డౌన్
- వారంరోజుల కనిష్టానికి సూచీలు
- కొరియా క్షిపణి ప్రయోగంతో ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యం

ముంబై: జపాన్ భూభాగంపైనుంచి ఉత్తర కొరియా క్షిపణిని ప్రయోగించడంతో తలెత్తిన ఉద్రిక్తతల నేపథ్యంలో మంగళవారం స్టాక్ మార్కెట్ కుప్పకూలింది. ప్రపంచ ట్రెండ్‌ను అనుసరిస్తూ భారత్ సూచీలు వారంరోజుల కనిష్ట స్థాయిలో ముగిశాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 362 పాయింట్లు (1.14 శాతం) పతనమై 31,388 పాయింట్ల వద్ద క్లోజ్ అయ్యింది. పాయింట్ల రీత్యా జూలై 18 తర్వాత ఇదే పెద్ద క్షీణతకాగా, శాతం ప్రకారం ఈ ఏడాదిలో ఇది అతిపెద్ద పతనం. ఇన్వెస్టర్లు ఎడాపెడా అమ్మకాలు జరపడంతో ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 117 పాయింట్లు (1.18 శాతం) క్షీణించి 9,796 పాయింట్ల వద్ద ముగిసింది. గత తొమ్మిదినెలల్లో నిఫ్టీ ఇంతగా పతనంకావడం ఇదే ప్రథమం. ఉత్తర కొరియా తాజా క్షిపణి ప్రయోగం కారణంగా యుద్ధమేఘాలు కమ్ముకున్నాయన్న భయాలతో ఇన్వెస్టర్లు అమ్మకాలకు పాల్పడ్డట్లు మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి.

రూ. 1.38 లక్షల కోట్ల సంపద నష్టం

తాజా మార్కెట్ పతనంతో రూ.1.38 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద తుడిచిపెట్టుకుపోయింది. బీఎస్‌ఈలో లిస్టయిన కంపెనీల మార్కెట్ విలువ రూ. 1,38,727 కోట్ల నుంచి రూ. 1,29,778 కోట్లకు తగ్గింది.

ప్రపంచ మార్కెట్ల ఎఫెక్ట్....

ఆసియా మార్కెట్లు బలహీనంగా ట్రేడ్‌కావడంతో మన మార్కెట్ గ్యాప్‌డౌన్‌తో మొదలయ్యిందని, మధ్యాహ్న సెషన్ సమయంలో యూరప్ సూచీలు తీవ్ర నష్టాలకు గురికావడంతో ఇక్కడ అమ్మకాలు మరింత వెల్లువెత్తాయని, ఫలితంగా భారీ నష్టాలతో సెన్సెక్స్, నిఫ్టీలు ముగిసినట్లు ఆ వర్గాలు వివరించాయి. జపాన్, హాంకాంగ్, సింగపూర్ తదితర ప్రధాన ఆసియా సూచీలు 0.5 శాతంపైగా నష్టాలతో ముగియగా, యూరప్‌లోని బ్రిటన్ ఎఫ్‌టీఎస్‌ఈ, ఫ్రాన్స్ కాక్, జర్మనీ డాక్స్ సూచీలు 1–1.5 శాతం మధ్య పతనమయ్యాయి. కడపటి సమాచారం అందేసరికి అమెరికా డోజోన్స్ ఇండెక్స్ 100 పాయింట్లకుపైగా నష్టంతో ట్రేడవుతోంది.

ఆగస్టు డెరివేటివ్స్ ముగింపు ప్రభావం..

తాజా యుద్ధ భయాలకు తోడు మరో రెండురోజుల్లో ఆగస్టు డెరివేటివ్ కాంట్రాక్టులు ముగియనున్నందున, లాంగ్ పొజిషన్లను భారీగా ఆఫ్‌లోడ్ చేయడంతో మార్కెట్ కోలుకునే అవకాశం లేకుండా పోయిందని విశ్లేషకులు పేర్కొన్నారు. మరోవైపు నెలరోజులుగా విదేశీ ఇన్వెస్టర్లు అదేపనిగా విక్రయాలు జరుపుతుండటంతో మార్కెట్ సెంటిమెంట్ బలహీనపడిందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. ఆర్థిక రాజధాని అయిన ముంబైలో భారీవరదలు రావడంతో ట్రేడింగ్ కార్యకలాపాలు కుంటుబడ్డాయని ఆయన వివరించారు.

రిలయన్స్ డౌన్...

సూచీల పతనానికి హెవీవెయిట్ షేర్లు రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీలు 2 శాతంపైగా పతనంకావడం ప్రధాన కారణం. రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.2 శాతం పతనమై 6 వారాల కనిష్టస్థాయి రూ. 1,532 వద్ద ముగిసింది. హెచ్‌డీఎఫ్‌సీ కూడా ఇంతేశాతం తగ్గి రూ. 1,726 వద్ద క్లోజ్ అయ్యింది. రూ. 168 ధరతో ఎన్‌టీపీసీలో 5 శాతం వాటాను కేంద్రం విక్రయిస్తుండటంతో ఆ షేరు 2.8 శాతం క్షీణించి రూ. 168.50 వద్ద క్లోజయ్యింది. నిఫ్టీ–50 నుంచి తొలగిస్తున్నందున, బ్యాంక్ ఆఫ్ బరోడా, టాటా పవర్‌లు 2–3 శాతం మధ్య తగ్గాయి. సన్‌ఫార్మా, ఏసీసీ, కోల్ ఇండియా, భారతీ ఎయిర్‌టెల్‌లు కూడా 1–2 శాతం మధ్య నష్టపోయాయి. నిఫ్టీ–50 ఇండెక్స్‌లో కొత్తగా ప్రవేశిస్తున్న హెచ్‌పీసీఎల్, యూపీఎల్‌లు స్వల్పంగా పెరిగాయి.

ఐకియాలో 800 కొలువులు

హైదరాబాద్ స్టోర్ కోసం హైరింగ్ ● వచ్చే వేసవికల్లా తొలి స్టోర్ ప్రారంభం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: స్వీడన్‌కి చెందిన ఫర్నిచర్ విక్రయ దిగ్గజం ఐకియా భారత్‌లో.. తొలిసారి హైదరాబాద్‌లో ప్రారంభించనున్న స్టోర్ కోసం నియామకాల ప్రక్రియ మొదలుపెట్టింది. మొత్తం 800 మంది సిబ్బందిని (పార్ట్‌టైమ్ కూడా కలిపి) రిక్రూట్ చేసుకుంటున్నట్లు ఐకియా తెలంగాణ ఎండీ జాన్ అహీలియా వెల్లడించారు. డిసెంబర్ నాటికి సుమారు 300–400 మంది ఉద్యోగులను నియమించుకోనున్నట్లు పేర్కొన్నారు. స్టోర్స్‌తో పాటు సుమారు వెయ్యికి పైగా సీట్లుండే రెస్టారెంట్ మొదలైన విభాగాల్లో వీరి నియామకం ఉంటుందని జాన్ మంగళవారం ఇక్కడ విలేకరులకు చెప్పారు. సుమారు నాలుగు లక్షల చ.అ. విస్తీర్ణంలో నిర్మిస్తున్న హైదరాబాద్ స్టోర్ వచ్చే వేసవి నాటికల్లా అందుబాటులోకి రాగలదని ఆయన వివరించారు. ఈ స్టోర్‌లో పదివేల పైగా ఉత్పత్తులు ఉంటాయని.. వీటిలో సుమారు 800 ఉత్పత్తులు ప్రత్యేకంగా భారతీయుల అవసరాలకు అనుగుణంగా రూపొందించినవి ఉంటాయని జాన్ చెప్పారు. అసెంబ్లింగ్ సేవలు కూడా అందించడంతో పాటు కొంతమేర ఆన్‌లైన్‌లో విక్రయాల యోచన కూడా ఉన్నట్లు తెలిపారు.

2025 నాటికి దేశవ్యాప్తంగా 25 స్టోర్స్

హైదరాబాద్ స్టోర్‌పై సుమారు రూ. 1,000 కోట్లు ఇన్వెస్ట్ చేస్తున్నామని.. ఆ తర్వాత ప్రారంభించబోయే ముంబై, బెంగళూరు స్టోర్స్‌పై కూడా పెట్టుబడి వ్యయాలు ఇదే స్థాయిలో ఉండగలవని ఐకియా ఇండియా డిప్యూటీ కంట్రీ మేనేజర్ ప్యాట్రిక్ ఆంటోనీ వెల్లడించారు. దేశవ్యాప్తంగా 2025 నాటికల్లా పెద్ద, చిన్న స్థాయి అన్నీ కలిపి 25 స్టోర్స్ దాకా ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఢిల్లీ, చెన్నై, పుణే తదితర ప్రాంతాల్లో కూడా స్టోర్స్ ప్రతిపాదన ఉందన్నారు. దాదాపు ముప్పై ఏళ్లుగా భారత్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న తాము భారీ మ్యాట్రెస్‌లను ఇక్కడ నుంచి ఎగుమతి చేస్తున్నామని.. తమకు ప్రస్తుతం దేశవ్యాప్తంగా 53, తెలంగాణలో రెండు సంస్థలు సరఫరా చేస్తున్నట్లు ప్యాట్రిక్ చెప్పారు. 2022 నాటికి దేశీయంగా సోర్సింగ్‌ను 30 శాతానికి పెంచుకోనున్నట్లు వివరించారు. ఫర్నిచర్‌పై పన్నులు దాదాపు 28 శాతంగానే ఉంటోన్న నేపథ్యంలో జీఎస్‌టీ అమల్లోకి వచ్చినప్పటికీ పెద్దగా ప్రతికూల ప్రభావమేమీ ఉండబోదని చెప్పారు.

ఏటా 10 వాటర్ ప్యూరిఫయర్లు

- ప్రతి మోడల్ దేనికదే ప్రత్యేకం
- బ్లూ స్టార్ ప్రెసిడెంట్ ముకుందన్



వాటర్ ప్యూరిఫయర్ల నూతన శ్రేణితో ముకుందన్, గిరీష్ (ఎడమ)

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాటర్ ప్యూరిఫయర్ల విపణిలోకి ఇటీవలే ప్రవేశించిన బ్లూ స్టార్ అత్యాధునిక ఫీచర్లతో పోటీ పడుతోంది. హాట్, కోల్డ్ వాటర్‌ను సైతం అందించే ఆర్‌వో, యూవీ ప్యూరిఫయర్‌ను భారత్‌లో తొలిసారిగా ఆవిష్కరించింది. కంపెనీ ప్రవేశపెట్టిన 21 మోడళ్లలో దేనికదే ప్రత్యేకమని బ్లూ స్టార్ ప్రొడక్ట్స్ బిజినెస్ సేల్స్ ప్రెసిడెంట్ సి.పి.ముకుందన్ మీనన్ మంగళవారమిక్కడ మీడియాకు తెలిపారు. వీటి తయారీలో దీర్ఘకాలం మన్నే విడిభాగాలను వాడామని చెప్పారు. తద్వారా నిర్వహణ ఖర్చులు తగ్గుతాయని వివరించారు. ఉత్పత్తుల అభివృద్ధిలో 100 మందికిపైగా నిపుణులు నిమగ్నమయ్యారని పేర్కొన్నారు. మోడళ్ల ధర రూ.7,900 నుంచి రూ.44,900 వరకు ఉంది.

ఏప్రిల్‌కల్లా 30 మోడళ్లు..

వచ్చే ఏప్రిల్ నాటికి మరో 9 మోడళ్లను కంపెనీ విడుదల చేయనుంది. ఏటా 8–10 కొత్త మోడళ్లు ప్రవేశపెడతామని బ్లూ స్టార్ వాటర్ ప్యూరిఫయర్స్ విభాగం చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ గిరీష్ హింగోరాణి వెల్లడించారు. ఒక్కో ఉత్పాదన అభివృద్ధికి 9 నెలల దాకా సమయం పడుతోందని చెప్పారు. 70 ఏళ్లుగా వాటర్ కూలర్ల వ్యాపారంలో ఉన్న బ్లూ స్టార్‌కు బ్రాండ్ ఇమేజ్ ఉపయోగపడుతోందని అన్నారు. దేశవ్యాప్తంగా 100 సర్వీస్ సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. వీటిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో 15 ఉన్నాయి.

మూడేళ్లలో తయారీ..

కంపెనీ ప్రస్తుతం రెండు మోడళ్లను కొరియా నుంచి దిగుమతి చేసుకుంటోంది. మిగిలిన మోడళ్లను భారత్‌లో తయారు చేస్తోంది. థర్డ్ పార్టీకి చెందిన ప్లాంట్లలో ఇవి రూపుదిద్దుకుంటున్నాయి. బ్లూ స్టార్ స్వయంగా తయారీని పర్యవేక్షిస్తోందని ముకుందన్ తెలిపారు. 'వాటర్ ప్యూరిఫయర్ల విక్రయం ద్వారా 2017–18లో రూ.60 కోట్ల టర్నోవర్ ఆశిస్తున్నాం. 2020–21 నాటికి టర్నోవర్ రూ.500 కోట్లు లక్ష్యంగా చేసుకున్నాం. ఆ సమయానికి సొంత తయారీ ప్లాంటు పెడతాం. మూడేళ్లలో 10 శాతం వాటాను చేజిక్కించుకుంటాం' అని వెల్లడించారు.

ఈసారి డర్టీ 40



మొండిబకాయిలపై ఆర్‌బీఐ రెండో అస్త్రం

- 40 కంపెనీల జాబితా సిద్ధం ● తెలుగు రాష్ట్రాల నుంచి నాలుగు కంపెనీలు
- ఐవీఆర్‌సీఎల్, ఈస్ట్‌కోస్ట్ ఎనర్జీ, నాగార్జునా ఆయిల్, సోమా
- తెలుగు ప్రమోటర్‌కు చెందిన ఆర్చిడ్ ఫార్మా కూడా...
- ఎన్‌సీఎల్‌టీకి సమర్పిస్తారనే వార్తలతో కుప్పకూలిన షేర్లు
- ఇప్పటికే డిఫాల్టర్లుగా ప్రచారంలో పలు బడా సంస్థలు

(సాక్షి, హైదరాబాద్ / అమరావతి)

రుణాలు తీసుకొని ఎగ్గొట్టిన కంపెనీలపై దివాలా చట్టం ప్రయోగించడానికి ఆర్‌బీఐ రంగం సిద్ధం చేసింది. ఇప్పటికే 12 పెద్ద కంపెనీలపై చర్యలు తీసుకోవడానికి అనుమతి ఇవ్వగా తాజాగా మరో 40 కంపెనీలతో రెండో జాబితాను తయారు చేసినట్లు తెలియవచ్చింది. భారీగా అప్పుల్లో కూరుకుపోయి వరుస నష్టాలను నమోదు చేస్తున్న కంపెనీలకు చెందిన ఆస్తులను విక్రయించడం ద్వారా వాటి రుణాలను వసూలు చేసుకోవడానికి బ్యాంకులకు ఆర్‌బీఐ అధికారమిచ్చింది. దీంతో బ్యాంకులు ఆర్‌బీఐ అనుమతి మేరకు ఆయా కంపెనీలపై జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)లో కేసులు దాఖలు చేస్తున్నాయి. తాజాగా రూపొందించిన జాబితాలో లిస్టెడ్, అన్‌లిస్టెడ్ కంపెనీలు కలిసి 40 వరకు ఉండవచ్చని సమాచారం. ఈ నలభైలో తెలుగు రాష్ట్రాలకు చెందిన నాలుగు కంపెనీలున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తున్న రెండు ఇన్‌ఫ్రా కంపెనీలు ఐవీఆర్‌సీఎల్, సోమా ఎంటర్‌ప్రైజెస్‌లతో పాటు నాగార్జునా ఆయిల్ రిఫైనరీ, శ్రీకాకుళంలో విద్యుత్ ప్లాంటు ఏర్పాటుకు ప్రయత్నించి చేతులెత్తేసిన ఈస్ట్‌కోస్ట్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్‌తో పాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రమోటర్ కె.రాఘవేంద్రరావు తమిళనాడు కేంద్రంగా నడిపిస్తున్న ఆర్కిడ్ కెమికల్స్ (ఇపుడు ఆర్కిడ్ ఫార్మాగా పేరు మార్చుకుంది) తదితర కంపెనీలున్నాయి. వీటి పేర్లన్నీ ఆర్‌బీఐ ద్వారా బ్యాంకులు ఎన్‌సీఎల్‌టీకి సిఫారస్సు చేసినట్లు మంగళవారం మార్కెట్లో వార్తలు షికారు చేయగా... ఆయా కంపెనీల షేర్లు భారీగా పతనమయ్యాయి.

అధిక ఖాతాలు ఎస్‌బీఐ వద్దే!!

గతంలో ఆర్‌బీఐ విడుదల చేసిన 12 డిఫాల్టింగ్ కంపెనీలను చూస్తే... దాదాపు అన్ని కంపెనీలకూ ఐసీఐసీఐ ఎంతో కొంత రుణాలు మంజూరు చేసి ఉంది. తాజాగా ఆర్‌బీఐ జాబితాగా చెబుతున్న 35– 40 కంపెనీలకుగాను దాదాపు 25–26 కంపెనీలకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రుణాలు మంజూరు చేసినట్లు తెలుస్తోంది. వీటిలో నాగార్జునా ఆయిల్ రిఫైనరీ సుమారు రూ.4,000 కోట్ల మేర రుణాలు బకాయి పడగా, ఐవీఆర్‌సీఎల్ రూ.3,579 కోట్లు, సోమా ఎంటర్‌ప్రైజెస్ రూ.1,895 కోట్ల మేర బకాయిలు పడ్డాయి. ఈ వార్తల నేపథ్యంలో మంగళవారం ఐవీఆర్‌సీఎల్ షేరు ధర 13 శాతం నష్టపోయి రూ.4.65 వద్ద ముగిసింది. నాగార్జునా ఆయిల్ రిఫైనరీ 5.45 శాతం నష్టపోయి రూ. 3.45 వద్ద ముగిసింది. ఇక సోమా ఎంటర్‌ప్రైజెస్ అన్‌లిస్టెడ్ కంపెనీ. సోమా ఎంటర్‌ప్రైజెస్‌కు మాగంటి రాజేంద్ర ప్రసాద్ చైర్మన్‌గా వ్యవహరిస్తుండగా, మాగంటి అంకినీడు మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఆర్చిడ్ ఫార్మా షేరు సైతం దాదాపు 9 శాతం నష్టపోయి రూ.18.95 వద్ద ముగిసింది.

ఉత్తమ్‌గాల్వా, రేణుకా షుగర్స్ కూడా!!

ఈ రెండవ జాబితాలో ఉన్నట్లుగా కొత్తగా ప్రచారంలోకి వచ్చిన కంపెనీల్లో ఉత్తమ్ గాల్వా, కాస్‌టెక్స్ టెక్నాలజీస్, జయస్వాల్ నెకో ఇండస్ట్రీస్, రుచి సోయా, వీసా స్టీల్, ఎస్‌ఈఎల్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ, ఏసియన్ కలర్స్, ఇస్పాత్ కోటెడ్, యూనిటీ ఇన్‌ఫ్రా తదితర కంపెనీలున్నాయి. ఇక డిఫాల్టర్ల జాబితాలో వీడియోకాన్ ఇండస్ట్రీస్, జిందాల్ స్టెయిన్‌లెస్, జయప్రకాష్ పవర్, అబాన్ ఆఫ్‌షోర్, శ్రీ రేణుక షుగర్స్ వంటి కంపెనీలున్నట్లు ఇప్పటికే వార్తలు వెలువడిన విషయం తెలిసిందే. అయితే ఈ మొత్తం కంపెనీల అప్పుల విలువ ఎంతుందో తెలియాల్సి ఉంది. ఈ వార్తల నేపథ్యంలో ఉత్తమ్ గాల్వా, జయస్వాల్ నెకో, రుచిసోయా, జేపీ అసోసియేట్స్, ఉత్తమ్ స్టీల్ కంపెనీల షేర్లు 9 శాతానికిపైగా నష్టపోయాయి. ఎస్‌ఈఎల్ మాన్యుఫాక్చరింగ్ 14 శాతానికిపైగా పడిపోయింది. గత జూన్‌లో ఆర్‌బీఐ విడుదల చేసిన 'డర్టీ డజన్' ఎగవేతదార్ల రుణాల విలువ రూ.1.75 లక్షల కోట్లు. ఇది మొత్తం నిరర్థక ఆస్తుల్లో 25 శాతానికి సమానం. ఈ కంపెనీలను ఎన్‌సీఎల్‌టీకి సిఫార్సు చేసిన తర్వాత రుణాలిచ్చిన బ్యాంకులు లిక్విడేషన్‌కు సంబంధించి కార్యాచరణ ప్రణాళికను 180 రోజుల్లో సమర్పించాల్సి ఉంటుంది. అవసరమైతే ఈ గడువును 270 రోజుల వరకు పొడిగించే అవకాశం కూడా ఉంది.

ప్రచారంలో ఉన్న కంపెనీల నిరర్థక ఆస్తులివీ...

కంపెనీ పేరు	రుణ మొత్తం
నాగార్జునా ఆయిల్ రిఫైనరీ	రూ.4,000 కోట్లు
ఐవీఆర్‌సీఎల్ ఇన్‌ఫ్రా	రూ. 3,579 కోట్లు
సోమా ఎంటర్‌ప్రైజెస్	రూ. 1,895 కోట్లు
జిందాల్ స్టెయిన్‌లెస్	రూ.3,367 కోట్లు
ఆర్కిడ్ కెమికల్స్	రూ.3,000 కోట్లు
జయప్రకాష్ పవర్ వెంచర్స్	రూ.21,098 కోట్లు
వీడియోకాన్ ఎంటర్‌ప్రైజెస్	రూ.47,554 కోట్లు
అబాన్ ఆఫ్‌షోర్	రూ.12,030 కోట్లు
ఉత్తమ్ గాల్వా	రూ.5,041 కోట్లు
పంజ్ లాయిడ్	రూ. 6,126 కోట్లు
శ్రీ రేణుక షుగర్స్	రూ.6,012 కోట్లు

గవర్నెన్స్ లోపించడంపైనే ఆందోళన

- నీలేకని రాకతో ఇన్ఫీకి 'అచ్చే దిన్'
- నారాయణ మూర్తి వ్యాఖ్య



న్యూఢిల్లీ: ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్‌లో ఇటీవల చోటు చేసుకున్న పరిణామాలపై సంస్థ సహ వ్యవస్థాపకుడు ఎన్ ఆర్ నారాయణ మూర్తి స్పందించారు. కార్పొరేట్ గవర్నెన్స్‌కి సంబంధించి గత బోర్డు సరైన విధానాలు పాటించకపోవడంపైనే తాను ఆందోళన వ్యక్తం చేశానని ఆయన చెప్పారు. ఈ వ్యవహారంలో వ్యక్తిగత ప్రయోజనాలేమీ ఇమిడి లేవని స్పష్టం చేశారు. చైర్మన్‌గా ఆర్ శేషసాయి, మరికొందరు బోర్డు సభ్యుల రాజీనామాతో సంస్థకు నూతనోత్తేజం కలిగించే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయని, ఇవి కొనసాగుతాయన్నారు. చైర్మన్‌గా నందన్ నీలేకని రాకతో మళ్లీ గవర్నెన్స్ ప్రమాణాలు తిరిగి రాగలవన్నారు. ఇన్ఫీకి అచ్చే దిన్(మంచి రోజులు) తెచ్చే ప్రయత్నాల్లో ఆయన విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నట్లు మూర్తి పేర్కొన్నారు. ఇన్ఫీ ప్రమోటర్లతో విభేదాల నేపథ్యంలో సీఈవోగా విశాల్ సిక్కా, పలువురు బోర్డు సభ్యులు రాజీనామా చేయడం, సహ వ్యవస్థాపకుల్లో ఒకరైన నందన్ నీలేకని తిరిగి చైర్మన్ పదవి చేపట్టడం తెలిసిందే. సంస్కృతి, మంచిపేరు, విలువల్ని ఆస్తులుగా కంపెనీకి ఇచ్చామని.. సంస్థలో చెప్పుకోతగిన స్థాయిలో వాటాలు ఉన్నప్పటికీ ప్రమోటర్లు స్వచ్ఛందంగా తప్పుకున్న దాఖలాలు దేశ కార్పొరేట్ చరిత్రలోనే లేవని మూర్తి వ్యాఖ్యానించారు.

రూ.1,000 నోట్లా .. ఆ ప్రతిపాదనేమీ లేదు...



న్యూఢిల్లీ: రూమర్లకు చెక్ పెడుతూ ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజాగా రూ.1,000 నోట్లను తిరిగి చలామణిలోకి తీసుకువచ్చే ప్రతిపాదనేమీలేదని స్పష్టంచేసింది. ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం మళ్లీ రూ. 1,000 నోట్లను మార్కెట్‌లోకి తీసుకువస్తోందంటూ వార్తలు జోరందుకున్నాయి. ఇలాంటి వదంతులు నమ్మవద్దని, రూ. 1,000 నోట్లను మళ్లీ తీసుకువచ్చే ప్రతిపాదనేమీ లేదని ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ ట్వీట్ చేశారు. నల్లధనానికి చెక్ చెప్పడం కోసం గతేడాది మోదీ సర్కారు రూ.500, రూ.1,000 నోట్లను రద్దు చేయడం తెలిసిందే. వీటి స్థానంలో కొత్తగా రూ.500 నోట్లను, 2,000 నోట్లను తెచ్చింది. తాజాగా రూ.200 నోట్లను కూడా చెలామణిలోకి తీసుకువచ్చింది. అలాగే త్వరలో కొత్త రూ.50 నోట్లను కూడా తీసుకువస్తోంది.

హచిసన్‌కు 32 వేల కోట్ల వడ్డన

- రూ. 7,900 కోట్ల పన్ను, అంతే మొత్తం జరిమానా
- వడ్డీ కింద మరో రూ. 16,430 కోట్లు
- వొడాఫోన్‌తో డీల్‌పై ఆదాయ పన్ను శాఖ నోటీసు



న్యూఢిల్లీ: బ్రిటన్ సంస్థ వొడాఫోన్‌కు టెలికం వ్యాపార విక్రయ డీల్‌కు సంబంధించి రూ. 32,320 కోట్లు పన్ను కట్టాలంటూ హాంకాంగ్‌కి చెందిన హచిసన్ సంస్థకు ఆదాయ పన్ను(ఐటీ) శాఖ తాజాగా నోటీసులు జారీ చేసింది. ఇందులో పన్ను రూపంలో రూ. 7,900 కోట్లు, వడ్డీ కింద రూ. 16,430 కోట్లు, జరిమానా కింద మరో రూ. 7,900 కోట్లు కట్టాలంటూ సూచించింది. అనుబంధ సంస్థ హచిసన్ టెలికమ్యూనికేషన్స్ ఇంటర్నేషనల్ (హెచ్‌టీఐఎల్)కి ఈ మేరకు నోటీసులు వచ్చినట్లు బిలియనీర్ లీ కా–షింగ్‌కి చెందిన సీకే హచిసన్ హోల్డింగ్స్ హాంకాంగ్ స్టాక్ ఎక్స్ఛేంజీకి తెలియజేసింది. 'అనుబంధ సంస్థ హెచ్‌టీఐఎల్‌కి 2017 ఫిబ్రవరి 13న ఐటీ శాఖ నుంచి వొడాఫోన్ డీల్ వ్యవహారంలో క్యాపిటల్ గెయిన్స్‌పై రూ. 7,900 కోట్ల పన్నుతో పాటు వడ్డీ కింద మరో రూ. 16,430 కోట్లు కట్టాలంటూ నోటీసులు వచ్చాయి. ఆ తర్వాత ఆగస్టు 9న పెనాల్టీ కింద మరో రూ.7,900 కోట్లు కట్టాలనీ నోటీసులు అందాయి' అని వివరించింది. దీన్ని తాము వ్యతిరేకించడం కొనసాగిస్తామని స్పష్టం చేసింది. ఈ లావాదేవీపై భారత్‌లో పన్ను విధింపు వర్తించదంటూ సుప్రీం కోర్టు గతంలో ఇచ్చిన ఉత్తర్వులకు, అంతర్జాతీయ చట్టాల సూత్రాలకు తాజా నోటీసులు విరుద్ధమని పేర్కొంది. ఇప్పటిదాకా వొడాఫోన్ నుంచి ఈ సొమ్ము రాబట్టేందుకు ప్రయత్నించిన ఆదాయ పన్ను శాఖ .. తాజాగా పంథా మార్చి హచిసన్‌కి నోటీసులు జారీ చేయడం ఇదే తొలిసారి.

వివాదమిదీ..: 2007లో భారత్‌లో హచిసన్ వాంపోవాకి చెందిన టెలికం వ్యాపారంలో వొడాఫోన్ 67% వాటాలు కొనుగోలు చేయడం తెలిసిందే. ఈ డీల్ విలువ 11 బిలియన్ డాలర్లు. ఇప్పటి మారకం రేటు ప్రకారం ఈ విలువ రూ. 70,400 కోట్లుగా ఉంటుంది. టెలికం వ్యాపార కొనుగోలు డీల్‌లో హచిసన్‌కి చేసిన చెల్లింపుల్లో పన్ను మొత్తాలను మినహాయించనందుకు గాను రూ.7,990 కోట్లు కట్టాలంటూ ఐటీ శాఖ వొడాఫోన్‌ను గతంలోనే ఆదేశించింది. వడ్డీ, పెనాల్టీ కలిపితే వొడాఫోన్ కట్టాల్సిన మొత్తం రూ. 20,000 కోట్ల పైచిలుకు తేల్చింది. అయితే, వొడాఫోన్ దీన్ని సవాల్ చేస్తూ సుప్రీం కోర్టును ఆశ్రయించగా పన్నులేమీ కట్టాల్సిన అవసరం లేదంటూ 2012 జనవరిలో ఉత్తర్వులు వచ్చాయి. కానీ ఆ తర్వాత పాత లావాదేవీలకూ పన్నులు వర్తింపచేసేలా కేంద్రం చట్టాలను సవరించి పన్నులను క్లెయిమ్ చేసింది. దీన్ని కూడా వొడాఫోన్ వ్యతిరేకించడంతో.. ప్రస్తుతం వివాదం అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ ప్యానెల్ ముందుకు చేరింది. ఆదాయ పన్ను చట్ట సవరణల కారణంగా మరో బ్రిటిష్ కంపెనీ కెయిర్న్ ఎనర్జీకి కూడా రూ. 10,247 కోట్ల పన్ను నోటీసులు జారీ అయ్యాయి. ఈ అంశం కూడా ప్రస్తుతం అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ ప్యానెల్ ముందు ఉంది.

బంగారం పరుగు!

ముంబై మార్కెట్‌లో రూ. 520 అప్ ● నైమెక్స్‌లో రెండు రోజుల్లో 35 డాలర్లు అప్



ముంబై/న్యూయార్క్: అంతర్జాతీయ పరిణామాల దన్నుతో బంగారం పరుగులు పెడుతోంది. దేశీయంగా ముంబై స్పాట్ మార్కెట్‌లో బంగారం 99.9 స్వచ్ఛత 10 గ్రాముల ధర మంగళవారం భారీగా రూ.520 పెరిగి రూ. 29,915కు చేరింది. 99.5 స్వచ్ఛత ధర ఇదే స్థాయిలో ఎగసి రూ. 29,765కు పెరిగింది. రెండు రోజుల్లో ఇక్కడ ధర దాదాపు రూ.750 పెరిగింది.

అంతర్జాతీయంగా ..

అమెరికా ఫెడ్ ఫండ్ రేటు పెంపుపై అనుమానాలు, డాలర్ ఇండెక్స్ 92 స్థాయికి భారీ పతనం, ఉత్తరకొరియా ఘర్షణాత్మక వైఖరి వంటి అంశాల నేపథ్యంలో పసిడి, సోమవారం నాడే న్యూయార్క్ మర్కంటైల్ ఎక్స్ఛేంజ్‌లో– నైమెక్స్‌లో కీలక 1,300 డాలర్ల స్థాయిని దాటి 20 డాలర్లు ఎగసింది. మంగళవారం ఒక దశలో 1,330 డాలర్ల స్థాయిని తాకిన పసిడి కడపటి సమాచారం అందే సరికి 1,322 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. సోమవారం ముగింపుతో పోల్చితే ఇది ఆరు డాలర్లు అధికం.

దేశీయ ఫ్యూచర్స్‌లో...

దేశీయ ఫ్యూచర్స్ మార్కెట్– మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో కడపటి సమాచారం అందే సరికి పసిడి 10 గ్రాముల ధర రూ.220 లాభంతో రూ. 29,725 వద్ద ట్రేడవుతోంది.

సాక్షి బిజినెస్ వెబ్‌సైట్‌లో...

- కొత్త 200 నోటు వెనక కథేంటి ?
- మార్కెట్‌ను మించిన మ్యూచువల్ ఫండ్స్
- పాన్‌కార్డులు రెండున్నాయా ? ఒకటి వెనక్కి ఇచ్చేయండి
- మిడ్‌క్యాప్స్ ఇప్పటికీ ముద్దే...
- క్యూ1 ఫలితాలతో రాజ(శ్రీ)యోగం

మరిన్ని ఆసక్తికర కథనాలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం..

నిత్యావసరాల ధరలు (హోల్‌సేల్/క్వింటాల్‌కు)

పత్తి (వరంగల్, వ్యాపారస్తులు)	మిర్చి (వరంగల్, తేజ)	పసుపు (నిజామాబాద్, కొమ్ము)	ఉల్లి (కర్నూలు)	చక్కెర (చెన్నై)	బియ్యం (కరీంనగర్)	కందిపప్పు (చెన్నై)	సుబాబులు (కృష్ణా)	ఆయిల్ పామ్ (పశ్చిమ గోదావరి)
రూ.4,800 (కనిష్ఠం) రూ.5,170 (గరిష్ఠం)	రూ.2,000 (కనిష్ఠం) రూ.5,000 (గరిష్ఠం)	రూ.3,406 (కనిష్ఠం) రూ.7,833 (గరిష్ఠం)	------	రూ.4,080	రూ.3,650 (హెచ్ఎంటీ)	రూ.7,800	రూ.4,400 (టన్నుకు)	రూ.6,781

ఈటీఎఫ్‌లతో రిస్క్ తక్కువ

- పాసివ్ ఇన్వెస్ట్‌మెంట్లతో మంచి రాబడి
- ఫండ్ ఖర్చులు తక్కువ కనక దీర్ఘకాలానికి బెటర్...
- ఇండెక్స్‌ల రూపకల్పనలో కఠిన నియమాలు
- తాజాగా స్మార్ట్‌బీటా పేరిట వోలటాలిటీ ఇండెక్స్ కూడా...
- ఏసియా ఇండెక్స్ సంస్థ బిజినెస్ హెడ్ కోయల్ ఘోష్ వ్యాఖ్యలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: స్టాక్ మార్కెట్లలో సహజమైన ఊగిసలాటల నుంచి ఇన్వెస్టర్లను రక్షించడానికి ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లు (ఈటీఎఫ్) ఉపకరిస్తాయని ఏసియా ఇండెక్స్ ప్రైవేట్ లిమిటెడ్, దక్షిణాసియా బిజినెస్ డెవలప్‌మెంట్ హెడ్ కోయల్ ఘోష్ చెప్పారు. స్టాండర్డ్ అండ్ పూర్ (ఎస్ అండ్ పీ) డౌజోన్స్, బోంబే స్టాక్ ఎక్స్ఛేంజీ సమాన భాగస్వాములుగా నాలుగేళ్ల కిందట ఈ ఏసియా ఇండెక్స్ సంస్థ ఏర్పాటయింది. ''ఈక్విటీలు, ఫిక్స్‌డ్ ఇన్‌కమ్, కమాడిటీస్, రియల్ ఎస్టేట్ వంటి వివిధ రకాల ఆస్తులు, థీమ్‌ల ఆధారంగా ఇండెక్స్‌లు రూపొందిస్తున్నాం. వీటి రూపకల్పనలో ఖచ్చితమైన అంతర్గత నియమావళిని, వ్యవస్థాగత ప్రామాణిక ప్రక్రియల్ని పాటిస్తున్నాం. ఒకరకంగా చెప్పాలంటే ఇవి యాక్టివ్ ఇన్వెస్ట్‌మెంట్లకన్నా పరోక్ష (పాసివ్) ఇన్వెస్ట్‌మెంట్లకు అనుకూలమైనవి'' అని ఈ సందర్భంగా కోయల్ తెలియజేశారు. ఇండెక్స్‌లకు సంబంధించి ఇండియాలో 2005లో కేవలం 6 ఉత్పత్తులే అందుబాటులో ఉండేవని, ఇపుడు వాటి సంఖ్య ఏకంగా 65కు చేరిందని, వీటి విలువ 5 బిలియన్ డాలర్ల మేర ఉండొచ్చని తెలియజేశారు. అంటే ఎస్ అండ్ పీ బీఎస్ఈ 100, ఎస్ అండ్ పీ-బీఎస్ఈ 500 తదితర ఇండెక్స్‌లన్న మాట. వీటిలో సెక్టార్ల వారీ ఫండ్లు కూడా ఉన్నాయి. ఈ ఇండెక్స్‌లలో ప్రపంచవ్యాప్తంగా ఎక్కువగా పెన్షన్ ఫండ్లు ఇన్వెస్ట్ చేస్తున్నట్లు కోయల్ చెప్పారు. ఇండియాలోనూ ఈ ట్రెండ్ పెరుగుతోందన్నారు. ఇటీవలే కేంద్ర ప్రభుత్వం డిజిన్వెస్ట్‌మెంట్ కోసంప్రారంభించిన భారత్-22 ఈటీఎఫ్‌ను ఆమె ఉదహరించారు. దీన్ని త్వరలో ఐసీఐసీఐ ఆరంభించనుందని చెబుతూ... ''గతంలో కేంద్రం ఆవిష్కరించిన సీపీఎస్ఈ ఈటీఎఫ్ కన్నా తాజా భారత్- 22 మెరుగైనదని చెప్పొచ్చు. ఎందుకంటే దీన్లో బ్యాంకులు, ప్రభుత్వ రంగ నవరత్న, మినీరత్న సంస్థలున్నాయి'' అని చెప్పారు. దీన్ని త్వరలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఆవిష్కరించనున్నట్లు ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు.

పాసివ్ ఇన్వెస్ట్‌మెంట్ అంటే...

ప్రత్యక్ష, పరోక్ష ఇన్వెస్ట్‌మెంట్ విధానాల మధ్య తేడాల్ని కోయల్ ఘోష్ వివరిస్తూ... ''యాక్టివ్ ఇన్వెస్టింగ్ విధానంలో ఇన్వెస్టరు లేదా ఫండ్ మేనేజరు తానే షేర్లను ఎంచుకుంటారు. తన సమర్థతనే నమ్ముకుంటారు. అనలిస్టుల అంచనాలు, స్టోరీలు, వార్తలు, వదంతుల ఆధారంగా తన ఇన్వెస్ట్‌మెంట్లను మారుస్తుంటారు. పాసివ్ విధానంలో అలా కాదు. ఇన్వెస్టర్లు మార్కెట్‌నో, మార్కెట్‌ను ప్రతిబింబించే ఒక ఇండెక్స్‌నో ఎంచుకుంటారు. అందులో ఇన్వెస్ట్ చేయటం ద్వారా మార్కెట్ వృద్ధిలో భాగస్వాములవుతారు'' అని వివరించారు. తరచు కొనుగోళ్లు, అమ్మకాలు జరపకుండా... ఆ ఖర్చు కూడా మిగిలేలా సుదీర్ఘకాలంపాటు ఇండెక్స్‌లలో ఇన్వెస్ట్ చేయటాన్నే పాసివ్ ఇన్వెస్ట్‌మెంట్‌గా పరిగణిస్తున్నట్లు కోయల్ తెలియజేశారు. పాసివ్ ఇన్వెస్టింగ్ విధానంలో ఇండెక్స్‌ల పనితీరును పోలుస్తూ... ఈ ఏడాది పాసివ్ విధానం ద్వారా వచ్చిన రాబడులు దాదాపు 66 శాతం యాక్టివ్ ఫండ్లకన్నా మెరుగ్గా ఉన్నాయని కోయల్ చెప్పారు. ఖర్చులు కూడా మ్యూచ్‌వల్ ఫండ్లలో 1.25 నుంచి 2.25 శాతం వరకూ ఉంటే... ఈటీఎఫ్‌లలో 0.3 శాతమే ఉంటాయని తెలిపారు. ఎప్పటికప్పుడు మారుతున్న మార్కెట్ పరిణామాలకు అనుగుణంగా ఆయా ఇండెక్స్‌లలోని షేర్లను కూడా మారుస్తున్నామని, ఇలా మార్చటానికి కఠినమైన నియమాలతో పాటు పారదర్శక కమిటీ కూడా ఉందని తెలియజేశారు. ''తాజాగా హెచ్చుతగ్గుల ఇండెక్స్‌ను రూపొందించాం. స్మార్ట్‌బీటాగా వ్యవహరించే ఈ హెచ్చుతగ్గుల ఇండెక్స్‌లో భారీగా ఒడిదుడుకులకు గురికాని షేర్లుంటాయి. అంటే మార్కెట్ బాగా పెరిగిన సందర్భాల్లో కూడా ఇవి తక్కువే పెరుగుతాయి. అలాగే మార్కెట్ బాగా పడినపుడు ఇవి తక్కువే పడతాయి. వీటిలో రిస్క్ తక్కువ ఉంటుంది. దీర్ఘకాలంలో ఎక్కువ లాభాలనిస్తాయి'' అని వివరించారు. ఈటీఎఫ్‌లలో పెట్టుబడులపై ఇండియాలో ఇపుడిపుడే ఇన్వెస్టర్లలో అవగాహన పెరుగుతోందని, ప్రపంచవ్యాప్తంగా ఈ ధోరణి ఎప్పటి నుంచో ఉందని చెబుతూ... ఎప్పటికప్పుడు ఇండెక్స్‌లలోని షేర్లు మారుతుంటాయి కనక చక్కని రాబడుల కోసం ఈటీఎఫ్‌లు మంచివేనని కోయల్ చెప్పారు.

నిఫ్టీ... ఫ్యూచర్స్ సిగ్నల్స్

ఈ మధ్యకాలంలో ఎన్నడూలేనంతగా ఎన్ఎస్ఈ ప్రధాన సూచి నిఫ్టీ మంగళవారం 1.18 శాతం క్షీణించి 9,796 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ ఫ్యూచర్ 3 పాయింట్ల ప్రీమియంతో 9,799 పాయింట్ల వద్ద క్లోజయ్యింది. మరో రెండు రోజుల్లో ఆగస్టు కాంట్రాక్టు ముగియనున్న నేపథ్యంలో నిఫ్టీ ఫ్యూచర్ కాంట్రాక్టు ఓపెన్ ఇంట్రస్ట్ (ఓఐ) నుంచి 28.56 లక్షల షేర్లు (12.5 శాతం) కట్ అయ్యాయి. మొత్తం ఓఐ 1.99 కోట్లకు తగ్గింది. స్పాట్ కంటే ప్రీమియం క్రితంరోజుతో పోలిస్తే 4 పాయింట్ల నుంచి 3 పాయింట్లకు తగ్గింది. ఈ యాక్టివిటీ ఆగస్టు కాంట్రాక్టు పొజిషన్ల అన్‌వైండింగ్‌ను సూచిస్తున్నది. అయితే సెప్టెంబర్ ఫ్యూచర్‌కు 25.56 లక్షల షేర్లు రోలోవర్‌కాగా, మొత్తం ఓఐ 71 లక్షలకు చేరింది. మొత్తం ఓఐ ఇంకా తక్కువగానే వుండటం...ట్రేడర్లలో వచ్చేనెల ట్రెండ్ పట్ల స్పష్టమైన అంచనాలేవీ ఏర్పడలేదనడానికి సంకేతం. సెప్టెంబర్ ఫ్యూచర్ ప్రీమియం మాత్రం 37 పాయింట్ల నుంచి 33 పాయింట్లకు తగ్గింది. కొత్త సిరీస్ ఇంకా ప్రారంభంకాకుండానే ప్రీమియం తగ్గడం...కొద్దిపాటి షార్ట్ రోలోవర్స్‌ను సూచిస్తున్నది. ఆగస్టు ఆప్షన్స్ విభాగంలో 9,800, 9,900 స్ట్రయిక్స్ వద్ద కాల్ రైటింగ్ జరగడంతో 21.79 లక్షలు, 11.37 లక్షల చొప్పున షేర్లు యాడ్ అయ్యాయి. ఈ స్ట్రయిక్స్ వద్ద 40.47 లక్షలు, 59.64 లక్షల చొప్పున కాల్ బిల్డప్ వుంది. 9,800 స్ట్రయిక్ వద్ద పుట్ కవరింగ్ కారణంగా 10.02 లక్షల పుట్స్ కట్ అయ్యాయి. ఇంకా 55.35 లక్షల పుట్ బిల్డప్ వుంది. సమీప భవిష్యత్తులో నిఫ్టీకి 9,800 పాయింట్ల స్థాయి కీలకం కాగలదని, పెరిగితే 9,900 పాయింట్లస్థాయి గట్టిగా నిరోధించవచ్చని, 9,800 పాయింట్ల దిగువన స్థిరపడితే...క్రమేపీ బలహీనపడవచ్చని ఈ ఆప్షన్ డేటా వెల్లడిస్తున్నది.

→ బ్యాంక్ ఆఫ్ బరోడా డెరివేటివ్ సంకేతాలు ఎలా ఉన్నాయ్ ఈ వివరాలు www.sakshibusiness.comలో

స్మార్ట్‌ఫోన్లో మూడో నేత్రం..

జీరో మెయింటెనెన్స్‌తో గోద్రెజ్ 'ఈవ్' • సీసీటీవీల ధర రూ.5,500-9,900

ఈవ్ యాప్‌ను ప్రదర్శిస్తున్న మెహర్నోష్, శరత్ (కుడి)

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: నగరాలతోపాటు పట్టణాల్లోనూ సీసీటీవీల (కెమెరా) వాడకం ఇప్పుడు బాగా పెరుగుతోంది. సమస్యల్లా వీటి నిర్వహణ ఖర్చులే. పైగా వీడియో రికార్డింగ్ పెద్ద ప్రహసనం కూడానూ. అయితే ఎటువంటి అదనపు ఖర్చులు లేకుండా కెమెరాలను సులభంగా నిర్వహించుకోవచ్చని చెబుతోంది గోద్రెజ్ సెక్యూరిటీ సొల్యూషన్స్. ప్రపంచంలో ఎక్కడి నుంచైనా స్మార్ట్‌ఫోన్ ద్వారా ప్రత్యక్షంగా వీడియోను వీక్షించే సీసీటీవీలను ఈవ్ పేరుతో సెప్టెంబర్ 1న విడుదల చేస్తోంది. ఆయస్కాంతం (మ్యాగ్నెట్) ఉన్న ఈ సీసీటీవీలను ఎక్కడైనా ఏర్పాటు చేయవచ్చు. వైఫైతో అనుసంధానిస్తే చాలు. వీడియో అంతా క్లౌడ్‌లో స్టోర్ అవుతుంది. కెమెరాకు మెమరీ కార్డు పెట్టుకునే వెసులుబాటూ ఉంది. స్మార్ట్‌ఫోన్‌లోని యాప్ ద్వారా కెమెరా యాంగిల్‌ను మార్చుకోవచ్చు. కావల్సిన తేదీ, సమయంలో రికార్డయిన వీడియోను క్షణాల్లో చూడొచ్చు. కరంటు సప్లై లేనప్పుడు పవర్ బ్యాంక్‌తోనూ పనిచేస్తాయి.

భారత్‌లో తొలిసారి..

తక్కువ ధరతోపాటు ఇన్ని ఫీచర్లతో సీసీటీవీలను తీసుకురావడం భారత్‌లో తొలిసారి అని గోద్రెజ్ సెక్యూరిటీ సిస్టమ్స్ మెహర్నోష్ పిథావాలా తెలిపారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక సేల్స్ డీజీఎం శరత్ మోహన్‌తో కలిసి మంగళవారమిక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఈవ్ సిరీస్‌లో రూ.5,500-9,900 ధరలో మూడు మోడళ్లను ప్రవేశపెడుతున్నాం. అదనపు ఖర్చులేవీ లేవు. మెయింటెనెన్స్ అక్కర లేదు. ఒక కెమెరా ఇచ్చే వీడియోను యాప్ సాయంతో కుటుంబ సభ్యులందరూ తమ స్మార్ట్‌ఫోన్లలో లైవ్ చూడొచ్చు. క్లౌడ్ స్టోరేజీ ఉచితం. కెమెరాకు ఉన్న సెన్సార్లు కదిలే వస్తువును ఇట్టే గుర్తిస్తాయి. రాత్రిపూట సైతం చక్కగా పనిచేస్తాయి. సెన్సార్లు స్పందించడమేగాక అలర్టుల రూపంలో నిమిషం నిడివిగల వీడియోలను పంపిస్తాయి. కెమెరాలకు ఏడాది వారెంటీ ఉంది' అని తెలిపారు.

లక్ష్యాన్ని దాటిన తొలి జీఎస్‌టీ వసూళ్లు: జైట్లీ

న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు తొలి నెల జూలైలో లక్ష్యాలను అధిగమించినట్లు ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ వెల్లడించారు. ఈ వసూళ్ల మొత్తం రూ.92,283 కోట్లని పేర్కొన్నారు. ఆయన తెలిపిన సమాచారం ప్రకారం 59.57 లక్షల మంది పన్ను చెల్లింపుదారులు జీఎస్‌టీ విధానం కింద రిజిస్టర్ అయ్యారు. వీరిలో ఇప్పటివరకూ 64.4 శాతం మంది నుంచి మాత్రమే పన్ను వసూళ్లు జరిగాయి. ఈ శాతం మరింత పెరిగే అవకాశం ఉంది. మొత్తం రూ.91,000 కోట్లు మాత్రమే జూలైలో జీఎస్‌టీ ద్వారా లభిస్తాయని వార్షిక బడ్జెట్ అంచనావేసింది.

ఫిన్‌టెక్ వ్యాలీ కొత్త కార్యక్రమాలు

విశాఖపట్నం: ఫిన్‌టెక్ వ్యాలీ వైజాగ్, కేపీఎంజీ ఇండియా సహకారంతో బీఎఫ్ఎస్ఐ రిపాజిటరీ, ఫిన్‌టెక్ వ్యాలీ యాసిలరేటర్ అనే రెండు కార్యక్రమాలను మంగళవారం ముంబైలో ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, ముఖ్యమంత్రి ఐటీ సలహాదారు జేఏ చౌదరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలు కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. వైజాగ్‌ను ఆర్థిక సేవలకు కేంద్రంగా చేయాలన్న లక్ష్యంతో ఫిన్‌టెక్ ఎకోసిస్టమ్ ఏర్పాటుకు పరిశ్రమలను, విద్యావేత్తలను, పెట్టుబడిదారులను ఒక వేదికపైకి తీసుకువచ్చేందుకు ఫిన్‌టెక్ వైజాగ్ వ్యాలీ 2016లో ఏర్పాటైంది.

ఎన్‌టీపీసీ వాటాకు రూ. 7,800 కోట్ల బిడ్స్

న్యూఢిల్లీ: ఎన్‌టీపీసీలో కేంద్ర ప్రభుత్వం 5% వాటా విక్రయానికి జారీచేసిన ఓఎఫ్ఎస్ ఇష్యూకు తొలిరోజైన మంగళవారం సంస్థాగత ఇన్వెస్టర్ల నుంచి రూ. 7,800 కోట్ల విలువైన బిడ్స్ దాఖలయ్యాయి. ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) మార్గంలో రెండురోజులపాటు అమల్లోవుండే ఈ ఇష్యూ ద్వారా 41.22 కోట్ల ఎన్‌టీపీసీ షేర్లను (5 శాతం) ఆఫర్ చేస్తుండగా, తొలిరోజున 46.35 కోట్ల షేర్లకు బిడ్స్ వచ్చాయి.

సీఈఎల్‌లో 100 % వాటా విక్రయానికి లైన్ క్లియర్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ సెంట్రల్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (సీఈఎల్)లో 100 శాతం వాటాను విక్రయించడానికి, యాజమాన్య నియంత్రణను బదిలీ చేసే ప్రతిపాదనకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు కేంద్ర పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణా శాఖ విడుదల చేసిన బిడ్ డాక్యుమెంట్‌లో పేర్కొంది.

డిక్సన్ టెక్నాలజీస్ ప్రైస్‌బ్యాండ్ రూ.1,760-1,766

న్యూఢిల్లీ: కన్జూమర్ ఎలక్ట్రానిక్స్ తయారీ కంపెనీ డిక్సన్ టెక్నాలజీస్ ప్రతిపాదిత తొలి పబ్లిక్ ఇష్యూకు (ఐపీఓ)రూ. 1,760-1,766 ప్రైస్‌బ్యాండ్‌ను నిర్ణయించారు. రూ. 600 కోట్ల సమీకరణకు కంపెనీ జారీచేస్తున్న ఐపీఓ సెప్టెంబర్ 6న ప్రారంభమై 8న ముగుస్తుంది. తిరుపతిలో లెడ్ టీవీల తయారీ కోసం ఉత్పాదక యూనిట్‌ను నెలకొల్పడంసహా పలు అవసరాలకు ఈ నిధులను వినియోగించుకోనుంది.

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9, 10గ్రా)	29,915	▲	520
బంగారం (99.5, 10గ్రా)	29,765	▲	520
వెండి (కిలో)	40,030	▲	805
చెన్నై			
బంగారం (24 క్యారెట్లు)	- -		
బంగారం (22 క్యారెట్లు)	28,490	▲	540
వెండి (కిలో)	- -		
హైదరాబాద్			
బంగారం (24 క్యారెట్లు)	29,800	▲	380
బంగారం (22 క్యారెట్లు)	28,310	▲	360
వెండి(కిలో)	40,190	▲	755
ప్రొద్దుటూరు			
బంగారం (24 క్యారెట్లు)	30,370	▲	370
బంగారం (22 క్యారెట్లు)	28,200	▲	420
వెండి(కిలో)	40,800	▲	700
విశాఖపట్నం			
బంగారం (24 క్యారెట్లు)	30,430	▲	780
బంగారం (22 క్యారెట్లు)	28,300	▲	350
వెండి(కిలో)	41,500		0
విజయవాడ			
బంగారం (24 క్యారెట్లు)	31,100	▲	750
బంగారం (22 క్యారెట్లు)	28,550	▲	450
వెండి(కిలో)	41,200	▲	700
ఏపీ బులియన్ అసోసియేషన్			
బంగారం (24 క్యారెట్లు)	30,820	▲	560
బంగారం (22 క్యారెట్లు)	28,540	▲	520
వెండి(కిలో)	41,200	▲	800

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	46.12 (రాత్రి 11.30కు)	$46.57 (సోమవారం ముగింపు)
బ్రెంట్	51.34 (రాత్రి 11.30కు)	$51.42 (సోమవారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 30-8-2017

విశాఖ	362-00
చిత్తూరు	390-00
వరంగల్	357-00
ముంబై	400-00
చెన్నై	397-00
విజయవాడ	359-00
గోదావరి	359-00
నమక్కల్	387-00
29-8-2017 ఫామ్ ధర...	
హైదరాబాద్	355-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.15
బెంగళూరు	382-00
ఢిల్లీ	355-00
కోల్‌కతా	390-00


ప్రసంగిస్తున్న ఎంపీ మేకపాటి, పక్కన ఎమ్మెల్యే రామిరెడ్డి తదితరులు

ఎన్నికల వ్యవస్థను బాబు భ్రష్టుపట్టించారు
వైఎస్సార్‌సీపీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి

కావలి: రాష్ట్రంలో ఎన్నికల వ్యవస్థను చంద్రబాబు భ్రష్టుపట్టించారని నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం రాత్రి కావలిలో నిర్వహించిన నియోజకవర్గ నవరత్నాల సభలో ఆయన మాట్లాడారు. ఎందరో మహానుభావుల త్యాగాలతో ప్రజాస్వామ్యాన్ని తీసుకొస్తే.. దానిని అపహాస్యం చేసేలా వ్యవహరిస్తున్న చంద్రబాబు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ప్రతి ఎన్నికల్లోనూ ప్రజలను మోసపూరిత విధానాలతో చంద్రబాబు మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. నంద్యాలలో కోట్లాది రూపాయలను విచ్చలవిడిగా వెదజల్లుతున్నారు. టీడీపీకి ఓటు వేయకపోతే పింఛన్లు రావని, ఇతరత్రా సౌకర్యాలు రద్దు చేస్తామనడం సిగ్గుచేటని అన్నారు. ఉప ఎన్నికలో గెలుపు కోసం చంద్రబాబు బరితెగించి నీచమైన పనులన్నీ చేశారని అన్నారు. ఆ గెలుపుతోనే సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడారు.

హైదరాబాద్‌లో పనిచేస్తే జీతాలు బంద్
సెప్టెంబర్ నుంచి అమలు.. ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

సాక్షి, అమరావతి: ఇంకా హైదరాబాద్‌లోనే పనిచేస్తున్న అధికారులకు, ఉద్యోగులకు సెప్టెంబర్ నెల నుంచి జీతాలు బంద్ చేస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. శాఖాధిపతుల కార్యాలయాలు, కార్పొరేషన్లు, స్వయంప్రతిపత్తిగల సంస్థల్లో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు ఇంకా హైదరాబాద్ నుంచి పనిచేస్తుంటే వారికి సెప్టెంబర్ నెల నుంచి వేతనాల చెల్లింపును నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వ సాధారణ పరిపాలన (రాజకీయ) కార్యదర్శి శ్రీకాంత్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తప్పనిసరిగా హైదరాబాద్‌లో ఉండే పనిచేయాల్సి వస్తే అందుకు మూడు నెలలకు మించకుండా ఆర్థిక శాఖ ఆమోదంతో పాటు ముఖ్యమంత్రి ఆమోదం పొందాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

'పోలవరం' డంపింగ్ సమస్యను పరిష్కరించండి
ఏపీ సీఎస్‌కు జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశం



సాక్షి, న్యూఢిల్లీ: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా వెలికితీస్తున్న వ్యర్థాల డంపింగ్ సమస్యను పరిష్కరించాలని ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్జీటీ) ఆదేశించింది. ప్రాజెక్టు వ్యర్థాల్లో విషపూరిత పదార్థాలు ఉంటున్నాయని, అలాగే రాత్రిపూట డంపింగ్ చేస్తుండడం వల్ల సమీప గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పెంటపాటి పుల్లారావు దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ స్వతంత్రకుమార్ నేతృత్వంలోని బెంచ్ మంగళవారం విచారించింది. డంపింగ్ అనేది ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యే వరకు నిరంతరాయంగా సాగే ప్రక్రియ అయినందున.. ఈ సమస్యను వెంటనే పరిష్కరించేలా ఏపీ సీఎస్‌కు ఆదేశాలివ్వాలని ఎన్జీటీని పిటిషనర్ కోరారు. పిటిషనర్ వాదనతో ఏకీభవించిన బెంచ్.. బాధితులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాల్సిందిగా సీఎస్‌ను ఆదేశించింది.

రేపు చంద్రన్న సంచార చికిత్స ఉద్యోగుల ధర్నా


సాక్షి, అమరావతి: చంద్రన్న సంచార చికిత్స (104) వాహనాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు గురువారం విజయవాడలో భారీ ధర్నా నిర్వహించనున్నారు. ఈ మేరకు 104 ఉద్యోగుల గౌరవాధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. జీవో నంబర్ 151 ప్రకారం వేతనాలు చెల్లించాలని, 104 వాహనాలను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని, పెరిగిన నిత్యావసర వస్తువులకు అనుగుణంగా డైలీ ఫుడ్ అలవెన్సు పెంచాలని డిమాండ్ చేశారు. పిరమిల్ స్వాస్థ్య సంస్థ ఉద్యోగులపై వేధింపులు తీవ్రతరం చేసిందని, వీటిని ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే ధర్నాకు పూనుకున్నట్లు తెలిపారు.

నంద్యాలలో టీడీపీ తీరు దారుణం: రామకృష్ణ



కల్లూరు (రూరల్): నంద్యాల ఉప ఎన్నికలో టీడీపీ నేతలు డబ్బుతో ఓటర్లను కొనుగోలు చేయడం అప్రజాస్వామికమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మండిపడ్డారు. మంగళవారం కర్నూలులో పార్టీ నగర కార్యదర్శి ఎస్ఎన్ రసూల్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ఉప ఎన్నికలో అధికార పార్టీ నేతలు ఓటుకు రూ. 2వేలు ఇవ్వడం దారుణమన్నారు. రానున్న 2019 ఎన్నికల్లో రూ.60 నుంచి 70 కోట్లు ఖర్చు పెడితే తప్ప ఎమ్మెల్యేగా గెలిచే పరిస్థితిని కల్పించారని మండిపడ్డారు. ఇదే రకంగా ఎన్నికలు కొనసాగితే ప్రజాస్వామ్యం పై ప్రజలకు నమ్మకం పోతుందన్నారు. 2014 ఎన్నికల్లో డేరాబాబా బీజేపీకి మద్దతు ఇవ్వడంతో ఆయన పట్ల సానుకూలంగా వ్యవహరిస్తున్నారని రామకృష్ణ ఆరోపించారు. ఈ విషయాలన్నీ ప్రజలకు తెలియజేసేందుకు సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు దేశవ్యాప్తంగా ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఆ విద్యార్థుల సమస్య పరిష్కరించాలి: పవన్



సాక్షి, అమరావతి: వ్యవసాయ బీఎస్సీ విద్యార్థులు 25 రోజులుగా చేస్తున్న ఆందోళనలను ప్రభుత్వం గుర్తించి, తక్షణమే ఆ సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని సినీ నటుడు, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ డిమాండ్ చేశారు. మంగళవారం విద్యార్థులతో కలసి ఆయన హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. వ్యవసాయ అధికారుల నియమాకాల్లో ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 64ను నిలుపుదల చేసి, గతంలో అమలులో ఉన్న జీవో నంబర్ 16ను కొనసాగించాలని ఆందోళన పథంలో ఉన్న బీఎస్సీ విద్యార్థులు కోరుతున్నారని చెప్పారు. ఈ సమస్యకు ప్రభుత్వం ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపని పక్షంలో జనసేన పార్టీ తన వంతు పాత్ర పోషించడానికి వెనుకాడదన్నారు.

బీసీ సబ్‌ప్లాన్ చట్టం తీసుకురావాలి: డేరంగుల

సాక్షి, హైదరాబాద్: జనాభా లెక్కల ప్రకారం బీసీల రిజర్వేషన్లను 50 శాతానికి పెంచాలని బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డేరంగుల ఉదయ్‌కిరణ్ డిమాండ్ చేశారు. అలాగే బీసీ సబ్‌ప్లాన్ చట్టం తీసుకురావాలన్నారు. మంగళవారం హైదరాబాద్లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అనంతపురం వడ్డెర సంఘం అధ్యక్షుడు బత్తుల లక్ష్మీకాంతయ్యను నియమించినట్టు తెలిపారు. అలాగే రాష్ట్ర విశ్వకర్మ కుల గౌరవాధ్యక్షుడు శ్యాంసుందరాన్ని సంఘం ఉపాధ్యక్షుడిగా నియమించినట్టు వెల్లడించారు.

తమిళనాడు అడ్వకేట్ జనరల్ రాజీనామా!

సాక్షి, చెన్నై: తమిళనాడు ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ (ఏజీ) ముత్తుకుమారస్వామి తన పదవికి మంగళవారం రాజీనామా చేశారు. అనారోగ్య కారణాలను వివరిస్తూ, తనను పదవి నుంచి తప్పించాలని ప్రభుత్వానికి, గవర్నర్‌కు ఆయన లేఖ రాశారు. తమిళనాడు ప్రభుత్వం సంక్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో ఏజీ రాజీనామా వెనుక ఏదేని బలమైన రాజకీయ కారణాలు ఉండొచ్చన్న చర్చ సాగుతోంది. ప్రస్తుతం తమిళనాడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోర్టుల్లో అనేక పిటిషన్లు విచారణలో ఉండటం గమనార్హం.

స్పెషల్ రైలు ఆగలేదు!

ఆమదాలవలస: హౌరా-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ (07183 నంబర్) ప్రత్యేక రైలుకి శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) స్టేషన్‌లో హాల్టు ఉన్నప్పటికీ ఆగకుండా వెళ్లిపోయింది. ఈ రైలు మంగళవారం మధ్యాహ్నం 12.55 గంటలకు ఇక్కడకు రావాల్సి ఉండగా మధ్యాహ్నం 3.20 గంటలకు స్టేషన్‌కు వచ్చినప్పటికీ ఆగలేదు. దీంతో ఈ ట్రైన్ కోసం శ్రీకాకుళం నుంచి సికింద్రాబాద్ ప్రయాణించేందుకు రిజర్వేషన్ చేయించుకున్న 26 మంది ప్రయాణికులతో పాటు.. సాధారణ ప్రయాణికులు మరో 100 మంది ఆందోళనకు గురయ్యారు. ట్రైన్ స్టేషన్‌కు వస్తుందని అనౌన్స్‌మెంట్ చేసిన రైల్వే అధికారులు నిలుపుదల చేయడంలో నిర్లక్ష్యం వహించడంపై మండిపడ్డారు. పలాస-విశాఖ ఈఎంయూ ప్యాసింజర్‌లో ప్రయాణికులను ఎక్కించి చీపురుపల్లి స్టేషన్‌లో ఆగిఉన్న ప్రత్యేక రైలులో ఎక్కించడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

'ఉత్తరాంధ్ర సుజల' అంచనాల పెంపు

రూ. 885.6 కోట్ల నుంచి రూ. 2,086.67 కోట్లకు పెంపు
అంచనా వ్యయాన్ని సవరిస్తూ జలవనరుల శాఖ ప్రతిపాదనలు
ఆర్థిక శాఖ ఆమోదముద్ర వేశాక పరిపాలన అనుమతులు జారీ

సాక్షి, అమరావతి: గోదావరి జలాలను తరలించే.. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకాన్ని దశల వారీగా చేపట్టాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా తొలి దశ అంచనా వ్యయాన్ని రూ. 885.6 కోట్ల నుంచి రూ. 2,086.67 కోట్లకు సవరిస్తూ ఆర్థిక శాఖకు జలవనరుల శాఖ ప్రతిపాదనలు పంపింది. ఆర్థిక శాఖ ఆమోదముద్ర వేశాక జలవనరుల శాఖ పరిపాలన అనుమతి జారీ చేయనుంది. గోదావరి జలాలతో విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలను సస్యశ్యామలం చేయాలన్న లక్ష్యంతో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకాన్ని దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి సంకల్పించారు. వరద వచ్చే 90 రోజుల్లో గోదావరి నుంచి 63.2 టీఎంసీలను తరలించి 8 లక్షల ఎకరాలకు సాగునీళ్లు, 1,200 గ్రామాల్లోని 30 లక్షల మందికి తాగునీళ్లు అందించాలని భావించారు. ఈ క్రమంలోనే రూ. 7,124.10 కోట్లతో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకాన్ని చేపట్టేందుకు జనవరి 2, 2009న పరిపాలన అనుమతులు జారీ చేశారు. టెండర్ నోటిఫికేషన్ జారీ చేసేలోగానే ఎన్నికల షెడ్యూలు వెలువడటంతో అప్పట్లో పనులు చేపట్టలేకపోయారు. వైఎస్ హఠాన్మరణంతో పనులు ముందుకు సాగలేదు.

అందుకే.. పురుషోత్తపట్నం

కాగా గోదావరి వరద సమయంలో 27.22 టీఎంసీలను తరలించి ఏలేరు ఆయకట్టును స్థిరీకరించడం, విశాఖపట్నం తాగు, పారిశ్రామిక అవసరాలు తీర్చడం లక్ష్యంగా రూ. 1,638 కోట్లతో పురుషోత్తపట్నం ఎత్తిపోతలను చేపట్టినట్లు ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం ప్రకటించింది. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకంలో భాగంగానే దీన్ని చేపట్టినట్లు వెల్లడించింది. కానీ ఆయకట్టుకు నీళ్లందించే పనులు చేపట్టకపోవడంతో విమర్శలు వెల్లువెత్తాయి. దాంతో ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని దశల వారీగా చేపట్టాలని సర్కార్ నిర్ణయించింది.

దశల వారీగా చేపట్టేలా ప్రణాళిక..



ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని దశలవారీగా చేపట్టాలని నిర్ణయించిన సర్కార్.. తొలి దశలో భాగంగా పోలవరం ఎడమ కాలువ 162 కి.మీ. నుంచి జమ్మంతటాపాలెం వద్ద ఎత్తిపోతల ద్వారా 13 టీఎంసీలను తోడి విశాఖపట్నం జిల్లాలో 1.30 లక్షల ఎకరాలకు నీళ్లందించే పనులను చేపట్టాలని సర్కార్ నిర్ణయించింది. 43 కి.మీల ప్రధాన కాలువ, 3.5 టీఎంసీల సామర్థ్యంతో పెదపూడి రిజర్వాయర్ నిర్మాణం, 1.30 లక్షల ఎకరాలకు నీళ్లందించేలా డిస్ట్రిబ్యూటరీల పనులను తొలి దశలో చేపట్టాలని ప్రతిపాదించింది. 2009 ధరల ప్రకారం ఈ పనుల అంచనా వ్యయం రూ. 885.6 కోట్లు. అయితే 2013 భూసేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు పరిహారం చెల్లించి, పునరావాస ప్యాకేజీని అమలు చేయాలి. ఈ నేపథ్యంలో అంచనా వ్యయాన్ని పెంచారు. ఆర్థిక శాఖ ఆమోదం తర్వాత రెండు ప్యాకేజీల కింద పనులకు టెండర్లు పిలవాలని జలవనరుల శాఖ నిర్ణయించింది.

ప్రాజెక్టు స్వరూపం ఇదీ..

- పురుషోత్తపట్నం వద్ద గోదావరిపై ఎత్తిపోతల ద్వారా రోజుకు 230 క్యూసెక్కుల చొప్పున పోలవరం ఎడమ కాలువలోకి ఎత్తిపోస్తారు. ఎడమ కాలువ 162 కి.మీ. వద్ద హెడ్ రెగ్యులేటర్ నిర్మించి.. అక్కడి నుంచి 129 కి.మీ.ల మేర ప్రధాన కాలువ తవ్వి 90 రోజుల్లో 63.2 టీఎంసీలను తరలిస్తారు.
- రావికమతానికి సమీపంలో 3.15 టీఎంసీల సామర్థ్యంతో పెదపూడి రిజర్వాయర్ నిర్మిస్తారు. అక్కడి నుంచి 45 మీటర్ల ఎత్తుకు నీటిని తోడి.. 6.55 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించే భూదేవి రిజర్వాయర్‌కు తరలిస్తారు. భూదేవి రిజర్వాయర్ నుంచి 45 మీటర్ల ఎత్తుకు నీటిని తోడి.. ఎస్.కోట సమీపంలో 6.20 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించే వీరనారాయణపురం రిజర్వాయర్‌కు తరలిస్తారు. ఆ రిజర్వాయర్ నుంచి 45 మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తిపోసి.. ఎస్.కోట సమీపంలో 3.80 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించే తాటిపూడి రిజర్వాయర్‌లోకి తరలిస్తారు. ఈ రిజర్వాయర్‌ల బ్రాంచ్ కాలువల ద్వారా ఆయకట్టుకు సాగునీళ్లు, పరిసర ప్రాంతాల్లోని 1,200 గ్రామాలకు తాగునీళ్లు, విశాఖ పారిశ్రామిక అవసరాలకు నీళ్లందించాలని నిర్ణయించారు.

టీటీడీ నిధులు సీఎం పందేరం!

- 4 నెలలైనా పాలకమండలిని నియమించని ప్రభుత్వం
- ఫిరాయింపు ఎమ్మెల్యే కోరారని 100% నిధులు మంజూరు

సాక్షి, అమరావతి: టీటీడీ పాలకమండలి పదవీ కాలం ముగిసి నాలుగు నెలలు పూర్తయినా ఇప్పటివరకు కొత్త పాలకమండలి కమిటీని గానీ, కనీసం ఉన్నతాధికారులతో స్పెసిఫైడ్ అథారిటీని కానీ నియమించకుండా కాలయాపన చేస్తూ.. టీటీడీ నిధులను నేరుగా ముఖ్యమంత్రే మంజూరు చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేసి గెలిచి తర్వాత టీడీపీలోకి ఫిరాయించిన కర్నూలు ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి అడిగారని రూ.1.25 కోట్ల ఖర్చుతో కర్నూలు పట్టణంలో మినీ కల్యాణ మండపం నిర్మాణానికి ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. ఇందుకు పూర్తిగా టీటీడీ నిధులను వ్యయం చేయనున్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. నిబంధనల ప్రకారం మినీ కల్యాణ మండపం నిర్మాణానికయ్యే మొత్తం ఖర్చులో 30 శాతం స్థానికులు భరించాల్సి ఉంటుంది. అప్పుడు మిగిలిన 70 శాతం నిధులు టీటీడీ నుంచి ఇచ్చేందుకు అవకాశం ఉంటుందని ఆలయ ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు. అయితే ముఖ్యమంత్రి కార్యాలయం మాత్రం వంద శాతం టీటీడీ నిధుల విడుదలకు ఆమోదం తెలపడం గమనార్హం. వాస్తవానికి కర్నూలు చిట్టారి వీధిలో కల్యాణ మండపం నిర్మాణానికి ఎస్వీ మోహన్‌రెడ్డి గత ఏడాది జూన్ 15వ తేదీన వినతిపత్రం అందజేశారు. నిబంధనల మేరకు 70 శాతం టీటీడీ నిధులతో మండపం నిర్మాణానికి ఆమోదం తెలుపుతూ మరుసటి నెల 12వ తేదీనే ఉత్తర్వులు (మెమో నంబరు 295614) జారీ అయ్యాయి. అయితే మోహన్‌రెడ్డి ఈ ఏడాది ఫిబ్రవరి 28వ తేదీన వంద శాతం టీటీడీ నిధులు మంజూరు చేయాలని కోరుతూ మరోసారి దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో సీఎం సూచన మేరకు వంద శాతం టీటీడీ నిధుల విడుదలకు అనుమతి తెలుపుతూ దేవాదాయ శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

అప్పుల బాధతో చేనేత కార్మికుడు ఆత్మహత్య
అనంతపురం జిల్లాలో ఘటన


భాస్కర్ (ఫైల్)

శింగనమల: అప్పుల బాధకు మరో చేనేత కార్మికుడు బలయ్యాడు. అనంతపురం జిల్లా శింగనమల మండలం ఆకులేడు గ్రామానికి చెందిన భాస్కర్ (38) అప్పుల బాధ తాళలేక మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. బుక్కరాయ సముద్రం మండలంలోని పసలూరు కొత్తపల్లి నుంచి 13 ఏళ్ల క్రితం ఆకులేడు వచ్చిన భాస్కర్, భార్య రత్నమ్మతో కలిసి మగ్గం నేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వీరికి ముగ్గురు ఆడ పిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. అనంతపురం సహకార బ్యాంకులో భాస్కర్ పేరిట రూ. 50 వేల రుణం ఉంది. మగ్గం ముడి సరుకుల ధర పెరగడం, నేసిన చీరలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో కుటుంబ పోషణకు రూ. లక్షకుపైగా ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులు చేశాడు. అదేవిధంగా ఎనిమిది నెలల క్రితం పెద్ద కుమార్తె పెళ్లి కోసం మరో రూ. లక్ష అప్పు చేశాడు. బంగారం తాకట్టు పెట్టి మరో రూ. లక్ష అప్పు తీసుకున్నాడు. ఈ అప్పుల నుంచి బయటపడే దారిలేక గ్రామ సమీపంలోని చింత చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు శింగనమల ఎస్ఐ హమీద్‌ఖాన్ తెలిపారు.

పరిహారం పంపిణీలో ఎందుకీ వివక్ష?
మిడియం బాబూరావు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులందరికీ ఒకే తరహాలో పరిహారాన్ని పంపిణీ చేయాలని ప్రాజెక్టు నిర్వాసితుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మిడియం బాబూరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సచివాలయంలో సహాయ, పునరావాస ప్యాకేజీ కమిషనర్‌ను బాబూరావు నేతృత్వంలో ఎమ్మెల్సీ వి.బాలసుబ్రమణ్యం, ఎం.కృష్ణమూర్తి, ఎ.రవి, జి.సింహాచలం, వెంకట్రామిరెడ్డి, వై.నాగేంద్ర, జి.వెంకట్రావులు కలసి వినతిపత్రం సమర్పించారు. పట్టిసీమ పథకంలో భాగంగా పోలవరం కుడి కాలువ కింద భూసేకరణకు ఎకరానికి రూ.32 లక్షల నుంచి రూ.50 లక్షల వరకూ పరిహారంగా చెల్లించారని.. పురుషోత్తపట్నం పథకం కింద ఎకరానికి రూ.28 లక్షల పరిహారం ఇచ్చారని గుర్తు చేశారు. కానీ పోలవరం ప్రాజెక్టు భూసేకరణలో ఒక్కో గ్రామంలో ఒక్కో విధంగా పరిహారాన్ని ఇస్తున్నారన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్రాజెక్టుల కింద భూములు కోల్పోయిన వారందరికీ ఒకే తరహాలో పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

కేసుల ఉపసంహరణపై కౌంటర్ దాఖలు చేయండి
రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మంత్రులు, అధికార టీడీపీ ఎమ్మెల్యేలు, నాయకులపై నమోదైన కేసులను ఉపసంహరించుకుంటూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు మంగళవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. కేసుల ఉపసంహరణపై ఇప్పటిదాకా ఎన్ని జీవోలు ఇచ్చారు? కింది కోర్టుల్లో ఆయా కేసుల స్థితిగతులు ఏమిటి? ఎన్ని కేసులను ఉపసంహరించారు? ఇంకా ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి? తదితర వివరాలన్నింటినీ తమ ముందుంచాలని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. ఈ మేరకు హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, పలు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలకు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేసేంత వరకూ కింది కోర్టుల్లో కేసుల ఉపసంహరణ పిటిషన్లు విచారణకు వస్తే వాయిదా తీసుకుంటామంటూ అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ ఇచ్చిన హామీని హైకోర్టు నమోదు చేసింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 19కి వాయిదా వేసింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ జె.ఉమాదేవిలతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది.



ఉపసంహరించే అధికారం ప్రభుత్వానికి లేదు

హత్య, అత్యాచారం, దోపిడీ వంటి తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురు అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు, నాయకులపై కేసులను ఉపసంహరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోలను సవాలు చేస్తూ మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై ఇప్పటికే పలుమార్లు విచారణ జరిపిన ఏసీజే నేతృత్వంలోని హైకోర్టు ధర్మాసనం మంగళవారం మరోసారి విచారించింది. ఈ సందర్భంగా ఆర్కే తరఫు న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి స్పందిస్తూ... కేసులను ఉపసంహరించే అధికారం ప్రభుత్వానికి లేదన్నారు. ఏజీ స్పందిస్తూ.. కేసులను ఉపసంహరించే అధికారం ప్రభుత్వానికి ఉందని సుప్రీంకోర్టు చెప్పిందన్నారు. దీనికి ధర్మాసనం ప్రతిస్పందిస్తూ.. ఓ ఎమ్మెల్యేపై తీవ్ర ఆరోపణలు ఉన్నాయని గుర్తు చేసింది. కావాలంటే తామే సుమోటోగా ఈ కేసును విచారిస్తామని స్పష్టం చేసింది. ఏజీ చెప్పిన విషయాన్ని ధర్మాసనం నమోదు చేసుకుంది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

బాలకృష్ణపై కేసు పెట్టేలా ఆదేశాలివ్వండి
ఓటర్లకు డబ్బు పంపిణీపై హైకోర్టులో వైఎస్సార్‌సీపీ పిటిషన్

సాక్షి, హైదరాబాద్: నంద్యాల ఉప ఎన్నిక సందర్భంగా ఓటర్లకు బహిరంగంగా డబ్బులు పంపిణీ చేసిన టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణపై ఎన్నికల సంఘం అధికారులు కేసు నమోదు చేయకపోవడంపై హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. బాలకృష్ణపై ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం కేసు నమోదు చేసేలా ఎన్నికల అధికారులను ఆదేశించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి కె.శివకుమార్ మంగళవారం పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో బాలకృష్ణతో పాటు కేంద్ర ఎన్నికల సంఘం, ప్రధాన ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారిని ప్రతివాదులుగా పేర్కొన్నారు. టీడీపీ తరఫున బాలకృష్ణ ఈ నెల 16న నంద్యాలలో రోడ్‌షో నిర్వహించారని, ఈ సందర్భంగా ఆయన ఓటర్లకు బహిరంగంగా డబ్బు పంపిణీ చేశారని శివకుమార్ పేర్కొన్నారు. దీనిపై ఫిర్యాదు చేసినా ఎన్నికల అధికారులు పట్టించుకోలేదన్నారు. బాలకృష్ణ డబ్బు పంపిణీ చేయడానికి సంబంధించి తన వద్ద పక్కా ఆధారాలున్నాయని, వీటిని సమర్పించినా కూడా అధికారులు కేసు నమోదు చేయలేదని వివరించారు. అధికార పార్టీ ఎమ్మెల్యే ఈ విధంగా అక్రమాలకు పాల్పడినా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ వ్యవహారంలో కోర్టు జోక్యం చేసుకుంటే తప్ప న్యాయం జరగదని, బాలకృష్ణపై కేసు నమోదు చేసేలా ఆదేశాలు జారీ చేయాలని న్యాయస్థానాన్ని శివకుమార్ కోరారు.


ప్రచారంలో డబ్బు పంచుతున్న బాలకృష్ణ (ఫైల్)

2022 నాటికి ప్రతి ఒక్కరికీ ఇల్లు: దత్తాత్రేయ



కృష్ణరాజపురం (బెంగళూరు): వచ్చే ఐదేళ్లల్లో దేశంలోని ప్రతీ కుటుంబానికి శాశ్వత ఇంటి వసతి కల్పించటమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని కేంద్ర కార్మిక శాఖ మంత్రి బండారు దత్తాత్రేయ తెలిపారు. మంగళవారం బెంగళూరు కేఆర్ పురంలో కార్మిక భవిష్యనిధి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన క్విట్ ఇండియా 75వ వార్షికోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాన్యులతో పాటు కార్మికులకు కూడా 2022 నాటికి శాశ్వత గృహాలు అందించడం, కార్మికుల పదవీ విరమణ సమయంలో భవిష్యనిధితో పాటు మరిన్ని సౌలభ్యాలను అందించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి డీ.వీ.సదానందగౌడ, స్థానిక ఎమ్మెల్యే బవసరాజు, ఎంపీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని కాపాడదాం
రాష్ట్ర దేవాదాయశాఖ స్థపతి పి.పరమేశ్వరప్ప

తాడేపల్లి రూరల్ (మంగళగిరి): సనాతన హిందూధర్మాన్ని కాపాడటం మనందరి బాధ్యతని రాష్ట్ర దేవాదాయశాఖ స్థపతి పి.పరమేశ్వరప్ప చెప్పారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలంలోని సీతానగరం గ్రామంలో మంగళవారం 13 జిల్లాల అర్చక స్వాములు, ఆలయ నిర్వాహకులు, దేవాదాయ డిప్యూటీ స్థపతులు, అసిస్టెంట్ స్థపతుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సీత కార్యాలయంలో అర్చక ట్రెనింగ్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ముఖ్యఅతిథి పరమేశ్వరప్ప మాట్లాడుతూ దేవాలయాల వాస్తు, శిల్పశాస్త్ర విషయాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. సనాతన ధర్మం, ఆలయ సంస్కృతి మహోన్నతమైనవన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ స్థపతులు, అసిస్టెంట్ స్థపతులు పాల్గొన్నారు.

విద్యార్థినులపై దూసుకెళ్లిన టిప్పర్

ఓర్వకల్లు: కర్నూలు జిల్లా ఓర్వకల్లులో మంగళవారం ఉదయం కంకర లోడుతో వెళ్తున్న టిప్పర్ ఇంటర్మీడియట్ విద్యార్థినులపై దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఏడుగురు గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఓర్వకల్లు మండలంలోని శకునాల గ్రామానికి చెందిన మహాలక్ష్మి, నిర్మల, శోభారాణి, మాధవి, హుశేనాపురం గ్రామానికి చెందిన శాంతకుమారి, మమత, కాల్వ గ్రామానికి చెందిన సుస్మిత, ఓర్వకల్లుకు చెందిన పరిమళలు మండల కేంద్రంలోని ఆర్సీ ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నారు. వీరు ఉదయం స్థానిక బస్టాండు నుంచి రోడ్డు వెంట నడుచుకుంటూ కళాశాలకు బయల్దేరారు. మరో రెండు నిమిషాల్లో వీరు కళాశాలకు చేరుకుంటారనగా.. ఓర్వకల్లు మండలం వెంకటాపురం నుంచి కర్నూలుకు కంకర తీసుకెళ్తున్న టిప్పర్ వేగంగా వారిపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇంటర్ ఫస్టియర్ విద్యార్థిని శాంతకుమారి (16) అక్కడికక్కడే మృతి చెందింది. మిగిలినవారు గాయపడగా, వీరిలో మహాలక్ష్మి (16) పరిస్థితి విషమంగా ఉంది. వీరికి కర్నూలు సర్వజనాస్పత్రిలో చికిత్స అందజేస్తున్నారు. డ్రైవర్ మద్యం మత్తులో వాహనం నడపడమే ప్రమాదానికి కారణంగా పోలీసులు భావిస్తున్నారు.

మీకు రూ.4కోట్లు.. మాకు రూ.12లక్షలా!?

- ఎన్నికల్లో కోట్లుకోట్లు పంచుతున్నారు.. రైతులకు ఇవ్వడానికి డబ్బుల్లేవా?
- ప్రభుత్వ తీరుపై నిడమర్రు రైతుల ఆగ్రహం
- భూసేకరణ సమావేశం బహిష్కరణ

నిడమర్రు (మంగళగిరి) : 'ఎకరాకు రూ.12 లక్షల ధర అని ఏ ప్రాతిపదికన నిర్ణయించారు.. ఒక్క సెంటు భూమి రూ.12లక్షలకు ఇప్పించండి.. ఇప్పుడే కొంటాం.. రైతుల నుంచి లాక్కున్న భూములను మాత్రం చంద్రబాబు రూ.4 కోట్లకు అమ్ముకుంటారా? రైతులకు మాత్రం రూ.12 లక్షలు ముష్టి వేస్తారా? ఎన్నికల్లో కోట్లు పంచుతున్నారు.. రైతులకు ఇవ్వడానికి ప్రభుత్వం వద్ద డబ్బులుండవా?' అంటూ రాజధాని ప్రాంత రైతులు సీఆర్‌డీఏ అధికారులతో పాటు ఈపీటీఆర్ఐ సంస్థ ప్రతినిధులను నిలదీశారు. దీంతో వారు సమాధానం చెప్పలేక నీళ్లనమిలారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలంలోని నిడమర్రు గ్రామంలో మంగళవారం సీఆర్‌డీఏ, ఈపీటీఆర్ఐ (ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ట్రెనింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్) పర్యావరణ పరిరక్షణ పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో 'భూసేకరణపై సామాజిక ప్రభావ అంచనా' అంశంపై గ్రామ సర్పంచ్ మండెపూడి మణెమ్మ అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు.


సమావేశాన్ని బహిష్కరించి వెళ్తున్న సర్పంచ్ మణెమ్మ, ఎంపీటీసీలు నాగరత్నం, మర్రెడ్డి తదితరులు

ధర నిర్ణయంపై రైతుల్లో ఆగ్రహం

ఈపీటీఆర్ఐ సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. తాము గతంలో సమావేశం నిర్వహించగా, రైతుల కోరిక మేరకు మళ్లీ సమగ్ర సర్వేచేసి రైతుల అభిప్రాయాలు కోరేందుకు సమావేశం ఏర్పాటుచేశామని తెలిపారు. భూసేకరణ చేస్తే ఎకరాకు రూ.12 లక్షలుగా తాము ధర నిర్ణయించామని వారు చెప్పారు. దీంతో రైతులు ఒక్కసారిగా భగ్గుమన్నారు. తాము తొలి నుంచి భూములు ఇచ్చేందుకు వ్యతిరేకిస్తున్నా మళ్లీమళ్లీ సమావేశాలు ఎందుకు ఏర్పాటుచేస్తున్నారని ప్రశ్నించారు. అసలు ఈపీటీఆర్ఐ తయారుచేసిన 134 పేజీల నివేదికలను రైతులకు మూడు రోజుల ముందు పంచాల్సి ఉండగా ఎందుకు పంపిణీ చేయలేదని నిలదీశారు. రైతులకు ఇప్పుడు నివేదికలిస్తే వారు ఎప్పుడు చదువుకుని మీకు అభిప్రాయాలు చెబుతారని నిలదీశారు. భూసమీకరణను వ్యతిరేకిస్తూ మూడుసార్లు పంచాయతీ తీర్మానాలను కలెక్టర్‌కు పంపామని, మండల పరిషత్ సైతం భూసమీకరణను వ్యతిరేకిస్తూ తీర్మానించిందని రైతులు చెప్పారు.

ఒక్క వాగ్దానాన్నీ నెరవేర్చలేదు...

ఇప్పటివరకు సమీకరణ సమయంలో ప్రభుత్వం ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్నీ నెరవేర్చలేదని... ఇప్పుడు సేకరణ అంటూ ముందుకు వచ్చి తమను ఆందోళనకు గురిచేయడం మానుకోవాలని రైతులు కోరారు. ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందన్నారు. సమీకరణ పేరుతో ఎకరా భూమి తీసుకుని 25 సెంట్లు మాత్రమే తిరిగి ఇచ్చి.. పదేళ్లు మాత్రమే కౌలు చెల్లించి.. మిగిలిన 75 సెంట్లను ఊరికే కొట్టేస్తోందంటూ సమావేశాన్ని బహిష్కరించారు. దీంతో అధికారులు కూడా సభను రద్దుచేసి వెళ్లిపోయారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు కొదమగొండ్ల నాగరత్నం, మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, ఉప సర్పంచ్ ఉయ్యూరు వెంకటరెడ్డి, సీఆర్‌డీఏ డెప్యూటీ కలెక్టర్లు పెద్దిరాజు, మాధురి, తహసీల్దార్లు శ్రీనివాస్, కళ్యాణి, ఈపీటీఆర్ఐ సంస్థ ప్రతినిధులు రాము, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మాండంగా బ్రహ్మోత్సవాలు
టీటీడీ జేఈవో కేఎస్ శ్రీనివాసరాజు



సాక్షి,తిరుమల: తిరుమల శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 23 నుంచి అక్టోబర్ 1 వరకు జరగనున్నాయని, ఇందు కోసం ఏర్పాట్లు బ్రహ్మాండంగా సాగుతున్నాయని తిరుమల జేఈవో కేఎస్ శ్రీనివాసరాజు అన్నారు. మంగళవారం ఆయన తిరుమలలోని అన్నమయ్య భవన్ అతిథిగృహంలో ఉత్సవ ఏర్పాట్లపై సీనియర్ అధికారులతో సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఇప్పటికే ఏర్పాట్లు దాదాపుగా పూర్తి దశకు చేరకున్నాయని, మిగిలిన పనులు సెప్టెంబర్ మొదటి వారానికి పూర్తి చేస్తామన్నారు. ప్రధానంగా ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఉత్సవ మూర్తిని దర్శించుకునేందుకు వేచి ఉండే భక్తుల ఏర్పాట్లపై దృష్టిసారించామన్నారు. ఆమేరకు గ్యాలరీలు, మంచినీరు, మరుగుదొడ్లు, అత్యవసర చికిత్సాకేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. సెప్టెంబరు 6వ తేది పౌర్ణమి గరుడవాహన సేవను మాదిరి బ్రహ్మోత్సవ గరుడవాహన సేవగా నిర్వహిస్తామన్నారు.

సూపర్ షరపోవా



'గ్రాండ్'గా రష్యా స్టార్ పునరాగమనం

- యూఎస్ ఓపెన్ తొలి రౌండ్‌లో రెండో సీడ్ హలెప్‌పై విజయం

న్యూయార్క్: డోపింగ్ కారణంగా 15 నెలల పాటు ఆటకు దూరమైనా... తన ఆటతీరులో ఏమాత్రం పదును తగ్గలేదని రష్యా టెన్నిస్ స్టార్ మరియా షరపోవా నిరూపించుకుంది. సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్‌లో ఈ మాజీ నంబర్‌వన్ ఘనంగా పునరాగమనం చేసింది. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో షరపోవా 6–4, 4–6, 6–3తో ప్రపంచ రెండో ర్యాంకర్, రెండో సీడ్ సిమోనా హలెప్ (రొమేనియా)ను బోల్తా కొట్టించింది. 2 గంటల 45 నిమిషాలపాటు జరిగిన ఈ పోరులో షరపోవా ఖాతాలో 60 విన్నర్స్, 64 అనవసర తప్పిదాలు, ఏడు ఏస్‌లు, ఏడు డబుల్ ఫాల్ట్‌లు ఉన్నప్పటికీ... కీలక దశలో పాయింట్లు నెగ్గడం ఆమెకు కలిసొచ్చింది. మరోవైపు హలెప్ కేవలం 15 విన్నర్స్ సాధించింది. షరపోవా సర్వీస్‌ను పదిసార్లు బ్రేక్ చేసే అవకాశం వచ్చినా హలెప్ నాలుగుసార్లు మాత్రమే సఫలమైంది. తన సర్వీస్‌ను మాత్రం ఐదుసార్లు కోల్పోయింది. షరపోవా చేతిలో హలెప్‌కిది వరుసగా ఏడో పరాజయం. యూఎస్ ఓపెన్ తుది ఫలితం ద్వారా ఈసారి మహిళల సింగిల్స్‌లో ఏకంగా ఎనిమిది మందికి టాప్ ర్యాంకర్ అయ్యే అవకాశం ఉండగా... ఈ ఓటమితో హలెప్‌కు ప్రపంచ నంబర్‌వన్ ర్యాంకర్ అయ్యే అవకాశం చేజారిపోయింది.


ఆరో సీడ్ కెర్బర్, ఏడో సీడ్ కొంటా అవుట్...

మరోవైపు ఆరో సీడ్ ఎంజెలిక్ కెర్బర్ (జర్మనీ), ఏడో సీడ్ జొహానా కొంటా (బ్రిటన్) తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. నవోమి ఒసాకా (జపాన్) 6–3, 6–1తో కెర్బర్‌ను... క్రునిక్ (సెర్బియా) 4–6, 6–3, 6–4తో కొంటాను ఓడించి సంచలనం సృష్టించారు. గత ఏడాది రన్నరప్, ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ కరోలినా ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్) శుభారంభం చేసింది. తొలి రౌండ్‌లో ప్లిస్కోవా 6–2, 6–1తో మగ్దా లినెట్టి (పోలాండ్)పై అలవోకగా గెలిచింది. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో మాజీ చాంపియన్, తొమ్మిదో సీడ్ వీనస్ విలియమ్స్ (అమెరికా) 6–3, 3–6, 6–2తో కుజ్‌మోవా (స్లొవేకియా)పై, 23వ సీడ్ స్ట్రికోవా (చెక్ రిపబ్లిక్) 6–1, 6–3తో మిసాకి దోయి (జపాన్)పై గెలిచారు.

పురుషుల సింగిల్స్‌లో మాజీ చాంపియన్, ఐదో సీడ్ మారిన్ సిలిచ్ (క్రొయేషియా), నాలుగో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ), ఎనిమిదో సీడ్ సోంగా (ఫ్రాన్స్), పదో సీడ్ జాన్ ఇస్నెర్ (అమెరికా) రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. తొలి రౌండ్‌లో సిలిచ్ 6–4, 6–3, 3–6, 6–3తో సాండ్‌గ్రెన్ (అమెరికా)పై, జ్వెరెవ్ 7–6 (11/9), 7–5, 6–4తో డారియన్ కింగ్ (బార్బడోస్)పై, సోంగా 6–3, 6–3, 6–4తో కోపిల్ (రొమేనియా)పై, ఇస్నెర్ 6–1, 6–3, 4–6, 6–3తో హెర్బెర్ట్ (ఫ్రాన్స్)పై విజయం సాధించారు.

గౌరవ్‌కు పతకం ఖాయం

ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్


గౌరవ్

హాంబర్గ్ (జర్మనీ): అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న భారత బాక్సర్ గౌరవ్ బిధురి సంచలనం సృష్టించాడు. ప్రపంచ సీనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ చరిత్రలో పతకం నెగ్గిన నాలుగో భారతీయ బాక్సర్‌గా గుర్తింపు పొందాడు. ఈ మెగా ఈవెంట్‌కు గౌరవ్ నేరుగా అర్హత పొందకపోయినా ఆసియా బాక్సింగ్ సమాఖ్య 'వైల్డ్ కార్డు' ఇవ్వడంతో బరిలోకి దిగాడు. వాస్తవానికి ఈ వైల్డ్ కార్డు ఎంట్రీ భూటాన్‌కు కేటాయించినా వారు ఆసక్తి చూపకపోవడంతో గౌరవ్‌కు ఈ అవకాశం లభించింది. మంగళవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో గౌరవ్ 3–0తో బిలెల్ మహమ్‌దీ (ట్యూనిషియా)పై విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. తద్వారా కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకున్నాడు. ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్ చరిత్రలో ఇప్పటివరకు భారత్ తరఫున విజేందర్ సింగ్ (2009), వికాస్ కృషన్ (2011), శివ థాపా (2015) కాంస్య పతకాలను సాధించారు. వీరి సరసన గౌరవ్ కూడా చేరనున్నాడు. మరోవైపు ఒలింపిక్ చాంపియన్ హసన్‌బాయ్ దుస్‌మతోవ్ (ఉజ్బెకిస్తాన్)తో జరిగిన 49 కేజీల విభాగం క్వార్టర్ ఫైనల్లో అమిత్ ఫంగల్ (భారత్)... కిమ్ ఇన్‌క్యు (దక్షిణ కొరియా)తో జరిగిన 52 కేజీల విభాగం క్వార్టర్ ఫైనల్లో కవీందర్ బిష్త్ (భారత్) ఓడిపోయారు. దాంతో ఈ పోటీల్లో భారత్ ఖాతాలో ఒక పతకం మాత్రమే చేరనుంది.

ఆసీస్ లక్ష్యం 265

ఢాకా: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో ఆస్ట్రేలియా విజయం దిశగా పయనిస్తోంది. 265 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన ఆసీస్‌కు ఓపెనర్ డేవిడ్ వార్నర్ (96 బంతుల్లో 75 బ్యాటింగ్; 11 ఫోర్లు, 1 సిక్స్) అజేయ అర్ధ సెంచరీతో అండగా నిలిచాడు. దీంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆసీస్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 30 ఓవర్లలో 2 వికెట్లకు 109 పరుగులు చేసింది. విజయానికి ఇంకా 156 పరుగులు చేయాల్సి ఉండగా ఆటకు మరో రెండు రోజుల సమయం ఉంది. క్రీజులో స్మిత్ (25 బ్యాటింగ్) కూడా ఉన్నాడు. అంతకుముందు బంగ్లా రెండో ఇన్నింగ్స్‌లో 79.3 ఓవర్లలో 221 పరుగులకు ఆలౌట్ అయ్యింది. నాథన్ లియోన్ ఆరు వికెట్లతో చెలరేగగా తమీమ్ ఇక్బాల్ (155 బంతుల్లో 78; 8 ఫోర్లు), ముష్ఫికర్ రహీమ్ (41) మెరుగ్గా ఆడారు.

వచ్చేసారి స్వర్ణం సాధిస్తా!



ప్రపంచ చాంపియన్ అవుతాననే నమ్మకముంది

బ్యాడ్మింటన్‌కు ఆదరణ బాగా పెరిగింది • మీడియాతో పీవీ సింధు

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ఫైనల్లో పరాజయం పాలైనా... తర్వాతి ప్రయత్నంలో తాను స్వర్ణం సాధిస్తానని భారత స్టార్ క్రీడాకారిణి పూసర్ల వెంకట (పీవీ) సింధు విశ్వాసం వ్యక్తం చేసింది. గ్లాస్గోలో ముగిసిన ఈ మెగా ఈవెంట్‌లో సింధు రజతం సాధించిన సంగతి తెలిసిందే. గతంలో కాంస్యానికే పరిమితమైన తాను ముందుగా అనుకున్నట్లుగా మరింత మెరుగైన ప్రదర్శన ఇవ్వడం సంతృప్తి కలిగించిందని ఆమె చెప్పింది. స్కాట్లాండ్ నుంచి మంగళవారం నగరానికి తిరిగి వచ్చిన అనంతరం సింధు మీడియాతో మాట్లాడింది. విశేషాలు ఆమె మాటల్లోనే...

రజత పతకం సాధించడంపై...

రియో ఒలింపిక్స్ తర్వాత ఏడాది వ్యవధిలోనే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పతకం సాధించడం చాలా సంతోషంగా ఉంది. టోర్నీకి వెళ్లే ముందు నాపై నేను పెట్టుకున్న నమ్మకం నిజమైంది. ఫైనల్ మ్యాచ్ నా కెరీర్‌లోనే అత్యుత్తమమైంది. ఓవరాల్‌గా నా కెరీర్ చాలా అద్భుతంగా సాగుతోంది. వచ్చేసారి బంగారు పతకం సాధించగలనని గట్టిగా చెప్పగలను. టోర్నీలో నా సహజ శైలిలోనే ఆడే ప్రయత్నం చేశాను తప్ప చైనా ప్రత్యర్థులతో పోల్చుకుంటూ వారిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టలేదు. అయితే వరల్డ్ చాంపియన్‌షిప్ కోసం సన్నద్ధమయ్యేందుకు మాకు తగిన సమయం లభించింది. దాదాపు రెండు నెలల పాటు తీవ్రంగా సాధన చేశాం. అదే ఇప్పుడు ఫలితాన్ని చూపించింది.

ఫైనల్ మ్యాచ్‌పై...

చివరి గేమ్‌లో 20–20తో ఉన్నప్పటికీ మ్యాచ్ కోల్పోవడం మాత్రం నన్ను చాలా కాలం వెంటాడవచ్చు. ఇది మాత్రం చాలా నిరాశ కలిగించింది. అయితే ఇద్దరం హోరాహోరీగా తలపడ్డాం. శారీరకంగా, మానసికంగా అలసిపోయాం. అయితే శక్తిని దాచుకొని చివర్లో చెలరేగిపోదామనే పరిస్థితి అక్కడ లేదు. అది ప్రపంచ చాంపియన్‌షిప్ ఫైనల్ కాబట్టి ఎవరూ వెనక్కి తగ్గలేదు. చివరకు అది నా రోజు కాకుండా పోయింది. ఇంత గొప్ప మ్యాచ్‌లో భాగమైనందుకు గర్వంగా ఉంది. స్టేడియంలో పెద్ద సంఖ్యలో భారత అభిమానులు మమ్మల్ని ప్రోత్సహించడం మరచిపోలేను.

సుదీర్ఘ ర్యాలీలపై...

73 షాట్‌ల ర్యాలీ నా జీవితంలో ఎప్పుడూ ఆడలేదు. ఇటీవల బ్యాడ్మింటన్‌లో ర్యాలీల ప్రాధాన్యత పెరిగింది. సుదీర్ఘ ర్యాలీలు తరచుగా పెద్ద సంఖ్యలో నమోదవుతున్నాయి. వాటి ద్వారా పాయింట్లు సాధించేందుకు ఆటగాళ్లు ప్రయత్నిస్తున్నారు. ఆ రకంగా చూస్తే మేం ఆడిన మ్యాచ్ ఈ ఆటలో ఫిట్‌నెస్ ప్రాధాన్యతను మరోసారి గుర్తు చేసింది. ఎవరూ సునాయాసంగా పాయింట్లు ఇవ్వడం లేదు. దాని కోసం ప్రతి ఆటగాడు అదనంగా శ్రమించాల్సి వస్తోంది.

ఆటకు లభిస్తున్న ప్రాధాన్యతపై...

సచిన్‌తో నన్ను పోలుస్తూ కొంత మంది వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదు. క్రికెట్ వేరు, సచిన్ స్థాయి వేరు. అయితే బ్యాడ్మింటన్ విలువ చాలా పెరిగిందని మాత్రం కచ్చితంగా చెప్పగలను. ముఖ్యంగా గత ఏడాది నేను రియోలో ఒలింపిక్స్ పతకం సాధించిన తర్వాత ఈ సంవత్సర కాలంలో పరిస్థితులు చాలా మారిపోయాయి. ఈ ఆటలో మరింత మెరుగైన ఫలితాల కోసం అంతా ఎదురు చూస్తున్నారు. భారత్‌లో కూడా పెరిగిన క్రేజ్ గురించి కొత్తగా చెప్పనవసరం లేదు. అసలు ఈ ప్రపంచ చాంపియన్‌షిప్ ఫైనల్లో నేను, సైనా నెహ్వాల్ తలపడతామని కూడా చాలా మంది అనుకున్నారు. ఈ సారి జరగకపోయినా అది ఎప్పుడైనా సాధ్యమే.

ఫైనల్ తర్వాత వేడుకలపై...

ఓటమి తర్వాత బాగా నిరాశ చెందాను. బహుమతి ప్రదానోత్సవానికి అందరితో కలిసి వెళ్లే సమయానికి కాస్త కోలుకోగలిగాను. తర్వాతి రోజు మాత్రం అంతా సాధారణంగా మారిపోయింది. ఆటలో ఏదీ అసాధ్యం కాదని అప్పుడు నాకు నేను గట్టిగా చెప్పుకున్నాను. అయితే ఫైనల్లో తీవ్రంగా అలసిపోవడంతో పాటు సమయాభావం కారణంగా ప్రత్యేకంగా సంబరాలు చేసుకునే అవకాశం కలగలేదు. ఇప్పుడు ఆ లోటును పూర్తి చేసుకుంటానేమో!

22 ఏళ్లకే ఇన్ని సాధిస్తే...

- ఇకపైనా సింధుకు తిరుగుండదు
- కోచ్ గోపీచంద్ ఆశాభావం

సాక్షి, హైదరాబాద్: బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రెండు పతకాలతో మన జట్టు మరో మెట్టు ఎక్కిందని భారత చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ అభిప్రాయపడ్డారు. ఈ మెగా ఈవెంట్‌లో రజత, కాంస్యాలు సాధించిన పీవీ సింధు, సైనా నెహ్వాల్‌లను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. భవిష్యత్తులో మరిన్ని ఘనతలు సాధించగల సత్తా సింధులో ఉందని ఆయన అన్నారు. ఇంకా గోపీచంద్ ఏమన్నారంటే...

ఇలాంటి మ్యాచ్ జీవితంలో చూడలేదు...

సింధు వయసు కేవలం 22 ఏళ్లు. ఇప్పటికే 3 ప్రపంచ చాంపియన్‌షిప్ పతకాలు, ఒలింపిక్ మెడల్‌తో పాటు రెండు సూపర్ సిరీస్ టోర్నీలలో విజేతగా నిలిచింది. ఇది చాలా పెద్ద ఘనత. ఇక ముందు ఆమె ఇదే తరహాలో కష్టపడితే పెద్ద సంఖ్యలో విజయాలు ఆమె ఖాతాలో చేరతాయి. సింధు ఆడిన ఫైనల్ మ్యాచ్‌లాంటిది నా జీవితంలో ఎప్పుడూ చూడలేదు. కోచ్ స్థానంలో కూర్చున్న నాతో పాటు దేశంలో ఎంతో మంది ఈ మ్యాచ్‌ను ఊపిరి బిగబట్టి చూడటమే ఈ మ్యాచ్ గొప్పతనం గురించి చెబుతోంది.



షెడ్యూల్‌ను సాకుగా చూపించలేము...

అంపైర్ నిబంధనల ప్రకారమే సింధును ఎల్లో కార్డుతో హెచ్చరించారు. మ్యాచ్‌ల సందర్భంగా ఇలాంటివి చిన్న విషయాలే. మ్యాచ్ సమయాలను ప్రసారకర్తలు నిర్ణయించడం సరైంది కాకపోయినా... భారత్‌లోని ప్రేక్షకులను దృష్టిలో ఉంచుకోవడం వల్ల కొన్ని సార్లు ఇది తప్పదు. అయితే మ్యాచ్ తుది ఫలితానికి దీనిని సాకుగా చూపించలేము.

ఫిట్‌నెస్ ప్రమాణాలు పెంచుకోవాలి...

ప్రస్తుతం ప్రపంచ బ్యాడ్మింటన్‌లో ఫిట్‌నెస్ ప్రమాణాలు ఎంతో పెరిగాయి. ఆ స్థాయికి చేరడంపై మనం కూడా దృష్టి పెట్టాం. వరల్డ్ చాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించకపోయినా శ్రీకాంత్, సాయిప్రణీత్ చక్కటి ప్రదర్శన కనబర్చారు. మొత్తంగా మన షట్లర్ల ఆట పట్ల సంతృప్తిగా ఉన్నాను.

మెరుగైన స్థితిలో ఉన్నాం...

ప్రస్తుత భారత క్రీడారంగం గతంలోకంటే ఎంతో మెరుగైన స్థితిలో ఉంది. భారత ప్రధాన మంత్రి ఒకరు క్రీడల గురించి, క్రీడలను ప్రోత్సహించడం గురించి ఇంత తరచుగా మాట్లాడటం గతంలో ఎప్పుడూ జరగలేదు. అత్యున్నత స్థాయి అధికారులు ఆటలు, సౌకర్యాల గురించి ఇంత ఎక్కువగా చర్చించడం కూడా ఇప్పుడే కనిపిస్తోంది. ఇది మన ఆటలకు మేలు చేసే అంశం. ఇప్పటి వరకైతే క్రీడలు సరైన దిశలో సాగుతున్నాయి. ఇక ముందు ఇంకా చేయాల్సింది చాలా ఉంది.

విండీస్ సంచలనం

రెండో టెస్టులో ఇంగ్లండ్‌పై 5 వికెట్లతో గెలుపు


హోప్

లీడ్స్: షాయ్ హోప్ (211 బంతుల్లో 118 నాటౌట్; 14 ఫోర్లు) పేరుకు తగ్గట్టుగానే వెస్టిండీస్ జట్టుకు ఆశాకిరణమయ్యాడు. 322 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన విండీస్‌కు తను వరుసగా రెండో శతకం బాది చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. 5/0 ఓవర్‌నైట్ స్కోరుతో చివరి రోజు ఆటను ప్రారంభించిన పర్యాటక జట్టు తమ రెండో ఇన్నింగ్స్‌లో 91.2 ఓవర్లలో ఐదు వికెట్లకు 322 పరుగులు చేసి నెగ్గింది. 2000 తర్వాత ఇంగ్లండ్ గడ్డపై విండీస్ టెస్టు విజయాన్ని అందుకోవడం విశేషం. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ చేసిన ఓపెనర్ బ్రాత్‌వైట్ (180 బంతుల్లో 95; 12 ఫోర్లు) కొద్దిలో మరో శతకాన్ని కోల్పోయాడు. బ్లాక్‌వుడ్ (45 బంతుల్లో 41; 3 ఫోర్లు, 2 సిక్సర్లు) వేగంగా ఆడాడు. మొయిన్ అలీకి రెండు వికెట్లు దక్కాయి.

ఘనంగా జాతీయ క్రీడా పురస్కారాల ప్రదానం

'ఖేల్‌రత్న' అందుకున్న జజరియా, సర్దార్ సింగ్

- 'అర్జున' స్వీకరించిన సాకేత్, జ్యోతి సురేఖ
- ప్రసాద్‌కు 'ద్రోణాచార్య' • హకీమ్‌కు 'ధ్యాన్‌చంద్'

న్యూఢిల్లీ: హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జరిగిన జాతీయ క్రీడా అవార్డుల పురస్కార కార్యక్రమం మంగళవారం వైభవంగా జరిగింది. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ వేడుకల్లో అత్యున్నత రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న అవార్డును పారాలింపియన్ దేవేంద్ర జజరియాతో పాటు హాకీ సీనియర్ ఆటగాడు సర్దార్ సింగ్... రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా అందుకున్నారు. వీరికి జ్ఞాపికతో పాటు రూ.7.5 లక్షల చొప్పున చెక్‌ను అందించారు. 2004 ఏథెన్స్, 2016 రియో పారాలింపిక్స్‌లో స్వర్ణాలు సాధించిన తొలి భారత క్రీడాకారుడిగా జావెలిన్ త్రోయర్ జజరియా నిలిచాడు. ఇక గత కొన్నేళ్లుగా మిడ్ ఫీల్డర్ సర్దార్ సింగ్ భారత విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు. అలాగే 17 మంది క్రీడాకారులు అర్జున అవార్డు దక్కించుకోగా... కౌంటీ మ్యాచ్‌ల్లో ఆడుతున్న కారణంగా క్రికెటర్ చతేశ్వర్ పుజారా ఈ కార్యక్రమానికి హాజరుకాలేకపోయాడు. మిగతా వారంతా అర్జునను స్వీకరించారు. ఇందులో తెలుగు తేజాలు సాకేత్ మైనేని (టెన్నిస్), జ్యోతి సురేఖ (ఆర్చరీ) కూడా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌కే చెందిన జీఎస్‌ఎస్‌వీ ప్రసాద్ 'ద్రోణాచార్య' (లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్)... ఫుట్‌బాల్ క్రీడాభివృద్ధికి గుర్తింపుగా తెలంగాణకు చెందిన ఒలింపియన్ సయ్యద్ షాహిద్ హకీమ్ 'ధ్యాన్‌చంద్' అవార్డులను అందుకున్నారు. రియో పారాలింపిక్స్ హైజంప్ (ఎఫ్46)లో స్వర్ణం సాధించిన మరియప్పన్ తంగవేలు అర్జున స్వీకరించేందుకు వస్తున్న సమయంలో ఆహుతుల నుంచి విశేష స్పందన కనిపించింది. రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ అవార్డును రిలయన్స్ ఫౌండేషన్ యూత్ స్పోర్ట్స్ తరఫున నీతా అంబానీ స్వీకరించారు. అర్జున, ద్రోణాచార్య, ధ్యాన్‌చంద్ అవార్డు గ్రహీతలు జ్ఞాపిక, సర్టిఫికెట్‌లతో పాటు రూ. 5 లక్షల చొప్పున చెక్‌ను అందుకున్నారు.

'దివ్యాంగ అథ్లెట్లకు ప్రోత్సాహం అందించాలి'

భారత పారా అథ్లెట్లకు ఇది చరిత్రాత్మకమైన రోజు అని దేవేంద్ర జజరియా అభిప్రాయపడ్డాడు. 'నాలాంటి వారు భారత్‌లో ఐదు కోట్ల మంది అథ్లెట్లు ఉన్నారు. వారికి మరింత తోడ్పాటు అవసరం. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగ క్రీడాకారుల కోసం చాలా చేయాల్సి ఉంది' అని 31 ఏళ్ల జజరియా కోరాడు.

అవార్డు గ్రహీతలు

ఖేల్‌రత్న: దేవేంద్ర జజరియా(పారాథ్లెట్, జావెలిన్ త్రో), సర్దార్‌సింగ్ (హాకీ). **అర్జున:** సాకేత్ మైనేని (టెన్నిస్), జ్యోతి సురేఖ (ఆర్చరీ), హర్మన్‌ప్రీత్ కౌర్ (క్రికెట్), ఖుష్బీర్ కౌర్, రాజీవ్ (అథ్లెటిక్స్), ప్రశాంతి సింగ్ (బాస్కెట్‌బాల్), దేవేంద్రో సింగ్ (బాక్సింగ్), బెంబెమ్ దేవి (ఫుట్‌బాల్), ఎస్‌ఎస్‌పీ చౌరాసియా (గోల్ఫ్), ఎస్‌వీ సునీల్ (హాకీ), జస్వీర్ సింగ్ (కబడ్డీ), ప్రకాష్ నంజప్ప (షూటింగ్), ఆంథోనీ అమల్‌రాజ్ (టీటీ), సత్యవర్త్ కడియాన్ (రెజ్లింగ్), తంగవేలు, వరుణ్ భటి (పారా అథ్లెట్స్). పుజారా (క్రికెట్). **ద్రోణాచార్య:** దివంగత డాక్టర్ ఆర్.గాంధీ (అథ్లెటిక్స్), జీఎస్‌ఎస్‌వీ ప్రసాద్ (బ్యాడ్మింటన్), బీబీ మహంతి (బాక్సింగ్), హీరానంద్ (కబడ్డీ), రాఫెల్ (హాకీ), సంజయ్ చక్రవర్తి (షూటింగ్), రోషన్ లాల్ (రెజ్లింగ్). **ధ్యాన్‌చంద్:** భూపిందర్ సింగ్ (అథ్లెటిక్స్), సయ్యద్ షాహిద్ హకీమ్ (ఫుట్‌బాల్), సుమరాయ్ టెటె (హాకీ).


రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా జాతీయ క్రీడా పురస్కారాలను స్వీకరిస్తున్న దేవేంద్ర జజరియా, సర్దార్ సింగ్ (ఖేల్‌రత్న), సాకేత్ మైనేని, జ్యోతి సురేఖ (అర్జున), గంగుల ప్రసాద్ (ద్రోణాచార్య లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్), హకీమ్ (ధ్యాన్‌చంద్ అవార్డు) కుడి నుంచి...

ముద్రగడ పాదయాత్ర కొనసాగిస్తారా?

నేడు కిర్లంపూడిలో రాష్ట్ర కాపు జేఏసీ భేటీ

జగ్గంపేట: రిజర్వేషన్‌లు సాధన దిశగా కాపు నేతలు బుధవారం కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వచ్చే కాపు ఐక్యకార్యాచరణ కమిటీ (జేఏసీ) నేతలు కిర్లంపూడిలోని ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం నివాసంలో సమావేశం కానున్నారు. గతనెల 26న ముద్రగడ తలపెట్టిన పాదయాత్రను ప్రభుత్వం అడ్డుకుంటున్న నేపథ్యంలో జేఏసీ భేటీపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. నిరవధిక పాదయాత్రగా ముందే ముద్రగడ ప్రకటించడంతో యాత్ర కొనసాగించేలా నిర్ణయం తీసుకుంటారా లేదా తాత్కాలికంగా కొన్ని రోజులు విరామం తీసుకుంటారా అనేది ఆసక్తిగా మారింది. ఆదివారం ముద్రగడ పాదయాత్రకు పెద్ద సంఖ్యలో కాపులు తరలివచ్చిన నేపథ్యంలో ప్రస్తుతం కిర్లంపూడిలో భారీగా పోలీసులు మోహరించారు. ముద్రగడ నివాసానికి వెళ్లడానికి ప్రజలను అనుమతించడం లేదు. ముద్రగడను మంగళవారం సాయంత్రం కిర్లంపూడిలోని ఆయన నివాసంలో మాజీ ఎంపీ హర్షకుమార్, వైఎస్సార్ కాంగ్రెస్ నాయకులు కందుల దుర్గేష్, రౌతు సూర్యప్రకాశరావు, కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజులు కలసి మద్దతు తెలిపారు. 30 రోజులుగా ముద్రగడను గృహ నిర్బంధం చేయడం దారుణమని మండిపడ్డారు. ముద్రగడతో జేఏసీ నాయకులు ఆకుల రామకృష్ణ, ఆరేటి ప్రకాష్, గౌతు స్వామి, చల్లా సత్యనారాయణ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పంతం నానాజీ తదితరులు ఉన్నారు.

డేరా బాబా గురువు చంద్రబాబా

- **వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కొడాలి నాని ధ్వజం**
- **వైఎస్ జగన్ గురించి నోటికొచ్చినట్లు మాట్లాడితే సహించం**

సాక్షి, హైదరాబాద్

ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన మంత్రులు నోటికొచ్చినట్టు మాట్లాడితే ఎంతమాత్రం సహించబోమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కొడాలి నాని హెచ్చరించారు. దమ్ము, ధైర్యం ఉంటే పార్టీ ఫిరాయించి, టీడీపీలో చేరిన 20 మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి, మళ్లీ ఎన్నికల్లో గెలిపించుకోవాలని సవాల్ విసిరారు. నంద్యాలలో డబ్బు వెదజల్లి, ప్రజలను ప్రలోభపెట్టి అధికార పార్టీ గెలిచిందని విమర్శించారు. తమ నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి పోరాటయోధుడని చెప్పారు. చంద్రబాబు ఎంతకైనా దిగజారుతాడని తెలిసి కూడా నంద్యాలలో పోరాటం చేశారని అన్నారు. నాని మంగళవారం హైదరాబాద్ లోటస్‌పాండ్‌లోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. సీఎం చంద్రబాబుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. నాని ఇంకా ఏం చెప్పారంటే....

''సొంత నియోజకవర్గంలోనే ఓడిపోయిన చరిత్ర చంద్రబాబుది. డేరా బాబా గురువు చంద్రబాబా. చంద్రబాబు మాదిరే డేరా బాబా కూడా ట్రస్ట్, పార్టీ, ప్రజాస్వామ్యం అంటూ మహిళలను వంచించాడు. డేరా బాబాకు పట్టిన గతే చంద్రబాబుకు సైతం పట్టడం ఖాయం. ఎవరైనా సీబీఐకు లేఖ రాస్తే, దానిపై విచారణ జరిగితే... చంద్రబాబు రాజకీయ జీవితమంతా జైల్లో గడపక తప్పదు. చంద్రబాబు ఎంత నీచుడో ఆయన కుటుంబ సభ్యులే



చెప్పారు. అతడు నమ్మక ద్రోహి, ఔరంగజేబులాంటి నీచుడు అని పిల్లనిచ్చిన మామ ఎన్టీఆరే చెప్పారు.

అధికారం, డబ్బు, సానుభూతి

నంద్యాలలో జగన్ దెబ్బకు చంద్రబాబు భయపడ్డాడు. కౌంటింగ్‌లో ఫలితం అనుకూలంగా వచ్చాక ప్రధాని అయినంతగా సంబరాలు చేసుకుంటున్నాడు. నంద్యాలలో అధికారం, డబ్బు, సాను భూతి అన్నీ కలిపినా టీడీపీకి 56 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. అధికార పార్టీ ధనబలం, అంగబలం ఉపయోగిస్తుందని తెలిసి కూడా దొంగదారులు వెతుక్కోకుండా పోటీచేసి, పోరాడిన యోధుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.

సత్తా చూపేందుకు మేము సిద్ధం

చంద్రబాబుకు దమ్ము, ధైర్యం ఉంటే... ఆయన పార్టీపైన, ఆయన చేసిన అభివృద్ధిపైనా నమ్మకం ఉంటే మా పార్టీ నుంచి తీసుకుపోయిన 20 మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి, వాళ్ళను గెలిపించుకొని రావాలి. అప్పుడు రెఫరెండంగా స్వీకరిద్దాం. లేదా మొత్తం 175 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరిపినా సత్తా చూపేందుకు మేము సిద్ధంగా ఉన్నాం.

2019లో వైఎస్సార్‌సీపీదే అధికారం

ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి, చంద్రబాబు టీడీపీని హస్తగతం చేసుకున్నాక ఆ పార్టీ రోజురోజుకూ క్షీణిస్తోంది. 1999లో బీజేపీతో కలిసి పోటీ చేస్తే 43 శాతం, 2004లో 37 శాతం, 2009లో

> **చంద్రబాబు ఎంత నీచుడో తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు, సోదరుడు రామ్మూర్తినాయుడు కూడా చెప్పారు. ఆయన బామ్మర్దులు కూడా అదే చెప్పే పరిస్థితి ఉంది.**

28 శాతం, ఆ తరువాత జరిగిన ఉప ఎన్నికల్లో 22 శాతం, ఉమ్మడి రాష్ట్రంలో 2014లో జరిగిన ఎన్నికల్లో టీడీపీకి 31 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. ఒక ఎమ్మెల్యే, ఎంపీతో మొదలైన వైఎస్సార్‌సీపీ అధికారాన్ని చేపట్టే స్థాయికి అంచెలంచెలుగా ఎదుగుతోంది. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి తీరుతుంది.

బాబువి ఉత్తర కుమారుడి ప్రగల్భాలు

పులివెందులలో జగన్ ఓడిపోయే పరిస్థితి ఉంటుందని టీడీపీ నాయకులు కబుర్లు చెబుతున్నారు. తన సొంతూరు నారావారిపల్లె ఉన్న నియోజకవర్గం చంద్రగిరిలో టీడీపీని గెలిపించలేని దద్దమ్మ చంద్రబాబు. 1983లో చంద్రగిరి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన చంద్రబాబుకు కనీసం డిపాజిట్ కూడా దక్కలేదు. చంద్రబాబు ఎన్టీఆర్‌కు నమ్మక ద్రోహం చేసి టీడీపీని హస్తగతం చేసుకున్న తర్వాత నాలుగుసార్లు ఎన్నికలు జరిగాయి. చంద్రగిరిలో 1999, 2004, 2009లో కాంగ్రెస్, 2014లో వైఎస్సార్‌సీపీ గెలిచింది. సొంత ఊళ్లోనే గెలవలేని చంద్రబాబు పులివెందులలో జగన్‌ను ఓడిస్తానంటూ ఉత్తర కుమారుడి ప్రగల్భాలు పలుకుతున్నారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీలతో చంద్రబాబు పోరాటం చేశారట! ఆయన చెప్పేవన్నీ వింటే... పోర్చుగీస్, డచ్, బ్రిటీష్ వాళ్లతో కూడా పోరాటం చేశానని చెబుతాడు. చంద్రబాబు ప్రధానమంత్రులతో లాలూచీ పడ్డాడే తప్ప పోరాటాలు చేసిన చరిత్ర లేదు.

టీడీపీకి డిపాజిట్లు కూడా దక్కలేదు

చంద్రబాబు 2004 నుంచి 2014 దాకా పదేళ్లు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 44 చోట్ల అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఇందులో 21 స్థానాల్లో టీడీపీకి డిపాజిట్లు కూడా దక్కలేదు. 10 స్థానాల్లో మూడో స్థానానికే పరిమితమైంది. మిగిలిన చోట్ల 30 వేలు, 40 వేల తేడాతో ఓడిపోయింది. రెండు చోట్ల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో సైతం టీడీపీ డిపాజిట్లు కోల్పోయింది. తనకు రాజకీయ అనుభవం ఉందని చెప్పుకుంటున్న చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్న ప్పుడు 44 చోట్ల తన పార్టీని ఎందుకు గెలిపించుకోలేకపోయాడు?

బాబు పాలనపై ఉద్యోగుల్లో తీవ్ర వ్యతిరేకత

రాష్ట్రంలో, కేంద్రంలో ఉప ఎన్నికలు జరిగితే 99 శాతం అధికార పార్టీకే విజయావకాశాలు ఉంటాయి. నంద్యాలలో రూ.2 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేస్తానంటూ చంద్రబాబు జీవో ఇచ్చాడు. పార్టీ పరంగా రూ.200 కోట్లు ఖర్చు చేసి నాయకులు, ప్రజలను ఒత్తిళ్ల, ప్రలోభాలకు గురి చేశాడు. ఉప ఎన్నికలో 250 మందికి పోస్టల్ బ్యాలెట్లు ఇస్తే, 39 మంది మాత్రమే తిరిగి పంపారు. అవి కూడా చెల్లకుండాపోయాయి. దీన్నిబట్టి ఉద్యోగుల్లో బాబు పాలనపై తీవ్ర వ్యతిరేకత ఉన్నట్లు స్పష్టమవుతోంది. రాష్ట్ర ప్రజలు ఈ విషయాన్ని గుర్తించాలి'' అని కొడాలి నాని కోరారు.

> **హైదరాబాద్‌ను తానే ప్రపంచ పటంలో పెట్టానని చంద్రబాబు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉంది. తెలంగాణలో ఓటుకు కోట్లు కేసులో దొంగలా దొరికిపోతే, ముఖ్యమంత్రి కేసీఆరే హైదరాబాద్ నుంచి తట్టా బుట్టా సర్దించి చంద్రబాబును విజయవాడ పటంలోకి నెట్టేశారు.**

రూ. కోటి ఇరవై లక్షలతో గణనాథుడికి విశేష అలంకారం



మంగళగిరి మెయిన్ బజార్‌లో రూ.1.20 కోట్ల నగదుతో అలంకరించిన గణనాథుడు

మంగళగిరి: గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణంలోని మెయిన్ బజార్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని మంగళవారం రూ.1.20 కోట్ల విలువైన నగదుతో అలంకరించారు. మెయిన్ బజార్ వర్తక వ్యాపార సంఘాల సహకారంతో ఎస్‌బీజీ యూత్ ఆధ్వర్యంలో అలంకరించిన గణపతిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కౌన్సిలర్ సంకా బాలాజీగుప్తా సోదరులు, వర్తకుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

అభ్యంతరకరంగా రోజా ఫ్లెక్సీ ఏర్పాటు

జంగారెడ్డిగూడెంలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆందోళన

జంగారెడ్డిగూడెం రూరల్: పశ్చిమగోదావరి జిల్లాలో తెలుగు తమ్ముళ్లు బరితెగించారు. జంగారెడ్డిగూడెంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్యే రోజాను కించపరిచేలా అభ్యంతరకరంగా ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. దీంతో పార్టీ శ్రేణులు భగ్గుమంటున్నాయి. స్థానిక జేపీ సెంటర్‌లో రోజాను కించపరుస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వందనపు సాయిబాలపద్మ ఆధ్వర్యంలో మహిళలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన చేశారు. సాయిబాల పద్మ మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించలేని ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటనా స్థలంలో ధర్నా నిర్వహించి అనంతరం డీఎస్పీ కార్యాలయానికి చేరుకుని డీఎస్పీకు ఫిర్యాదుచేశారు. వివాదం ముదురుతుండటంతో మున్సిపల్ సిబ్బంది ఫ్లెక్సీని తొలగించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పి.బాబ్జి, బీవీఆర్ చౌదరి, పట్టణ కమిటీ అధ్యక్షుడు రవికుమార్ పాల్గొన్నారు.



ఫ్లెక్సీ వద్ద ధర్నా నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

హిందూ సమాజ అభ్యున్నతికి కృషిచేయాలి

కమలానంద భారతి స్వామిజీ



వెంకటగిరి రూరల్: హిందూ సమాజ అభ్యున్నతికి ప్రతిఒక్క హిందువు కృషిచేయాలని హిందూ దేవాలయ ప్రతిష్ఠాన పీఠం పీఠాధిపతి కమలానంద భారతి స్వామిజీ పిలుపునిచ్చారు. సంపూర్ణ గ్రామ దేవాలయ సందర్శనా రథయాత్రలో భాగంగా నెల్లూరు జిల్లా వెంకటగిరి మండలంలోని జంగాలపల్లి, వైఎస్ అగ్రహారం, ముద్దంపల్లి, పత్రాపల్లి, అమ్మపాళెం, లక్ష్మీరాంపల్లి, కందనాలపాడు, పాపమాంబపురం, వర్ధనవల్లి గ్రామాల్లోని ఆలయాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి మాట్లాడుతూ హిందూ సమాజం విశిష్టతను గ్రామాల వరకు తెలియజేసి అన్ని ఆలయాలను క్రియాశీలకం చేసేందుకే సంపూర్ణ గ్రామ దేవాలయ సందర్శనా రథయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం లక్ష గోవిందనామ గళార్చనకు టీటీడీ అందించిన ముడుపులను భక్తులకు పంపిణీ చేశారు.


432 ఫ్లాట్ల నిర్మాణానికి రూ.608 కోట్లు నిజమే

'సాక్షి' కథనంపై సీఆర్‌డీఏ వివరణ

సాక్షి, అమరావతి: రాజధానిలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఐఏఎస్‌ల నివాస భవనాల నిర్మాణంపై 'అడుగు అడుగుకో కమిషన్' శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై సీఆర్‌డీఏ వివరణ ఇచ్చింది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఐఏఎస్‌ల నివాస ఫ్లాట్ల నిర్మాణానికి 'సాక్షి' కథనంలో పేర్కొన్న మేరకే వ్యయం అవుతోందని మంగళవారం విడుదల చేసిన ఆ ప్రకటనలో స్పష్టం చేసింది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఐఏఎస్‌ల నివాస భవనాలకు 3,500 చదరపు అడుగుల చొప్పున 432 ఫ్లాట్ల నిర్మాణానికి రూ.608 కోట్లు వ్యయం అవుతోందని, దీని ప్రకారం ఒక్కో ఫ్లాటు నిర్మాణానికి 1.40 కోట్ల రూపాయలకుపైగా వ్యయం అవుతోందని 'సాక్షి' పేర్కొంది. భూమి ఉచితంగా ఇచ్చినప్పుడు చదరపు అడుగు నిర్మాణానికి ఇది ఎక్కువ వ్యయమని తెలిపింది. సాక్షి రాసింది నిజమేనని వివరణలో పేర్కొన్న సీఆర్‌డీఏ భూమి ఉచితం గురించి మాత్రం ఎక్కడా ప్రస్తావించలేదు. ఇదే కథనంలో తాత్కాలిక సచివాలయానికి అన్ని రకాల వ్యయంతో చదరపు అడుగుకు రూ.10 వేలు వరకు వ్యయం చేసినట్లు సాక్షి పేర్కొనగా, తాత్కాలిక సచివాలయం చదరపు అడుగు నిర్మాణానికి రూ.6,020 వ్యయం అయినట్లు సీఆర్‌డీఏ పేర్కొంది. ఫ్లాట్ల నిర్మాణ వ్యయంలో లిఫ్టులు, ఫర్నీచర్ తదితర సౌకర్యాలుంటాయని తెలిపింది. అయితే హైదరాబాద్‌లోని ఖరీదైన ప్రాంతంలో కూడా ఒక్కో ఫ్లాటు భూమితో కలిసి రూ.1.40 కోట్లు లేదని సాక్షి పేర్కొన్న అంశంపై స్పందించలేదు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 and Printed at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 EDITOR: V. Murali, Phone No. 08562-200076, 77 RNI Regn No. APTEL/2008/23796.

నాలుగు మంచి భావాలను
అక్షరాలతో నేసి...
ఒంటి మీద వేసుకుంటే..
అవేవీ పైకి కనిపించవు.
ఆ మనిషి నగ్నంగా ఉన్నాడనో..
యోగి అనో.. బైరాగి అనో..
అనుకునే ప్రమాదం ఉంది.
'వేమన.. వారెవరూ కాదు.
పదాల నేతగాడు.
భావాల కూర్పరి.
గొప్ప కవి' అంటారు డాక్టర్ ఎన్.గోపి.
నిజమే.
మనకు వేమన నగ్నంగానే
కనబడతాడు.
గోపీకి మాత్రం
ఒక యజ్ఞంలా కనబడతాడు.



అక్షర యోగి

నేను నా దైవం

డా॥ ఎన్.గోపీ, అరుణ

కవితా సంకలనాలు, వ్యాస సంకలనాలు, పరిశోధనాత్మక ప్రచురణలు, అనువాదాలు, వ్యాఖ్యానాలు, టెక్స్ట్‌బుక్స్, కాలమ్ రైటింగ్స్.. ఇలా 50కి పైగానే రచనలు చేశారు డా.ఎన్.గోపి. ఒక్క తెలుగులోనే కాకుండా దేశ విదేశీ భాషల్లోకి గోపీగారి కవిత్వాలు అనువాదం అయ్యాయి. విశ్రాంత ఆచార్యులు అయినా నిరంతర కవితాన్వేషి. ప్రస్తుతం కేంద్రసాహిత్య అకాడమీలో సభ్యుడిగా ఉన్నారు. సభలూ, సమావేశాలతో నిత్యం బిజీగా ఉండే గోపీగారిని దైవం గురించి అడిగితే కవిత్వాన్నే పరిచయం చేశారు.

● మీరు దంపతులు అవడం దైవికమే అనుకుంటారా?

గోపీ: ఏదో తెలియదు కానీ, అరుణకు మరుజన్మకు కూడా రుణపడి ఉన్నాను. మేం కాలేజీ రోజుల్లో క్లాస్‌మేట్స్. మాది నిజామాబాద్ జిల్లాలోని బోధన్. కులాంతర వివాహం కావడంతో మా ఇరువైపుల వారు ఒప్పుకోలేదు. నేను జీవితంలో నిలదొక్కుకునేంతవరకు ఓర్పుగా ఎదురు చూసింది. వేమనగ్రంథం పరిశోధన సమయంలో తను గర్భవతి. తనను ఒక్కదాన్ని ఉంచి నేను ఊళ్లు తిరగాల్సిన పరిస్థితి. గ్రంథం అచ్చువేయడానికి చేసిన అప్పులు పదేళ్లపాటు తీర్చుకుంటూ వచ్చాను. సాహిత్యానికి నేను చేసిన సేవ అరుణ ద్వారానే సాధ్యమైంది.

అరుణ: ముమ్మాటికి దైవికమే! మేం కలుసుకోవడం, దంపతులు అవడం దైవికమే అనుకుంటాను. కవిత్వం కన్నా ముందుగా పరిచయమైన ఆయన వ్యక్తిత్వం బాగా నచ్చింది. ఆ తర్వాత కవితలు చదివి అబ్బురపడేదాన్ని. ఈయన ఇచ్చిన స్ఫూర్తితోనే నేనూ కవయిత్రిగా కొన్ని కవనాలు చేశాను. 'మౌనమూ మాట్లాడుతుంది, పాటల చెట్లు, ఇత్తడి బిందెలు, అమ్మ ఒక మనిషి, హృదయమే వదనం, సూది నా జీవన సూత్రం, నిరీక్షణే ఒక గాయం, కొన్ని తీగలు– కొన్ని రాగాలు.' పుస్తకాలుగా వచ్చాయి.

● వేమన జీవితం, పద్యాల మీద ఎంతో పరిశోధన చేశారు మీరు. వేమన దైవత్వం గురించి ఏం చెప్పారు?

సమాజంలో దైవం పేరుతో జరిగే మూఢనమ్మకాలను విపరీతంగా నిరసించాడు వేమన. ఎంతో ధైర్యవంతుడు. శ్రమలో దైవత్వాన్ని దర్శించమన్నాడు. 'శ్రమములోన పుట్టు సర్వంబు తానౌను' అన్నాడు ఒకచోట. అది నా పట్ల నిజమైందనుకుంటాను. విద్యార్థి రోజుల్లో వేమన గురించి పరిశోధన మొదలుపెట్టినప్పుడు చాలా ప్రాంతాలు సందర్శించాను. తాళపత్రాలలో వేమన పద్యాలు మద్రాస్‌లోని లైబ్రరీలో ఉన్నాయని తెలిసి అక్కడకు వెళ్లాను. అక్కడ కట్టల కొద్ది తాళపత్రాలు. మూడువేల పద్యాలు ఉంటాయవి. వాటన్నింటినీ చూసి 'అమ్మో!' అనిపించింది. ఎందుకంటే, కాపీ చేసుకోవాలంటే రాత తప్ప మరో సాధనం లేని రోజులవి. వెనక్కి తిరిగి వెళ్లిపోదామా అనిపించింది. కానీ, వెనకడుగు వేయడమా? ప్రశ్నే లేదనుకొని ఓ రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం వరకు రాస్తూ కూర్చున్నాను. ఆ లెక్క ప్రకారం చూసుకుంటే కనీసం ఆరునెలలకు పైగా పడుతుంది. ఎలా? స్కాలర్‌షిప్ తప్ప మరో ఆదాయం లేదు. తెలిసినవారి గదిలో ఉంటూ రెండేళ్ల పాటు వేసవి సెలవుల్లో మాత్రం మద్రాస్ వెళ్లి, వేమనపద్యాలన్నీ రాసుకొని, తలమీద మోసుకుంటూ తీసుకొచ్చాను. మొదట ఆ పత్రాలను చూసినప్పుడు 'అమ్మో! ఎలా సాధ్యమౌతుంది?' అని భయపడిన నాకు ఆ పద్యాలను ఒక్కోటీ రాస్తూ ఉంటే నాలో ఏదో శక్తి ప్రవేశిస్తున్న అనుభూతి కలుగుతుండేది. అదే నన్ను యాక్టివేట్ చేసింది. ఆ తర్వాత వేమనపద్యాల ప్రభావం నా మీద బలంగా పడింది. ఆ శ్రమ తెలుగు సాహిత్యంలో ఇంకా ఇంకా పరిశోధించడానికి ఉపయోగపడింది.

నేటి తరానికి వేమన పద్యాలు ఎంతవరకు అవసరమంటారు?

వేమనను ఒక యోగిలాగానో, బైరాగిలాగానో భావిస్తారు కానీ, ప్రపంచంలో వేమనను మించిన కవి లేడన్నది నా అభిప్రాయం. నా గ్రంథం 'ప్రజాకవి వేమన' ఇప్పటివరకు అయిదు పునర్ముద్రణలు పొందిందంటే ఆ కవి పట్ల పెరుగుతున్న జిజ్ఞాసే అందుకు కారణం. తెలుగుభాషను కాపాడుకోవాలంటే వేమన పద్యాలు పిల్లలకు నేర్పితే చాలు.

● వేమననే మీ పరిశోధనకు ఎంచుకోవడం యాదృచ్ఛికమా? దైవికమా?

ఇంటర్మీడియెట్ పూర్తయ్యాక హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ విద్యలో చేరాను. కానీ, నా మనసుకు పట్టలేదు. పరిశోధన సమయానికి వచ్చేసరికి వేమన పద్యాల మీదకు ఆలోచన మళ్లింది. కారణం, నా చిన్ననాటి నుంచి ఊళ్లో చాలామంది నోట వేమన పద్యాలలోని సూక్తులు విని ఉన్నాను. ఇంట్లో నాన్న కూడా ఏదో ఒక సందర్భంలో వేమన పద్యాలలోని మాటలను ఉపయోగించే వాడు. వేమన జనంలోకి అంతగా ఎలా వెళ్లగలిగేడు అనే సందేహం నాకెప్పుడూ కలిగేది. దీంతో వేమన నా పరిశోధన గ్రంథమయ్యాడు.

● మీలో కవిత్వం పుట్టుక దైవికం అని భావిస్తారా?

ఎప్పుడైనా సరే కవిత్వం అశాంతిలో నుంచి పుడుతుంది. సమాజంలో మనకు, సాటిమనిషికి జరుగుతున్న అన్యాయంలోంచి పుడుతుంది. ఎంతోమంది గొప్ప గొప్ప కవులు నా చిన్నతనంలోనే అంటే ఏడు, ఎనిమిది తరగతుల నుంచే పరిచయం అయ్యారు. అది నా అదృష్టం. ముఖ్యంగా సి.నారాయణరెడ్డి కవితలు నన్ను అమితంగా ఆకర్షించేవి. కవులతో పద్యాల్లోనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగేవి. యాదగిరి గుట్టపైన బ్రహ్మోత్సవాల్లో జరిగే సాహిత్య, సంగీత కార్యక్రమాలు కూడా నా పసి మనస్సులో కవితాముద్రను వేశాయి. తెలుసుకోవడం పట్ల ఆసక్తి, సాధన మన భవిష్యత్తును నిర్ణయిస్తుంది. పసితనంలో మొదలైన ఆసక్తి, ఆ తర్వాత సాధన ఈ రోజుకు ఇలా నిలిపింది.

● కవిత్వం పుట్టుక కోసం ఆలయాల సందర్శన ఏమైనా ఉపయోగపడిందా?

అలాంటిదేమీ లేదు. అయితే నా కవితల్లో 'కొండమీది గుడి' ఒకటి. అందులో...

'చిన్నప్పటి నుంచి కొండమీది గుడిని
చూస్తూ
ఆ రోడ్డు మీద ఎన్నో సార్లు
వెళ్లాను.
దగ్గర్లే ఉన్నట్టుంటుంది.
నడిస్తే మైలున్నర.
పెద్ద తలకు చిన్న కిరీ
టం పెట్టుకున్న
పౌరాణిక పాత్రలా
ఉంటుందా గుడి...'
అంటూ
మొదలవుతుంది.
'రెండు గంటలు కష్టపడి
శిఖరాన్ని చేరుకున్నాను.
కింది నుంచి గుట్ట చిన్నగా
కనిపించేది.
ఇక్కడి నుంచి లోకమూ అంతే!
'ఇంత చిన్న గుడిలో ఒంటరిగా దేవుడెలా
వుంటున్నాడో!' ఇలాంటి అనేక సందేహాలు నా కవితలో పంక్తులుగా చేరిపోయాయి.

> **'ప్రజాకవి వేమన' గ్రంథం ఇప్పటి వరకు ఇన్ని పునర్ముద్రణలు పొందిందంటే ఆ కవి పట్ల పెరుగుతున్న జిజ్ఞాసే కారణం. తెలుగుభాషను కాపాడుకోవాలంటే వేమన పద్యాలు పిల్లలకు నేర్పితే చాలు.**

● కవిత్వంలో దైవాన్ని దర్శించడం అంటే...!

'కాలాన్ని నిద్రపోనివ్వను' కవితల్లో ఒక ఘర్షణ ఉంటుంది. 'తంగేడుపూలు'లో ఒక వేదన ఉంటుంది. 'జలగీతం' అనే దీర్ఘకవితలో ఒక అనుభూతి ఉంటుంది. 'జలగీతం' కవిత ద్వారా నేను మళ్ళీ జన్మ ఎత్తిన భావన కలిగింది.

'నీటి విలువ ఎడారిలో ఉన్న వాళ్లకు తెలుస్తుంది.
నీటి విలువ ఎడారిలో శుష్కించేవాళ్లకు తెలుస్తుంది...' అంటూ జలం గురించి చెబుతుంది ఈ కవిత.
'నీళ్ల లేని తనం ప్రాణాలను పీల్చేస్తుంది.
నీళ్ల లేని తనం ఎంతటి వాణ్నయినా నిలువునా కూల్చేస్తుంది' అంటూ వివరిస్తుంది.
నీళ్లను సేవించినప్పుడైనా, అందులో స్నానించినప్పుడైనా మనం అనుభూతించాలి. ప్రేమగా అక్కున చేర్చుకోవాలి. ప్రతీబొట్టును ఆస్వాదించాలి. నీళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలి. ఇదంతా జలగీతం కవిత ద్వారా తెలియజేశాను.

సినారె ఈ కవితాసంపుటి ఆవిష్కరణలో ఒకమాట అన్నారు. 'విశ్వంభర..లో నేను మట్టిని నమ్ముకున్నాను. 'జలగీతం'లో నీవు నీటిని నమ్ముకున్నావు అన్నారు. ఏ పని చేసినా అందులో లీనమై చేయడం నాకు అలవాటు. కవిత్వంలో ఒక మంచిపదం పడటం కూడా ఒక జీవన్మరణ సమస్యలా అనిపిస్తుంది.

● అధ్యాపకుడిగా మీరు దర్శించిన దైవత్వం...

అధ్యాపకుడి కంటే ముందు నేను టీచర్‌ని. తెలుగు నేర్పడానికి ముందు ప్రిపరేషన్ ఏముంటుంది... అనుకునేవారు కొందరు. కానీ, ప్రతి పాఠం, ప్రతి పద్యం పిల్లలకు నేర్పడానికి ముందు నేను విద్యార్థిగా మారేవాడిని. వారికొచ్చే సందేహాలు ఏయే రూపాలుగా వస్తాయో, ఎలా వాటిని తీర్చాలో ముందే నోట్సు సిద్ధం చేసుకునేవాడిని. విద్యార్థుల నుంచి ఎంతో నేర్చుకున్నాను. దాదాపు 40 ఏళ్ళ అధ్యాపక వృత్తిలో ఎంతో మంది శిష్యులకు అభిమాన గురువునయ్యాను. ఇది నాకు కలిగిన మరో అదృష్టం.

● దైవత్వాన్ని ఎలా దర్శించాలని మీ అభిప్రాయం...?

సేవ ద్వారానే! మరో మార్గం లేదు. బాల్యంలో నేను ఎంతో దారిద్ర్యాన్ని అనుభవించాను. పుస్తకాల కోసం, చదువుకోసం సరైన ఆర్థిక వనరులు లేని కారణంగా ఎంతో ప్రయాస పడ్డాను. నాలా తెలుగు భాష మీద అభిమానం ఉండి, ఇబ్బందులు పడే విద్యార్థుల పరిశోధనకు, వారి ఆసక్తికి 12 వేల పుస్తకాలతో మా ఇంటిపైన ఒక అంతస్తులో లైబ్రరీ ఏర్పాటు చేశాను. పరిశోధన చేసే విద్యార్థులు వాళ్ల ఐడీ కార్డుతో సంప్రదించి ఇక్కడే ఉండి చదువుకోవచ్చు.

● దైవం ఉందని అనిపించిన ఘటన...?

వేమన పరిశోధనా గ్రంథం కోసం ఊళ్లు తిరుగుతూ రాజమండ్రి గౌతమీ గ్రంథాలయానికి వెళ్లాను. అక్కడ ఎవరూ పరిచయం లేరు. పగలంతా లైబ్రరీలో గడుపుతూ రాత్రిళ్లు ఆర్.టి.సి బస్టాండ్‌లో పడుకునేవాడిని. 25 సంవత్సరాల తర్వాత ఆ ఊరికే వైస్–ఛాన్స్‌లర్ హోదాలో వెళ్తే ఎందరో స్వాగతం పలకడం అదో అనుభూతి. సరస్వతీ దేవికి ఇచ్చే గౌరవం, మర్యాద ఎంతటిదో నాడు కళ్లారా చూశాను.

- నిర్మలారెడ్డి చిల్కమర్రి

ఆత్మీయం

అప్పు లేనివాడు అధిక సంపన్నుడు




ఇది పెద్దలు అనుభవంతో చెప్పిన మాట. అయితే, ఇప్పుడు అప్పు చేయడం ఒక ఫ్యాషన్. ఒక అలవాటు. అప్పు చేయనిదే పొద్దు పోదు కొందరికి. రకరకాల కారణాలు చెప్పి, అవతలి వాళ్లని బురిడీలు కొట్టించి మరీ అప్పు చేసి, జల్సాలు చేయడం ఇంకొందరి నిత్యకృత్యం. కావాలంటే వడ్డీ ఎంతయినా తీసుకోండి కానీ, అప్పు లేదని మాత్రం అనకండి అంటూ ముందే ముందరి కాళ్లకు బంధాలు వేస్తారు. ఒకటి రెండుసార్లు మాట నిలబెట్టుకుని నమ్మకం కలిగిస్తారు, ఆ తర్వాత నట్టేట ముంచుతారు. నిజానికి అప్పు చేయడం తప్పేమీ కాదు. అవసరానికి సరిపడా డబ్బు లేకపోతేనో, సమయానికి సర్దుబాటు కాకపోతేనో చేబదులు తీసుకోవచ్చు. అయితే, అప్పు చేయడాన్ని అలవాటుగా మార్చుకోవడమే తప్పు. అవసరానికి అప్పు ఇచ్చి ఆదుకున్న వాళ్లకు ముఖం చాటేయడం ఇంకా తప్పు. గట్టిగా అడిగితే 'మీ డబ్బు తీసుకుని మేమేమీ ఊరొదిలి పారిపోములే' అంటూ ఈసడింపుగా మాట్లాడటం ఇంకా పెద్ద తప్పు. ఇరుగు పొరుగు దగ్గరో, తెలిసిన వాళ్ల దగ్గరో చేబదుళ్లు తీసుకోవడం నామోషీగా మారిపోయి, క్రెడిట్ కార్డులు తీసుకోవడం, కార్డు చేతిలో ఉంది కదా అని దానిని ఎడాపెడా వాడేయటం, ఆ తర్వాత ఆ అప్పులు తీర్చలేక తల వేలాడేయడం... ఇదంతా ఊహించే పెద్దలు 'అప్పు లేనివాడు అధిక సంపన్నుడు' అన్నారు. అందుకే, అవసరానికి అప్పు చేయడం తప్పు కాదు. అవసరం లేకున్నా అప్పు చేసి మరీ 'మా దగ్గర ఆ వస్తువులున్నాయి, ఈ వస్తువులున్నాయి' అని గప్పాలు కొట్టుకోవడం, విందు వినోదాలతో జల్సా చేయడం మాత్రం ముమ్మాటికీ తప్పే. అందుకే 'అప్పు చేసి పప్పు కూడు' తినేకన్నా, ఉన్నదానిని జాగ్రత్తగా ఖర్చు చేసుకుంటూ హుందాగా జీవించడమే ఆనందం.

క్విక్ ఫుడ్

మెంతికూర - శనగపప్పు

తయారి సమయం: 30 నిమిషాలు



కావలసినవి
మెంతి కూర – కట్ట (కడిగి శుభ్రపరచాలి), పచ్చి శనగపప్పు – కప్పు,
ధనియాల పొడి – టీ స్పూన్,
ఉల్లిపాయ – 1,
కారం – అర టీ స్పూన్
నీళ్లు – 2 కప్పులు, పసుపు – పావు టీ స్పూన్, నూనె – టేబుల్ స్పూన్
జీలకర్ర – అర టీ స్పూన్
వెల్లుల్లి రేకలు – 4
ఇంగువ – చిటికెడు, పచ్చిమిర్చి–1
టొమాటోలు–2 (చిన్నగా కట్ చేసుకోవాలి) ఉప్పు – రుచికి సరిపడా

తయారి
- ముందుగా పచ్చి శనగపప్పు, నీళ్లు, ఉప్పు, ధనియాల పొడి ప్రెజర్ కుకర్‌లో వేసి, మరీ మెత్తగా ఉడకబెట్టకుండా ఒక్క విజిల్ వచ్చేవరకు ఉంచి తీయాలి.
- పాత్రలో నూనె వేడయ్యాక జీలకర్ర వేసి చిటపటలాడించాక ఉల్లిపాయలు వేసి గోధుమ రంగు వచ్చేవరకు వేయించి ఇంగువ, వెల్లుల్లి రేకలు వేసి వేయించాలి.
- టొమాటోలు, పచ్చిమిర్చి వేసి అయిదు నిమిషాల పాటు వేయించాక, కారం వేయాలి.
- మెంతి కూర, ఉడకబెట్టిన పప్పు వేసి కలియబెట్టాలి. మూత పెట్టి 15 నిమిషాల వరకు వేయించాలి.
- మెంతి మిశ్రమం కాస్త దగ్గరగా అయిన తరవాత దింపేయాలి.
- దీనిని వేడివేడిగా చపాతీల్లోకి అందిస్తే రుచిగా ఉంటుంది.

బ్యూటిప్స్

పెదవుల మృదుత్వానికి...



కొంతమందికి తరచుగా పెదవులు చిట్లడం,. పై పొర లేచిపోయి పొట్టు రాలడం జరుగుతుంటుంది. ఇలా ఎందుకు అవుతుందంటే... శరీరంలో వచ్చిన మార్పులను, వాతావరణంలోని మార్పులను పెదవులు ఇట్టే ప్రతిబింబిస్తాయి. ఇందుకు దారితీసే కారణాలు...
- కాఫీలు ఎక్కువగా తాగడం, ఆల్కహాలు తీసుకోవడం వల్ల శరీరం డీహైడ్రేషన్‌కు గురవుతుంది. దీనితో పెదవులు పొడిబారుతాయి.
- వాతావరణంలో మార్పు వచ్చినప్పుడు ఆ మార్పును పెదవులు భరించలేవు. ఎక్కువ చలిని, ఎక్కువ వేడిని తట్టుకోలేక తేమ కోల్పోయి పొడి బారతాయి.
- పని ఎక్కువైనందువల్ల వచ్చే ఒత్తిడికి శరీర వ్యవస్థలో ఒడిదుడుకులు వస్తాయి. ఆ ప్రభావం మొదట కనిపించేది పెదవులలోనే.
- లిప్‌స్టిక్‌ల వల్ల ఇరిటేషన్ వచ్చినా కూడా పెదవులు పొడిబారి, చిట్లుతాయి.
- ఏదైనా రుగ్మతకు మందులు వేసుకున్నప్పుడు శరీరం తేమను కోల్పోయినట్లయితే కూడా బయటకు కనిపించే సమస్యల్లో ఇదే మొదటిది.

పెదవులకు సాంత్వన చేకూరాలంటే...
- ఐదు మిల్లీ లీటర్ల గ్లిజరిన్‌లో అంతే మోతాదు నిమ్మరసాన్ని, పన్నీటిని కలపాలి. ఈ మిశ్రమాన్ని ఉదయం ఒకసారి, సాయంత్రం ఒకసారి పెదవులకు పట్టించాలి. దానంతట అది ఆరే వరకు అలాగే ఉంచాలి. ఈ మిశ్రమాన్ని ఫ్రిజ్‌లో పెట్టుకుని మూడు రోజుల వరకు వాడవచ్చు. మరీ ఎక్కువగా పొడిబారినట్లనిపిస్తే రెండు గంటలకొకసారి కాని ఉదయం రెండుసార్లు, సాయంత్రం రెండుసార్లు కాని పట్టించవచ్చు.
- ఇవేవీ వీలుకానప్పుడు నీటితోనే మర్దన చేస్తే తాత్కాలికంగా ఉపశమనం కలుగుతుంది. చలికి పెదవులు చిట్లినప్పుడు వేడినీటిలో దూది ముంచి పెదవులకు పట్టించాలి. ఎండలకు చిట్లినట్లయితే దూదితో చల్లటి నీటిని పట్టించాలి. వీలైతే నీటిలోనే వాజలిన్, తేనె ఏదో ఒకటి కొద్దిగా వేసుకోవచ్చు.
- లిప్‌స్టిక్ కొనేటప్పుడు అందులో వాడిన పదార్థాల జాబితాను ఒకసారి సరిచూసుకోవడం తప్పనిసరి. బ్రాండెడ్ కంపెనీలు తప్పనిసరిగా ఈ లిస్ట్‌ను ప్రచురిస్తాయి. మాయిశ్చరైజర్ ఉన్న లిప్‌స్టిక్‌నే ఎంచుకోవాలి. సాధారణంగా లిప్‌స్టిక్‌లలో గ్లిజరిన్‌తోపాటు యాంటిసెప్టిక్ ప్రాపర్టీస్ కూడా ఉంటాయి. ఒకసారి నిర్ధారణ చేసుకోవడం మంచిది.

హరిహరుల దివ్య క్షేత్రం మొగిలి


మొగిలీశ్వర స్వామి

చిత్తూరు జిల్లాలోని మొగిలి ఆధ్యాత్మిక కేంద్రం. మొగిలీశ్వరుడు అక్కడ కొలువై నాడు. తడిబట్టలతో స్నానం చేసి సాష్టాంగ పడితే చాలు కోరిన కోరిక నెరవేరుతుందని అక్కడి ప్రజలకు నమ్మకం. అందుకే కాబోలు ఆ చుట్టుపక్కల గ్రామాల్లోనే కాకుండా.. కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లో కూడా మొగిలీశ్వరుడి పేరున్న వ్యక్తులు అనేకమంది కనిపిస్తుంటారు. చుట్టూ కొండల మధ్య కనువిందైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో స్వయంభువుగా ముక్కంటి అక్కడ వెలిశాడని స్థల పురాణాలు చెబుతున్నాయి. హరితో కొలువైనందున దీన్ని హరిహర క్షేత్రమని కూడా అంటారు. ఆ గోపాలుడు రుక్మిణీ, సత్యభామ సమేతంగా కొలువై ఉండటం మొగిలి ప్రత్యేకత. దేశంలో ఏ హర క్షేత్రంలో లేని విధంగా భక్తులకు శఠగోపంతో పూజారులు ఆశీర్వాదాలు అందజేస్తారు. సర్పదోష నివారణ కోసం చేసే రాహుకేతు పూజ ఈ ఆలయంలో చేయించుకుంటే మంచి ఫలితాలు ఉంటాయని అక్కడి ప్రజలు చెబుతుంటారు.

స్థల పురాణం

మొగలిపొదల సమీపంలో గల మొగిలివారిపల్లి గ్రామంలో పేద బోయ దంపతులు నివసించేవారు. బోయ భార్య నిండు చూలుతో ఉన్నపుడు ఒకరోజు వంట చెరకు కోసం అడవికి వెళ్లింది. అకస్మాత్తుగా నొప్పులు వచ్చి అక్కడే బిడ్డను ప్రసవించింది. మొగలిపొదల వద్ద పుట్టాడు కనుక మొగిలప్ప అని ఆ బిడ్డను అందరూ పిలవసాగారు. మొగిలప్ప యుక్తవయస్సుకు వచ్చాక ఒక పెద్ద రైతు ఇంట్లో పశువులను మేపే పనికి కుదిరాడు. ఒకరోజు మొగిలప్ప అడవిలోకి పశువులను తోలుకెళ్లి సమీపంలోని మొగలి పొదల వద్ద వాటిని వదిలి, వంట చెరకు కోసం పొదలను నరకసాగాడు. కొద్దిసేపటికి కంగుమని శబ్దం వచ్చి రక్తం కారసాగింది. ఆ పొదలను తొలగించి చూడగా అక్కడ రక్తం ధారగా ప్రవిస్తున్న శివలింగం కనిపించింది. వెంటనే మొగిలప్ప ఆ లింగానికి కట్టుకట్టాడు. నాటినుంచి ఆ శివలింగాన్ని పూజిస్తూ పూలు, పళ్లు సమర్పించేవాడు. మొగిలప్పకు శివుడిపై భక్తి పెరిగి ఇంటి ధ్యాస తగ్గిపోగా, కలవరపడ్డ అతని తల్లి వెంటనే మొగిలప్పకు వివాహం చేసింది. అయినా పరిస్థితిలో మార్పు రాలేదు. మొగిలప్ప మేపుతున్న మందలో ఒకగోవు పాలివ్వకపోతుండడంతో రైతు మొగిలప్పను మందలించాడు. మరునాడు మొగిలప్ప ఆ గోవుపై ఒక కన్నేసి ఉంచాడు. ఆ గోవు మేతమేస్తూ దేవరకొండ వైపు వెళ్లి అక్కడ ఉన్న బిలంలో ప్రవేశిస్తుండగా దాని తోకను పట్టుకొన్నాడు. అతనూ గోవుతోపాటు చాలా దూరం ప్రయాణించాడు. ఇద్దరూ ఒక విశాల ప్రదేశానికి చేరుకోగా అక్కడ జగన్మాత పార్వతీదేవి ఒక బంగారు పాత్రను చేబూని, ఆ గోవును సమీపించి పాలు పితికింది. ఇంతలో మొగిలప్పను గమనించి అనుమతి లేకుండానే ఆ ప్రదేశానికి వచ్చినందుకు శపించబోయింది. మొగిలప్ప ఆమె పాదాలపై పడి క్షమించమని వేడుకున్నాడు. జగన్మాత శాంతించి మొగిలప్పకు ఆకలిదప్పులు లేకుండా ఉండేటట్లు వరమిచ్చి, జ్ఞానోపదేశం చేసింది. ఈ విషయం ఎవరికి చెప్పినా వెంటనే మరణిస్తావని హెచ్చరించింది. అనంతరం మొగిలప్ప ఇంటికి చేరుకున్నాడు. నాటినుంచి సర్వం త్యజించి శివధ్యానంలో మునిగిపోయేవాడు. నిద్రాహారాలు మానేసి శివధ్యానంలో గడిపేవాడు. అతని భార్య ఎంత అడిగినా ఏమీ చెప్పేవాడు కాదు. చచ్చిపోతానని భార్య బెదిరించడంతో చేసేదేమీ లేక ఊరి పొలిమేరల్లో చితి పేర్చుకొని, ఊరందరినీ పిలిచి విషయం చెప్పాడు. మరుక్షణం మరణించాడు. మొగిలప్ప భార్య పశ్చాత్తాపంతో సహగమనం చేసింది. మొగిలప్ప చితి ఉన్న ప్రదేశాన్ని మొగిలప్ప గుండంగా పిలుస్తుంటారు. మొగిలప్ప పేరుమీదుగానే శివలింగాన్ని మొగిలీశ్వరుడు అని పిలవసాగారు. చోళుల కాలంలో దేవాలయాన్ని నిర్మించారు.

మహిమ గల దైవం

సంతానం లేనివారు ఆలయంలో నిద్ర చేస్తే సంతానం కలుగుతుందని భక్తుల విశ్వాసం. బిడ్డలు లేని ఎందరో మహిళలు స్వామివారి కృపాకటాక్షాలతో సంతానం పొందారు. ఈ క్షేత్రంలో వివాహం చేసుకుంటే మంచి జరుగుతుందని భక్తుల విశ్వాసం. అందుకే ప్రతి సంవత్సరం కనీసం వంద వరకు వివాహాలు జరుగుతుంటాయి. ప్రతి అమావాస్యకూ భక్తులు ఆలయానికి పోటెత్తుతారు.

- గాండ్లపర్తి భరత్‌రెడ్డి
సాక్షి, చిత్తూరు


మొగిలీశ్వరస్వామి ఆలయం

ఆలయాన్ని నిర్మించిన మొగిలప్ప

నిత్య పూజలు

అర్చన, రుద్రాభిషేకం, క్షీరాభిషేకం, రుద్ర హోమం, చండీ హోమం సహస్రనామార్చన, శనిదోష నివారణ పూజలు

వారపు పూజలు

ప్రతి సోమవారం రాహుకేతు పూజ (రాహుకాలంలో సర్ప దోష నివారణకోసం) ఉ॥ 7.30 నుంచి 8 వరకు జరుపుతారు.

మాస పూజలు

శ్రావణమాసంలో రెండో శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతాలు ఉచితంగా ఆలయ యాజమాన్యం నిర్వహిస్తుంది. అదేవిధంగా కార్తీక పౌర్ణమి రోజు సత్యనారాయణ స్వామి వ్రతం ఉచితంగా నిర్వహిస్తారు.

బ్రహ్మోత్సవాలు..

ప్రతి సంవత్సరం శివరాత్రి సందర్భంగా మొగిలీశ్వరస్వామి దేవస్థానంలో 12 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఉభయదారుల చేతులు మీదుగా ఒక్కోరోజు ఒక్కో ఉత్సవం జరిపి స్వామివారిని మేళతాలాలతో ఊరేగిస్తారు. ఈ బ్రహ్మోత్సవాలకు ఇసకేస్తే రాలనంత జనం హాజరవుతారు.

ఇలా చేరుకోవచ్చు..

బెంగళూరు చెన్నై హైవేలో చిత్తూరుకు 30 కిలోమీటర్ల దూరంలో మొగిలీశ్వరుడు కొలువైనాడు. బెంగళూరుకు 148 కిలోమీటర్లు, చెన్నైకి 186 కిలోమీటర్లు, కాణిపాకంకు 39 కిలోమీటర్లు ఉంది. చెన్నై నుంచి వచ్చే భక్తులు బెంగళూరుకు వెళ్లే బస్సుల్లో మొగిలికి చేరుకోవచ్చు. చిత్తూరు, పలమనేరు నుంచి బస్సు సౌకర్యం ఉంది.

పుణ్య తీర్థం

తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న ఓ చిన్న మరాఠి గ్రామం పాలజ్. ఈ చిన్న మారుమూల పల్లె 15 ఏళ్లుగా లక్షలాది మంది నోళ్లల్లో నానుతోంది. ఇక్కడి ప్రత్యేకతే ఈ కుగ్రామానికి ప్రతిఏటా లక్షలాదిమందిని రప్పిస్తోంది. ఎక్కడా లేని విధంగా వినాయక నవరాత్రుల్లో ఈ గ్రామస్తులు కర్ర గణేశుని ప్రతిష్ఠించి.. పూజించడమే ఈ పాలజ్ ప్రత్యేకత. ఇక్కడ కొలువుదీరే కర్రగణేశుడు కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా పేరొందాడు. పాలజ్‌లో ప్రభుత్వం నుంచి ఏ ఒక్క అధికారి లేకపోయినా ఆలయ కమిటీ, గ్రామస్తులు కలిసి సమష్టిగా లక్షలాది భక్తులకు సౌకర్యాలను సమకూరుస్తుంటారు. గణేశ్ ఉత్సవాలన్ని రోజులూ ఈ ఊరి పేరు ఉత్తర తెలంగాణ, మహారాష్ట్రలోని ప్రతి ఒక్కరి నోళ్లలో నానుతుంది.



వ్యాధులు నయం చేసే పాలజ్ కర్ర గణేశుడు

తెలంగాణ సరిహద్దు మండలమైన కుభీర్‌కు పక్కనే మహారాష్ట్రలోని బోకర్ తాలూకాలో పాలజ్ గ్రామం ఉంటుంది. ఇక్కడ 1948లో నిర్మల్‌కు చెందిన నకాషీ కళాకారుడు పోలకొండ గుండాజీ వర్మ కర్రతో మలిచిన వినాయకుడికి ప్రతిష్ఠాపన చేసి ప్రతియేటా పూజలు నిర్వహిస్తున్నారు. ప్రతి వినాయకచవితి సందర్భంగా కర్ర గణేశుడిని ప్రతిష్ఠించి, చివరిరోజు సమీప వాగులో పూజలు జరిపి నిమజ్జనోత్సవంగా భావిస్తారు. అనంతరం కర్ర విగ్రహాన్ని తిరిగి ఆలయంలోని బీరువాలో భద్రపరుస్తారు. కేవలం వినాయక నవరాత్రులప్పుడు మాత్రమే పాలజ్ కర్రగణేశుడు దర్శనమిస్తాడు. మిగతా సమయంలో ఇక్కడి ఆలయంలో గణేశుడి ఫొటో మాత్రమే ఉంటుంది.

ఊరంతా మంచం పట్టిందని...

స్వాతంత్ర్యానికి పూర్వం పాలజ్ గ్రామంలో కలరా, ప్లేగు వ్యాధులు ప్రబలి ఊరంతా మంచం పట్టింది. ఇదే సమయంలో వినాయక చవితి పండుగ వచ్చింది. ఊరి ప్రజలంతా గణేశుని నమ్ముకుందాం.. అని నిశ్చయించుకున్నారు. ఇందుకు ప్రత్యేకంగా కర్రగణపతిని చేయించి ప్రతిష్ఠించాలని నిర్ణయించారు. అందుకోసం నిర్మల్‌లో కొయ్యబొమ్మలు చేసే నకాషీ కళాకారుడైన గుండాజీవర్మను రప్పించి సుందరమైన కర్ర గణేశుడి విగ్రహాన్ని చేయించారు. ఆ విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఊరంతా మొక్కితేనే వ్యాధులన్నీ దూరమయ్యాయని గ్రామపెద్దలు చెబుతారు. అలా అప్పటి నుంచి కర్ర గణేశుడిని మాత్రమే వినాయక ఉత్సవాల్లో కొలువడం ఆనవాయితీగా వస్తోంది. ఇక ఇక్కడ పూజలు చేసి, ముడుపు కడితే కోరుకున్న పని జరిగి తీరుతుందన్న నమ్మకం ఉంది. ముందుగా ఈ ఊరికి చెందిన ఆడపడుచుల ద్వారా కర్రగణేశుడి మహిమ ఇతర గ్రామాలకు తెలిసింది. అలా ఊరూరా పాలజ్ ప్రత్యేకత విస్తరిస్తూ ఇప్పుడు ఏకంగా ఉత్తర తెలంగాణ, మహారాష్ట్ర అంతా వ్యాపించింది.

సుందర రూపుడిగా

కర్రతో చేసిందైనా.. నకాషీ కళాకారుడైన గుండాజీవర్మ చేతుల్లో సుందరంగా రూపుదిద్దుకున్నాడు ఇక్కడి లంబోదరుడు. అసలు.. కర్రతో ఇంత అందంగా విగ్రహాన్ని మలచవచ్చా.. అనేంత నునుపుగా గణపయ్యను తీర్చిదిద్దాడు. సింహాసనంపై ఆసీనుడైన గణపయ్యకు పెద్ద చెవులు ఉంటాయి. నాలుగుచేతుల వాడిగా.. ఒక చేతిలో గండ్రగొడ్డలి, మరోచేతిలో త్రిశూలం, ఇంకోచేతిలో లడ్డులతోపాటు కుడిచేత్తో ఆశీర్వదిస్తుంటాడు.

కలిసికట్టుగా

లక్షల్లో తరలివచ్చే భక్తులతో పాలజ్ ఆలయానికి ఆదాయమూ లక్షల్లోనే వస్తోంది. ఈ గ్రామస్తులు కలిసికట్టుగా కర్రగణేశుడి సేవలో పాల్గొంటారు. గత ఏడాది 11 రోజుల ఉత్సవాల్లో ఆలయానికి రూ. 80 లక్షల ఆదాయం వచ్చింది. రూ. 11 లక్షల ఖర్చులు పోను రూ. 69 లక్షల కానుకలు మిగిలాయి. పదేళ్ల కింద సాదాసీదాగా ఉండే పాలజ్ ఆలయం ఇప్పుడు సరికొత్త హంగులతో ఇరుగుపొరుగు జిల్లాలవారినీ ఆకట్టుకుంటోంది. 2004 ప్రాంతంలో ఆలయ కమిటీ వద్ద మొత్తానికి, గ్రామస్తులు చందాలు పోగు చేసి సేకరించిన మరో రూ. 2 లక్షలు కలిపి ఆలయ నిర్మాణం ప్రారంభించారు. అందంగా నిర్మించిన ఆలయం పూర్తయిన తర్వాత భక్తుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. గ్రామస్తులే కోటి రూపాయలతో అన్నదాన సత్రాలు, స్నానపుగదులు, మరుగుదొడ్లు నిర్మించారు. చుట్టుపక్కల గ్రామాలకూ ఇక్కడి నుంచి శుద్ధ నీరు అందిస్తున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలోనే సీసీ రోడ్లు వేశారు. ఆలయ ప్రాంగణంలో సీసీ కెమెరాలను అమర్చారు.



అన్ని ఏర్పాట్లు చేశాం..

పాలజ్‌లో భక్తుల సౌకర్యానికి అన్ని ఏర్పాట్లు చేశాం. బారికేడ్లు, తాగు నీరు, తీర్థప్రసాదాలు అందిస్తున్నాం. వాహనాలకు ఇబ్బంది లేకుండా పార్కింగ్ సౌకర్యాన్ని కల్పిస్తున్నాం. భక్తులకు అల్పాహారాన్నీ అందిస్తాం.

- గంధం గణేశ్
ఆలయ కమిటీ అధ్యక్షుడు

పాలజ్ వెళ్లడం ఇలా...

హైదరాబాద్ నుంచి వచ్చేవారు నిజామాబాద్, బాసరల మీదుగా భైంసా చేరుకుంటే దూరభారం తగ్గుతుంది. నిర్మల్ మీదుగా వచ్చేవాళ్లు కూడా భైంసా మీదుగానే పాలజ్‌కు వెళ్లాల్సి ఉంటుంది. భైంసా నుంచి 23 కిలోమీటర్ల దూరంలో పాలజ్ ఉంటుంది. ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుంది. ప్రైవేటు వాహనాలూ అందుబాటులో ఉంటాయి. వాహనాల కోసం ఆలయ ప్రాంగణంలో పార్కింగ్ ఏర్పాటు చేస్తారు.

- పుప్పాల హన్మండ్లు
సాక్షి, భైంసా, నిర్మల్ జిల్లా



లవ్ డాక్టర్ — నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సర్! ఐయామ్ స్టడీయింగ్ బీటెక్ ఫైనల్ ఇయర్! ఐయామ్ ఇన్ లవ్ విత్ ఏ గర్ల్ సిన్స్ త్రీ ఇయర్స్. షీ టాక్స్ టు మి నైసేలీ. బట్, ఐ డోంట్ నో ఇఫ్ షీ లవ్స్ మి ఆర్ నాట్! దిస్ ఈజ్ మై ఫైనల్ ఇయర్ అండ్ ఐ యామ్ గోయింగ్ టు ప్రపోజ్ హర్!? బట్, ఐ హేవ్ ఎ డౌట్ దట్ ఇఫ్ షి రిజెక్ట్స్, అవర్ ఫ్రెండ్‌షిప్ విల్ ఆల్‌సో బి గాన్!? సో, సజెస్ట్ మి విత్ సమ్ గుడ్ ఐడియా?

– చందు

ఐ థింక్ యూ షుడ్ రాదర్ నాట్ ఎక్స్‌ప్రెస్ యువర్ లవ్.

ఫర్ ఆల్ ది అఫెక్షన్ యూ హావ్ ఫర్ హెర్ విల్ సడన్లీ టర్న్ వెరీ సోర్, బిట్టర్, అసార్బిక్, కాస్టిక్ ఇఫ్ షీ రిజెక్ట్స్ యూ.

లవ్ ట్రూలీ ఈజ్ మోస్ట్ బ్యూటిఫుల్ వెన్ నాట్ ఎక్స్‌ప్రెస్డ్.

వెన్ నాట్ టెస్టెడ్.

వెన్ నాట్ వెర్బలైజ్డ్.

వెన్ నాట్ యానిమేటెడ్.

లవ్ ఈజ్ ఇన్ ఇట్స్ ప్రిస్టెన్ బ్యూటీ వెన్ ఇట్ ఈజ్ కెప్ట్ టైట్లీ వితిన్ యువర్ హార్ట్. అన్‌సెడ్.

అన్‌టోల్డ్.. సీక్రెట్ లవ్ హ్యాస్ ఎ బ్యూటిఫుల్ టింజ్ ఆఫ్ కలర్ లేయర్డ్ ఇన్ ఎ హింట్ ఆఫ్ పెయిన్ అండ్ ఎ టచ్ ఆఫ్ యాంటిసిపేషన్.

‘సార్.. మీరు బోర్డు తిప్పకూడదని ఎన్ని ప్రయత్నాలు చేసినా.. ఈ ఒక్క ఉద్వేగభరిత ఆన్సర్‌తో మీ ఉద్యోగం ఖతం!’

వై?

‘తెలుగు పేపర్లో ఎవరూ చెయ్యని అపచారం చేశారు సార్...’

వాట్?

‘ఎహే!! ఇంకా ఆ ఇంగిలీపీసు ఏంటి సార్.. తెలుగు పేపర్లో ఇంగ్లిష్ ఆన్సర్ ఇస్తే హాం ఫట్.. ఖతం... మీ జాబ్ గాన్ సార్!’

ఇంగ్లిపీస్‌లో క్వశ్చన్ వస్తే తెలుగులో ఆన్సర్ చెబితే బ్రోకి ఎలా అర్థం అవుతుంది.

‘సార్.. మీరు రాసే సొల్లు ఆన్సర్లు తెలుగు ప్రేమికులు కూడా చదువుతారు కదా సార్..’

వాట్ షుడ్ ఐ డు నౌ.. టెల్ మీ.. ఐ సే టెల్ మీ!!

‘క్వశ్చన్ ఆన్సర్ రెండు తెలుగులో చెబితే ప్రాయశ్చిత్తం కలగొచ్చు.. నేను కూడా రికమెండ్ చేస్తా... మీ ఉద్యోగం తీయొద్దని... ఓకే!?’

ఇష్టపడ్డాడు.. అమ్మాయికి తెలియదు.. ఇప్పుడు చెప్పకపోతే మళ్లీ చెప్పలేడు.. చెబితే.. చీకొడితే ఆ అవమానంతో బతకలేడు.. ఏమి చెయ్యాలి అని అడిగాడు..

‘మీరు ఏమి చెప్పారు..?’

మూసుకుని పెట్టుకో అని చెప్పా!

‘వై సర్!?’

అంతా పెంట అయిపోతుందని అలా చెప్పా!

‘మరి అమ్మాయికి ఎలా తెలియాలి?’

లవ్ డాక్టర్ చదువుతుందిలే...!

‘శహభాష్ సార్.. మీ ఉద్యోగం కంటిన్యూ.. వాడి లవ్ కంటిన్యూ.. ఇంద అరటిపండు!!

లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. lovedoctorram@sakshi.com

కాసుకో సుడోకు

3	6	4	7	8		1		
9	5					6		4
							3	
		3		7	8		6	5
7			5		4			3
4	2		6	1		8		
	3							
8		7					2	6
		2		4	6	7	8	9

నిబంధనలు:
ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరంలోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

4	9	1	3	7	6	2	8	5
5	6	3	8	2	1	9	7	4
2	8	7	5	9	4	6	3	1
1	4	6	7	8	3	5	2	9
8	2	5	6	4	9	7	1	3
7	3	9	1	5	2	4	6	8
6	7	8	4	1	5	3	9	2
3	5	2	9	6	8	1	4	7
9	1	4	2	3	7	8	5	6

ఈద్ వేళ

హజ్ విధానం ఇలా ఉంటుంది

హజ్ అనే అరబ్బీ పదానికి ‘యాత్ర’ అని అర్థం. హజ్ కోసం వెళ్లే ముస్లింల కోసం దివ్య ఖురాన్‌లో అల్లా ఇలా సెలవిచ్చాడు– ‘ప్రప్రథమంగా మానవుల కోసం నిర్మించబడిన ఆరాధన గృహం మక్కా నగరంలో ఉంది. దాన్ని దర్శించుకునే వారికి సకల శుభాలు ప్రసాదించబడతాయి’. అందుకే స్తోమత గల వారు జీవితంలో కనీసం ఒకసారి హజ్ చేయడం తప్పనిసరి.

పవిత్రహజ్‌ను నిర్వర్తించడానికి వెళ్లేవారు ఈ లోకంతో సంబంధంలేని వారుగా... ఒక లుంగీ... ఒక దుప్పటి... ఒక జత పాదరక్షలు మాత్రమే తీసుకొని వెళుతారు. తలకు నూనె, శరీరానికి సుగంధ ద్రవ్యాలు వాడరు. క్షవరం కూడా చేసుకోరు. అన్ని రకాల అలంకరణలను, సుఖాలను త్యజిస్తారు. వాంఛలను ప్రేరేపించే విషయాలకు దూరంగా ఉంటారు. ఈ నియమ నిబంధనల వల్ల వారి హృదయం దైవారాధనకు సంపూర్తిగా సిద్ధమవుతుంది.

హాజీలు కాబా గృహానికి చేరుకొని కాబాను సందర్శిస్తారు. గృహప్రదక్షిణలు చేస్తారు. ‘ముఖామే ఇబ్రహీం’ వద్ద రెండు రకాతులు నమాజులు చేస్తారు. సఫా, మర్వా పర్వతాల మధ్య పరుగెత్తుతారు. మీనా, అరఫాత్, ముజ్దాలిఫాలో బస చేస్తారు. గులకరాళ్లతో షైతాన్‌ను కొడుతారు. ఖుర్బానీ చేస్తారు. ఇలా విధిని పూర్తిచేసి దైవానుగ్రహాన్ని పొందడానికి ప్రయతిస్తారు.

దైవ ప్రసన్నత కోసం....

హజ్ వెళ్లాలని సంకల్పించుకున్న వారు దానికి అన్ని విధాలుగా సంసిద్ధులు కావాలి. దైవం తన దాసుని నుంచి కోరిన దాన్ని నెరవేర్చాలి. హజ్ సమయంలో ప్రవక్త తెలిపిన దువాలను పఠించాలి.

హజ్ ఎప్పుడు..?

హజ్ ఇస్లామియా కేలండర్‌లోని చివరి మాసమైన జిల్ హజ్జా నెలలోని 8, 9, 10, 11, 12వ తేదీల్లో నిర్వహిస్తారు. ఈ ఐదురోజుల పాటు ప్రత్యేక ఆరాధనలుంటాయి.

హజ్ ఆరాధనలోని మొదటిరోజు ఇహ్రామ్ దుస్తులను ధరించి హజ్ ఆరాధనల సంకల్పం చేసుకొని తల్బియా పలుకుతూ రెండు రకాతుల నఫీల్ నమాజులు చేయాలి. తల్బియా మూడుసార్లు పలికి మక్కానుంచి మినా బయలుదేరాలి. అక్కడ జొహర్, అసర్, మగ్రీబ్ , ఇషా నమాజులు చేయాలి. రాత్రి మినా మైదానంలో బస చేయాలి.

జిల్ హజ్జా తొమ్మిదవ రోజు

హజ్ రెండవరోజు (9న) ఫజర్ నమాజ్ మినాలో చేసి అరఫాత్ బయలుదేరాలి. మినా నుంచి అరఫాత్ వెళ్లే దారిలో తల్బియా పలకాలి. అరఫాత్‌లో విడిది చేయడమే అసలు హజ్. జొహర్ ఆసర్ నమాజులు చేయాలి. ఈ రెండు నమాజ్‌లు సాముహికంగా నిర్వహిస్తారు. మగ్రీబ్ నమాజు చేయకుండా ముజ్దలిఫా వైపు బయలుదేరాలి. ఇషా సమయంలో ఒక అజాన్ రెండు ఇఖామత్‌లతో మగ్రీబ్, ఇషానమాజ్‌లు ముజ్దలిఫాలో చేయాలి. రాత్రి ముజ్దలిఫాలో గడపాలి. ఇక్కడ 70 కంకర రాళ్లను షైతాన్‌పై విరసడానికి పోగు చేసుకొని పెట్టుకోవాలి.

జిల్ హజ్జా పదవ రోజు

మూడోరోజు (10న) ముజ్దలిఫాలో ఫజర్ నమాజ్ తరువాత దైవ నామస్మరణ ఎక్కువ చేయాలి. పాప కార్యాలను క్షమించమని పశ్చాత్తాప పడాలి. అనంతరం మినా వైపుకు వెళ్లాలి. సూర్యుడు ఉదయించక ముందు పెద్ద షైతాన్ పై ఏడు కంకర రాళ్లతో కొట్టాలి. అనంతరం ఖుర్బానీ చేయాలి. తలవెంట్రుకలను తొలగించుకోవాలి. హజ్ ఆరాధనల కోసం ధరించిన ఇహ్రామ్ దుస్తులను తీసివేయాలి. స్నానం చేసి సాధారణ దుస్తులను ధరించాలి. మక్కా వెళ్లి తవాఫే జియారత్ చేసుకొని తిరిగి మినా మైదానానికి చేరకోవాలి. రాత్రి మినాలో గడపాలి.

హిల్ హజ్జా పదకొండవ రోజు

నాలుగోరోజు (11న) సూర్యోదయం తరువాత ముగ్గురు షైతాన్‌లను కంకరరాళ్లతో కొట్టాలి. ముందుగా బిస్మిల్లాహి అల్లాహు అక్బర్ అని చిన్నషైతాన్‌పై ఏడు రాళ్లు, మధ్య షైతాన్‌పై ఏడు రాళ్లు, పెద్ద షైతాన్ పై ఏడురాళ్లను కొట్టాలి. మూడోరోజు చేసినట్లే తవాఫే జియారత్ (కాబా గృహ ప్రదక్షణలు) చేయాలి. మినాకు బయలుదేరి రాత్రి అక్కడే బస చేయాలి.


జిల్ హజ్జా 12వ రోజు

ఐదో రోజు (12న) నాలుగోరోజు చేసినట్లే ముగ్గురు షైతాన్‌లపై ఏడు కంకర రాళ్లతో కొట్టాలి. సూర్యాస్తమయం కాకముందే మినా నుంచి బయలుదేరాలి. ఒకవేళ తవాఫే సియారత్ చేయాలనుకుంటే సూర్యాస్తమయానికి ముందే చేసుకోవాలి. ఇంతటితో హజ్ ఆరాధనలు పూర్తవుతాయి. తిరిగి వచ్చేటప్పుడు తవాఫే జియారత్ చేయాలి.

- మహమ్మద్ మంజూర్



సాక్షి ఫ్యామిలీ సినిమా
వైఎస్ఆర్ జిల్లా
బుధవారం
30-8-2017



● రవితేజ

కబడ్డీ.. కబడ్డీ.. కబడ్డీ.. తోడ్‌దే దుష్మన్ కి హడ్డీ!

కబడ్డీ... కబడ్డీ... ఆటగాళ్లు, వీక్షకులతో ఓ ఇండోర్ స్టేడియంలో సందడి నెలకొంది. ఆ ఆటగాళ్లలో రాజా (రవితేజ) ఒకడు. 'కబడ్డీ.. కబడ్డీ..' అంటూ కూత పెడుతూ ప్రత్యర్థి కోర్టులోకి అడుగు పెడతాడు. అప్పటివరకు అది ఆటే అనుకుంటారంతా! కానీ, రాజా అడుగుతో వేటగా మారుతుంది. 'కబడ్డీ.. కబడ్డీ..' అనే కూత 'తోడ్‌దే దుష్మన్ కి హడ్డీ' (దుష్టుల/విలన్స్ ఎముకలు విరగొట్టేయ్) అనేలా వినబడుతుంది అందరికీ! అప్పుడు తను అంధుడనే సంగతి ఎవ్వరికీ గుర్తు రానంతగా రాజా ఆడిన ఆట... కాదు.. కాదు.. సాగించిన వేట 'రాజా ది గ్రేట్' సిన్మా హైలైట్స్‌లో ఒకటిగా నిలుస్తుందట! రవితేజ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'రాజా ది గ్రేట్'. ఇందులో రవితేజ అంధుడిగా నటిస్తున్న సంగతి తెలిసిందే. అయినా... ప్రేక్షకులు ఆశించే యాక్షన్ సీక్వెన్సులకు ఏమాత్రం లోటు ఉండదట. ముఖ్యంగా కబడ్డీ ఫైట్ చాలా బాగుంటుందని సమాచారం. 'దిల్' రాజు, శిరీష్‌లు నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. ప్రస్తుతం రవితేజ, రాధిక, ఇతర తారాగణంపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. మెహరీన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాకు సాయికార్తీక్ సంగీత దర్శకుడు.


● 'రాజా ది గ్రేట్'లో కబడ్డీ సీన్


● నాగచైతన్య


● నాగార్జున

జస్ట్... చైన్ హ్యాండ్ మారిందంతే!

మంగళవారం మన్మథుడు అక్కినేని నాగార్జున బర్త్‌డే. ఈ సందర్భంగా 'రాజుగారి గది–2'లోని ఆయన లుక్‌ను విడుదల చేశారు. చూపుల్లో సీరియస్‌నెస్... చేతుల్లో రుద్రాక్షమాల... ఎప్పటిలా హ్యాండ్‌సమ్‌గా కనిపించారు నాగ్. రాజుగారి లుక్కు అక్కినేని అభిమానులకు మాంచి కిక్కిచ్చింది. తండ్రి రుద్రాక్షమాలతో కిక్ ఇస్తే.. తనయుడు నాగచైతన్య సైకిల్ చైన్‌తో ఎట్రాక్ట్ చేశారు. నాగ్ కెరీర్‌లో ఉన్న బెస్ట్ మాస్ మూమెంట్ ఏదని అడిగితే... వెంటనే అక్కినేని అభిమానులకు గుర్తొచ్చేది 'శివ' సిన్మాలో సైకిల్ చైన్ లాగే సీనే కదా. అంతలా ప్రేక్షకులపై ఆ సీన్ ఇంపాక్ట్ చూపింది. సరిగ్గా ఆ సీన్‌ను గుర్తు చేసేలా నాగచైతన్య తండ్రికి బర్త్‌డే విషెస్ చెప్పారు. చైతూ నటించిన తాజా సిన్మా 'యుద్ధం శరణం'. నాగ్ బర్త్‌డే సందర్భంగా చైతూ సైకిల్ చైన్ పట్టుకున్న ఈ సినిమాలోని స్టిల్‌ను విడుదల చేశారు. అటు రుద్రాక్షమాలతో నాగార్జున... ఇటు సైకిల్ చైన్‌తో చైతూ... ఫ్యాన్స్‌కి గూస్‌బంప్స్ వచ్చాయంటే నమ్మండి! ఈ రెండు స్టిల్స్‌తో వాళ్లు ఫుల్ హ్యాపీ. అన్నట్టు... చైతూ నటించిన ఈ 'యుద్ధం శరణం' వచ్చే నెల 8న విడుదలవుతోంది. అప్పుడీ సైకిల్ చైన్ సీన్‌కి ఏ రేంజ్ రెస్పాన్స్ వస్తుందో చూడాలి!!


● మహేశ్‌బాబు

అసెంబ్లీలో 40 రోజులు

యస్... మహేశ్‌బాబు నలభై రోజుల పాటు అసెంబ్లీకి వెళతారు. అవును మరి.. రాజకీయ నాయకులు అసెంబ్లీకి వెళుతుంటారు కదా. పైగా, మహేశ్ ముఖ్యమంత్రి కూడా. 'భరత్ అనే నేను' గురించే చెబుతున్నాం అని ఈపాటికి అర్థమై ఉంటుంది. కొరటాల శివ దర్శకత్వంలో మహేశ్‌బాబు హీరోగా రూపొందుతోన్న ఈ చిత్రానికి సంబంధించిన కీలక షెడ్యూల్‌ను ఇటీవల లక్నోలో జరిపారు. నెక్ట్స్ షెడ్యూల్‌ను హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో వేసిన భారీ సెట్‌లో ప్రారంభించనున్నారు. ఇది అసెంబ్లీ సెట్. దాదాపు 2 కోట్ల రూపాయలతో అచ్చంగా అసెంబ్లీని తలపించేట్లుగా ఈ సెట్ తయారు చేశారని చూసినవాళ్లు అంటున్నారు. ఇందులో 40 రోజుల పాటు షూటింగ్ చేయడానికి ప్లాన్ చేశారట. ప్రస్తుతం 'స్పైడర్' చిత్రం చివరి పాట చిత్రీకరణ కోసం రుమేనియాలో ఉన్నారు మహేశ్. ఆ పాట పూర్తి కాగానే హైదరాబాద్‌లోని అసెంబ్లీలోకి అడుగుపెడతారు. అదేనండి.. 'భరత్ అనే నేను' సెట్స్‌లోకి ఎంటరవుతారు.

డాక్టర్ కాజల్

యస్... ఇప్పుడు కాజల్ అగర్వాల్ డాక్టర్ అయ్యారు. ఇది గౌరవ డాక్టరేట్ కాదు. ఎంబీబీఎస్ చదివితే డాక్టర్ అంటారే... ఆ డాక్టరే. కానీ, కాజల్ ఎంబీబీఎస్ చదవలేదు. మరెలా డాక్టర్ అవుతున్నారు? అంటే... హీరోయిన్‌గా చేస్తున్నారు కదా! ఆ కోటాలో డాక్టర్ అయ్యారు. అదెలా? అంటే... తమిళ హీరో విజయ్ హీరోగా రూపొందుతోన్న సినిమా 'మెర్సల్'. ఇందులో కాజల్ ఓ హీరోయిన్‌గా డాక్టర్ పాత్రలో నటిస్తున్నారు. 'నేనే రాజు నేనే మంత్రి, వివేకం'... ఇటీవల చేసిన ఈ రెండు సిన్మాల్లోనూ ట్రెడిషనల్‌గా కనిపించారు కాజల్. ఇందులో మోడ్రన్‌గా కనిపిస్తారట! కాజల్‌తో పాటు సమంత, నిత్యా మీనన్ కూడా ఇందులో హీరోయిన్లుగా నటిస్తున్నారు. దీనిపై కాజల్ స్పందిస్తూ... ''గతంలోనూ నేను మల్టీ హీరోయిన్ ఫిల్మ్స్ చేశా. ఇప్పుడు కొత్తేం కాదు కదా! నా పాత్రకు సిన్మాలో మంచి ప్రాముఖ్యత ఉంటుంది'' అన్నారు.


● కాజల్ అగర్వాల్

తండ్రికి విలన్... కుమారుడికి?

హీరోయిజమ్, విలనిజమ్... జగపతిబాబు నటనలో రెండిటినీ తెలుగు ప్రేక్షకులు చూశారు. మలయాళీలకు ఆయన నటనలోని విలనిజమ్ మాత్రమే తెలుసు. అసలు పేరు కంటే కొసరు పేరు 'డాడీ గిరిజ'గా అక్కడి ప్రేక్షకులకు తెలుసు. మోహన్‌లాల్ 'పులి మురుగన్' (తెలుగులో 'మన్యం పులి'గా విడుదలైంది)లో డాడీ గిరిజగా జగపతిబాబు ప్రదర్శించిన విలనిజమ్ అటువంటిది మరి! మలయాళంలో ఆయన నటించిన తొలి చిత్రమది. తాజాగా మరో చిత్రం అంగీకరించారు. ఇందులో మోహన్‌లాల్ కుమారుడు ప్రణవ్ హీరో. సిన్మా పేరు 'ఆది'. అప్పుడు మోహన్‌లాల్ 'పులి మురుగన్'తో మలయాళంలో విలన్‌గా మంచి పేరు తెచ్చుకున్న జగపతిబాబు, ఇప్పుడు ఆయన కుమారుడు ప్రణవ్ మోహన్‌లాల్ 'ఆది'లోనూ విలన్‌గా నటిస్తున్నారా? లేదా? అనే అంశాన్ని యూనిట్ సభ్యులు ప్రస్తుతానికి సీక్రెట్‌గా ఉంచారు!


● జగపతిబాబు


● శర్వానంద్

డాన్?

న్యూ స్టోరీ... న్యూ స్క్రీన్‌ప్లే... న్యూ క్యారెక్టరైజేషన్... శర్వానంద్ సినిమా ఒప్పుకోవాలంటే ఈ మూడు కంపల్సరీ. అఫ్‌కోర్స్ డైరెక్టర్‌కీ ఇంపార్టెన్స్ ఇస్తారు. ఇప్పుడు శర్వానంద్ ఇలాంటి ప్యాకేజ్‌తో ఓ కొత్త సినిమా ఒప్పుకున్నారని సమాచారం. 'స్వామి రారా, కేశవ' వంటి వినూత్న చిత్రాలను అందించిన సుధీర్ వర్మ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందనుందని వినికిడి. మాఫియా నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని కృష్ణానగర్‌లో వినిపిస్తోంది..మాఫియా డాన్‌గా శర్వానంద్ న్యూ లుక్‌లో కనిపించనున్నారట. అది మాత్రమే కాదు... ఇందులో రెండు పాత్రల్లో కనిపిస్తారని ఓ టాక్. అందులో వయసు మళ్లిన పాత్ర ఒకటి అని భోగట్టా. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించనున్న ఈ సినిమా త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనుందట.

కండిషన్స్ అప్లై!

కుర్ర హీరోలతో సీనియర్ హీరోయిన్లు రొమాంటిక్ సన్నివేశాల్లో నటించడం బాలీవుడ్‌లో కొత్తేమీ కాదు. 'ఏ దిల్ హై ముష్కిల్' చిత్రంలో రణబీర్‌కపూర్‌తో ఐశ్వర్యారాయ్, 'కి అండ్ కా'లో అర్జున్‌కపూర్‌తో కరీనా కపూర్ నటించారు. ఇటీవల 'విఐపి–2'లో నటించిన కాజోల్‌తో కుర్ర హీరోలతో సీనియర్ నాయికలు రొమాంటిక్ సినిమాలు చేయడంపై మీ అభిప్రాయం ఏంటి? అని అడిగితే ''ఈ రోజుల్లో డిఫరెంట్ సినిమాలు వస్తున్నాయి. దర్శకుల విజన్ కూడా మారుతోంది. కుర్ర హీరోలతో రొమాంటిక్ సీన్స్ చేయడాన్ని తప్పనడంలేదు. స్క్రిప్ట్ డిమాండ్ చేస్తే నాకేం అభ్యంతరం లేదు. కానీ, కొన్ని కండిషన్స్. నాతో నటించబోయే కుర్ర హీరో మ్యాన్లీగా ఉండాలి. అతని ఆలోచనల్లో, యాక్టింగ్‌లో పరిణితి చెంది ఉండాలి. అలాంటి హీరో సరసన ఛాన్స్ వస్తే అప్పుడు ఆలోచిస్తాను'' అన్నారామె.


● కాజోల్

చిన్న కారులో పెద్ద పాప

కమల్‌హాసన్ పెద్ద పాప శ్రుతీహాసన్‌ను చూశారా!? వయసులో పెద్దదవుతున్నా... మనసుకు నచ్చిన పనులు చేసే విషయంలో ఇంకా చిన్నపిల్లే అనుకోవాలేమో! ముఖ్యంగా ఎంజాయ్ చేసే విషయంలో. ఇప్పుడీ అమ్మాయి లండన్‌లో ఉన్నారు. సినిమా షూటింగ్ కోసం కాదు... సరదాగా ఎంజాయ్ చేయడం కోసం వెళ్లినట్టున్నారు. సోషల్ మీడియాలో శ్రుతీ పోస్ట్ చేస్తున్న ఫొటోలు చూస్తే ఎంత ఎంజాయ్ చేస్తున్నారో ఇట్టే చెప్పేయొచ్చు. ఇన్‌సెట్‌లో ఫొటో ఉంది చూశారా... అందులో చిన్న కారు ఉంది కదా. లండన్ వీధుల్లో సరదాగా నడుస్తున్నప్పుడు అది శ్రుతీ కంట పడింది. చిన్నప్పటి ఆటలు గుర్తొచ్చినట్టున్నాయి. వెంటనే కారులో కూర్చుని కెమెరా కంటికి ఓ ఫోజిచ్చారు. అదీ 'చిన్న కారులో పెద్ద పాప' మేటర్!!




● శ్రుతీహాసన్


● దివ్య


ఫోనులో దెయ్యం

కిరణ్, దివ్య జంటగా కె. నరేంద్రబాబు దర్శకత్వంలో వెంకటేశ. సి నిర్మించిన సినిమా 'మళ్లీ వచ్చిందా'. ఈ సినిమా ఫస్ట్ లుక్ టీజర్ విడుదల చేసిన టి. ప్రసన్నకుమార్ మాట్లాడుతూ– ''సస్పెన్స్, హారర్ థ్రిల్లర్స్‌కు ఎప్పుడూ క్రేజ్ ఉంటుంది. 'గంగ, రాజుగారి గది, ఆనందో బ్రహ్మ' తరహా జానర్‌లో వస్తోన్న 'మళ్లీ వచ్చిందా' కూడా ప్రేక్షకాదరణ పొందుతుంది'' అన్నారు. నరేంద్రబాబు మాట్లాడుతూ– ''ఆత్మలు, దెయ్యాలు మనుషుల్ని ఆవహించి, భయపెట్టడం చాలా సినిమాల్లో చూశాం. కానీ, ఒక దెయ్యం ఓ ఫోన్ నుంచి మరో ఫోన్‌కి వెళుతూ మనుషుల్ని భయపెడితే ఎలా ఉంటుందనేది మా సిన్మాలో చూపించాం. ఈ దెయ్యం స్పెషాలిటీ ఏంటంటే... ఎవరి ఫోన్‌కైనా వారి వాయిస్‌ను 'డెత్ మెసేజ్' రూపంలో పంపిస్తుంది'' అన్నారు. త్వరలో పాటల్ని, చిత్రాన్ని విడుదల చేస్తామని నిర్మాత తెలిపారు. చిత్రసహ నిర్మాతలు గురురాజ్, జి. శశికాంత్, హీరో కిరణ్, హీరోయిన్ దివ్య, కెమెరామ్యాన్ పూర్ణ .కె తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ పేజీలపై మీ అభిప్రాయాలనూ, సూచనలనూ తెలియచేయండి. ప్రియదర్శిని రామ్, ఫీచర్స్ ఎడిటర్. features.sakshi@gmail.com

సమాచార విప్లవంలో సరికొత్త అధ్యాయం...

క్లౌడ్ కంప్యూటింగ్



- సమాచారాన్ని భద్రపరచడంపై దృష్టి
- రక్షణపై సందేహాలు
- భారత్‌లో రూ.120 లక్షల కోట్ల విలువైన వ్యాపార అవకాశాలు
- రానున్న పదేళ్లలో భారత్‌లో 20 లక్షల మంది ఇంజనీర్ల అవసరం

సాక్షి, అమరావతి

రమేశ్ మొబైల్ ఫోన్ కొనేందుకు ఇంటర్నెట్‌లో ముఖ్యమైన సైట్లన్నీ సెర్చ్ చేశాడు. ఏదో సైట్లో లాగిన్ కావడానికి ఈ–మెయిల్ ఎంటర్ చేశాడు. అంతే... అప్పటినుంచీ కుప్పలు తెప్పలుగా మెయిల్స్ వస్తున్నాయి. ఫేస్‌బుక్‌కు కనెక్టయినా ప్రపంచంలోని అన్ని మొబైల్ ఫోన్ల డేటా వచ్చేస్తోంది. మెయిల్‌కు, ఫేస్‌బుక్‌కు మొబైల్ నెంబర్ ఇవ్వడం కామన్ కదా! రమేశ్ మొబైల్‌కు కూడా మెసేజ్‌లు వస్తూనే ఉన్నాయి. దీంతో రమేశ్‌కు కొత్త ఫోన్ ఎంచుకోవడం మరింత సులభమయింది. ఇలాంటి వ్యాపార టెక్నిక్స్‌పై ఇప్పుడు అన్ని కంపెనీలు దృష్టిపెట్టాయి. డేటాను గుప్పెట్లో పెట్టుకునేందుకు పోటీపడుతున్నాయి. ఈ కారణంగానే 'క్లౌడ్ డేటా సెంటర్స్' ప్రపంచ వ్యాప్తంగా తమ ఆధిపత్యాన్ని చాటుకుంటున్నాయి. సాఫ్ట్‌వేర్ పరిభాషలో దీన్ని క్లౌడ్ కంప్యూటింగ్ అని పిలుస్తున్నారు.

అసలేంటీ క్లౌడ్..

క్లౌడ్ అంటే తెలుగులో మేఘం. ఇక్కడ సమాచార మేఘం అని చెప్పాలి. మొత్తం సమాచారాన్ని గుప్పెట్లో పెట్టుకుని అవసరమైనప్పుడు మేఘంలా కుమ్మరిస్తుంది. అంటే.. ఏదైనా కంపెనీ అన్ని రకాల సమాచారాన్ని ఫైళ్ల ద్వారా భద్రపరుస్తుందన్న విషయం తెలిసిందే. కంప్యూటర్లు వచ్చిన కొత్తలో దీనిని హార్డ్ డిస్క్‌లో నిక్షిప్తం చేసేవారు. డిస్క్‌ల సామర్థ్యాన్ని మెగాబైట్లు, గిగా బైట్లు, టెరాబైట్లలో పిలుస్తారు. కంపెనీల్లో ఒక్కో ఉద్యోగికి ఒక్కో కంప్యూటర్, వేర్వేరుగా డేటా అప్లికేషన్లు ఉంటాయి. వీటన్నింటినీ కలుపుతూ సర్వర్లు ఉంటాయి. వీటిలోనే సంస్థకు సంబంధించిన మొత్తం సమాచారం నిక్షిప్తమై ఉంటుంది. సైబర్ నేరగాళ్ళు ఇప్పుడు వీటినే లక్ష్యంగా చేసుకుంటున్నారు. సంస్థలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నా... ఫైర్‌వాల్స్‌తో పటిష్టమైన బందోబస్తు చేసినా చిన్న వైరస్‌ను పంపించి డేటా మొత్తం ధ్వంసం చేస్తారు. లేదా డేటాను హ్యాక్‌చేసి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. ఈ అనుభవాల్లోంచి వచ్చిందే క్లౌడ్ కంప్యూటింగ్. క్లౌడ్ డేటా సెంటర్‌లో అనేక కంపెనీల సమాచారం ఒకేచోట ఉంటుంది. వీటిని నిల్వచేసేందుకు ఎక్కువ స్పేస్ ఉండే హార్డ్ డిస్క్ వాడతారు. సైబర్ నేరగాడి కదలికలను పసిగట్టే సాంకేతిక నైపుణ్యం వీటికి ఉంటుంది. సమాచార దోపిడీకి చొరబడే వీలున్న మెయిల్స్‌ను క్షణాల్లో విశ్లేషించి అప్రమత్తం చేసే ఫైర్‌వాల్స్ క్లౌడ్‌డేటా కంప్యూటింగ్‌లోకి వచ్చాయి.

క్షణాల్లో డేటా రికవరీ

క్లౌడ్ కంప్యూటింగ్‌లో డేటా, అప్లికేషన్లు అన్నీ సర్వర్లలోనే ఉంటాయి. వీటిని యూజర్లు ఏ డివైస్ నుంచైనా, ఎక్కడి నుంచైనా యాక్సెస్ చేసుకోవచ్చు. వీటిలో క్లయింట్లకు కావాల్సిన అన్ని రకాల అప్లికేషన్లు ఉంటాయి. వాటిని యూజర్లు ఇంటర్నెట్ ద్వారా యాక్సెస్ చేస్తూ, డేటా స్టోర్ చేసుకుంటారు. కంప్యూటర్‌లో కేవలం డివైస్ ఆపరేటింగ్ సిస్టమ్ లేదా క్లౌడ్ కంప్యూంటింగ్ సర్వీస్‌ను అందించే సంస్థ ఉపయోగించే అప్లికేషన్ మాత్రమే ఉంటుంది. క్లయింట్ నేరుగా క్లౌడ్ సర్వర్ల నుంచి కావాల్సిన అప్లికేషన్లు, డేటాను యాక్సెస్ చేస్తూ ఉంటాడు. ఇందులో రెండు సెక్షన్లు ఉంటాయి. ఒకటి ఫ్రంట్ ఎండ్.. రెండోది బ్యాక్ ఎండ్. ఈ రెండూ నెట్‌వర్క్ (ఇంటర్నెట్) ద్వారా ఒకదానికొకటి అనుసంధానం అవుతాయి. ఫ్రంట్ ఎండ్ అంటే సర్వీస్‌ను పొందే క్లయింట్ డివైస్. బ్యాక్ ఎండ్ అంటే సర్వీస్‌ను అందించే క్లౌడ్ సర్వర్ (వెబ్ సర్వర్). సర్వీస్ అందించే సంస్థ వీటిని ఏర్పాటుచేస్తుంది. వ్యాపార సంస్థలు డేటాను భద్రపర్చుకునేందుకు ప్రత్యేకంగా ఏర్పాట్లుచేసుకోవాల్సిన అవసరం లేదు. డేటా సెంటర్‌కు హైస్పీడ్ ఇంటర్నెట్ ద్వారా లింక్ అయితే చాలు. భద్రపర్చాల్సిన డేటాను కమాండ్ ఇవ్వడం ద్వారా అది స్టోరేజ్‌లోకి వెళ్లిపోతుంది. అదే విధంగా కావాల్సి వచ్చినప్పుడూ తీసుకోవచ్చు. ప్రమాదవశాత్తూ ఒకవేళ ఆఫీస్‌లో డేటా నష్టపోయినా డేటా సెంటర్‌లో సురక్షితంగా ఉంటుంది. డేటా సెంటర్ కూడా మరోచోట భద్రపరుస్తుంది కాబట్టి ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదు.

విస్తృతమవుతున్న డేటా సెంటర్లు

ఐదేళ్ళ క్రితం వేళ్ల మీద లెక్కపెట్టేటట్లు డేటా సెంటర్లు ఉండేవి. ఇప్పుడవి ప్రపంచవ్యాప్తంగా 2 వేలకు పైగా వెలిశాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల ప్రారంభమైన పై డేటా సెంటర్ కూడా ఇలాంటిదే. ప్రపంచవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్‌కు 100కు పైగా క్లౌడ్ డేటా సెంటర్లున్నాయి. బింగ్, ఎంఎస్ఎన్, ఆఫీస్ 365, ఎక్స్‌బాక్స్ లైవ్, స్కైప్, వన్‌డ్రైవ్, మైక్రోసాఫ్ట్ అజూర్ వంటి 200లకు పైగా సంస్థలు సేవలందిస్తున్నాయి. 100 కోట్ల కస్టమర్లు, 2 కోట్ల వ్యాపార సంస్థలు క్లౌడ్ సేవలు పొందుతున్నాయి. భారత్‌లో క్లౌడ్ సేవల మార్కెట్‌లో రూ.120 లక్షల కోట్ల విలువైన వ్యాపార అవకాశాలు ఉన్నాయని మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల ప్రకటించారు. ఊరిస్తున్న ఇంత భారీ వ్యాపార అవకాశాలను దక్కించుకోవడానికి భారత్‌తో అనేక సంస్థలు పోటీపడుతున్నాయి. మూడు డేటా సెంటర్లను ఏర్పాటుచేసి వాణిజ్యపర క్లౌడ్ సేవలను అందిస్తామని అవి చెబుతున్నాయి.

సవాళ్ళు... ప్రతిసవాళ్ళు

క్లౌడ్ కంప్యూటింగ్ భారత మేథో సంపత్తి అనడంలో ఎంతమాత్రం అతిశయోక్తి లేదు. దశాబ్ద కాలంగా ప్రపంచంలోని పలు దేశాల్లో క్లౌడ్ టెక్నాలజీని అభివృద్ధి చేస్తున్న వాళ్లల్లో మన భారతీయులే ఎక్కువ. సమాచారం ప్రధాన ఆస్తిగా పరిగణిస్తున్న ఈ కాలంలో క్లౌడ్ డేటా సెంటర్ల భద్రతపై ఇంకా అనుమానాలున్నాయి. దీనిపై ఇంకా పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి.

- వాస్తవానికి సైబర్ నేరాలకు సంబంధించి ప్రపంచ వ్యాప్తంగా ఏకీకృత చట్టాలు లేవు. క్లౌడ్ కంప్యూటింగ్‌లో సమాచారం ఎల్లలు దాటుతుంది. అన్నింటికన్నా ముఖ్యంగా ఓ కార్పొరేట్ గుప్పెట్లోకి వెళ్తుంది. విశ్వసనీయత ఏమేర ఉంటుందనే దానిపై స్పష్టత లేదు.
- డేటా సెంటర్‌లోనైనా హార్డ్‌డిస్క్‌లోనే స్టోర్ చేయాలి. వాటిని భద్రంగా ఉంచే వాతావరణం ఉండాలి. అంతకన్నా మించి టెక్నాలజీ ఉండాలి. కొన్ని డేటా సెంటర్స్‌లో ఇది కొరవడిందనే ఆరోపణలున్నాయి. సరఫరా అయ్యే హార్డ్ డిస్క్‌లోనే సమాచార దోపిడీకి అనువైన విధానాలు వస్తున్నాయని నిపుణులు అంటున్నారు.
- క్లౌడ్ కంప్యూటింగ్‌కు మరో పదేళ్లల్లో భారత్‌లోనే 20 లక్షల మంది ఇంజనీర్లు అవసరమని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇంజనీరింగ్ లేదా సైన్స్ బ్యాక్‌గ్రౌండ్ కలిగి ఉండి, ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌లపై పట్టు ఉండేవాళ్ళు ఈ రంగంలో రాణిస్తారు. ఇంజనీరింగ్ విద్య రానురాను ప్రమాణాలు కోల్పోతున్న నేపథ్యంలో నిపుణుల కొరతపై సందేహాలున్నాయి.
- క్లౌడ్ కంప్యూటింగ్ రంగంలో రాణించాలనుకునే వారికి హెచ్‌టీఎంఎల్, వర్చువలైజేషన్ టెక్నాలజీ, జావా, సీ ప్లస్ ప్లస్, డాట్ నెట్ వంటి ప్రోగ్రామింగ్ స్కిల్స్, డేటా మేనేజ్‌మెంట్, డేటా ఎనాలిసిస్, డేటా మైనింగ్ వంటి కోర్ నైపుణ్యాలు అవసరం. ఇంజనీరింగ్ కాలేజీలు వీటిపై పెద్దగా దృష్టి పెట్టడంలేదు.
- వెబ్ డెవలప్‌మెంట్, నెట్‌వర్క్ సెక్యూరిటీ, అప్లికేషన్ డెవలప్‌మెంట్, బిజినెస్ అనాలిసిస్ తదితర యూజర్ రిలేటెడ్ స్కిల్స్ అవసరం ఉంటుంది. క్లౌడ్ మేనేజ్‌మెంట్‌కు సరిపడా ప్రమాణాలతో వీటిని అందించే సంస్థల కొరత దేశంలో తీవ్రంగా ఉంది.

కోర్సులు ఎక్కడ

జేఎన్‌టీయూ, ట్రిపుల్ ఐటీ, సీ–డాక్ వంటి సంస్థలు ఆఫర్‌చేసే సాఫ్ట్‌వేర్ కోర్సుల్లోనే క్లౌడ్ కంప్యూటింగ్ మాడ్యూల్స్‌ను అందిస్తున్నాయి. దీంతోపాటు ఐఐటీ ముంబై, ఐబీఎం ఇండియా రీసెర్చ్ ల్యాబ్, టీసీఎస్ ఇన్నోవేషన్ ల్యాబ్, హెచ్‌పీ ల్యాబొరేటరీలలో క్లౌడ్ కంప్యూటింగ్‌లో ఆర్ అండ్ డీ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఇందుకోసం ఈ సంస్థలు ప్రత్యేక ప్రవేశ ప్రక్రియల ద్వారా ఔత్సాహికులను ఎంపిక చేస్తున్నాయి. అలాగే, ఐబీఎం, సిస్కో, హెచ్‌పీ టెక్నాలజీస్, గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలు పలు సర్టిఫికెట్ కోర్సులను ఆఫర్ చేస్తున్నాయి. డెవలప్‌మెంట్, మెయింటెనెన్స్ విభాగాల్లో క్లౌడ్ కంప్యూటింగ్ శిక్షణను అందిస్తున్నారు.

ఇవీ లాభాలు...

- ఎలాంటి సాఫ్ట్‌వేర్ అయినా క్లౌడ్ కంప్యూటింగ్ ద్వారా అందించే అవకాశం ఉంది. కంప్యూటర్‌లో యాక్సెస్ చేసే ఏ సాఫ్ట్‌వేర్‌నైనా క్లౌడ్ ద్వారా రన్ చేయవచ్చు.
- నెట్‌ద్వారా ఏ డివైస్‌తోనైనా యాక్సెస్ కావడం తేలిక. సంస్థలు కొత్త సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ కొనాల్సిన అవసరం ఉండదు. క్లౌడ్ సెంటర్ సర్వీస్‌ను అప్‌గ్రేడ్ చేసుకుంటే సరిపోతుంది.
- డేటా, అప్లికేషన్స్ నిర్వహణ మొత్తం క్లౌడ్‌లోనే జరుగుతుంది. యూజర్ వద్ద ఎక్కువ స్టోరేజ్ ఉండాల్సిన పనిలేదు. క్లౌడ్‌లో ఉన్న డేటాను ఎప్పటికప్పుడు బ్యాకప్ తీసుకునే వీలు ఉంది.
- డేటా అంతా ఒకేచోట ఉండడంవల్ల కంప్యూటింగ్ రిస్క్ తగ్గుతుంది. వైరస్‌లు, మాల్‌వేర్ల వంటివి లేకుండా సెక్యూరిటీ కలిగి ఉంటే ఎలాంటి పీసీ నుంచైనా డేటాను పొందవచ్చు.

ఢిల్లీకి చేరిన 'తమిళ' రాజకీయం

సాక్షి, చెన్నై: తమిళనాడు రాజకీయాలు మంగళవారం ఢిల్లీకి చేరాయి. అన్నాడీఎంకే పార్టీ అధికార చిహ్నమైన రెండాకుల గుర్తును దక్కించుకోవడమే లక్ష్యంగా అన్నాడీఎంకే పళని, పన్నీర్ వర్గం ఎంపీ, పార్లమెంట్ డిప్యూటీ స్పీకర్ తంబిదురై నేతృత్వంలో మంత్రుల బృందం ఢిల్లీకి చేరుకుంది. వీరి ప్రయత్నాల్ని అడ్డుకుంటూ, తమను సంప్రదించకుండా ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని పార్టీ ఉప ప్రధాన కార్యదర్శి దినకరన్ బృందం ఎన్నికల సంఘానికి వినతిపత్రాన్ని అందజేసింది. మరోవైపు, అసెంబ్లీలో బలపరీక్షకు ఆదేశాలివ్వాలని కోరుతూ రాష్ట్రపతిని కలిసేందుకు ప్రతిపక్ష డీఎంకే సిద్ధం అయింది. ఎన్నికల కమిషన్‌కు రెండాకుల చిహ్నం, ప్రధాన కార్యదర్శి నియామకంపై గతంలో పళని, ఓపీ సెల్వం శిబిరాలు వేర్వేరు ఫిర్యాదులిచ్చాయి. వాటిని ప్రస్తుతం వెనక్కు తీసుకునేందుకు ఈ రెండు వర్గాలు చర్యలు చేపట్టారు. ఇందుకోసం తంబిదురై నేతృత్వంలో మంత్రుల బృందం ఢిల్లీకొచ్చింది. అక్కడ న్యాయ నిపుణులతో బృందసభ్యులు చర్చించారు. అదే సమయంలో కేంద్ర మంత్రులు జైట్లీ, నిర్మల సీతారామన్‌లనూ వీరు కలిశారు. తమిళనాడు రాజకీయాలు కేంద్రంలోని బీజేపీ సర్కారు కనుసన్నల్లో నడుస్తున్నాయన్న ఆరోపణలకు ఈ భేటీ బలాన్ని చేకూర్చింది. కాగా, ఈసీని కలిసేందుకు పళని సిద్ధం కావడంతో దినకరన్ మరో అడుగు ముందుకేశారు. ఈయన అన్నాడీఎంకే కర్ణాటక విభాగం నేత పుహలేంది బృందం ద్వారా ఈసీని ఆశ్రయించారు. తనను సంప్రదించకుండా రెండాకుల విషయంలో పార్టీ నిర్ణయం తీసుకోకూడదని వినతిపత్రంలో పేర్కొన్నారు.

రాష్ట్రపతి చెంతకు డీఎంకే..

మెజారిటీ నిరూపించుకోవాలని సీఎంకు ఆదేశాలు ఇవ్వాలని గవర్నర్ విద్యా సాగర్‌కు విజ్ఞప్తి చేసినా స్పందన లేకపోవడంతో ఢిల్లీలో తేల్చుకోవాలని డీఎంకే నిర్ణయించింది.కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ ఎంపీల ద్వారా రాష్ట్రపతి కోవింద్‌ను డీఎంకే నేత స్టాలిన్ కలవనున్నారు. గురువారం కలిసి బల పరీక్షకు ఆదేశాలు ఇవ్వాలని కోరనున్నట్లు డీఎంకే కార్య నిర్వాహక అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ తెలిపారు.

చంద్రన్న బీమాకు 'సంక్షేమ' నిధులు మళ్లిస్తున్నారు

టీడీపీ ప్రభుత్వంపై సీఐటీయూ జాతీయ కార్యదర్శి గఫూర్ ధ్వజం

సాక్షి, అమరావతి: పార్లమెంటు చట్టం చేసినప్పటికీ భవన నిర్మాణ సంక్షేమ నిధికి తెలుగుదేశం ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని సీఐటీయూ జాతీయ కార్యదర్శి గఫూర్ విమర్శించారు. విజయవాడలో జరుగుతున్న కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సీడబ్ల్యూఎఫ్ఐ) అఖిల భారత కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గఫూర్ మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వం భవన నిర్మాణ సంక్షేమ నిధులను చంద్రన్న బీమాకు మళ్లించిందని ఆరోపించారు. రూ.1000, రూ. 500 నోట్లు రద్దు చేయడంతో భవన నిర్మాణ కార్మికులకు నాలుగు నెలలపాటు పనులు దొరకక అవస్థలు పడ్డారని చెప్పారు. ఇసుక, మైనింగ్ మాఫియా ఎక్కువైందని ఆందోళన వ్యక్తం చేశారు. సీడబ్ల్యూఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు సింగారవేలు మాట్లాడుతూ.. బీజేపీ హయాంలో సామాన్యుడి బతుకు దుర్భరమైందని, కార్పొరేట్లు, విదేశీ కంపెనీలకు మాత్రం మంచి రోజులు వచ్చాయన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లపై ఢిల్లీలో నవంబర్ 9 నుంచి మూడ్రోజులపాటు కార్మిక మహాప్రదర్శన నిర్వహించనున్నట్టు తెలిపారు.

వారసత్వ సంపదను కాపాడేందుకు ఏడు అకాడమీలు

- జీవోను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- త్వరలో తెలుగుభాషాభివృద్ధి ప్రాధికార సంస్థకు చట్టం
- భాషను పరిరక్షించడం అందరి బాధ్యత


తుమ్మలపల్లి కళాక్షేత్రంలో తెలుగుభాషా దినోత్సవ సభను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు

సాక్షి, విజయవాడ: తెలుగు భాషా, సంస్కృతి, సంప్రదాయాల వారసత్వ సంపదను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏడు అకాడమీలను ఏర్పాటు చేసింది. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం జరిగిన తెలుగు భాషా దినోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సాహిత్య, సంగీత, నృత్య, నాటక, దృశ్య కావ్య, జానపదకళలు, సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీలను ఆవిష్కరిస్తూ జీవోను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. త్వరలోనే ఈ అకాడమీలు పని చేయడం ప్రారంభిస్తాయని ప్రకటించారు. గతంలో అధికార భాష చట్టం ఉండేదని, దాని స్థానంలో తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సంస్థ ఏర్పాటు బిల్లును త్వరలోనే అసెంబ్లీలో పెట్టి చట్టం చేస్తామని వెల్లడించారు. జీవనోపాధి కోసం ఇంగ్లిష్ నేర్చుకోవచ్చు కాని, మాతృభాషను మరిచిపోకూడదని చెప్పారు. ప్రజల సంతోషం కోసం 'ఆనందలహరి' అనే కార్యక్రమాన్ని ప్రారంభించామని చెప్పారు. ప్రతి శనివారం సాయంత్రం లేదా ఆదివారాల్లో అన్ని మునిసిపాలిటీల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు. ప్రాచీన భాష సంఘాన్ని మైసూరులో ఏర్పాటు చేస్తే.. దాన్ని అమరావతికి తీసుకువచ్చేందుకు విశేష కృషి చేస్తున్నామని చెప్పారు. తెలుగుభాషకు విశేషంగా కృషి చేసిన గిడుగు రామ్మూర్తి పంతులు గురించి గూగుల్‌లో తెలుసుకున్నానని భాష, సాంస్కృతిక శాఖ మంత్రి అఖిల ప్రియ తెలిపారు.

సన్మాన గ్రహీతలు వీరే...

తెలుగుభాష అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన 30 మందిని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సత్కరించారు. ఆర్.అనంతపద్మనాభరావు (నెల్లూరు), రామ్‌మోహన్ రాయ్ (గుంటూరు), ఆచార్య చందు సుబ్బారావు (విశాఖపట్నం), శంకర్‌నారాయణ (ప్రకాశం), విహారి (కృష్ణా), డాక్టర్ జి.దామోదరనాయుడు (చిత్తూరు), మహాదేవమణి (తూర్పుగోదావరి), డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి (గుంటూరు), ఆచార్య మునిరత్నంనాయుడు(చిత్తూరు), డాక్టర్ తిరునగరి (హైదరాబాద్), రామతీర్థ (తూర్పుగోదావరి), ద్రావిడదేశం కృష్ణారావు (చైన్నై), వి.వి.రామారావు నాయుడు (శ్రీకాకుళం), కృష్ణాజీ (విజయనగరం), మల్లిపురం జగదీష్ (విజయనగరం), డాక్టర్ గూటం స్వామి (తూర్పుగోదావరి), ఎం.ఆర్.వి.సత్యనారాయణ మూర్తి(పశ్చిమగోదావరి), కోకా విమలకుమారి (కృష్ణా), సహజకవి దుబ్బాలదాసు (గుంటూరు), సవ్వప్పగారి ఈరన్న (కర్నూలు), పలమనేరు బాలాజీ(చిత్తూరు), జూపల్లి ప్రేమ్‌చంద్ (అనంతపురం), డాక్టర్ పి.రమేష్ నారాయణ (అనంతపురం), రాధేయ (అనంతపురం), డాక్టర్ డి.మస్తానమ్మ (కడప), వేంపల్లి షరీఫ్ (కడప), రసరాజు (పశ్చిమగోదావరి), వి.సింగారావు (గుంటూరు), వి.ఆర్.రాసాని (చిత్తూరు), రామతీర్థ (విశాఖపట్నం)లను శాలువ, మెమోంటోలతో సత్కరించారు. పద్మశ్రీ కనకకుమారి ఆలపించిన అమరావతి రాగం సీడీని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. కనకకుమారి, రచయిత జొన్నావిత్తుల రామలింగేశ్వరరావును సత్కరించారు. ఈ సమావేశానికి డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధ ప్రసాద్, ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ విజయకుమార్, మేయర్ కోనేరు శ్రీధర్, జడ్పీ చైర్మన్ గద్దె అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

కాలిపోయిన బల్బులు తీసుకుంటాం

సాక్షి వార్తకు ఇంధన శాఖ వివరణ

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, అమరావతి: కాలిపోయిన ఎల్‌ఈడీ బల్బులను తీసుకొని కొత్తవాటిని అందిస్తామని రాష్ట్ర ఇంధన పొదుపు మిషన్ సీఈవో ఎ చంద్రశేఖరరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 'కాలిపోతున్నాయి.. మాడిపోతున్నాయి' అనే శీర్షికతో 'సాక్షి' పత్రికలో వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకూ 2,16,82,362 ఎల్‌ఈడీ బల్బులను పంపిణీ చేశామని, వాటిల్లో 5,37,540 కాలిపోయాయని తెలిపారు. 7 వాట్స్ ఎల్‌ఈడీ బల్బులకు ఐదేళ్లు, 9 వాట్స్ ఎల్‌ఈడీలకు మూడేళ్ల పాటు వారెంటీ ఇవ్వాల్సిన బాధ్యత ఈఈఎస్ఎల్‌దేనని వివరించారు.

'పన్నీరు 'డిప్యూటీ' చెల్లదు!'



సాక్షి, చెన్నై: డిప్యూటీ సీఎంగా పన్నీరు సెల్వం ప్రమాణ స్వీకారం చెల్లదంటూ మద్రాసు హైకోర్టులో మంగళవారం పిటిషన్ దాఖలు అయింది. అన్నాడీఎంకే విలీన ప్రక్రియతో మాజీ సీఎం పన్నీరు సెల్వంకు డిప్యూటీ సీఎం పదవి దక్కిన విషయం తెలిసిందే. అయితే దీన్ని సవాల్ చేస్తూ చెన్నైకి చెందిన న్యాయవాది ఇళంగోవన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. డిప్యూటీ సీఎం పదవికి ఓ మంత్రిని సిఫారసు చేసే అధికారం ఉందిగాని, ఏకంగా డిప్యూటీ సీఎంగా నియమించి ప్రమాణ స్వీకారం చేయించే అధికారం రాజకీయ శాసనాల్లో లేదని వివరించారు. పన్నీరు సెల్వం చేత డిప్యూటీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేయించినందున చెల్లదంటూ ఆదేశాలివ్వాలని కోర్టును కోరారు. ఈ పిటిషన్ ఒకటి రెండు రోజుల్లో విచారణకు రానుంది.

మురుగన్ కోసం జైలులో నళిని దీక్ష



వేలూరు (తమిళనాడు): తమిళనాడు వేలూరు జైల్లో దీక్ష చేస్తున్న మురుగన్‌ను కాపాడాలని అతని భార్య నళిని సోమవారం నుంచి మహిళా జైల్లో దీక్ష చేస్తున్నారు. మాజీ ప్రధాని రాజీవ్ హత్య కేసులో 26 ఏళ్లుగా వేలూరు పురుషుల సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న మురుగన్ జీవ సమాధి అయ్యేందుకు ఆహారం తీసుకోకుండా 12 రోజులుగా దీక్ష కొనసాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో మురుగన్‌కు సోమవారం సాయంత్రం ఆరోగ్యం క్షీణించడంతో జైలులోని వైద్యులు మూడు బాటిళ్ల గ్లూకోజ్ ఎక్కించారు. అదే కేసులో మహిళా జైలులో శిక్ష అనుభవిస్తున్న మురుగన్ భార్య నళిని.. మురుగన్ దీక్ష విరమించుకునేందుకు జైలు అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతూ సోమవారం నుంచి దీక్ష ప్రారంభించారు. కాగా, జైలులో దీక్షచేస్తున్న మురుగన్‌ను రక్షించాలని మద్రాసు హైకోర్టులో అతని బంధువులు సోమవారం పిటిషన్ దాఖలు చేశారు.

సాంకేతిక లోపంతో బస్సు దగ్ధం

- విజయవాడలో ఘటన
- ప్రాణభయంతో పరుగులు తీసిన ప్రయాణికులు


దగ్ధమవుతున్న ఆర్టీసీ బస్సు

గుణదల (రామవరప్పాడు): సాంకేతిక లోపంతో ఆర్టీసీ సీఎన్‌జీ బస్సు దగ్ధమైన ఘటన మంగళవారం విజయవాడ ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎదురుగా జాతీయ రహదారిపై జరిగింది. ప్రమాదాన్ని గుర్తించిన డ్రైవర్, ప్రయాణికులు అప్రమత్తమవడంతో ఎవ్వరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. గవర్నర్‌పేట–2 డిపోకు చెందిన ఆటోనగర్ నుంచి రైల్వేస్టేషన్ వెళ్లే రూట్ నంబర్ 54 సీఎన్‌జీ బస్సు ఉదయం 9 గంటల సమయంలో 80 మంది ప్రయాణికులతో మెడికల్ కళాశాల సమీపంలోని బస్సు స్టాప్ వద్దకు చేరుకుంది. బస్సు స్టాప్ నుంచి కొద్ది దూరం వెళ్లే సరికి బస్సు వెనుక నుంచి పొగ రావడం డ్రైవర్ ఎ.వెంకటేశ్వరరావు గమనించాడు. దీంతో బస్సును పక్కకు ఆపి పరిశీలించగా అప్పటికే పొగతో పాటుగా చిన్నగా మంటలు ప్రారంభమయ్యాయి. వెంటనే డ్రైవర్, కండక్టర్ శిరీష అప్రమత్తమై ప్రయాణికులకు ప్రమాదం గురించి హెచ్చరించారు. వెంటనే ప్రయాణికులు ప్రాణభయంతో పెద్దగా కేకలు పెడుతూ బస్సుకు రెండు వైపులా ఉన్న ద్వారాల నుంచి వెంటనే బయటకు పరుగులు తీశారు. ఇంతలో క్షణాల్లో మంటలు బస్సు మొత్తం వ్యాపించాయి. అప్పటికే సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. సుమారు గంటకుపైగా మంటలు ఆర్పడానికి ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది. ఈ ప్రమాదంలో బస్సు పూర్తిగా దగ్ధమవడంతో సుమారు 20 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని సమాచారం. సాంకేతిక లోపంతో ప్రమాదం జరిగినట్టు డ్రైవర్ తెలిపారు.

చలానాలు తక్షణమే తగ్గించాలి

- ఏపీ, తెలంగాణకు కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్లు ఇవ్వాలి
- రవాణా శాఖ కమిషనర్‌ను కోరిన ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్

సాక్షి, అమరావతి: భారీగా పెంచిన చలానాలు, పెనాల్టీలను 15 రోజుల్లో తగ్గిస్తామని చెప్పిన ప్రభుత్వం ఐదు నెలలైనా తగ్గించకపోవడంపై ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రూ.100 నుంచి రూ. 3,000కు పెంచిన చలానాలను తగ్గిస్తామని ఏప్రిల్ 6న హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇంతవరకు దాన్ని పట్టించుకోకపోవడంతో రవాణా రంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.వి.ఈశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రవాణా రంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులను మంగళవారం ఏపీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎస్.బాలసుబ్రమణ్యం దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఈశ్వరరావు విలేకర్లతో మాట్లాడుతూ చలానాలు తగ్గింపునకు సంబంధించిన ఫైల్ ఇప్పటికే సిద్ధమయ్యిందని, త్వరలోనే దీనికి సంబంధించిన జీవోను విడుదల చేయనున్నట్లు బాలసుబ్రమణ్యం హామీ ఇచ్చారన్నారు. అలాగే ఇతర రాష్ట్రాలతో పోలిస్తే రాష్ట్రంలో డీజిల్ ధరలు అధికంగా ఉండటంతో లారీ యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, డీజిల్ ధరలను ఇతర రాష్ట్రాలతో సమానంగా చేయాలని ఆయన కోరారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా ఇక్కడ లేబర్ వెల్ఫేర్ ఫండ్ పేరుతో ప్రతీ లారీ నుంచి ఏటా రూ.1,500 వసూలు చేయడం దారుణమని, అదే విధంగా అక్రమంగా లారీల నుంచి ఆశీలు వసూలు చేస్తున్న అంశాన్ని కూడా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ, ఏపీలకు టెంపరరీ పర్మిట్లు ఇస్తుండటం వల్ల లారీ యజమానులు తీవ్రంగా నష్టపోతున్నారని, వీటి స్థానంలో కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ప్రభుత్వం త్వరలోనే చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నామని, లేకపోతే నిరసన కార్యక్రమం చేపట్టడానికి వెనుకాడమని ఆయన స్పష్టం చేశారు.


బొర్రావారిపాలెం-కొత్త కూచినపూడి రహదారిలో నాట్లు వేసి నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

రహదారిపైనే నాట్లు

గుంటూరు జిల్లాలో మహిళల వినూత్న నిరసన

నిజాంపట్నం (రేపల్లె): గుంటూరు జిల్లా నిజాంపట్నం మండలంలోని బొర్రావారిపాలెం–కొత్తకూచినపూడి రహదారిపై నాట్లువేసి మహిళలు మంగళవారం వినూత్న నిరసన చేపట్టారు. చినుకుపడితే రోడ్లు చిత్తడిగా మారుతున్నాయని, కాలినడకన వెళ్లాలన్నా వీలుకానంత ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయని వారు ఆవేదన వ్యక్తంచేశారు. తమ సమస్యలపై ఎన్నోసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు.